శనివారం 15-3-2025

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 353

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



వీల్ పవర్

ఆమె పేరు వసుంధర.. విధి పెట్టిన అన్ని పరీక్షల్లో నెగ్గింది.. వీల్ చెయిర్‌తోనే విజయానికి అడుగులు వేసింది! మాతృత్వాన్నీ సాధించింది! డేరెస్ట్ ఉమన్‌గా మన్ననలు అందుకుంటున్నారు హైదరాబాద్‌కు చెందిన వసుంధర. ఈ విజేత గురించి ఆమె మాటల్లోనే..

– వివరాలు 13లో


indriya.com
ADITYA BIRLA
JEWELLERY
ఇంద్రియ ఆభరణాలను ఒక్కసారి చూస్తే
ఇక ఎప్పటికీ దాని నుండి విడిపోవాలని అనుకోరు.
ఎందుకంటే ప్రతి ఇంద్రియ సృష్టి
స్వచ్ఛమైన ప్రేమతో రూపొందించబడింది
ఆదిత్య బిర్లా గ్రూప్ ద్వారా మీకు అందించబడింది.
మా కలెక్షన్స్‌లో ప్రతి ఒక్కటి అద్భుతమైన కవిత్వం
ఆభరణాలను ఇష్టపడే వారి కోసం... అంతులేని పెన్నిధి
మా పరిచయ ఆఫర్‌లు మీ గుండె ఓ క్షణం
ఆగిపోయేలా రూపొందించబడ్డాయి.
కాబట్టి రండి, అద్భుతమైన
ఆభరణాలను సొంతం చేసుకోండి
మనసు ఇంకా నిండలేదు
INDRIYA
ADITYA BIRLA | JEWELLERY
కంటే ఎక్కువ*
16000 డిజైన్లు ✦ 2000 నెక్లెస్‌లు ✦ 2000 గాజులు మరియు చెవిదిద్దులు ✦ 5000 బ్రాస్‌లెట్‌లు
మీ అంతులేని ప్రేమను
పొందడానికి స్కాన్ చేయండి
ప్రారంభ ఆఫర్లు
25% వరకు తగ్గింపు
స్వర్ణాభరణాల మజూరీ మరియు
వజ్రాల ఆభరణాల విలువపై#
మీ పాత బంగారంపై 100%
మారకపు విలువ పొందండి^
#^నియమ నిబంధనలు వర్తిస్తాయి. ఆఫర్ 6 ఏప్రిల్, 2025 వరకు వర్తిస్తుంది.
✦ కొండాపూర్ మరియు కొంపల్లిలో ఇప్పుడు స్టోర్స్ తెరవబడ్డాయి ✦ త్వరలో ఎ.ఎస్.రావు నగర్‌లో కూడా తెరవబడుతుంది ✦


సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 353
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అది హక్కు కాదు: వాన్స్

గ్రీన్‌కార్డు ఉన్నంత మాత్రాన అమెరికాలో ఉండేందుకు శాశ్వత హక్కులు దఖలు పడ్డట్టు కాదని ఉపాధ్యక్షుడు వాన్స్ అన్నారు.

- వివరాలు 6లో



'చిప్'ల కోసం ట్రంప్ స్కెచ్

చిప్‌ల రారాజుగా తైవాన్ తలపై ఉన్న కిరీటాన్ని తన్నుకుపోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద స్కెచ్ వేశారు.

- వివరాలు 6లో

జ్వరం గోలీలూ లేవు!

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు ఇవ్వడం లేదంటున్న రోగులు

జలుబు, ఒళ్లు నొప్పులు తదితర సాధారణ మందులూ బయట కొనుక్కోవాల్సిందే


ఆస్పత్రిలో మందుల్లేక..బయట కొనలేక!

➤ ఈ ఫొటోలో కన్పిస్తున్న వృద్ధురాలి పేరు మాశమ్మ. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి సమీపంలోని నాగనూల్ గ్రామానికి చెందిన ఈమె ఒంటి నొప్పుల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చింది. పరీక్ష చేసిన డాక్టర్ మందులు రాశారు. అయితే ఆ మందులు ఆసుపత్రిలో లేవని చెప్పిన సిబ్బంది బయట ప్రైవేటులో తీసుకోవాలని చెప్పారు. డబ్బులు పెట్టి ప్రైవేట్ దుకాణంలో మందులు కొనే స్తోమత లేని మాశమ్మ ఇలా నిస్సహాయంగా నిలబడింది.

- కొన్నిచోట్ల నెల రోజుల కోర్సుకు 10 రోజుల వరకే ఇచ్చి సరిపెడుతున్న వైనం
- చిన్న పిల్లలకు ఇచ్చే విటమిన్-ఏ సిరప్ రాష్ట్రవ్యాప్తంగా షార్టేజ్
- మందులు పంపిస్తున్నాం.. కొరత లేదంటున్న టీజీఎంఐడీసీ ఎండీ
- క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధంగా పరిస్థితులు..
- ప్రభుత్వం స్పందించి తమ కష్టాలు తీర్చాలంటున్న ప్రజలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులను మందుల కొరత పీడిస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో (పీహెచ్‌సీలు) పాటు రాష్ట్రంలో కీలకమైన ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఎంఎన్‌జే, వరంగల్ ఎంజీఎం, ఆదిలాబాద్ రిమ్స్ వంటి ఆసుపత్రుల్లో కూడా రోగులు మందుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. అనేకచోట్ల సాధారణ జబ్బులకు అవసరమైన ట్యాబ్లెట్లు కూడా ఉండటం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. జ్వరానికి వాడే పారాసెటమాల్, జలుబుకు ఉపయోగించే సిటిరిజైన్ లాంటివి కూడా బయట కొనుక్కోవాల్సి వస్తోందని రోగులు చెబుతున్నారు. డాక్టర్లు రాసిచ్చిన 5 మందుల్లో కనీసం 2 లేదా 3 బయట కొనుక్కోక తప్పడం లేదని అంటున్నారు. మందుల కొరత నేపథ్యంలో కొన్ని జిల్లా ఆసుపత్రుల్లో అవసరమైన మేరకు కాకుండా 10 రోజుల వరకే మందులు ఇస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రులకు అవసరమైన మందుల నిల్వలు తమ వద్ద ఉన్నాయని టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ చెపుతున్నారు. అలాగే జిల్లాల్లోని సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ (సీడీఎస్)లలో కూడా మందుల నిల్వలు ఉన్నాయని ఆయా జిల్లాల డీఎంహెచ్‌ఓలు చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. చాలాచోట్ల అవసరమైన మందుల కోసం ఇండెంట్లు పెట్టేవారే లేరని, మరోవైపు మందులు సమీకరించి పంపాల్సిన టీజీఎంఎస్ఐడీసీకి నిధుల కొరత సమస్యగా మారిందని



మిగతా 5వ పేజీలో ▶

సర్కారుపై ఏమాత్రం వెనక్కి తగ్గొద్దు!



శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం నుంచి ఎంత ఒత్తిడి ఎదురైనా ప్రధాన ప్రతిపక్షంగా బలంగా గొంతు వినిపించాలని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పార్టీ నేతలను ఆదేశించారు. శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో తనతో సుదీర్ఘంగా భేటీ అయిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఈ మేరకు దిశానిర్దేశం చేశారు.

- వివరాలు 2లో

శుక్రవారం నల్లగొండలో బీఆర్ఎస్ నిరసన ర్యాలీ



పాలన చేతగాకే.. గొంతు నొక్కుతున్నారు

- అసెంబ్లీ నుంచి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై బీఆర్ఎస్ నిరసన
- రాష్ట్రవ్యాప్తంగా సీఎం, ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం
- ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలతో ఆందోళన..
- ప్రభుత్వ తీరును ప్రజాకోర్టులోనే తేల్చుకుంటాం: కేటీఆర్

2 లో

మరింత బలంగా గళం వినిపిస్తా

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే జి. జగదీశ్‌రెడ్డి
- నా సస్పెన్షన్‌కు చూపిన కారణాలేవీ సరికాదు.. స్పీకర్‌ను మీరు అనే సంబోధించా.. ఏకవచనం లేదు

2 లో

గ్రూప్-3లోనూ పురుషులే 'టాప్'

- మొదటి పది ర్యాంకుల్లో ఒక్కరే మహిళ.. టాప్ 92లో పది మంది మహిళలకే చోటు
- గ్రూప్-3 మార్కులు, జీఆర్ఎల్ విడుదల చేసిన టీజీపీఎస్సీ
- గ్రూప్-1, 2, 3లోనూ టాపర్లుగా నిలిచిన కొందరు అభ్యర్థులు
- దీంతో కొన్ని కిందిస్థాయి పోస్టులు మిగిలిపోయే అవకాశం

- వివరాలు 3లో

అమృత కవచం!

కూరగాయలు, పండ్లు, పూల నిల్వ కోసం 'కృషి కవచ్'!

- ఇందులో పెడితే 30 రోజుల పాటు దెబ్బతినవు
- రైతులతోపాటు వినియోగదారులు, వ్యాపారులకూ ప్రయోజనం
- ఉద్యాన ఉత్పత్తుల వృథాకు చెల్లు చీటీ
- రక్షణశాఖ విశ్రాంత శాస్త్రవేత్త రామకృష్ణ ఆవిష్కరణ

- వివరాలు 3లో

ఇదంజగత్



ఈ రంగు నచ్చకుంటే దేశం విడిచి వెళ్లిపో!!

ఆ జాబితా పరిగణించం!



- ఇందిరమ్మ గ్రామీణ ప్రాంత అర్హుల జాబితాపై కేంద్రం మెలిక
- తాము రూపొందించిన యాప్‌తో సర్వే చేస్తేనే వివరాలు తీసుకుంటామని స్పష్టీకరణ
- మళ్లీ సర్వే చేసి వివరాలు ఇవ్వాలని సూచన
- కేంద్ర నిబంధనల మేరకే సర్వే చేశామని, ఆమోదించాలని కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేళ గందరగోళం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పేదల ఇళ్లకు సంబంధించిన ఇందిరమ్మ పథకం అమలు విషయంలో కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మళ్లీ పేచీ నెలకొంది. గ్రామీణ ప్రాంత ఇళ్లకోసం అందిన సుమారు 30 లక్షల దరఖాస్తులపై సర్వే చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. 23 లక్షల దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించి, జాబితా సిద్ధం చేసింది. ఆ దరఖాస్తులను కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేను తాము పరిగణనలోకి తీసుకోబోమని..

మిగతా 3వ పేజీలో ▶



బాల్యంపై బులీయింగ్ పడగ

- క్లాస్‌లో ఒకరిని ఏకాకిని చేసి ఏడిపించే చర్యలు
- బాధిత పిల్లల్లో కుంగుబాటు, మానసిక ఒత్తిడి, ఒంటరితనం
- బులీయింగ్‌కు ఆజ్యం పోస్తున్న కొందరు టీచర్లు
- చాపకింద నీరులా విస్తరిస్తున్న విషసంస్కృతి
- పెంపకంలో లోపాలు కూడా కారణమంటున్న నిపుణులు
- పిల్లల ప్రవర్తనను నిత్యం గమనించాలని సూచనలు

తోటి విద్యార్థుల చేతుల్లోనే పిల్లలకు వేధింపులు

'ఐ వాంట్ టు డై'.. ఐదో తరగతి చదివే ఒక బాలిక తన రెండు నోట్ బుక్స్‌లో రాసుకున్న వాక్యం ఇది. హైదరాబాద్‌లోని అల్వాల్ తిరుమల గిరి ప్రాంతానికి చెందిన ఆ బాలిక బాగా పేరొందిన పాఠశాలలో చదువుతోంది. నోట్‌బుక్స్‌లో రామకోటి రాసినట్లుగా 'ఐ వాంట్ టు డై'అంటూ రాసి పేజీలు నింపేసింది. వాటిని చూసి తల్లిదండ్రులు హడలిపోయి, మానసిక వైద్యులను సంప్రదించారు. కొంతకాలంగా ఆ బాలిక తీవ్ర కుంగుబాటుకు లోనైనట్లు వైద్యులు గుర్తించారు. తల్లిదండ్రులు సకాలంలో స్పందించకపోతే పాప ఆత్మహత్యకు పాల్పడి ఉండేదని తెలిపారు. ఆ బాలిక మాత్రమే కాదు.. చాలామంది స్కూల్ పిల్లలు తరగతి గదిలో తోటి విద్యార్థుల వేధింపుల కారణంగా కుంగుబాటుకు గురవుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కొంతమంది విద్యార్థులు గ్రూపులుగా విడిపోయి ఒకరిద్దరు పిల్లలను టార్గెట్ చేసి అనేక రకాలుగా వేధిస్తున్నారు. వారిలోని శారీరక లోపాలను ఎత్తిచూపుతూ ఏడిపిస్తారు. మానసిక వైద్య పరిభాషలో 'బులీయింగ్'గా పిలిచే ఈ విష సంస్కృతి చాపకింద నీరులా విస్తరిస్తోంది. కాలేజీల్లో ర్యాగింగ్ తరహాలో స్కూళ్లలో బులీయింగ్ భూతం పిల్లలను వెంటాడుతోందని నిపుణులు చెబుతున్నారు. యూనిసెఫ్ వంటి అంతర్జాతీయ సంస్థల అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఈ విష సంస్కృతి 1.3 శాతం ఉంటే, హైదరాబాద్ తదితర మెట్రో నగరాల్లో 35 నుంచి 37 శాతం వరకు ఉన్నట్లు చెబుతున్నారు. - సాక్షి, హైదరాబాద్

ఏమిటీ బులీయింగ్?

ఐ వాంట్ టు డై అని రాసిన బాలిక తోటి విద్యార్థుల కంటే కాస్త లావుగా ఉంటుంది. దాంతో తరగతి గదిలో సహ విద్యార్థులు మొదట్లో ఆటపట్టించేవారు. క్రమంగా అంతా ఒక్కటై ఆమెను ఏకాకిని చేసి ఏడిపించడం మొదలుపెట్టారు. ఈ బులీయింగ్ అంతటితో ఆగలేదు. బాలిక చుట్టూ చేరి జడలు పట్టుకొని లాగుతూ 'పిగ్‌టేల్'అంటూ ఏడిపించేవారు. ఈ వేధింపులపై క్లాస్ టీచర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. పైగా ఆ బాలికనే తిట్టింది. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డ ఫిర్యాదును పట్టించుకోలేదు. దీంతో ఆ బాలిక డిప్రెషన్‌లోకి వెళ్లింది. పైకి చూడ్డానికి ఇది సాధారణంగా ఏడిపించడం (బులీయింగ్)గానే కనిపిస్తుంది. కానీ పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతుందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. కొన్ని స్కూళ్లలో కొందరు టీచర్లే బులీయింగ్‌కు ఆజ్యం పోస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పిల్లల రంగు, రూపు, ఆకృతి, నడక వంటి శారీరక అంశాలను లక్ష్యంగా చేసుకొని 'బాడీషేమింగ్'కు పాల్పడుతున్నారు. ఏడేళ్ల చిన్నారుల నుంచి 18 ఏళ్ల టీన్స్ వరకు బులీయింగ్ బారిన పడుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

ఆధిపత్య పెంపకం

తరగతిలో ఉన్న పిల్లలంతా ఒకేవిధమైన బులీయింగ్ స్వభావాన్ని కలిగి ఉండరు. వారిలో ఒక్కరో, ఇద్దరో కలిసి మిగతా వాళ్లందరినీ ఒక గ్రూపుగా సంఘటితం చేస్తారు. టార్గెట్ చేసిన బాలిక లేదా బాలుడిని ఏకాకిని చేస్తారు. మిగతా పిల్లలు తమ ప్రమేయం లేకుండానే ఆ జట్టులో చేరి ఏడిపిస్తుంటారు. తరగతిలో తాము ఏం చేసినా చెల్లుబాటవుతుందనే ఆ ఒకరిద్దరు పిల్లల ప్రవర్తన మిగతా పిల్లలను ప్రభావితం చేస్తుంది. తోటివారికంటే తామే గొప్పవాళ్లమనే భావన పిల్లల్లో కలగడానికి వారి తల్లిదండ్రుల ఆధిపత్య పెంపకమే (అథారిటేరియన్ పేరెంటింగ్) కారణమని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ విష సంస్కృతి గురించి ఉపాధ్యాయులు, స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు పెద్దగా పట్టించుకోవడం లేదు. బులీయింగ్‌ను అరికట్టాల్సిన టీచర్లే బాధితులను మరింత ఏకాకులను చేస్తున్నారు. స్కూల్ నుంచి పిల్లలు ఇంటికి రాగానే ఆ రోజు ఎలా గడిచిందనే విషయాన్ని తల్లిదండ్రులు కచ్చితంగా ఆరా తీయాలని నిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా బులీయింగ్‌కు గురయ్యే పిల్లలు సరిగ్గా తినకపోవడం, మాట్లాడకుండా ఉండిపోవడం, ఇంట్లోనూ ఒంటరిగా గడపడం వంటి లక్షణాలతో బాధపడుతారు. అలాంటి సమయంలో తల్లిదండ్రులు వెంటనే అప్రమత్తం కావాలని సూచిస్తున్నారు.



కలిసికట్టుగా ఎదుర్కోవాలి

పిల్లల పెంపకంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. స్నేహపూర్వకంగా ఉండాలి. కానీ కొందరు అందుకు భిన్నంగా డామినేటింగ్ కల్చర్‌లో పిల్లలను పెంచుతారు. దీంతో సహజంగానే ఆ పిల్లలకు అదే సంస్కృతి అలవడుతుంది. తాము అలా ఏడిపించడం వల్ల తోటి విద్యార్థి మనస్సును గాయపరుస్తున్నామనే భావన ఆ పిల్లల్లో ఏ మాత్రం కనిపించదు. ఒక సర్వే ప్రకారం తరగతి గదిలో ప్రతి ముగ్గురిలో ఒకరు ఏదో ఒక విధమైన బులీయింగ్‌కు గురవుతున్నారు. తల్లిదండ్రులు, టీచర్లు, స్కూల్ యాజమాన్యం కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన సమస్య ఇది. బులీయింగ్ లక్షణాలు ఏ రూపంలో కనిపించినా అరికట్టాలి. లేకపోతే పిల్లల భావి జీవితాన్ని ఇది కబళిస్తుంది. – డాక్టర్ సంహిత, మానసిక వైద్యనిపుణులు, సికింద్రాబాద్.

క్లుప్తంగా...

నేటి నుంచి అంగన్‌వాడీలు ఒకపూటే

మహిళా, శిశు సంక్షేమ మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఒకపూటే నిర్వహించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క ఆదేశించారు. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేయాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. శనివారం నుంచి ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగించాలని తెలిపారు.

రేపు 'జర్నలిజం-మహిళలు -సవాళ్ల'పై సెమినార్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాల సందర్భంగా ఈనెల 16న 'జర్నలిజం–మహిళలు–సవాళ్లు'అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవ పున్నయ్య, హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు బి.అరుణ్ కుమార్, బి.జగదీశ్వర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రజల ఆకాంక్షలు సాకారం చేయాలి

నూతన ఎమ్మెల్సీ శ్రవణ్‌కు హరీశ్ సూచన

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి హరీశ్‌రావును.. నూతన ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్‌కు.. హరీశ్ రావు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కల్పించిన గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాకారం దిశగా కృషి చేయాలని శ్రవణ్‌కు సూచించారు.

హరీశ్‌కు హైడ్రా బాధితుల కృతజ్ఞతలు



సాక్షి, హైదరాబాద్: హైడ్రా కూల్చివేతల సమయంలో.. ఆందోళనలో ఉన్న తమకు అండగా నిలిచినందుకు మాజీ మంత్రి హరీశ్‌రావును బాధితులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. హైదర్షాకోట్ డ్రీమ్ హోమ్ కాలనీకి చెందిన పలువురు శుక్రవారం హోలీ పండుగ సందర్భంగా హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా బీఆర్‌ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా హరీశ్ రావు భరోసా ఇచ్చారు. హరీశ్‌తో పాటు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, కార్తీక్‌రెడ్డి ఉన్నారు.

అయోధ్యను సందర్శించిన దక్షిణ కొరియా బృందం

అయోధ్య: దక్షిణ కొరియాకు చెందిన 78 మంది సభ్యుల బృందం అయోధ్యను సందర్శించింది. దక్షిణ కొరియాకు చెందిన కరాక్ వంశానికి చెందిన ప్రతినిధి బృందం గురువారం అయోధ్యకు చేరుకుంది. రామాలయాన్ని సందర్శించి, సరయూ నది ఒడ్డున జరిగిన 'హారతి'లో పాల్గొంది. శుక్రవారం నయాఘాట్‌లోని క్వీన్ హీయో మెమోరియల్ పార్కును సందర్శించిన ప్రతినిధులు స్మారక చిహ్నం వద్ద నివాళులర్పించారు. కొరియా పురాణాల ప్రకారం, అయోధ్యకు చెందిన యువరాణి సూరిరత్న 2వేల ఏళ్లక్రితం పడవలో 4,500 కిలోమీటర్లు ప్రయాణించి దక్షిణ కొరియాకు చేరుకున్నారు. ఆ దేశంలో గయ రాజ్యాన్ని స్థాపించిన రాజు కిమ్ సురోను వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత హీయో హ్వాంగ్–ఓక్‌గా మారారు. సూరిరత్న వారసులుగా భావించే దక్షిణ కొరియాలోని 60 లక్షల మంది ప్రజలు అయోధ్యను మాతృభూమిగా భావిస్తారు.



సూర్యాపేట జిల్లా మఠంపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

పాలన చేతగాకే.. గొంతునొక్కుతున్నారు

- అసెంబ్లీలో జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై బీఆర్‌ఎస్ నిరసన
- రాష్ట్రవ్యాప్తంగా సీఎం, ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం
- ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలతో ఆందోళన..
- పలుచోట్ల బీఆర్‌ఎస్ శ్రేణులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ప్రభుత్వ తీరును ప్రజాకోర్టులోనే తేల్చుకుంటాం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: శాసనసభ బడ్జెట్ సమావేశాల నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడంపై బీఆర్‌ఎస్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతగాకనే అసెంబ్లీలో ప్రతిపక్షం గొంతునొక్కుతోందని మండిపడింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాయి. సీఎం రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలతో ర్యాలీలు నిర్వహించి దహనం చేశాయి. జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి బయటికి పంపడం అప్రజాస్వామికమని.. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న బీఆర్‌ఎస్ నేతల గొంతు నొక్కేందుకు సీఎం రేవంత్ సస్పెన్షన్లను ఆయుధంగా మలుచుకున్నారని మండిపడ్డాయి. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ శ్రేణులు పలు చోట్ల రాస్తారోకోలు, ధర్నాలు చేయగా... పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు..

శాసనసభలో స్పీకర్‌ను అగౌరవపరిచే విధంగా జగదీశ్‌రెడ్డి ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోయినా... ప్రభుత్వం కక్షపూరితంగా, పథకం ప్రకారమే ఆయనను సభ నుంచి సస్పెండ్ చేసిందని బీఆర్‌ఎస్ నేతలు మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా చెప్పుకునేందుకు ఒక్క మంచి పనికూడా లేనందునే.. కాంగ్రెస్ సర్కారు నియంతృత్వ ధోరణిలో వ్యవహరిస్తోందని విమర్శించారు. అసెంబ్లీని అడ్డాగా చేసుకుని అరాచకాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశాయి. నకిరేకల్, దేవరకొండ, మునుగోడులలో రాస్తారోకోతో నిరసన తెలిపాయి. హుజూర్‌నగర్, మఠంపల్లి, నేరేడుచర్లలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల, భీమారం, రామకృష్ణాపూర్, ఆసిఫాబాద్, ఖానాపూర్‌లలో బీఆర్‌ఎస్ నేతలు నిరసనలు తెలిపారు. కాగా.. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మంచిర్యాలలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మణుగూరు, ఇల్లందు, మధిర తదితర చోట్ల తీవ్రస్థాయిలో నిరసనలు తెలిపారు.

ప్రజాకోర్టులో తేల్చుకుంటాం: కేటీఆర్

పార్టీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ కేడర్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతకానితనం బయటపడొద్దనే బీఆర్‌ఎస్ నాయకులపై కుట్రలు చేస్తున్నారని ఒక ప్రకటనలో మండిపడ్డారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కితే ప్రజాకోర్టులో తేల్చుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలు, హామీల అమల్లో మోసాన్ని ఇదే స్ఫూర్తితో ఎప్పటికప్పుడు ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

బలంగా గళం వినిపిస్తా

- కాంగ్రెస్ నా గొంతు నొక్కలేదు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి
- నా సస్పెన్షన్‌కు చూపిన కారణాలేవీ సరికాదు
- స్పీకర్‌ను మీరు అనే సంబోధించా.. ఏకవచనం లేదు... సభాపతి స్థానానికి కుల మతాలు ఉండవు



సాక్షి, హైదరాబాద్: 'శాసనసభ్యుడిగా నా హక్కులు కాపాడుకోలేని నేను ప్రజల హక్కులను ఎలా కాపాడగలను? ఎలాంటి సభా సాంప్రదాయాలను ఉల్లంఘించకున్నా నన్నుఅసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం అన్యాయం, అక్రమం. నా సస్పెన్షన్‌కు చూపిన కారణాలేవీ సరికాదు. కాంగ్రెస్ పార్టీకి నా గొంతు నొక్కడం సాధ్యం కాదు. పంటలు ఎండి బాధ పడుతున్న రైతు గురించి, ప్రభుత్వం చేతిలో మోసానికి గురవుతున్న ప్రజల గురించి మరింత బలంగా నా గళం వినిపిస్తా. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రజలు అప్పగించిన బాధ్యతలు నిర్వర్తిస్తా..'అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగంపై బీఆర్‌ఎస్ నుంచి ఎవరు మాట్లాడినా సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ శాసనసభ పక్షం భేటీలో సీఎం సమక్షంలో ముందే నిర్ణయం తీసుకున్నారన్నారు. అసెంబ్లీ సమావేశాల నుంచి తనను సస్పెండ్ చేయడంపై జగదీశ్‌రెడ్డి శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు.

పథకం ప్రకారమే గొడవకు దిగారు

'గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే అంశంపై కాంగ్రెస్ నుంచి ఇద్దరు సభ్యులు సుమారు గంటన్నర పాటు మాట్లాడినా మేం ఎక్కడా అడ్డు చెప్పలేదు. కానీ నేను మాట్లాడుతున్న సమయంలో కాంగ్రెస్ సభ్యులు పథకం ప్రకారమే గొడవకు దిగారు. స్పీకర్ గౌరవాన్ని తగ్గించేలా నేను ఒక్క అక్షరం కూడా ఉపయోగించలేదు. 50 మంది సభ్యులు అంతరాయం కలిగిస్తున్నా స్పీకర్ నా రక్షణకు రాలేదు. సభను నియంత్రణలో పెట్టాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉందని మాత్రమే చెప్పా. సభ్యులందరికీ సమాన హక్కులుంటాయనే విషయాన్ని గుర్తు చేశా. నేను స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధించానని, దళితులను అవమాన పరిచానని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఇందులో దళిత కోణం ఎక్కడుందో చెప్పాలి. ఏకవచనంతో సంబోధించలేదు అనేందుకు అనేక ఆధారాలు ఉన్నాయి. సభాపతి స్థానానికి కుల మతాలు ఉండవు. ప్రజలు ప్రత్యక్షంగా నేను మాట్లాడిన తీరును వీక్షించారు. ఈ విషయంలో స్పీకర్ నిస్సహాయత స్పష్టంగా కనిపించింది. సభను ప్రభుత్వం నియంతృత్వ పద్ధతిలో నడిపిస్తోంది..'అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

సభా సాంప్రదాయాలు తుంగలో తొక్కారు

'నా సస్పెన్షన్ విషయంలో అన్ని సభా సాంప్రదాయాలను తుంగలో తొక్కారు. అన్ని పార్టీల సభా పక్ష నేతల సమక్షంలో నా వ్యాఖ్యలపై చర్చించి నిర్ణయం తీసుకోవచ్చు. కానీ కనీసం వివరణ ఇచ్చే అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేశారు. నేను మాట్లాడిన అతికొద్ది సమయంలో ఎక్కడా అన్‌పార్లమెంటరీ పదాలు వాడలేదు..'అని మాజీమంత్రి చెప్పారు.

సీఎంపై పోలీసులకు బీఆర్‌ఎస్ ఫిర్యాదు

కుత్బుల్లాపూర్/చిక్కడపల్లి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలమధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, తమ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆయనపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి డైవర్షన్ రాజకీయాలు చేస్తూ, చిల్లర మాటలు మాట్లాడుతున్నారని వారు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం బీఆర్‌ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మర్రి రాజశేఖర్‌రెడ్డిలు పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్‌ను కలసి రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఇటీవల రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చావు కోరుతూ వ్యాఖ్యలు చేసి.. రాష్ట్ర ప్రజలు, కేసీఆర్ అభిమానుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన ముఖ్యమంత్రిని తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదని ఆ నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఎదుటివారి వినాశనాన్ని కోరుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. తమ స్వార్థ రాజకీయాల కోసం చిల్లర మాటలు మాట్లాడుతూ.. విద్వేషాలను రెచ్చగొట్టి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని బీఆర్‌ఎస్ నేతలు ధ్వజమెత్తారు. ఇదిలా ఉండగా ఇదే అంశంపై బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన దాసోజు శ్రవణ్ ఫిల్మ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో, ఆ పార్టీ యువనాయకుడు ముఠాజైసింహ చిక్కడపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.



సీఐకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు వివేకానంద్, రాజశేఖర్‌రెడ్డి

పదవిని కాపాడుకునేందుకు బీజేపీతో రేవంత్ డీల్: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి పదవిని కాపాడుకునేందుకు బీజేపీ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆరోపించారు. 'అట్టర్ ఫ్లాప్ సీఎంగా ముద్రపడిన రేవంత్ తన కుర్చీ ఏ క్షణమైనా చేజారుతుందనే సంకేతాలు అందడంతో బీజేపీతో డీల్ సెట్ చేసుకున్నారు. ఏడాదిన్నర పాలనలో రాష్ట్రాన్ని ఆగంచేసి డర్టీ పాలిటిక్స్ చేస్తున్న ఈ రాబందు రాజకీయాలను తెలంగాణ సమాజం ఎట్టి పరిస్థితుల్లో సహించదు. కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు ఉన్నారంటూ రంకెలు వేస్తున్న రాహుల్ గాంధీకి బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకున్న రేవంత్‌పై చర్యలు తీసుకునే దమ్ము ఉందా? బీజేపీ నేతలతో కుస్తీ పడుతున్నట్లు పోజులు కొడుతూ దొంగచాటుగా వారితో దోస్తీ చేయడమే కాంగ్రెస్ సంస్కృతా'అని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కేటీఆర్ ప్రశ్నించారు. 'పదవులు కాపాడుకునేందుకు ప్రజల నడుమ వైషమ్యాలు సృష్టించే నీచ చరిత్ర కాంగ్రెస్ నాయకులది'అని మండిపడ్డారు. సీఎం హోదాను మరిచి గల్లీలో తిట్లు తిడుతూ ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌ల పేరిట సీఎం కాలం గడుపుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

బీఆర్‌ఎస్ సభకు దేవన్నపేటే ఫైనల్!

ఏప్రిల్ 27న రజతోత్సవ సభ

సాక్షి ప్రతినిధి, వరంగల్: బీఆర్‌ఎస్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన రజతోత్సవ సభకు హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేటను ఫైనల్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి జనం ట్రాఫిక్ సమస్య లేకుండా వచ్చి వెళ్లేందుకు వీలుగా ఉంటుందని ఎంచుకున్నట్లు తెలిసింది. ఏప్రిల్ 27న జరగనున్న బీఆర్‌ఎస్ బహిరంగ సభ కోసం సీనియర్ నేత, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయభాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపనేని నరేందర్, బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు దేవన్నపేటలో సభా వేదిక స్థలాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బహిరంగ సభకు అవసరమైన మార్పులు, సూచనలను చేశారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరవనున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు సమగ్రంగా ఉండేలా చూడాలని ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులకు, పార్టీ శ్రేణులకు హరీశ్‌రావు సూచించారు. సభ సక్సెస్ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై మాట్లాడారు. త్వరలోనే సన్నాహక కమిటీలను కూడా వేయనున్నట్లు పార్టీవర్గాల సమాచారం.

సర్కారుపై ఏమాత్రం వెనక్కి తగ్గొద్దు!

- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే బీఆర్‌ఎస్ సభ్యుల సస్పెన్షన్
- అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని పార్టీ నేతలకు కేసీఆర్ ఆదేశం... బయటికి పంపితే వివిధ రూపాల్లో నిరసన తెలపాలి
- 22న చెన్నైలో జరిగే భేటీలో తెలంగాణపై కేంద్ర వివక్షను ప్రశ్నించాలి
- పార్టీ రజతోత్సవాల కోసం భారీగా ఏర్పాట్లు చేయాలని సూచన
- ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌తో కేటీఆర్ సమావేశం



సాక్షి, హైదరాబాద్: శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం నుంచి ఎంత ఒత్తిడి ఎదురైనా ప్రధాన ప్రతిపక్షంగా బలంగా గొంతు వినిపించాలని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు పార్టీ నేతలను ఆదేశించారు. ప్రభుత్వం పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు అసెంబ్లీలో బీఆర్‌ఎస్ సభ్యుల సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఆయుధంగా ఎంచుకుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ సభ్యులంతా అసెంబ్లీ సమావేశాలకు క్రమం తప్పకుండా వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ఎండగట్టాలని స్పష్టం చేశారు. ఒకవేళ అసెంబ్లీ నుంచి బలవంతంగా బయటికి పంపినా వివిధ రూపాల్లో నిరసన తెలపాలని స్పష్టం చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌తో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా ఈ సమావేశానికి హాజరవుతారని భావించినా హోలీ పండుగ నేపథ్యంలో కేటీఆర్ ఒక్కరే వెళ్లినట్టు పార్టీవర్గాలు తెలిపాయి.

ముందుగా ప్లాన్‌చేసుకునే సస్పెన్షన్లు

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా రచ్చ చేసి బీఆర్‌ఎస్ సభ్యులను సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ ఎల్పీ భేటీలోనే ప్లాన్ చేసుకున్నారని కేసీఆర్ పేర్కొన్నట్టు తెలిసింది. ''అసెంబ్లీ సమావేశాల నుంచి బహిష్కరించడం ద్వారా ప్రజా సమస్యలు, ఆకాంక్షలు చర్చకు వచ్చే అవకాశం లేకుండా పోతుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లోని డొల్లతనాన్ని బయట పెట్టేందుకు సమావేశాలను ఉపయోగించుకోవాలి. దూషణలు, పరస్పర విమర్శల జోలికి వెళ్లకుండా పూర్తి ఆధారాలు, అంకెలతో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించాలి''అని సూచించినట్టు సమాచారం.

పార్టీ రజతోత్సవాలపైనా చర్చ

బీఆర్‌ఎస్ రజతోత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా కేసీఆర్ పలు సూచనలు చేశారు. వరంగల్‌లో ఏప్రిల్ 27న నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఇప్పటికే దృష్టి సారించారు. ఆ సభను విజయవంతం చేసేందుకు జరగాల్సిన కసరత్తు, నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు, సన్నాహక కమిటీల ఏర్పాటు వంటి అంశాలపైనా కేటీఆర్‌కు కేసీఆర్ పలు సూచనలు చేశారు. ఏర్పాట్లకు సంబంధించి త్వరలో కేటీఆర్ అన్ని జిల్లాల ముఖ్య నేతలతో ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

22న డీఎంకే భేటీకి కేటీఆర్

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ఈ నెల 22న చెన్నైలో జరిగే దక్షిణాది రాష్ట్రాల అఖిలపక్ష భేటీకి హాజరుకావాల్సిందిగా కేటీఆర్‌ను కేసీఆర్ ఆదేశించారు. ఆ భేటీలో బీఆర్‌ఎస్ పక్షాన ప్రస్తావించాల్సిన అంశాలు, పోరాట రూపాలు, ఐక్యకార్యాచరణ, అవలంబించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. తెలంగాణ పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూపుతున్న వివక్ష, దానిపై బీఆర్‌ఎస్ చేసిన పోరాటాలను కూడా ప్రస్తావించాలని సూచించారు. నియోజకవర్గాల పునర్విభజన, నిధుల పంపిణీలో వివక్ష, దేశ ఆర్థిక వ్యవస్థకు దక్షిణాది రాష్ట్రాలు చేస్తున్న కంట్రిబ్యూషన్ తదితరాలపైనా దిశానిర్దేశం చేశారు.

ఉగాదికి 'భూభారతి'!

- కొత్త రెవెన్యూ చట్టం మార్గదర్శకాల తయారీ ప్రక్రియ పూర్తి
- న్యాయశాఖ నుంచి క్లియరెన్స్.. ప్రభుత్వ పరిశీలనకు అధికారులు
- ఇక కేబినెట్ ఆమోదమే తరువాయి.. ఆపై అందుబాటులోకి వెబ్‌సైట్
- కొత్త వెబ్‌సైట్‌లో 5 మాడ్యూల్స్

సాక్షి, హైదరాబాద్: 'భూభారతి'చట్టం ఈ ఉగాది నుంచి అమల్లోకి వచ్చే అవకాశాలున్నాయి. రెవెన్యూ వర్గాల్లో జరుగుతున్న చర్చ ప్రకారం.. ఈ చట్ట మార్గదర్శకాల రూపకల్పన పూర్తయింది. దీనికి న్యాయశాఖ నుంచి క్లియరెన్స్ వచ్చింది. దీంతో ప్రభుత్వ పరిశీలన కోసం ఈ మార్గదర్శకాలు వెళ్లాయి. ప్రభుత్వ పరిశీలన అనంతరం రాష్ట్ర మంత్రివర్గం ఈ మార్గదర్శకాలను ఆమోదించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ సమావేశాల అనంతరం నిర్వహించే కేబినెట్‌లో మార్గదర్శకాలకు గ్రీన్ సిగ్నల్ వస్తుందని తెలుస్తోంది. ఉగాది నుంచి ఈ చట్టం అమల్లోకి వస్తుందని, కేబినెట్ భేటీలో జాప్యం జరిగితే కొంత ఆలస్యమవుతుందని రెవెన్యూ వర్గాలంటున్నాయి. కాగా, అసెంబ్లీ ఆమోదం పొందిన ఈ చట్టానికి జనవరి నెలలోనే రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదముద్ర వేశారు. అయితే చట్టం మార్గదర్శకాల రూపకల్పన కోసం ప్రభుత్వం ఈ మేరకు సమయం తీసుకోవడం గమనార్హం.

ఆన్‌లైన్‌తోపాటు మాన్యువల్‌గా కూడా...

ప్రస్తుతం అమల్లో ఉన్న రెవెన్యూ చట్టమైన ధరణి ద్వారా వ్యవసాయ భూముల సమస్యలను పరిష్కరించేందుకుగాను కేవలం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునేవారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తున్న కొత్త రెవెన్యూ చట్టం (భూభారతి) ప్రకారం మాన్యువల్‌గానూ దరఖాస్తులు ఇచ్చే వెసులుబాటు కల్పిస్తారు. ఈ మేరకు చట్టం మార్గదర్శకాల్లో పొందుపర్చినట్టు సమాచారం. అవగాహన కలిగిన రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటారని, ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఇబ్బందులు ఎదురైన పక్షంలో మండల రెవెన్యూ కార్యాలయాల్లో మాన్యువల్‌గానూ ఈ దరఖాస్తులు ఇవ్వొచ్చు. కొత్త చట్టం అమల్లోకి రాగానే ప్రస్తుతమున్న ధరణి వెబ్‌సైట్ పేరు కూడా భూభారతిగా మారనుంది. ప్రస్తుతం ధరణి వెబ్‌సైట్‌లో వివిధ రకాల భూ సమస్యల పరిష్కారం కోసం 35 రకాల మాడ్యూల్స్ ఉండగా, వాటిని కుదించి కేవలం ఐదు మాడ్యూల్స్‌కు మాత్రమే పరిమితం చేయనున్నారు. గతంలో ప్రతి చిన్న సమస్య రాష్ట్ర స్థాయిలో పరిష్కారం కావాల్సి ఉండగా, ఇప్పుడు జిల్లా స్థాయిలోనే మెజారిటీ సమస్యలకు పరిష్కారం చూపేలా ప్రభుత్వం ఈ మార్గదర్శకాలను రూపొందించినట్టు తెలుస్తోంది.



ఆలయం వెలుపల జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి

తిరుమల శ్రీవారిని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ తదితరులు శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు.

- తిరుమల



శ్రీవారి ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు దంపతులు



శ్రీవారి ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ వేణుగోపాల్

అమృత కవచం!

కూరగాయలు, పండ్లు, పూల నిల్వ కోసం 'కృషి కవచ్'!

- ఇందులో పెడితే 30 రోజుల పాటు దెబ్బతినవు
- రైతులతోపాటు వినియోగదారులు, వ్యాపారులకూ ప్రయోజనం
- ఉద్యాన ఉత్పత్తుల వృథాకు చెల్లు చీటీ
- రక్షణశాఖ విశ్రాంత శాస్త్రవేత్త రామకృష్ణ ఆవిష్కరణ



ఇది అనవసరపు నష్టం..

రైతులు ఆరుగాలం కష్టించి పండిస్తున్న పండ్లు, కూరగాయలను తోటలో కోసినప్పటి నుంచి మన నోటికి చేరేసరికే సగటున 25–30% వరకు పాడైపోతున్నాయి. సరైన రవాణా, నిల్వ సదుపాయాలు లేకపోవడమే దీనికి కారణం. దీనివల్ల అనవసరంగా జరుగుతున్న నష్టం ఏటా రూ.1,52,790 కోట్లు అని అంచనా.

ఇది అమృతం లాంటి పరిష్కారం..

కూరగాయలు, పండ్లు, పూలను సాధారణ వాతావరణంలోనే 30 రోజులపాటు చెక్కు చెదరకుండా నిల్వ ఉంచే అద్భుత ఆవిష్కరణ అందుబాటులోకి వచ్చింది. మైసూరుకు చెందిన ఓ విశ్రాంత శాస్త్రవేత్త ఈమేరకు ప్రత్యేకమైన కవర్లను రూపొందించారు. పర్యావరణ హిత పదార్థాలతో ఈ 'మోడిఫైడ్ ఎట్మాస్పియర్ ప్యాకేజింగ్ (మాప్)' కవర్ల తయారీ సాంకేతికతను ఆవిష్కరించటం విశేషం. బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ (ఐఐహెచ్‌ఆర్) ద్వారా ఈ సాంకేతికత త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది.

(సాక్షి స్పెషల్ డెస్క్):

రక్షణశాఖలో ఆహార శాస్త్రవేత్తగా 34 ఏళ్లు పనిచేసి రిటైరైన డాక్టర్ ఎ.రామకృష్ణ ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు, వ్యాపారులతోపాటు వినియోగదారులకు మేలు కలిగించే అద్భుత ఆవిష్కరణను వెలువరించారు. భారతీయ రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)కు అనుబంధంగా కర్ణాటకలోని మైసూర్‌లో ఉన్న రక్షణ ఆహార పరిశోధన ప్రయోగశాల (డీఎఫ్ఆర్ఎల్)లోని ఫుడ్ ఇంజనీరింగ్ అండ్ ప్యాకేజింగ్ విభాగంలో ఆయన సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేసి రిటైర్ అయ్యారు. మూడేళ్లుగా సొంతంగా పరిశోధనలు చేస్తున్నారు. ఈ క్రమంలో పండ్లు, కూరగాయలు, పూలు ఎక్కువకాలం దెబ్బతినకుండా ఉండేలా, పూర్తిగా ప్రజలకు ఉపయోగపడేందుకు దోహదపడేలా వినూత్న ప్యాకేజింగ్‌తో 'కృషి కవచ్'కవర్లను అభివృద్ధి చేశారు.

పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో..

పోలియాక్టిక్ యాసిడ్, చెరుకు పిప్పి వంటి స్థానికంగా చవకగా లభించే సేంద్రియ పదార్థాలను ఉపయోగించి కృషి కవచ్ కవర్లను రూపొందించినట్టు రామకృష్ణ వెల్లడించారు. ''కూరగాయలు, పండ్లు, పూలను కృషి కవచ్ కవర్లలో ఉంచితే చాలు. రిఫ్రిజిరేషన్ అవసరం లేదు. సాధారణ గది వాతావరణంలో ఉంచినా.. నెల రోజుల వరకు బాగుంటాయి. వడలిపోవు. కుళ్లిపోవు. అర కిలో నుంచి వంద కిలోల వరకు అవసరం మేరకు కృషి కవర్లను తయారు చేసుకోవచ్చు. రైతులు తమ ఉత్పత్తులను కోసిన రోజే ఏదో ఒక ధరకు అమ్ముకోకుండా నిల్వ చేసుకుని మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు. రైతుల ఆదాయం పెరుగుతుంది. టోకు, చిల్లర వ్యాపారులతోపాటు విదేశాలకు ఎగుమతి చేసే వ్యాపారులకు కూడా కృషి కవచ్ కవర్లు ఉపయోగపడతాయి''అని తెలిపారు. దీనిపై త్వరలో పేటెంట్ కోసం దరఖాస్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఐఐహెచ్‌ఆర్‌తో త్వరలో ఒప్పందం..

ఐఐహెచ్‌ఆర్, యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌లోని గాంధీ కృషి విజ్ఞాన కేంద్రంలో 'కృషి కవచ్' టెక్నాలజీని పరీక్షించి చూశారని రామకృష్ణ తెలిపారు. ఈ టెక్నాలజీని ప్రజలకు అందించే క్రమంలో ఐఐహెచ్‌ఆర్‌తో త్వరలో ఒప్పందం కుదుర్చుకోనున్నట్టు చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ టెక్నాలజీని ఐఐహెచ్‌ఆర్ అందిస్తుందని వెల్లడించారు.

వృథా అవుతున్న పండ్లు, కూరగాయలు:	ఈ నష్టం విలువ సుమారు:
25 - 30%	రూ.1,52,790 కోట్లు

- మన దేశంలో ఏటా 1,132 లక్షల టన్నుల పండ్లు, 2,146 లక్షల టన్నుల కూరగాయలు, 36 లక్షల టన్నుల పూలు ఉత్పత్తి అవుతున్నాయి.
- కూరగాయల్లో.. బంగాళదుంపలు 30–40%, టమాటాలు 5–47%, ఉల్లిపాయలు 25–40%, వెల్లుల్లి 8–22%, క్యాబేజీ, కాలీఫ్లవర్ 7–25%, మిరపకాయలు 4–35%, క్యారట్ 5–9% శీతల సదుపాయాల్లేక పాడైపోతున్నాయి.
- పండ్లలో.. ద్రాక్ష 27%, అరటి 20–28%, బత్తాయి, నారింజ, నిమ్మ వంటి సిట్రస్ పండ్లు 20–95%, యాపిల్స్ 14%, అవకాడోలు 43% దెబ్బతింటున్నాయి.

'కృషి కవచ్' పనిచేసేదిలా..



''సాధారణంగా పండ్లు, కూరగాయలను చెట్ల నుంచి కోసిన తర్వాత ఆక్సిడేటివ్ మెటబాలిజం ద్వారా వాటిలో మార్పులు జరుగుతాయి. సేంద్రియ పదార్థాలు విచ్ఛిన్నమవుతూ ఉంటాయి. శీతల ప్రదేశంలో ఉంచకపోతే ఈ ప్రక్రియ వేగంగా సాగి.. అవి వడలి, కుళ్లి పాడైపోతాయి. 'కృషి కవచ్'కవర్లలోకి ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్, ఇథైలిన్ వంటి వాయువులు కొంతమేర ఇటూ ఇటూ పారాడేందుకు వీలుంటుంది. ఇందులో నీటి ఆవిరి ఏర్పడదు. దీనితో ఆహార ఉత్పత్తులు సెకండరీ ప్యాకేజింగ్ అవసరం లేకుండానే 30 రోజుల వరకు తాజాగా ఉంటాయి. సూక్ష్మజీవులు, ఫంగస్‌లు కూడా ఆశించవు. ఈ కవర్లను తిరిగి వాడొచ్చు, కంపోస్టు చేయవచ్చు. 25–30శాతంగా ఉన్న ఉద్యాన ఉత్పత్తుల వృథాను అరికట్టడం ద్వారా గణనీయమైన ఆర్థిక, సామాజిక, పర్యావరణ ప్రయోజనాలు చేకూరుతాయి. కృషి కవచ్ కవర్ల ద్వారా ఆహార వృథాను అరికట్టడంతోపాటు వ్యాల్యూ యాడెడ్ చర్యల ద్వారా దేశ జీడీపీని 3శాతం మేరకు పెంచుకోవచ్చు.

- డాక్టర్ ఎ.రామకృష్ణ, విశ్రాంత శాస్త్రవేత్త, 'కృషి కవచ్' ఆవిష్కర్త, మైసూరు

గ్రూప్‌-3లోనూ పురుషులే 'టాప్'

- మొదటి పది ర్యాంకుల్లో ఒక్కరే మహిళ
- టాప్ 92 ర్యాంకుల్లో పది మంది మహిళలకే చోటు
- గ్రూప్–3 మార్కులు, జీఆర్ఎల్ విడుదల చేసిన టీజీపీఎస్సీ
- దరఖాస్తులు 5,36,400.. పరీక్ష రాసినవారు 2,67,921 మంది
- 18,364 మంది అనర్హత. 2,49,557 మంది జీఆర్ఎల్ విడుదల
- గ్రూప్–1, 2, 3లోనూ టాపర్లుగా నిలిచిన కొందరు అభ్యర్థులు
- దీంతో కొన్ని కిందిస్థాయి పోస్టులు మిగిలిపోయే అవకాశం



శుక్రవారం గ్రూప్‌-3 ఫలితాలను విడుదల చేస్తున్న టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం

గ్రూప్‌-3లో టాప్ 10 ర్యాంకులకు వచ్చిన మార్కులు		గ్రూప్‌-3లో టాప్ 10 మహిళా ర్యాంకర్లకు వచ్చిన మార్కులు	
ర్యాంకు	మార్కులు	ర్యాంకు	మార్కులు
1	339.239	8	325.157
2	331.299	37	312.11
3	330.427	46	309.184
4	329.179	47	309.157
5	327.245	51	308.124
6	326.272	55	307.097
7	326.225	70	305.056
8	325.157	77	304.103
9	323.184	82	303.076
10	323.157	92	301.239

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్–3 కొలువుల భర్తీ కోసం నిర్వహించిన అర్హత పరీక్షల ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) శుక్రవారం విడుదల చేసింది. గ్రూప్–2 లాగే గ్రూప్–3 పరీక్షల్లోనూ పురుషులే ఆధిపత్యం కనబరిచారు. ఈ ఫలితాల్లో టాప్ 10 ర్యాంకుల్లో ఒకే ఒక్క మహిళ ఉన్నారు. టాప్ 92లో పది మంది మహిళలు మాత్రమే నిలిచారు. మొత్తం 450 మార్కులకు గాను మొదటి ర్యాంకు సాధించిన వ్యక్తి 339.239 మార్కులు సాధించాడు. గ్రూప్–2లో టాప్ 31 ర్యాంకుల్లో ఒక్క మహిళ కూడా లేని విషయం తెలిసిందే.

18 వేల మందికి అనర్హత

మొత్తం 1,388 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ 30 డిసెంబర్, 2022లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉద్యోగాల కోసం 5,36,400 మంది దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో పరీక్షలు నిర్వహించారు. గ్రూప్–3లో మూడు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్‌కు 150 మార్కులు. ఈ పరీక్షల ఫలితాలు, జనరల్ ర్యాంకింగ్ లిస్టు(జీఆర్ఎల్), మాస్టర్ క్వశ్చన్ పేపర్లు, ఫైనల్ కీ, ఓఎంఆర్ షీట్ స్కాన్డ్ కాపీలను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ పరీక్షలకు 2,67,921 హాజరుకాగా, వీరిలో ఏకంగా 18,364 మంది అనర్హతకు గురయ్యారు. దీంతో జీఆర్ఎల్‌లో 2,49,557 మంది అభ్యర్థుల వివరాలు మాత్రమే ఉన్నాయి. అభ్యర్థులు వారి టీజీపీఎస్సీ ఐడీ, హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలతో కమిషన్ వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. తాజాగా విడుదల చేసిన ఫైనల్ కీపై ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించబోమని కమిషన్ స్పష్టం చేసింది. జీఆర్ఎల్ ఆధారంగా ధ్రువపత్రాల పరిశీలన కోసం ప్రాథమిక ఎంపిక జాబితా రూపొందిస్తామని తెలిపింది. నోటిఫికేషన్‌లో నిర్దేశించిన విధంగా అభ్యర్థులు వారి ఒరిజినల్ ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది. సాంకేతిక సమస్యలకు సంబంధించిన సమాచారం కోసం టీజీపీఎస్సీ హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్లు 040–23542185, 040–23542187లలో సంప్రదించాలని, లేదా 'హెల్ప్‌డెస్క్(ఎట్)టీఎస్‌పీఎస్సీ.జీఓవీ.ఇన్'లో ఈమెయిల్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపింది. ఈ నెల 10వ తేదీన గ్రూప్–1 మార్కులు విడుదల చేసిన టీజీపీఎస్సీ... 11న గ్రూప్–2 ఫలితాలను ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా గ్రూప్–3 జీఆర్ఎల్ విడుదల చేసిన కమిషన్.. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షల తుది ఫలితాలను 17న, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పరీక్షల తుది ఫలితాలను 19న ప్రకటించనుంది. కాగా, గ్రూప్–3 జీఆర్ఎల్‌లో అభ్యర్థి ర్యాంకు, హాల్ టికెట్ నంబర్, సాధించిన మార్కులు మాత్రమే ఉన్నాయి.

పోస్టులు ఖాళీ అయ్యే అవకాశం

గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 కొలువులకు సంబంధించిన పరీక్షల ఫలితాలను టీజీపీఎస్సీ వరుసగా విడుదల చేసింది. అయితే, ఈ మూడు కేటగిరీల్లోనూ టాపర్లుగా నిలిచినవారు ఎక్కువ మందే ఉన్నారని సమాచారం. అదేవిధంగా ఇప్పటికే గ్రూప్–4 ఉద్యోగాల్లో చేరిన కొందరు గ్రూప్–3లోనూ అర్హత సాధించారు. వీరిలో చాలామంది గ్రూప్–1 ఉద్యోగాల్లో లేదంటే గ్రూప్–2 ఉద్యోగాల్లో చేరుతారు. దీంతో గ్రూప్–3లో కొన్ని పోస్టులు మిగిలిపోయే అవకాశం ఉందని అంటున్నారు. అదే సమయంలో గ్రూప్–4 ఉద్యోగం చేస్తూ గ్రూప్–3 పోస్టు సాధించినవారు.. ప్రస్తుతం చేస్తున్న గ్రూప్–4 ఉద్యోగాలను వదిలేసే అవకాశమే ఎక్కువ. దీంతో పలు కేటగిరీల్లో కొన్ని పోస్టులు మిగిలిపోయే అవకాశం ఉందని సమాచారం.

గ్రూప్‌-3 స్టేట్ టాపర్ అర్జున్‌రెడ్డి

గ్రూప్‌-2లోనూ 18వ ర్యాంకు



పాపన్నపేట (మెదక్): గ్రూప్– 3 పరీక్షల్లో స్టేట్ టాపర్‌గా మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన అర్జున్‌రెడ్డి నిలిచారు. శుక్రవారం టీజీపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో 450 మార్కులకు గాను ఆయన 339.239 మార్కులు సాధించారు. ఇటీవల ప్రకటించిన గ్రూప్– 2 ఫలితాల్లో కూడా అర్జున్‌రెడ్డికి స్టేట్ 18వ ర్యాంకు రావటం విశేషం. ఇంజనీరింగ్ పూర్తి చేసిన అర్జున్‌రెడ్డి.. ప్రస్తుతం హవేళిఘనపూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ, మెదక్ కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూప్–2 పోస్టుకు ప్రాధాన్యం ఇస్తానని అర్జున్‌రెడ్డి తెలిపారు.

3-7-27-27

పోటీ పరీక్షల్లో చంద్రకాంత్ ర్యాంకులివి



శంకర్‌పల్లి: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు చంద్రకాంత్ పోటీ పరీక్షల్లో సత్తాచాటారు. గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, జూనియర్ లెక్చరర్‌పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించాడు. శుక్రవారం విడుదలైన గ్రూప్–3 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంక్ సాధించిన చంద్రకాంత్, ఈ నెల 11 వెల్లడైన గ్రూప్–2 ఫలితాల్లోనూ రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంకు సాధించాడు. కొన్నాళ్ల క్రితం ప్రకటించిన గ్రూప్–4 పరీక్షల్లోనూ ఇతడు 27 ర్యాంకు సాధించటం విశేషం. అంతేకాదు, జూనియర్ లెక్చరర్ పరీక్షల్లో కూడా స్టేట్ 3వ ర్యాంకు సొంతం చేసుకొని ప్రశంసలు పొందాడు. ఈ నెల 12న రవీంద్రభారతిలో సీఎం చేతుల మీదుగా జేఎల్ ఉద్యోగ నియామక పత్రం అందుకున్నాడు.

గ్రూప్‌-3, గ్రూప్‌-2లో మహిళా టాపర్ ఒక్కరే



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–3 పరీక్ష ఫలితాల్లో మహిళా విభాగంలో డాక్టర్ వినీషారెడ్డి మహిళా విభాగంలో టాపర్‌గా నిలిచారు. మొత్తం 450 మార్కులకు గాను ఆమె 325.157 మార్కులు సాధించి 8వ ర్యాంకు సొంతం చేసుకున్నారు. గ్రూప్–2 ఫలితాల్లోనూ మహిళల విభాగంలో ఆమే టాపర్ కావటం విశేషం. సీడీపీఓ పరీక్షల్లో సైతం వినీషారెడ్డి స్టేట్ టాపర్‌గా నిలిచారు. గ్రూప్–1 పరీక్షలో కూడా మంచి మార్కులు సాధించారు. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండానే సొంతంగా పరీక్షలకు సిద్ధమైనట్లు ఆమె తెలిపారు. తన లక్ష్యం ఐఏఎస్ ఉద్యోగం సాధించటమేనని చెప్పారు.

గ్రూప్స్ పరీక్షలన్నింట్లోనూ ర్యాంకులు



పెంట్లవెల్లి: టీజీపీఎస్సీ గ్రూప్స్–1, 2, 3, 4 పరీక్షలన్నింట్లోనూ మంచి ర్యాంకులు సాధించి ఔరా అనిపించాడు నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామానికి చెందిన హవల్దారి శ్రీనాథ్. ఇతడు గ్రూప్–1లో 454.5 మార్కులు సాధించాడు. గ్రూప్–2లో స్టేట్ 68వ ర్యాంకు పొందిన శ్రీనాథ్.. శుక్రవారం ప్రకటించిన గ్రూప్–3లో స్టేట్ 88వ ర్యాంకు సొంతం చేసుకున్నాడు. గ్రూప్–4లో స్టేట్ 136వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడిన శ్రీనాథ్.. తన తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహం వల్లే తాను పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించినట్లు చెప్పాడు.

నాగారంలోని 50 ఎకరాలపై స్టేటస్ కో

- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే నంబర్ 181, 182లో ఉన్న 50 ఎకరాల భూమిపై హైకోర్టు యథాతథస్థితి విధించింది. ఆ భూమి ప్రైవేట్‌ది అని కొందరు వాదిస్తుండగా, భూదాన్ సంస్థది అని భూదాన్ బోర్డు దానిపై హక్కులు కోరుతోంది. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని లోతుగా పరిశీలించాల్సి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఇందులో ప్రజాప్రయోజనాలు ఇమిడి ఉన్నందున ప్రభుత్వం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేవరకు స్టేటస్‌కో విధిస్తున్నట్లు జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు.

అది దానమిచ్చిన భూమి: ప్రభుత్వం

సర్వే నంబర్ 182లో 10 ఎకరాలకు సంబంధించి ఖాదర్ ఉన్నీసాకు వారసత్వ ధ్రువీకరణ పత్రం జారీచేసిన అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్, డీఆర్‌వో ఆర్‌పీ జ్యోతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని 2024, సెప్టెంబర్ 18న, అక్టోబర్ 26న ఫిర్యాదు చేసినా ప్రభుత్వం స్పందించలేదని నవాబ్ ఫరూఖ్ అనే వ్యక్తి హైకోర్టులో తొలుత పిటిషన్ దాఖలు చేశారు. ఆ భూమిలో తనకు వాటా ఉందని ఆయన వాదిస్తున్నారు. దీనిపై కోర్టు ఆదేశాల మేరకు భూదాన్ యజ్ఞ బోర్డు అధికారి హోదాలో నవీన్ మిత్తల్ ఇటీవల కౌంటర్ దాఖలు చేశారు. 'నవాబ్ మహమ్మద్ హాజీ నాగారంలోని భూములను భూదాన్ బోర్డుకు దానం చేశారు. ఆ భూములపై ఆయన వారసులకు ఎలాంటి హక్కులు ఉండవు. ఈ 50 ఎకరాలపై ఎలాంటి లావాదేవీలు జరిగినా అవి చెల్లవు. ఈ భూములపై హైకోర్టు స్టే ఇచ్చినందున సర్వే నంబర్ 181, 182లను నిషేధిత జాబితాలో చేర్చాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాం. తీర్పు వచ్చాక రికార్డులను సవరించి, భూదాన్ భూమిగా చేర్చాలని కోరాం' అని కౌంటర్‌లో పేర్కొన్నారు. ఈ కౌంటర్‌ను సవాల్ చేస్తూ ఈబీపీఎల్ నిర్మాణ సంస్థ తరఫున శ్రీధర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి.. మొత్తం భూమిపై యథాతథ స్థితి కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

19న యూకే పార్లమెంట్‌లో చిరంజీవికి సత్కారం

- అదే వేదికపై 'బ్రిడ్జ్' జీవిత సాఫల్య పురస్కారం



సాక్షి, హైదరాబాద్: కళారంగానికి, సమాజానికి నాలుగున్నర దశాబ్దాలుగా ప్రముఖ నటుడు చిరంజీవి చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆయనను హౌస్ ఆఫ్ కామన్స్ యూకే పార్లమెంట్‌లో గౌరవించనున్నారు. ఈ మేరకు ఆయనకు ఆహ్వానం అందింది. ఈనెల 19న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో యూకేకి చెందిన అధికార లేబర్ పార్టీ పార్లమెంట్ సభ్యుడు నవేందు మిశ్రా చిరంజీవిని ఘనంగా సత్కరించనున్నారు. సోజన్ జోసెఫ్, బాబ్ బ్లాక్‌మన్ సహా ఇతర పార్లమెంట్ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అదే వేదికపై బ్రిడ్జ్ ఇండియా సంస్థ సినిమా, ప్రజాసేవ, దాతృత్వానికి చిరంజీవి చేసిన కృషిని గుర్తించి కల్చరల్ లీడర్‌షిప్‌తో ప్రజాసేవలో విశిష్ట సేవలకుగాను 'జీవిత సాఫల్య పురస్కారం'ప్రదానం చేయనుంది.. బ్రిడ్జ్ సంస్థ యూకేలో పబ్లిక్ పాలసీలను రూపొందించే ప్రముఖ సంస్థ.

ఆ జాబితా పరిగణించం!

▶ మొదటి పేజీ తరువాయి

తాము రూపొందించిన మొబైల్ అప్లికేషన్ ఆధారంగా మళ్లీ సర్వే చేసి వివరాలు అందజేయాలని కేంద్రం తేల్చిచెప్పింది. దీనితో కంగుతినడం రాష్ట్ర ప్రభుత్వం వంతు అయింది. అన్ని లక్షల దరఖాస్తులకు సంబంధించి కేంద్ర యాప్‌తో మళ్లీ సర్వే చేయటం ఇప్పటికిప్పుడు అయ్యే పనికాదు. మరోవైపు ప్రభుత్వం ఇప్పటికే ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు అందితే.. లబ్ధిదారులకు మొదటి విడత సొమ్ము అందజేసేందుకు సిద్ధమైంది. అలాంటిది కేంద్రం పెట్టిన మెలికతో గందరగోళం మొదలైంది.

కేంద్రం నుంచి అందే నిధుల కోసం..

దాదాపు పుష్కర కాలం తర్వాత రాష్ట్రంలో మళ్లీ ఇందిరమ్మ పేరుతో పేదల ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తెలంగాణ పరిధిలో దాదాపు 19 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించారు. ఇప్పుడు వచ్చే నాలుగేళ్లలో దాదాపు 20 లక్షల ఇళ్లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో వీలైనన్ని నిధులను కేంద్రం నుంచి పొందాలని నిర్ణయించింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద 20 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని కోరింది. ఎన్ని ఇళ్లు మంజూరు చేస్తుందనేది కేంద్రం ఇప్పటివరకు స్పష్టం చేయలేదు. పైగా ఒక్క ఇల్లు కూడా అనర్హుల చేతికి అందకూడదని, కేంద్రం ఖరారు చేసిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, అనర్హులకు ఇళ్లు మంజూరు చేసినట్టు తేలితే నిధులు ఇవ్వబోమని షరతులు పెట్టింది. దీనికి అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం.. అక్రమాలకు తావు లేకుండా చూడాలని అధికారులను అప్రమత్తం చేసింది. కానీ సర్వే విషయంలోనే ఇప్పుడు చిక్కు వచ్చింది.


కేంద్రం రూపొందించిన యాప్‌తో మళ్లీ సర్వే..

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకోసం ప్రభుత్వానికి దాదాపు 30 లక్షల దరఖాస్తులు అందాయి. కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసిన పరిశీలనాంశాల ఆధారంగా అధికార యంత్రాంగం ఇటీవలే దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి.. 23 లక్షల మందిని అర్హులుగా గుర్తించింది. ఇందులో 19.50 లక్షల మంది సొంత జాగా ఉన్నవారుకాగా.. మూడున్నర లక్షల మంది సొంత భూమి లేనివారు. రాష్ట్రం తాజాగా ఈ వివరాలను కేంద్రానికి అందజేసి నిధులు మంజూరు చేయాలని కోరింది. అయితే తాము రూపొందించిన మొబైల్ అప్లికేషన్ ఆధారంగా ఈ సర్వే జరగనందున పరిగణనలోకి తీసుకోబోమని, ఆ మొబైల్ యాప్ ద్వారా మళ్లీ సర్వే చేసి వివరాల జాబితా సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్రం ప్రామాణికంగా నిర్ధారించిన అంశాలనే పరిగణనలోకి తీసుకుని సర్వే చేశామని, వివరాల్లో ఎలాంటి తేడా ఉండదని.. దీన్ని గుర్తించి ఆ జాబితాను కేంద్ర ప్రభుత్వ యాప్‌తో అనుసంధానించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అయినా కేంద్రం ససేమిరా అంటున్నట్టు తెలిసింది. దరఖాస్తుల్లో బ్యాంకు ఖాతా, ద్విచక్ర వాహనాలు, పన్ను చెల్లింపు వంటి వివరాలేవీ లేవని, అవి లేకుండా జాబితా తీసుకోబోమని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇవి పెద్దగా తేడా చూపే అంశాలు కాదని, ఇళ్లను మంజూరు చేసేనాటికి ఆ వివరాలను కూడా అప్‌లోడ్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ కోరినట్టు తెలిసింది. కేంద్రం సానుకూలంగా స్పందించి నిధులు ఇస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశాభావంతో ఉన్నా... కేంద్రం నుంచి ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు.

కేంద్ర నిధులు రాకుంటే పథకం భారమే!

పట్టణ ప్రాంత ఇళ్లకు కేంద్రం యూనిట్ కాస్ట్‌ను రూ.లక్షన్నరగా ఖరారు చేసింది. దీనితో వీలైనన్ని ఎక్కువ ఇళ్లను పట్టణ ప్రాంత ఖాతా కింద పొందాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అయితే దేశవ్యాప్తంగా మంజూరు చేసే పట్టణ ప్రాంత ఇళ్లలో 4 శాతాన్ని తెలంగాణకు ఇస్తామని కేంద్రం స్పష్టం చేసింది. ఇది చాలా తక్కువని, సంఖ్య మరింత పెంచాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది. కానీ స్పష్టత రావాల్సి ఉంది. ఇక గ్రామీణ ప్రాంత ఇళ్లకు సంబంధించి యూనిట్ కాస్ట్ రూ.73 వేలుగా ఉంది. ఈ నిధులన్నా పొందుదామంటే కేంద్రం పెట్టిన మెలిక కలవరపెడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించింది. కేంద్రం నుంచి సాయం అందని పక్షంలో మొత్తం నిధులను రాష్ట్రమే భరించాల్సి వస్తుంది. అది పెద్ద భారంగా మారుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

సప్తగిరులపై సుందర దృశ్యం



తిరుమలేశుని సప్తగిరులు సుందర మనోహరంగా శోభిల్లుతున్నాయి. రెండవ ఘాట్ రోడ్‌లో వెండి మబ్బులు ఏడుకొండల ప్రకృతి అందాలను తిలకించేందుకు దివి నుంచి నేలపైకి వచ్చాయా అన్నట్లుగా దట్టంగా కమ్మేస్తున్నాయి. తిరుమల క్షేత్రాన్ని మేఘాలు ముద్దాడుతున్నట్లుగా కనిపిస్తున్న ఆ దృశ్యాలను భక్తులు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తూ మురిసిపోతున్నారు.

- తిరుమల




లాంగ్‌మార్చ్ చేస్తున్న విద్యార్థులు

హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు విద్యార్థుల లాంగ్ మార్చ్

రాయదుర్గం: హెచ్‌సీయూలోని భూముల పరిరక్షణలో భాగంగా పలు విద్యార్థి సంఘాలు భారీ లాంగ్‌మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిపాలనా భవనం నుంచి క్యాంపస్‌లోని పురాతన రాతిసంపదగా గుర్తింపు పొందిన మష్రూమ్‌రాక్ వరకు లాంగ్‌మార్చ్‌లో పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి, హెచ్‌సీయూ భూములను వేలం వేయకుండా చూడాలి, హెచ్‌సీయూ భూమిని కాపాడతాం'అంటూ విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున నినాదాలు చేశాయి. ఎస్ఎఫ్ఐ, డీఎస్‌యూ, ఏఎస్ఏ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొని పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. వేలం పాటల కోసం చదును చేసిన స్థలంలో విద్యార్థులు గురువారం సాయంత్రం మొక్కలు నాటి నిరసన తెలియజేశారు.

మూడేళ్లలోగా సీతమ్మసాగర్ బరాజ్‌ను పూర్తి చేయాలి





- అధికారులకు మంత్రులు ఉత్తమ్, తుమ్మల ఆదేశం
- సీతారామ ప్రాజెక్టు పనులపై భేటీ అయిన మంత్రులు

సాక్షి, హైదరాబాద్: సీతమ్మసాగర్ బరాజ్ నిర్మాణ పనులను మూడేళ్లలోగా పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి మిగిలిన పనులపై చర్చించడానికి శుక్రవారం తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి ఉత్తమ్‌తో భేటీ అయ్యారు. సత్తుపల్లి ట్రంక్, భూ సేకరణ, ప్రాజెక్టుకు అవసరమయ్యే నిధులు, నాణ్యత, భవిష్యత్ ప్రణాళికలపై మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. సత్తుపల్లి ట్రంక్ పనులను ఈ సంవత్సరం లోపు పూర్తి చేయాలని, అలాగే పంప్‌హౌస్–4 నిర్మాణాన్ని కూడా డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. అలాగే ప్రాజెక్టుకు అవసరమయ్యే భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఖమ్మం, కొత్తగూడెం కలెక్టర్లను మంత్రులు ఈ సందర్భంగా ఆదేశించారు. పనుల్లో వేగం, నాణ్యత, ఖర్చులో నియంత్రణ వంటి అంశాలపై అధికారులు, కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సీతారామ ప్రాజెక్టు కీలకం..

సీతమ్మసాగర్ బరాజ్ పూర్తయితే దాదాపు ఐదారు వందల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టు రానున్న రోజుల్లో కీలకం కానుందని మంత్రి వ్యాఖ్యానించారు. భవిష్యత్‌లో కృష్ణా జలాలు ఇబ్బందిగా మారితే సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు స్థిరీకరణకు సీతారామ ప్రాజెక్టు జీవధారగా నిలుస్తుందన్నారు. జూలూరుపాడు టన్నెల్ పూర్తయి, పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి నీళ్లు చేరితే భవిష్యత్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సీతారామ వర ప్రదాయనిగా మారుతుందని మంత్రి తుమ్మల ఉత్తమ్‌కు వివరించారు. కాగా, రైతాంగం మేలు కోసం సాగు నీటికి బాటలు వేసే పనులపై కీలక విషయాలు చర్చించినట్లు సమావేశం అనంతరం మంత్రులు ఒక ప్రకటనలో తెలిపారు.

యోగమునందు బుద్ధిగలవారు ఒకటే నిశ్చయముతో ఉందురు.
వేరు అభిప్రాయాలు కలుగువారికి బుద్ధి శాఖోపశాఖలై ఉండును.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 15 మార్చి 2025

‘రూ’పం... సారం

నిరుడు లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి వరసగా మూడోసారి కేంద్రంలో అధికారం లోకొచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి విపక్షాల ఆధ్వర్యంలోని రెండు రాష్ట్రాలు గట్టి ప్రతిఘటననిస్తున్నాయి. ఇందులో తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం బెంగాల్‌లోని తృణమూల్ సర్కారుకన్నా ఒకడుగు ముందుంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఒకపక్క నియోజక వర్గాల పునర్విభజన, మరోపక్క హిందీ భాష పెత్తనం అనే రెండు పదునైన ఆయుధాలతో కేంద్రాన్ని ఇరకాటంలో పడేస్తున్నారు. పార్లమెంటులోనూ, వెలుపలా ఈ రెండింటిపైనా విస్తృతమైన చర్చ జరిగేలా చూస్తున్నారు. నిత్యం పతాక శీర్షికలకెక్కుతున్నారు. శుక్రవారం ప్రవేశపెట్టే 2025–26 రాష్ట్ర బడ్జెట్ లోగో లోని హిందీ అక్షరం‘రూ’ బదులు తమిళ అక్షరం ‘రూ’ను వినియోగించబోతున్నామని గురువారం స్టాలిన్ ప్రకటించటం అందులో భాగమే. అయితే తమ ఉద్దేశం తమిళభాష ఔన్నత్యాన్ని పెంచటమే తప్ప, హిందీని వ్యతిరేకించటం కాదని డీఎంకే ప్రతినిధి శరవణన్ వివరణనిచ్చారు. హిందీ ‘రూ’ జాతీయ కరెన్సీ అధికారిక చిహ్నంగా 2010 జూలై నుంచి అమల్లోవుంది. వచ్చే ఏడాది జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల దృష్టితోనే డీఎంకే ఇలాంటి విన్యాసాలు చేస్తున్నదని బీజేపీ అంటున్నా, ఆ పార్టీ లేవనెత్తుతున్న రెండు అంశాలూ కొట్టిపారేయదగ్గవి కాదు. రాజ్యాంగం నిర్దేశించిన ఫెడరలిజం భావనను కేంద్రం నీరుగారుస్తోందన్న అభిప్రాయం రాష్ట్రాల్లో బలపడనట్టయితే డీఎంకే లేవనెత్తిన అంశాలకు ఇప్పుడున్నంత ప్రాముఖ్యత లభించేది కాదన్నది వాస్తవం. ఇంతకూ జాతీయ కరెన్సీ చిహ్నం రూపొందించింది తమిళనాడు వ్యక్తి, పైగా డీఎంకే మాజీ ఎమ్మెల్యే కుమారుడు. కనుకనే డీఎంకే నిర్ణయం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ చిహ్నంలో హిందీ అక్షరమేవున్నా ఇంగ్లిష్ అక్షరం ‘ఆర్’ను కూడా పోలివుండటం దాని ప్రత్యేకత. కానీ సమస్య తలెత్తినప్పుడు ఇవన్నీ మరుగున పడతాయి. ఆ సంగతలా వుంచి ఈ అంశంలో బీజేపీ స్పందనలు శ్రుతిమించాయి. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కరెన్సీ చిహ్నం మార్పు దేశ ఐక్యతను బలహీనపరిచే ప్రమాదకరమైన మనస్తత్వం పర్యవసానమని అభివర్ణించారు.

హిందీ అమలుకు అనుసరించే విధానాలవల్లే ఆ భాషపై వ్యతిరేకత వస్తోంది. ఇది బీజేపీతో మొదలు కాలేదు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోవున్నా ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. వాటికి ఎప్పటికప్పుడు ప్రతిఘటన వస్తూనే వున్నది. 2008లో యూపీఏ సర్కారు హిందీ వాడకాన్ని పెంచడానికంటూ విడుదల చేసిన సర్క్యులర్‌పై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మెట్రిక్, ఆపై స్థాయి అభ్యర్థులకు కేంద్ర నియామకాల కోసం నిర్వహించే పోటీ పరీక్షల్లో తప్పనిసరిగా హిందీ ప్రశ్నపత్రం ఉండాలన్నది సర్క్యులర్ సారాంశం. తమ పార్టీ ఆధ్వర్యంలోని యూపీఏ సర్కారే దీన్ని తీసుకొచ్చినా అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఇతర ప్రశ్న పత్రాల్లో మెరుగైన మార్కులు వచ్చినా హిందీలో ఫెయిలైతే ఉద్యోగానికి అనర్హులవుతారని ఆ ప్రతిపాదన తెలిపింది. ఇది హిందీ భాషా ప్రాంతాల అభ్యర్థులకే లాభిస్తుందనీ, దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనీ వైఎస్ లేఖ రాశారు. చివరకు ఆ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత 2014, 2017, 2019లలో సైతం కేంద్రం ఈ మాదిరి ప్రతిపాదనలే ముందుకు తోసింది. ఇంగ్లిష్‌కు ప్రత్యామ్నాయంగా హిందీ ఉండాలని రెండేళ్ల క్రితం కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నప్పుడు కూడా వివాదం రేగింది.

జాతీయ విద్యావిధానం–2020తో తమిళనాడుకు పేచీవుంది. తాము ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్న త్రిభాషా సూత్రాన్ని తీసుకురావటమే ఆ విద్యావిధానం సారాంశమని డీఎంకే అంటున్నది. ఆ విధానం ప్రకారం విద్యార్థి మాతృ భాషతోపాటు ఇంగ్లిష్, మరేదైనా దేశీయ భాష నేర్చుకోవాలన్న నిబంధన వుంది. హిందీయే నేర్చుకోవాలని అందులో లేదన్నది నిజమే కావొచ్చుగానీ... వేరే భాష నేర్చుకోవాలనుకుంటే ఆ భాషా ఉపాధ్యాయులు అందుబాటులో ఉండే అవకాశముందా? హిందీ ప్రాంతాల్లో దక్షిణాది భాషలు నేర్పే టీచర్లే లేరు. అసలు ఈ త్రిభాషాసూత్రం వల్ల ఈ స్థాయిలో మేలు జరిగిందని చెప్పే గణాంకాలున్నాయా? జాతీయ విద్యావిధానం అమలు చేయలేదన్న కారణంతో సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కింద కేంద్రం నుంచి రావాల్సిన 2,152 కోట్లను నిలిపివేశారని తమిళనాడు ఆరోపిస్తోంది. ఎస్ఎస్ఏకు రావాల్సిన ఆ నిధులను సొంత వనరుల నుంచే సమీకరించాలని నిర్ణయించినట్టు ఆ రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించారు. హిందీకి వ్యతిరేకమనో, నూతన విద్యావిధానానికి వ్యతిరేకమనో చూపి నిధులు ఆపేయటం ఒత్తిడి తీసుకొచ్చే మార్గమని కేంద్రం అనుకోవచ్చుగానీ... దీన్ని బెదిరించటంగా, బ్లాక్‌మెయిల్‌గా తమిళనాడు పరిగణిస్తోంది. విద్యాపరంగా చూసినా, పన్నుల వసూళ్లపరంగా చూసినా తమిళనాడు అనేక రాష్ట్రాలకన్నా ఎంతో ముందుంది. అందుకు ఇదా బహుమతి అనే ప్రశ్న తలెత్తదా?

అమల్లోకి తీసుకురాదల్చుకున్న ఏ విధానంపైన అయినా సమగ్ర చర్చ జరపడం, అపోహల్ని తొలగించటం అవసరమని కేంద్రం గ్రహించాలి. ప్రాథమిక స్థాయి విద్య మొదలుకొని విశ్వవిద్యాలయ విద్యవరకూ అన్నింటా తన ఆధిపత్యమే ఉండాలన్న ఆత్రుత వేరే పర్యవసానాలకు దారి తీస్తున్నదని గుర్తుంచుకోవాలి. రాష్ట్రాలను మున్సిపాలిటీల స్థాయికి దిగజారిస్తే, ఫలానా పథకం అమలు చేయలేదన్న కారణం చూపి నిధులు ఎగ్గొడితే సాధారణ ప్రజలకు వేరే సంకేతాలు పోతాయి. ఆ పరిస్థితి తలెత్తకుండా చూసుకోవటం కేంద్రం బాధ్యత.

‘ఇండియా’ కూటమి లేనట్టేనా?

అభిప్రాయం



టంకశాల అశోక్

సీపీఎం పొలిట్ బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ ఈ నెల 9వ తేదీన గమనార్హమైన వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం యేచూరి మరణం తర్వాత ఇంకా ఎవరూ ఆ స్థానంలోకి రాలేదు. కరత్ పొలిట్ బ్యూరో సమన్వయ కర్తగా నియమితులయ్యారు. అది ప్రస్తుతానికి ప్రధాన కార్యదర్శి వంటి హోదా. పైగా ఆయన స్వయంగా లోగడ ఆ హోదాలో పని చేశారు. అందువల్ల తన మాటలకు తగినంత ప్రాధాన్యత ఉంటుంది. అంతేకాదు. కరత్‌కు మార్క్సిస్ట్ సిద్ధాంతాలలో నిష్ణాతుడనే పేరు పార్టీలో, బయటా కూడా ఉన్నది. హరికిషన్ సింగ్ సూర్జిత్ ప్రధాన కార్యదర్శిగా ఉండినపుడు, సీపీఎంతో పాటు మొత్తం వామపక్షాలను మధ్యే మార్గ పార్టీలతో మైత్రి వైపు మళ్లించారు. సీతారాం అందుకు అనుకూలురు కాగా, కరత్ వ్యతిరేకి.

కరత్ మాట్లాడిన సందర్భం సీపీఎం కేరళ శాఖ సభలు కొల్లామ్ పట్టణంలో జరగటం. ఆ సభలు ఒక రాష్ట్రానికి సంబంధించినవి. ఆయన మాటలు నేరుగా తన ప్రసంగంలో అన్నవి గాక, విడిగా ఒక పత్రికా ప్రతినిధితో చెప్పినవి. అందువల్ల వాటికి తగిన ప్రచారం రాలేదు. కానీ అవి మొదట అనుకున్నట్లు గమనార్హమైనవి: ‘ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్, ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా) పేరిట ఏర్పడిన 26 బీజేపీ యేతర పార్టీల కూటమి 2024 లోక్‌సభ ఎన్నికలలో పోటీకి ఏర్పడింది మాత్రమే. ఆ ఎన్నికల తర్వాత ఏమి చేయాలన్నది ఎవరూ ఆలోచించలేదు. ఆ కూటమికి ఒక వ్యవస్థాత్మక నిర్మాణాన్ని మేము వ్యతిరేకించాం. ఎందుకంటే రకరకాల విధానాలు, సిద్ధాంతాలు, నాయకులు ఆ కూటమిలో ఉన్న స్థితిలో ఏకీకృత కేంద్ర స్థాయి నిర్మాణం సాధ్యం కాదు. ఒక సమన్వయ కమిటీ ఏర్పాటుకు ఇతర పార్టీలు ప్రయత్నించాయి గానీ అది ఆచరణలో పని చేయగలది కాదన్నాము. దానితో, నాయకులు మాత్రం కలుస్తుండేవారు. కొన్ని కమిటీలు ఏర్పాటు చేశారు గానీ అవేవీ పని చేయలేదు. సీట్ల సర్దుబాటుపై జాతీయ స్థాయి చర్చలు వీలయేవి కాదు గనుక ఆ పని ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంగా జరగాలన్నాము మేము. ఉదాహరణకు మా పార్టీ బెంగాల్‌లో, కేరళలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేయదు. మొత్తానికి ఆ పద్ధతి పనిచేసి బీజేపీ సొంత మెజారిటీ కోల్పోయి 240 స్థానాలకు తగ్గింది. అందువల్ల, ఇండియా కూటమి అన్న ఆలోచనే లోక్‌సభ ఎన్నికలకు పరిమితమైనటువంటిది... లోక్‌సభ ఎన్నికల అనంతరం తమకు అసలు ఒక ఉమ్మడి వేదిక అవసరమా? అయితే ఏ విధంగా? అన్నది ఈ పార్టీలు ఆలోచించాలి. ఒకవేళ వేదిక ఎన్నికల కోసమే అయితే, ఇపుడు చేయవలసింది ఏమీ ఉండదు’ అన్నారు సీపీఎం సమన్వయకర్త.

కూటమి భవిష్యత్తు?

కరత్ వెల్లడించిన అభిప్రాయాలలో ఇండియా కూటమి ఏ విధంగా వ్యవహరించిందన్న గత పరిస్థితులకే పరిమితమయ్యారనే భావన కలగవచ్చు. కానీ అందులో అంతర్లీనంగా, ప్రతిపక్షాలు మౌలికంగా ఎట్లా పనిచేస్తున్నాయి, భవిష్యత్తులో ఏ విధంగా పని చేయాలనే కోణాలు కూడా కనిపిస్తాయి. చెప్పాలంటే ఈ ప్రశ్నలు ప్రతిపక్షాలకు 1977 నాటి జనతా పార్టీ నుంచి మొదలుకొని తర్వాత కాలంలో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్‌ల కాలంలో, ఇంకా తర్వాత కాంగ్రెస్ నాయకత్వాన ఏర్పడిన యూపీఏ హయాంలోనూ కొనసాగినవే. ఇండియా కూటమి బలహీనతలు, వైఫల్యాల వెనుక కూడా ఇదంతా ఉంది.

కూటమికి వ్యవస్థాత్మక నిర్మాణాన్ని సీపీఎం వ్యతిరేకించటానికి కారణం అందులో పలు రకాల విధానాలు, సిద్ధాంతాలు గల పార్టీలు, నాయకులు ఉండటం. దీనికి సమాధానాలు కనుగొనలేకపోయినందువల్లనే అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి కూటమికి భంగపాట్లు ఎదురు కావటం జరిగింది. అటువంటి భంగపాట్లు జనతా పార్టీ కాలం నుంచి గత 48 సంవత్సరాలుగా ప్రతిపక్షాలకు ఎదురవుతూనే ఉన్నాయి. అందుకు ఒక కారణం వారి వైఫల్యాలు కాగా, మరొకటి భారతదేశపు మహా విస్తారమైన వైవిధ్యత.

ఇన్నిన్ని ప్రాంతాలు, సైద్ధాంతిక, విధానపర, రాజకీయ వైవిధ్యతలు ఉన్నపుడు ఏకాభిప్రాయాలు, విభేదాలకు అవకాశం ఉండని సమష్టి నాయకత్వాలు తేలిక కాదు. కాంగ్రెస్, బీజేపీలవలె నిర్దిష్ట దీర్ఘకాలిక చరిత్రలు, నాయకత్వాలు, సిద్ధాంతాలు ఉన్నపుడు అది సాధ్యమవుతుంది. లేదా ఎమర్జెన్సీ వంటి అసాధారణ పరిస్థితి ఏర్పడి దేశాన్ని ఒకటి చేయటం వంటిది జరగాలి. వీటన్నింటి మధ్య స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి ఒక పాయగా సాగుతుండిన సోషలిస్టు రాజకీయం సరిగా కుదురుకొని ఉంటే ఏమి జరిగేదో గానీ పలు కారణాలవల్ల అది ఛిన్నాభిన్నమైంది. మరొకవైపు, కేవలం ఎమర్జెన్సీ పట్ల వ్యతిరేకతతో ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట ఏర్పడిన జనతా పార్టీ, తర్వాత ‘యాంటీ కాంగ్రెసిజం’ ఆలోచనలతో ముందుకు వచ్చింది. తాము ఒకప్పటి కాంగ్రెస్ సంప్రదాయంలో వామపక్షపు మొగ్గ గల మధ్యే మార్గ ప్రత్యామ్నాయం కాగలమన్న ఫ్రంట్ కూటములు అదే దశలో చెదిరిపోయాయి.

కనీస ఉమ్మడి కార్యక్రమం ఏమిటి?

అయితే, ప్రకాశ్ కరత్ మాటలను పరిగణనలోకి తీసుకుని ఆలోచిస్తే, 1977 నాటి జనతా పార్టీ కాదుగానీ, 1989లో ఏర్పడిన నేషనల్ ఫ్రంట్ కొంత భిన్నంగా కనిపించింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చిన తీవ్ర అవినీతి ఆరోపణలతో అదే పార్టీకి చెందిన వీపీ సింగ్ వంటి ముఖ్య నేతలు బయటకు రావటం, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరించి వేస్తున్నదనే ఫిర్యాదుతో పలు ప్రాంతీయ పార్టీలు, ప్రభుత్వాలు, ఎమర్జెన్సీ – జనతా పార్టీ దశలో ఒకటై తిరిగి చెదిరిపోయిన సోషలిస్టు వర్గాలు, ఉభయ కమ్యూనిస్టులు, దేశవ్యాప్తంగా సమాజంలోని ప్రజాస్వామికవాదులు ఒకే వేదికపైకి వచ్చి చేరారు. అంతేగాక, వీపీ సింగ్, ఎన్టీఆర్‌ల నాయకత్వాన బీజేపీని ఒక అడుగు దూరంలోనే ఉంచివేశారు. ఈ వైవిధ్యతల మధ్య అపుడు ప్రకాశ్ కరత్ ఉద్దేశిస్తున్నది ఒకటి జరిగింది. అది, ఎన్నికలకన్నా ముందే వివిధ పార్టీల మధ్య సుదీర్ఘ చర్చల ద్వారా ‘కనీస ఉమ్మడి కార్యక్రమం’ ఒకటి రూపొందించటం. అది దేశ ప్రజానీకానికి ఒక కొత్త విశ్వాసాన్ని కలిగించిన మాట నిజం. అయితే కొందరు సీనియర్ల అధికార కాంక్షలు, మందిర్–మండల్ వివాదాల మూలంగా ఆ ప్రయోగం భంగపడటం తెలిసిందే. అది జరగనట్లయితే దేశ రాజకీయాలు మరొక విధంగా ఉండేవేమో.

సీపీఎం సమన్వయ కర్త ప్రకాశ్ కరత్ అపుడంతా జాతీయ స్థాయిలో ఈ పరిణామాలను ప్రత్యక్షంగా గమనించిన వ్యక్తి. ప్రస్తుత ‘ఇండియా’ కూటమికి సంబంధించిన పరిణామాల వరకు తనకు తెలియనిది లేదు. అందువల్లనే ఆ కూటమి ఏర్పాటు తీరు, లక్ష్యాలు, పనితీరు, పరిమితులు, సాఫల్య వైఫల్యాల గురించి అంత స్పష్టంగా చెప్పగలిగారు. ఈ విషయాన్ని కొంత ముందుకు తీసుకువెళ్ళినట్లయితే, ఆయన ఎత్తి చూపిన సైద్ధాంతిక, విధానపరమైన వైవిధ్యతలు, వైరుధ్యాల నుంచి, నాయకుల వ్యక్తిగత ధోరణుల నుంచి బీజేపీ యేతర పార్టీలు బయటకు రాగలగటం, నేషనల్ ఫ్రంట్ వలె కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందించుకోవటం ఎంత వరకు సాధ్యమన్నది ప్రశ్న. అందుకు బీజేపీ వ్యతిరేకత అన్నదొక్కటే చాలదు. తమవైపు నుంచి ప్రజలకు చూపించే ప్రత్యామ్నాయ పాజిటివ్ ఆర్థిక, సామాజిక, అభివృద్ధి అజెండా తప్పనిసరి. ఎన్నికల తర్వాత ఏమిటన్న చర్చ ‘ఇండియా’ కూటమిలో ఎప్పుడూ జరగలేదని కరత్ ఎత్తిచూపింది ఈ విధమైన కొరతనే!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్



ఇండియా కూటమి నేతలు



‘ఇండియా’ పేరిట ఏర్పడిన 26 బీజేపీ యేతర పార్టీల కూటమి 2024 లోక్‌సభ ఎన్నికలలో పోటీకి ఏర్పడింది మాత్రమే. ఆ ఎన్నికల తర్వాత ఏమి చేయాలన్నది ఎవరూ ఆలోచించలేదు. ఆ కూటమికి ఒక వ్యవస్థాత్మక నిర్మాణాన్ని మేము వ్యతిరేకించాం. ఎందుకంటే రకరకాల విధానాలు, సిద్ధాంతాలు, నాయకులు ఆ కూటమిలో ఉన్న స్థితిలో ఏకీకృత కేంద్ర స్థాయి నిర్మాణం సాధ్యం కాదు. లోక్‌సభ ఎన్నికల అనంతరం తమకు అసలు ఒక ఉమ్మడి వేదిక అవసరమా? అయితే ఏ విధంగా? అన్నది ఈ పార్టీలు ఆలోచించాలి.
– ప్రకాశ్ కరత్, సీపీఎం పొలిట్ బ్యూరో సమన్వయకర్త

సోషల్ మీడియా

ఇదా సమస్య?



2014 వరకూ రూపాయి, డాలర్ మధ్య వ్యత్యాసం గురించి ఆందోళన చెందిన బీజేపీ నాయకులు, ఇప్పుడు అంతకంటే ఎక్కువగా తమిళనాడు ప్రభుత్వం తన రాష్ట్ర బడ్జెట్‌లో ‘₹’ గుర్తును తొలగించినందుకు ఆందోళన చెందుతున్నారు.
– మహమ్మద్ జుబేర్, జర్నలిస్ట్

వాటికి వద్దా?



ఉపగ్రహ సమాచారం ద్వారా అత్యున్నత సమర్థతతో కూడిన ఇంటర్‌నెట్/బ్రాడ్‌బాండ్ సేవల కోసం ‘స్టార్‌లింక్’తో భాగస్వాములు కావడానికి ఎయిర్‌టెల్, జియోకు భద్రతాపరమైన అనుమతి ఇస్తున్నప్పుడు, ప్రభుత్వం తన సొంత కంపెనీలైన బీఎస్ఎన్ఎల్, వోడాఫోన్ (పెద్ద భాగస్వామి)లకు ఆ ప్రయోజనాన్ని ఎందుకు నిరాకరిస్తోంది?
– ఎం.కె. వేణు, సంపాదకుడు

పద్ధతి లేదు!



సూపర్ పవర్‌గా ఎదుగుతున్నట్టు ఇండియా ఎన్ని గొప్పలయినా చెప్పుకోవచ్చు. కానీ భారతీయులు, ముఖ్యంగా కొంత చదువు, సంపద ఉండి, షికాగో నుంచి ఢిల్లీకి సుదీర్ఘ విమాన ప్రయాణం చేయగలిగే మధ్యతరగతి భారతీయులకు కనీసం టాయ్‌లెట్ ఎలా వాడాలో అయితే తెలీదు.
– రూపా సుబ్రమణ్య, కాలమిస్ట్

ఎన్నికల అంశం



2024 వరకూ ఎన్నడూ ‘₹’ గుర్తు గురించి ఆలోచించని డీఎంకే నాయకులు, రానున్న ఎన్నికల కారణంగా దాన్ని మారుస్తున్నారు.
– శిల్ప సీఎస్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

మారే నినాదం




యూఎస్ నూతన ప్రభుత్వం విధిస్తున్న సుంకాలు, అనుసరిస్తున్న వాణిజ్య విధానాలు దోషపూరితమైనవి, ప్రమాదకరమైనవి. అవి ‘మాగా’ను ‘మోగా’ చేస్తాయి. (మోగా– మేక్ ‘అదర్స్’ గ్రేట్ ఎగైన్ – ఇతరులను గొప్ప చేద్దాం.)
– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఇన్ బాక్స్

అవకాశాన్ని వదులుకోవద్దు!

దేశవ్యాప్తంగా 46 సెంట్రల్ యూనివర్సిటీలకు 2025–26 విద్యాసంవత్సరానికి గాను నాలుగు సంవత్సరాల డిగ్రీ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ‘కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్’ నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 1వ తేదీన రిజిస్ట్రేషన్ మొదలయ్యింది. ఈ ప్రక్రియ 23వ తేదీ వరకూ కొనసాగుతుంది. 37 సబ్జెక్టులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు డొమెయిన్ సబ్జెక్టు (ప్రధాన సబ్జెక్టు)నూ, నిర్దేశించిన 13 భాషలలో ఒక భాషనూ ఎంచుకోవాలి. జనరల్ స్టడీస్‌ను అభ్యర్థులందరూ రాయాలి. కనీస భాషా పరిజ్ఞానాన్ని పరీక్షించే విధంగా భాషకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. ఇంటర్మీడియట్, ప్లస్ 2, 12వ తరగతి పూర్తి చేసుకున్నటువంటి విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులు. ప్రతి విద్యార్థి ఐదు సబ్జెక్టుల వరకు పరీక్ష రాయడానికి ఎన్‌టీఏ అవకాశం కల్పించింది. ఈ ఒక్క పరీక్ష ద్వారా దేశవ్యాప్తంగా ఉన్నటువంటి సెంట్రల్ యూనివర్సిటీల్లో, అనుబంధ కళాశాలల్లో విద్యార్థులు తమ ర్యాంకు ద్వారా, రిజర్వేషన్ల ఆధారంగా సీటు పొందడానికి అవకాశం ఉంటుంది.



కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం (2020)లో భాగంగా అన్ని కేంద్ర విద్యా సంస్థలలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సును గత రెండు సంవత్సరాల క్రితం నుండి ప్రారంభించారు. ఒక విద్యార్థి 8 సెమిస్టర్లను పూర్తి చేసుకుంటే ఆ విద్యార్థికి డిగ్రీతోపాటు ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ తీసుకునే అవకాశం ఉంటుంది. దీని ద్వారా విద్యార్థి టీచర్ నియామకానికి సంబంధించి పరీక్షను నేరుగా రాయడానికి అర్హత సాధిస్తాడు. దీంతో పాటు పీజీ సర్టిఫికెట్ కూడా పొందుతాడు. ఈ కోర్సులో విద్యార్థి 75% శాతం మార్కులు సాధిస్తే నేరుగా పీహెచ్‌డీలో చేరడానికి అర్హత లభిస్తుంది. యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా చేరడానికి అవసరమైన నెట్, సెట్ పరీక్షలు రాయడానికి విద్యార్థి అర్హత సాధిస్తాడు.

సైన్సు చదివే విద్యార్థి ఆర్ట్స్ సబ్జెక్టు చదవడం, ఆర్ట్స్ చదివే విద్యార్థి సైన్సు సబ్జెక్టు చదవడానికి వీలు ఉండేలా ఈ కోర్సులు డిజైన్ చేశారు. విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవడానికి కంప్యూటర్ శిక్షణతో పాటు, మాతృభాష, ఇతర భాషలను నేర్పే విధంగా బోధన ఉంటుంది.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఇఫ్లూ, మాను, సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలు తెలంగాణలో; తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ట్రాన్సిట్ క్యాంపస్)లు ఏపీలో ఈ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా ప్రవేశం కల్పిస్తున్నాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. వివరాలకు ఎన్‌టీఏ వెబ్‌సైట్ (https://cuet.nta.nic.in/)ను చూడవచ్చు

– డా॥ చింత ఎల్లస్వామి, ములుగు


బ్యాటింగ్–బౌలింగుల్లో అరుదైన ఘనుడు



సి. వెంకటేశ్

కపిల్ దేవ్ కంటే చాలా ముందు భారత జట్టులో ఒక మంచి పేస్ బౌలింగ్ ఆల్రౌండర్ ఉండేవాడని ఇప్పటి తరం వారిలో చాలా మందికి తెలియదు. ఆయనే మన హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ ఆబిద్ అలీ. కపిల్ దేవ్‌తో పోలిస్తే ఆబిద్ గణాంకాలు చిన్నబోతాయి. కపిల్ నికార్సయిన ఫాస్ట్ బౌలర్ కాగా... ఆబిద్ ఓ మీడియం పేసర్ మాత్రమే. అయినా తన బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ సామర్థ్యాలతో భారత క్రికెట్‌కు ఆయన అమూల్యమైన సేవలందించారు. ముఖ్యంగా 1971లో మన జట్టు వెస్టిండీస్, ఇంగ్లండ్‌పై సాధించిన చరిత్రాత్మక సిరీస్ విజయాలలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు.

బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లతో పాటు వికెట్ కీపింగ్ కూడా చేయగల నేర్పరితనం ఆబిద్‌కు ఉండేది. నిజానికి ఆయన తన కెరీర్‌ను వికెట్ కీపర్‌గానే మొదలుపెట్టారు. కొత్త బంతితో బౌలింగ్ ప్రారంభించడంతో పాటు బ్యాట్స్‌మన్‌గా ఓపెనింగ్ కూడా చేయగల సామర్థ్యం ఆయనకు ఉండేది. ఇండియాకు బ్యాటింగ్, బౌలింగ్ రెండూ ఓపెన్ చేసిన అరుదైన ఘనత ఆయనకు దక్కింది. ఏ స్థానంలో అయినా బ్యాటింగ్‌కు దిగగలిగినట్టే, ఫీల్డింగ్‌లో కూడా ఏ పొజిషన్‌లో అయినా ఆబిద్ రాణించేవారు. అయితే క్లోజ్ ఫీల్డర్‌గా ఆయన ఎక్కువ గుర్తుంటారు. హైదరాబాద్ గ్రామర్ స్కూల్, ఆల్ సెయింట్స్ స్కూల్లో చదుకుంటున్నప్పటి నుంచి క్రికెట్ మీదే ఆయన ధ్యాస. ఆ రోజుల్లోనే ఫిట్‌నెస్ మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టేవారాయన. లాల్ బహదూర్ స్టేడియం గ్యాలరీ మెట్ల మీద గంటల తరబడి పరుగులు పెట్టడం ఆయనకుదినచర్య. ఎమ్ఎల్ జయసింహ కెప్టెన్సీలో 1959లో రంజీ ట్రోఫీలో ఆరంగేట్రం చేసిన ఆబిద్ అలీకి ఓ ఎనిమిదేళ్ళ తర్వాత గానీ ఇండియాకు ఆడే అవకాశం రాలేదు. 1967–68 ఆస్ట్రేలియా టూర్ మొదటి టెస్ట్ నాటికి ఇండియా కెప్టెన్ టైగర్ పటౌడీకి గాయమవ్వడంతో ఆబిద్ అలీకి ఎలెవెన్‌లో చోటు దక్కింది. ఆ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసి, తొలి టెస్ట్‌లోనే అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా రికార్డు పుస్తకాలకెక్కారు. అదే మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో కూడా రాణించి రెండు ఇన్నింగ్సుల్లో ఒక్కొక్క దానిలో 30 పరుగుల చొప్పున చేశారు. ఆ సిరీస్‌లోని ఆఖరు టెస్ట్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 78, రెండో ఇన్నింగ్స్‌లో 81 పరుగులు చేసి జట్టులో తన స్థానం సుస్థిరం చేసుకున్నారు.



సయ్యద్ ఆబిద్ అలీ

1971వ సంవత్సరం భారత క్రికెట్‌లో ఒక సువర్ణాధ్యాయం లాంటిది. ఆ ఏడాది అజిత్ వాడేకర్ నాయకత్వంలో మన జట్టు వెస్టిండీస్, ఇంగ్లండుల్లో టెస్ట్ సిరీస్‌లు గెలిచి సంచలనం రేపింది. అంతకు ముందు ఆ రెండు దేశాల్లో ఇండియా కనీసం ఒక టెస్ట్ కూడా గెలవలేదు. ఆ జంట విజయాలలో గవాస్కర్, దిలిప్ సర్దేశాయ్ లాంటి ఆటగాళ్ళు హైలైట్ అయ్యారు. అయితే ఆబిద్ అలీ కూడా తన ఆల్‌రౌండ్ ప్రతిభతో కీలక పాత్ర పోషించారు. వెస్టిండీస్‌పై తొలి టెస్ట్ విజయమప్పుడు విన్నింగ్ రన్స్ కొట్టే అవకాశాన్ని మొదటి టెస్ట్ ఆడుతున్న గవాస్కర్ కోసం త్యాగం చేశారు ఆబిద్. కొత్తగా టెస్టుల్లోకి వచ్చిన బ్యాట్స్‌మన్‌కు ఆ ఛాన్సు ఇద్దామని ఓ ఫుల్‌టాస్ బంతిని ఫోర్ కొట్టకుండా డిఫెన్స్ ఆడానని తరువాత ఓ జర్నలిస్టుకి చెప్పారాయన. అయితే ఇంగ్లండ్‌పై అదే ఏడాది ఓవల్ టెస్ట్‌లో మనం గెలిచినప్పుడు విన్నింగ్ రన్స్ ఈసారి ఆబిద్ అలీనే కొట్టారు. 1971 వెస్టిండీస్ టూర్ హైదరబాదీయులకు బాగా గుర్తుంటుంది. ఎందుకంటే ఆ టూర్‌కు హైదరాబాద్ టీమ్ నుంచి ఐదుగురు ఆటగాళ్ళు – ఆబిద్ అలీతో పాటు, జయసింహ, జయంతిలాల్, క్రిష్ణ మూర్తి, గోవింద రాజ్ వెళ్ళారు.

1974 వరకు ఆబిద్ అలీ భారత టెస్ట్ జట్టులో కొనసాగారు. 1975లో జరిగిన తొలి ప్రపంచ కప్‌లో కూడా ఆడే అవకాశం దక్కింది. మొత్తం ఐదు వన్డే ఇంటర్నేషనల్స్‌లో ఆయన ఇండియాకు ప్రాతినిధ్యం వహించారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగుల్లో ఆరితేరిన ఆబిద్... ఈ తరంలో పుట్టి ఉంటే ఐపీఎల్‌లో ఆయనకు బోలెడంత డిమాండు ఉండేది. 29 టెస్టులాడి 47 వికెట్లు తీసి, వెయ్యికి పైగా పరుగులు చేశారు. రెండు వందలకు పైగా ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 13 సెంచరీలతో 8,732 పరుగులు చేసి, 397 వికెట్లు సాధించారు.


ఆబిద్ తన సెకండ్ ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ జూనియర్ జట్టుకు, ఆంధ్ర జట్టుకు కోచ్‌గా పని చేశారు. ఆయన్ని క్రికెట్ వర్గాల్లో ‘చిచ్చా’ అని ఆప్యాయంగా పిలుచుకునేవారు. అమెరికా వెళ్ళి అక్కడ ఒక అకాడమీలో కోచ్‌గా స్థిరపడ్డారు. ఇప్పటి క్రికెటర్ల మాదిరిగా కోట్లకు కోట్లు సంపాదించుకోలేదు. 1995లో ఓపెన్ హార్ట్ సర్జరీ అవ్వడంతో ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారని సన్నిహితులు చెబుతున్నారు. చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈ ఆల్‌రౌండర్ ఎనభై మూడేళ్ళ వయసులో తుది శ్వాస (మార్చి 12)విడిచారని తెలిసి నిన్నటి తరం క్రికెట్ ప్రేమికులు ఒక ఆత్మీయుడిని కోల్పోయినట్టుగా బాధపడుతున్నారు.

వ్యాసకర్త క్రికెట్ వ్యాఖ్యాత

అసలైన తీర్థయాత్ర

దాదాపు ఒక వంద సంవత్సరాల క్రితం కాశీలో విశుద్ధానంద అనే సాధువు ఉండేవాడు. ఆయన గాలి, వెలుతురు లేని ఒక ఆలయపు గర్భగుడిలో ఉండేవాడు. ఆయన ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేవాడు కాదు గానీ ఎక్కువ సమయం ‘ఓం’కారం లాంటి శబ్దం చేస్తూ ఉండేవాడు. ‘ఓం’కారాన్ని ప్రణవమనీ, శబ్ద బ్రహ్మమనీ వేల ఏండ్ల కిందటే చెప్పారు భారతీయ ఋషులు. ‘ఓమిత్యేకాక్షరం బ్రహ్మ’ అని భగవద్గీత 8వ అధ్యాయం 13వ శ్లోకంలో శ్రీకృష్ణ పరమాత్ముడు చెబుతాడు.

శబ్దానికి నిజంగా ఏమైనా శక్తి ఉందా? అనేది చాలామందికి వచ్చే సందేహం. ఆధునిక విజ్ఞాన శాస్త్రం నిర్ద్వంద్వంగా శబ్దా నికి ఎంతో శక్తి ఉందనీ, ఉపయోగాలూ ఉన్నాయనీ బాగా ఋజువు చేసింది. అల్ట్రా సౌండ్ స్కానింగ్ సిస్టమ్‌ను వినియోగించి ఒక వ్యక్తి శరీరంలో ఎక్కడెక్కడో అతి సూక్ష్మంగా దాగి ఉన్న లోపాల్ని కనుక్కోవటం అందరికీ తెలిసిన విషయమే. విశుద్ధానంద ఆనాడే ఇంగ్లాండ్ నుంచి వచ్చిన ముగ్గురు డాక్టర్లకు ప్రత్యక్షంగా, ఒక ప్రయోగం ద్వారా శబ్ద శక్తిని నిరూపించాడట. ఆ డాక్టర్లు ఒక పిచ్చుకను తెచ్చి, ‘ఈ పిచ్చుకపై శబ్ద ప్రభావం ఏమైనా ఉండగలదా? ఉంటే నిరూపించ గలరా’ అని విశుద్ధానందను అడిగారు. కొంత దూరంలో కూర్చొన్న విశుద్ధానంద కళ్ళు మూసుకొని ఏదో శబ్దాలు చేశాడు. ఆ పిచ్చుక గిలగిల కొట్టుకొని పడిపోయింది. డాక్టర్లు పరీక్షించి అది చని పోయిందని నిర్ధారించారు. కొంతసేపు తర్వాత విశుద్ధానంద మళ్లీ ఏవో శబ్దాలు చేశాడు. ఆశ్చర్యకరంగా ఆ పిచ్చుక బతికింది, రెక్కలు ఆడిస్తూ ఎగిరి పోయింది. (పుట 11 – హిడెన్ మిస్టరీస్ – ఓషో).



ఎన్నో శబ్దాలు మన మనసులో ప్రవేశించి తీవ్ర గందరగోళాన్ని కల్గిస్తాయి. అన్ని శబ్దాలకు మూలమైన ‘ఓం’కారానికి మన మనస్సుని నడిపించి, దాన్ని కూడా అధిగమించి పోయే ధ్యాన పద్ధతులను ఆవిష్కరించారు మహర్షులు. బాహ్యం నుంచి అంతరంగానికి, లౌకికం నుంచి ఆధ్యాత్మికానికి పయనించే మార్గమది. అసలైన తీర్థయాత్ర అదే.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.పాడ్యమి ప.1.02 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: ఉత్తర ఉ.7.48 వరకు, తదుపరి హస్త, వర్జ్యం: సా.5.02 నుండి 6.46 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.18 నుండి 7.47 వరకు, అమృతఘడియలు: రా.3.29 నుండి 5.15 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.13, సూర్యాస్తమయం: 6.06.

క్లుప్తంగా...

కోడిపందేల కేసులో విచారణకు హాజరైన ఎమ్మెల్సీ పోచంపల్లి


శ్రీనివాస్‌రెడ్డి

మొయినాబాద్: కోడి పందేల కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. గత నెల 11న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్టలోని శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో కోడి పందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో గత నెల 13నే శ్రీనివాస్‌రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. అప్పట్లో విచారణకు రాకుండా తన న్యాయవాది ద్వారా లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. దీనికి సంతృప్తి చెందని పోలీసులు మళ్లీ విచారణకు హాజరుకావాలని గురువారం ఉదయం నోటీసులు ఇచ్చారు. దీంతో ఆయన శుక్రవారం ఉదయం 11.30 గంటలకు మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి ఆయన్ను విచారించారు. సుమారు 4 గంటలకు పైగా ప్రశ్నల వర్షం కురిపించారు. విచారణలో పోలీసులు లీజుకు సంబంధించిన విషయాలు అడిగారని పోచంపల్లి చెప్పారు.

రూ.55 లక్షలకు సర్పంచ్ పదవి వేలం!

శాంతినగర్: ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికవ్వాల్సిన సర్పంచ్ పదవిని వేలం వేశారు. ఒక వ్యక్తి పదవిని ఏకంగా రూ.55 లక్షలకు వేలం పాడుకున్నాడు. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామంలో వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో ఎవరూ పోటీ చేయకుండా ఏకగ్రీవం చేయాలని గ్రామస్తులు తీర్మానించారని తెలిసింది. గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం గ్రామపెద్దల సమక్షంలో వేలం పాట నిర్వహించినట్లు సమాచారం. గ్రామానికి చెందిన వడ్డె వరదరాజులు రూ.55 లక్షలకు పాడటంతో.. ఆయనకే సర్పంచ్ పదవి కట్టబెట్టాలని నిర్ణయించారు. వేలం పాట ద్వారా వచ్చిన డబ్బును గ్రామంలోని ఆలయాల అభివృద్ధికి ఖర్చు చేయాలని తీర్మానించినట్లు తెలిసింది.

సంపత్ మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి, హైదరాబాద్: జగిత్యాల జిల్లాకు చెందిన సంపత్ పోలీసు రిమాండ్‌లో మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కోరారు. పోలీసులే దీనికి కారణమని తేలితే సంబంధిత అధికారుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశాడనే అభియోగంతో సంపత్ అనే వ్యక్తిని నిజామాబాద్ సైబర్ క్రైం పోలీసు అధికారులు కస్టడీలోకి తీసుకున్నారని, విచారణ ప్రక్రియలో ఉన్నప్పుడే అకస్మాత్తుగా మరణించాడని ఆరోపించారు. పోలీసు కస్టడీలో చిత్రహింసలు పెట్టడంతో అతను చనిపోయాడని, సంపత్ శరీరంపై తీవ్రమైన గాయాలున్నాయని, అతన్ని చూడటానికి కూడా అనుమతించలేదని కుటుంబసభ్యులు ఆరోపించినట్లు తెలిపారు.



ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ సమీపంలోని బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో శుక్రవారం సాయంత్రం బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన శ్రీలక్ష్మీనృసింహుని డోలోత్సవం, తెప్పోత్సవాలను కన్నులపండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఆలయం నుంచి బ్రహ్మపుష్కరిణి వరకు మంగళ వాయిద్యాలతో తీసుకెళ్లారు. కోనేరులో హంసవాహనంపై ఐదు ప్రదక్షిణలు చేసి తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం భోగ మండపంలోని ఊయలపై స్వామివార్లను ఆసీనుల్ని చేసి డోలోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాది భక్తుల నర్సింహా నామస్మరణతో కోనేరు ప్రాంతం మారుమోగింది. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ చైర్మన్ జక్కు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

డోలోత్సవం.. తెప్పోత్సవం



భద్రాచలం: రెండు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తజనం.. ఓ పక్క తలంబ్రాల తయారీలో మహిళల ఆనందోత్సవాలు.. మరోపక్క వసంతోత్సవంతో శుక్రవారం భద్రగిరి సందడిగా మారింది. శ్రీరామనవమికి భద్రాచలంలో జరిగే శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి పౌర్ణమి రోజు సంప్రదాయ బద్ధంగా పసుపు కొమ్ములు దంచడం ఆనవాయితీగా వస్తోంది. మిథిలా స్టేడియం, వైకుంఠ ద్వారం వద్ద ఈ కార్యక్రమాలు చేపట్టారు. తొలుత పల్లకీసేవగా స్వామి ఉత్సవమూర్తులను ఉత్తర ద్వారం వద్దకు తీసుకొచ్చాక అర్చకులు స్వామి వారితో పాటు రోళ్లు, రోకళ్లకు పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ రమాదేవి, అర్చకుల, పండితుల సతీమణులతో పసుపు కొమ్ములు దంచడంతో పాటు బియ్యంలో పసుపు కలిపి తలంబ్రాలు సిద్ధం చేశారు.

సీతారాముల కల్యాణ పనులు ఆరంభం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి సంబంధించిన సమస్త సమాచారాన్ని ఇకపై భక్తులు ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చు. దేవస్థానం అధికారుల వివరాలు, పూజలు, వసతులు, టికెట్ల సమాచారం ఇప్పటికే వెబ్‌సైట్ ద్వారా అందుబాటులో ఉండగా, మరింత చేరువ చేసేందుకు మొబైల్ యాప్ రూపొందించారు. ఇందులో సమస్త సమాచారంతో పాటు.. పూజలు, అందుబాటులోని సందర్శనీయ స్థలాలు, వసతి గదుల వివరాలు, బుకింగ్ సైతం చేసుకునే వెసులుబాటు కల్పించారు. మరో వారం, పది రోజుల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే ఈ యాప్‌ను.. ఈవో రమాదేవి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించి వివరాలను వెల్లడించారు. మొబైల్ యాప్ ద్వారా భక్తులకు సమాచారం, సేవలను అందిస్తున్న తొలి దేవస్థానం రెండు తెలుగు రాష్ట్రాల్లో భద్రాచలమేనని ఈవో రమాదేవి స్పష్టం చేశారు. ఆత్రేయ ఇన్ఫోటెక్ సిస్టం ఆధ్వర్యాన రూపొందించిన ఈ యాప్‌కు 'రామాలయం టెంపుల్ ఇన్ఫర్మేషన్'గా నామకరణం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కంపెనీ ఆధ్వర్యంలోనే ప్రస్తుతం ఆలయంలో అన్నదానం, ప్రొటోకాల్ డిజిటలైజ్ సిస్టం కొనసాగుతోందని పేర్కొన్నారు.


యాప్ క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న ఈవో రమాదేవి

అరచేతిలో 'భద్రగిరి' సమాచారం

డీ2 ప్రాంతంలో లభించని కార్మికుల ఆచూకీ

- రంగంలోకి మరో రెండు రోబోలు
- ముమ్మరంగా సహాయక చర్యలు
- సొరంగంలోకి లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంప్‌తో పాటు వ్యాక్యూమ్ ట్యాంకర్
- రోబోలతో పూర్తిస్థాయి పనులు చేపట్టేందుకు మరో 2 రోజులు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో మిగతా ఏడుగురు కార్మికుల ఆచూకీ కోసం అన్వేషణ కొనసాగుతోంది. శుక్రవారం డీ2 పాయింట్ల వద్ద తవ్వకాలు జరిపినా మిగతా కార్మికుల జాడ లభించలేదు. నిత్యం 12 రెస్క్యూ సంస్థలకు చెందిన 650 మంది మూడు షిఫ్టుల్లో సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ఇప్పటికే సొరంగంలోకి వెళ్లిన అటోమేటివ్ స్లడ్జ్ రిమూవల్ రోబో మిషనరీతో పాటు మరో రెండు రోబోలను శుక్రవారం టన్నెల్ లోనికి పంపించారు. ప్రమాదస్థలంలో పేరుకుపోయిన బురదను తొలగించేందుకు 30 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంప్‌తో పాటు వ్యాక్యూమ్ ట్యాంకర్‌ను కూడా పంపారు. ఈ వ్యాక్యూమ్ ట్యాంక్ ద్వారా గంటకు 620 క్యూబిక్ మీటర్ల బురద మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలించవచ్చని చెబుతున్నారు. రోబోలను అనుసంధానం చేయడం కోసం కమ్యూనికేషన్ వ్యవస్థను అందుబాటులో తెచ్చేందుకు పనులు కొనసాగుతున్నాయి. రోబోటిక్ మిషనరీలతో పూర్తిస్థాయిలో తవ్వకాలు చేపట్టేందుకు మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉంది.

డీ2 పాయింట్ల వద్ద 9 మీటర్లు తవ్వినా..

ప్రమాదస్థలంలో కార్మికులు చిక్కుకుపోయినట్టుగా భావిస్తున్న డీ2తో పాటు డీ1 పాయింట్లను గుర్తించారు. డీ2 సొరంగం డెడ్ ఎండ్ నుంచి 70 మీటర్ల దూరంలో ఉండగా, డీ1 43.5 మీటర్ల దూరంలో ఉంది. వీటిలో డీ2 వద్ద తవ్వకాలు జరిపినప్పుడే గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభించింది. మిగతా కార్మికుల కోసం అదేచోట తవ్వకాలు కొనసాగుతుండగా.. సమీప ప్రదేశాల్లో సుమారు 9 మీటర్ల లోతులో తవ్వినా వారి ఆచూకీ లభించలేదు. దీంతో డీ2, డీ1 మధ్యలో ఉన్న 12 మీటర్ల ట్రెంచ్‌తో పాటు డీ1 వద్ద తవ్వకాలు చేపడుతున్నారు. టీబీఎం ప్లాట్‌ఫాం తొలగించారు. టీబీఎం ఎడమవైపు ఉన్న మోటార్లు, గడ్డర్లను తొలగించారు. టీబీఎం మధ్యలో ట్రాక్‌లైన్ మార్గంలో తవ్వుతున్నారు.

రెండు, మూడురోజుల్లో జాడ తెలిసే చాన్స్: కలెక్టర్

టీబీఎంలో సెగ్మెంట్ ఎరెక్టర్ ఉండే చోట కార్మికులు ఉండే అవకాశం ఉన్నట్టు భావిస్తున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్ ఆధ్వర్యంలో తవ్వకాలు చేపడుతున్నారు. డీ1 వద్ద సైతం 9 మీటర్ల లోతువరకు తవ్వకాలు జరిపి మట్టి, శిథిలాలను తొలగిస్తేనే కార్మికుల జాడ తెలిసే అవకాశం ఉందని అంటున్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్ ఎప్పటికప్పుడు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. డీ1 వద్ద పూర్తిస్థాయిలో మట్టిని తొలగిస్తేనే కార్మికుల జాడ తెలిసే అవకాశం ఉందని, ఇందుకు కనీసం రెండు, మూడురోజుల సమయం పడుతుందని కలెక్టర్ తెలిపారు.


రోబోకు అనుసంధానంగా ఉండే లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంపు మోటారు, ఇతర పరికరాలు

ఆర్టీసీ బస్సు బోల్తా

- టికెట్లు కొట్టేందుకు ఆపుతుండగా ప్రమాదం
- 20 మందికి స్వల్ప గాయాలు


బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

పరిగి: టికెట్లు కొట్టేందుకు బస్సును రోడ్డు పక్క ఆపే క్రమంలో జరిగిన ప్రమాదంలో 20 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. వికారాబాద్ జిల్లా పరిగి పట్టణ సమీపంలోని సయ్యద్ మల్కాపూర్ వద్ద శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై ప్రయాణికులు, స్థానికుల కథనం మేరకు.. పరిగి డిపోకు చెందిన బస్సు పరిగి నుంచి షాద్‌నగర్‌కు రాత్రి 7.30 గంటలకు దాదాపు వందమంది ప్రయాణికులతో బయల్దేరింది. రద్దీ ఎక్కువగా ఉండటంతో టికెట్లు తీసుకునేందుకు డ్రైవర్ బస్సును రోడ్డు పక్క ఆపేందుకు ప్రయత్నించాడు. కొద్ది రోజుల క్రితం మరమ్మతులు చేయడంతో.. రోడ్డు పక్కన మట్టి ఉంది. దీంతో బస్సును ఆపే క్రమంలో.. ఆ మట్టిలో ఓ పక్కకు ఒరిగి పడిపోయింది. ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొని.. బస్సులోని వారిని బయటకు తీసుకొచ్చారు. గాయపడిన వారిని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాదాపు 20 మందికి గాయాలయ్యాయి. పదిహేను మంది పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో, మరో ఐదుగురు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. గాయపడిన వారిలో వెంకటమ్మ, జ్యోతి, రాములమ్మ, నర్సమ్మ, రాములు, సుజాత, గౌరి నందన్, మంజుల, యాదమ్మ, శ్రీనివాస్, అంజమ్మ, పార్వతమ్మ, రుక్కమ్మ తదితరులు ఉన్నారు. దోమ మండలం ఊటుపల్లికి చెందిన శ్రీనివాస్ శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండటంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బస్సు ఆపే సమయంలో డ్రైవర్.. మహిళతో మాట్లాడటం వల్లే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు.


పరిగి ప్రభుత్వాస్పత్రిలో క్షతగాత్రులు

కస్టడీలో ఉన్న యువకుడి మృతి

- సైబర్ క్రైం పోలీసులు కొడితేనే చనిపోయాడంటూ మృతుడి కుటుంబీకుల ధర్నా
- గుండె సంబంధిత సమస్యతో మృతి చెందాడన్న పోలీస్ కమిషనర్


సంపత్

ఖలీల్‌వాడి/జగిత్యాలక్రైం/రామగుండం: సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీలో ఉన్న ఓ యువకుడు మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లాలో కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా అంతర్గాంలోని వడ్డెర కాలనీకి చెందిన ఆలకుంట సంపత్ (31) జగిత్యాలలోని శ్రీరామ ఇంటర్నేషనల్ మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. సంపత్‌తోపాటు చిరంజీవి, మిట్టపల్లి నర్సారెడ్డిలు కూడా కన్సల్టెన్సీలో పనిచేస్తున్నారు. విదేశాల్లో డేటాఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురు నిరుద్యోగుల నుంచి వీరు లక్షల్లో వసూలు చేశారు. కొందరిని లావోస్ దేశానికి డేటాఎంట్రీ ఆపరేటర్ల పేరిట పంపించారు. తీరా అక్కడ సైబర్‌నేరాలు చేయించడంతో బాధితులు అక్కడి భారత రాయబార కార్యాలయంలో ఫిర్యాదు చేసి స్వదేశానికి తిరిగొచ్చారు. ఆలకుంట సంపత్, చిరంజీవి, నర్సారెడ్డిలపై నిజామాబాద్‌లోని సైబర్‌క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. ఈ నెల 4న ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. 12న కోర్టు అనుమతితో ముగ్గురిని సైబర్ క్రైమ్ పోలీసులు తమ కస్టడీలోకి తీసుకొని విచారణ నిమిత్తం జగిత్యాలకు తీసుకెళ్లారు. విచారణ అనంతరం నిజామాబాద్‌లోని సైబర్‌క్రైమ్ పీఎస్‌కు తీసుకొచ్చారు. గురువారం రాత్రి సంపత్ ఎడమచేయి లాగుతోందని పోలీస్ సిబ్బందికి చెప్పగా, వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలోనే ఫిట్స్‌తో మృతి చెందినట్టు పోలీసులు చెబుతున్నారు. గురువారం అర్ధరాత్రి కుటుంబసభ్యులకు చెప్పగా, శుక్రవారం ఉదయం వారు నిజామాబాద్ ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. పోలీసులు తీవ్రంగా కొట్టడంతోనే తన భర్త సంపత్ మృతి చెందాడని భార్య ఆరోపిస్తూ సమగ్ర విచారణ చేపట్టాలని బంధువులతో కలిసి ధర్నాకు దిగింది. ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి హామీతో ధర్నా విరమించారు.

జడ్జి సమక్షంలో పోస్టుమార్టం

సంపత్ మృతదేహానికి ఫస్ట్‌క్లాస్ జడ్జి హరికృష్ణ సమక్షంలో ముగ్గురు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. దానికి సంబంధించిన రిపోర్ట్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్యకు అందించారు. సంపత్ గుండె సంబంధిత సమస్యతోనే మృతి చెందాడని సీపీ సాయిచైతన్య తెలిపారు. సంపత్ నిరుద్యోగ యువతను థాయ్‌లాండ్, మయన్మార్, లావోస్ తదితర ప్రాంతాలకు పంపించేవాడని, మోసపోయిన వారి ఫిర్యాదు మేరకు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడని తెలిపారు. ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో పోలీసులు నిజామాబాద్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారని తెలిపారు. అక్కడి సీసీటీవీ ఫుటేజీలో సంపత్ నడుచుకుంటూ వెళ్లినట్టు గుర్తించామన్నారు. ఆస్పత్రికి వెళ్లిన తర్వాత సంపత్ కుప్పకూలిపోయాడని, వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సంపత్ మృతిపై వన్‌టౌన్ పీఎస్‌లో కేసు నమోదైందని, విచారణ కొనసాగుతోందన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో....

అంతర్గాంకు చెందిన ఆలకుంట సంపత్(31) ట్రాక్టర్లతో ఉపాధి పొందేవాడు. కొన్నేళ్లు ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగాడు. ఇసుక వ్యాపారం నిలిచిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో గతేడాది జగిత్యాల జిల్లా కేంద్రానికి మకాం మార్చాడు. అక్కడ శ్రీరామ ఇంటర్నేషనల్ మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ కార్యాలయం స్థాపించి మేనేజర్‌గా కొనసాగుతున్నాడు. సంపత్‌కు భార్య సంధ్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శనివారం సంపత్ అంత్యక్రియలు నిర్వహిస్తామని మృతుడి బంధువులు చెప్పారు.

తండ్రిని కాపాడబోయి..

- విద్యుదాఘాతంతో కుమారుడి మృతి


కనిష్క్ వర్ధన్

జనగామ/బచ్చన్నపేట: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన తండ్రిని కాపాడబోయి కుమారుడు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఎస్సై రాజేష్, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన సందెల వెంకటేశ్వర్లు, స్వప్నలకు ఇద్దరు కుమారులు. వెంకటేశ్వర్లు జనగామ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. పిల్లల చదువు రీత్యా జనగామకు వచ్చి కుర్మవాడలో ఉంటున్నారు. వీరి పెద్దకుమారుడు కనిష్క్ వర్ధన్ (12) సెయింట్ పాల్స్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. సిద్దిపేట రోడ్డులోని బ్రాహ్మణవాడలో వీరి నూతన ఇంటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు ప్రతిరోజూ కుమారులతో కలిసి ఇంటికి వాటర్ క్యూరింగ్ చేసి వచ్చేవారు. హోలీ పండుగ నేపథ్యంలో పాఠశాలకు సెలవు కావడంతో ఉదయమే తండ్రీ, కొడుకులు నూతన ఇంటి వద్దకు వెళ్లారు. వాటర్ క్యూరింగ్ చేసే క్రమంలో వెంకటేశ్వర్లు విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. గమనించిన కుమారుడు కనిష్క్ వర్ధన్ తండ్రిని పక్కకు నెట్టేసే క్రమంలో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే చిన్నకుమారుడు కేకలు వేయడంతో అక్కడే ఉన్న వేద పండితులు ప్రసాదశర్మ పరుగున వచ్చి కర్రతో తండ్రీ కొడుకులను విడదీశాడు. ఇరువురికి సీపీఆర్ చేసినా.. కనిష్క్ వర్ధన్‌ను కాపాడలేకపోయారు. అంబులెన్స్‌లో ఇద్దరిని జిల్లా ఆస్పత్రికి తరలించగా, కుమారుడు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించి, తండ్రికి చికిత్స చేశారు. కళ్లెదుటే కుమారుడు మృతిచెందడంతో వెంకటేశ్వర్లు కన్నీరుమున్నీరుగా విలపించాడు. సెయింట్ పాల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ మరిచా జోసెఫ్ బాలుడి మృతికి నివాళులర్పించారు. ఇటీవల స్కూల్‌లో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో కనిష్క్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ఉపాధ్యాయులు గుర్తు చేసుకున్నారు.

జ్వరం గోలీలూ లేవు!

▶ మొదటి పేజీ తరువాయి

అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

సాధారణ మందులకూ తిప్పలు

తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్‌ఐడీసీ) ద్వారా రాష్ట్రంలోని జిల్లా ఆసుపత్రులు, బోధన కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రులు, పీహెచ్‌సీలకు అక్కడి నుంచి ఆరోగ్య ఉప కేంద్రాలకు మందులు సరఫరా అవుతుంటాయి. ఈ మేరకు జిల్లా ఆస్పత్రులు, తదితర ఆస్పత్రుల నుంచి ఇండెంట్లు అందుతుంటాయి. ఈ విధంగా పలు ఆస్పత్రులు ఇండెంట్‌లు పంపినా కొన్ని మందులు నెలలుగా సరఫరా కావడం లేదు. జ్వరానికి వాడే పారాసెటమాల్ ట్యాబ్లెట్ ప్రతి ఆసుపత్రిలో తప్పక ఉండాలి. కానీ పెద్దపల్లి జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీల్లో ఈ ట్యాబ్లెట్ల కొరత ఉన్నట్లు రోగులు చెపుతున్నారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో కంటి చూపు సమస్య నివారణ కోసం వ్యాధి నిరోధక టీకాలకు అనుబంధంగా అందించే విటమిన్ -ఏ సిరప్ కొరత దాదాపుగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఉంది. నెల రోజులుగా ఈ సిరప్ నిల్వలు నిండుకోగా.. జిల్లా ఆసుపత్రులతో పాటు పీహెచ్‌సీలు, ఇతర ఆరోగ్య కేంద్రాల్లో కేవలం టీకాలు మాత్రమే ఇస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి మరో 15 రోజులు పట్టే అవకాశం ఉందని వైద్యాధికారులే చెపుతున్నారు. అలాగే సర్వ సాధారణ మందులైన రాన్‌టాక్, పాన్‌టాప్, జోఫర్, డైసైక్లోమిన్, ఎవిల్, ఫెరజోడిన్, సిటిరిజైన్, మెట్రోజిల్, బెటాడిన్ ఆయింట్‌మెంట్, డైక్లో, స్రైబీష్ లోషన్ వంటివి కూడా కొన్నిచోట్ల అందుబాటులో లేవు. పీహెచ్‌సీల్లో బీపీ, షుగర్‌కు సంబంధించి నెల రోజులకు సరిపడే మందులు ఇవ్వాల్సి ఉండగా, కొంతకాలంగా 10 రోజులకే పరిమితం చేస్తున్న పీహెచ్‌సీలు చాలా ఉన్నాయి. జింక్, యాంటీ బయోటిక్, ఐరన్ గోలీలతో పాటు ఐవీ సెట్లు కూడా చాలా పీహెచ్‌సీలు, ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో లేవని, బయట కొనుక్కోమంటున్నారని రోగులు చెపుతున్నారు.

ప్రముఖ ఆసుపత్రుల్లోనూ...

ఉస్మానియా, గాంధీ, నీలోఫర్, ఎంజీఎం, ఎంఎన్‌జే ఆసుపత్రుల్లో అధికారిక పడకలు, నిత్యం వచ్చే రోగులను పరిగణనలోకి తీసుకుని టీజీఎంఎస్‌ఐడీసీ మందులను సరఫరా చేస్తోంది. 80% మందులు ఇక్కడి నుంచే వస్తుండగా, మరో 20% మందులను అత్యవసర పద్ధతిలో ఆసుపత్రి అధికారులు కొనుగోలు చేస్తుంటారు. కానీ 20 శాతం మందుల కొనుగోలుకు సంబంధించి 8 నెలలైనా టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉండటం లేదు. మరోవైపు అధికారిక లెక్కల కంటే రోగుల తాకిడి ఎక్కువగా ఉండటం కూడా సమస్యకు కారణమవుతోంది. ఉస్మానియా ఆసుపత్రిలో 1,100 పడకల వరకు ఉండగా, నిత్యం 1,500 మందికి పైగానే రోగులు వస్తున్నారు. ఇక గాంధీ ఆస్పత్రిలో 1000 పడకలకు గానూ 1,500కు పైనే రోగుల తాకిడి ఉంటోంది. కొన్నిసార్లు (సీజన్) ఈ రెండు ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య 2 వేలకు పైగానే ఉంటోంది. దీంతో గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల ఆవరణల్లో అక్రమంగా నిర్వహిస్తున్న ప్రైవేటు మెడికల్ దుకాణాలు 24 గంటలు రోగులతో కిటకిటలాడుతూ ఉంటున్నాయి. వరంగల్ ఎంజీఎంలో 2,500 నుంచి 3,000 వరకు రోగులు నమోదవుతున్నారు. కాగా మందుల కొరత నేపథ్యంలో జిల్లా ఆసుపత్రులు, మండలాలు, పట్టణ కేంద్రాల్లోని ఆరోగ్య కేంద్రాల పక్కనే ఉంటున్న ప్రైవేటు మెడికల్ షాపులే రోగులకు గతవుతున్నాయి.

293 మందులకు 100 కూడా ఉండటం లేదు..

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) మార్గదర్శకాల ప్రకారం గ్రామాల్లోని పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్స్‌లో మందులు, సిరప్‌లు, ఇంజెక్షన్లు, ఆయింట్‌మెంట్లు, లోషన్లు, యాంటీ బయాటిక్స్, ఐవీ సెట్లు మొదలైనవన్నీ కలిపి 293 కేటగిరీల మందులు ఉండాలి. జ్వరం, దగ్గు, జలుబుతో వచ్చే రోగులు మొదలుకొని దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, బీపీతో వచ్చే వారికి, చర్మ వ్యాధులు, పాము కాట్లు, పురుగు మందులు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన వారికి ఉపయోగపడే మందుల వరకు ప్రతి ఒక్కటీ పీహెచ్‌సీల్లో ఉండాలి. కానీ ప్రస్తుతం రాష్ట్రంలోని 636 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 249 పట్టణ పీహెచ్‌సీలు, 4,693 ఉప ఆరోగ్య కేంద్రాల్లో పలుచోట్ల 50 నుంచి 100 లోపు కేటగిరీల్లోనే మందులు ఉంటున్నాయనే ఆరోపణలున్నాయి. పాముకాటుకు గురై పీహెచ్‌సీలకు వచ్చే వారికి 'పాం' ఇంజక్షన్ అందుబాటులో ఉండడం లేదు. కుక్కకాటుకు కూడా ఇంజెక్షన్ అందుబాటులో ఉండాలని ఎన్‌హెచ్‌ఎం చెపుతుండటం గమనార్హం. కాగా, ప్రభుత్వం తక్షణమే స్పందించి మందుల సరఫరాకు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో లేని కొన్ని మందులివే..

రాష్ట్రంలోని కొన్ని జిల్లా ఆస్పత్రులు, సీఎంఎస్‌లు టీజీఎంఎస్‌ఐడీసీకి మందులకు సంబంధించిన ఇండెంట్లు పంపుతాయి. అయితే వారు పంపిన ఇండెంట్‌లలో కొన్ని మందులు చాలా నెలలుగా సరఫరా కావడం లేదు.

- → అటోర్వస్టాటిన్ 20 ఎంజీ, బెంజాయిన్ ఆయింట్‌మెంట్, డిసైక్లోమైన్ ఇంజెక్షన్ 10 ఎంజీ, ఫ్రామీసెటిన్ క్రీమ్ 1%, హైవోస్కైన్ బుటిల్ బ్రోమైడ్ ఇంజెక్షన్ 20 ఎంజీ, లిగ్నోకైసిన్ హెచ్‌సీఎల్ జెల్లీ 2%, విటమిన్- ఏ ఓరల్ లిక్విడ్, రొసువాస్టాటిన్ 10 ఎంజీ, సిల్వర్ సల్ఫడైజైన్ క్రీమ్ 1%,
- → అమోక్సీసిలిన్+క్లావునానిక్ యాసిడ్ డ్రై సిరప్, లెవోథైరాక్సిన్ 50 ఎంసీజీ, విటమిన్-బి కాంప్లెక్స్ ఇంజెక్షన్, మెట్రోనైడెజోల్ బెంజోట్ ఓరల్ సస్పెన్షన్ ఐపీ 100 ఎంజీ/5ఎంఎల్, 60ఎంఎల్, జింక్ 20ఎంజీ.
- → అమోక్సీసిలిన్ ఓరల్ లిక్విడ్, ఆట్రోపైన్ ఇంజెక్షన్ 0.6ఎంజీ/ఎంఎల్, బిసాకొడిల్ 5 ఎంజీ, కాలామైన్ లోషన్, క్లోట్రిమాజోల్ డస్టింగ్ పౌడర్ 1% డబ్ల్యు/డబ్ల్యు, సియానొకోబలామైన్ ఇంజెక్షన్ ఐపీ 1000 ఎంసీజీ/ఎంఎల్, డెక్సామెథాసోన్ సోడియం ఫాస్ఫేట్ ఇంజెక్షన్, డెక్సామెథాసోన్ టాబ్లెట్ 0.5 ఎంజీ, ఎటోఫైలైన్+థియోఫైలైన్ ఇంజెక్షన్, ఫ్లూకొనజోల్ 100 ఎంజీ, 150 ఎంజీ, ఫ్రామైసెటిన్ క్రీం, గ్లిజరిన్, లెవోథీరాక్సిన్ ట్యాబ్లెట్ 50 ఎంసీజీ, లిగ్నోకైన్ హెచ్‌సీఎల్‌జెల్ 2%, లిగ్నోకైన్ టాపికల్ 10% స్ప్రే, లొపెరామైడ్ 2 ఎంజీ, మెడ్రోక్సీప్రొజెస్టోరోన్ అసెటేట్ 10 ఎంజీ, మెటోప్రొలోల్ 50 ఎంజీ, మిడాజొలమ్ ఇంజెక్షన్, నియోమైసిన్ పౌడర్, ఒండాన్‌సెట్రాన్ ఓరల్ లిక్విడ్ 2 ఎంజీ, ఒండాన్‌సెట్రాన్ టాబ్లెట్స్ 4 ఎంజీ, పొవిడోన్ అయోడిన్ గార్గిల్ 2% ఎం/వి, పొవిడోన్ అయోడిన్ సొల్యూషన్, రిబిఫ్లాబిన్ 5 ఎంజీ, సిల్వర్ సల్ఫాడైజిన్ + క్లోరోహెక్సిడైన్ ఆయింట్‌మెంట్, సిల్వర్ సల్ఫాడైజిన్ క్రీం 1%, సిటాగ్లిప్టిన్ 50ఎంజీ, క్లోట్రిమాజోల్ డస్టింగ్ పౌడి, డైసైక్లోమైన్ ఇంజెక్షన్, డైథైల్ కార్బమజైన్ ట్యాబ్లెట్, ఫ్లుకొనాజోల్ ట్యాబ్లెట్, గామా బెంజిన్ హెక్సాక్లోరైడ్ అప్లికేషన్, హయోసిన్ బ్యూటైల్ బ్రోమైడ్ ఇంజెక్షన్, లోపెరమైడ్ ట్యాబ్లెట్, మెట్రోనిడజోల్ బెంజోట్ ఓరల్ సస్పెన్షన్, మిడాజోలామ్ ఇంజెక్షన్, నీయోమైసిన్ పౌడర్ బాసిట్రసిన్, రిబోఫ్లేవిన్ ట్యాబ్లెట్, రోసువాస్టాటిన్ ట్యాబ్లెట్, సాలిసిలిక్ యాసిడ్ ఆయింట్‌మెంట్, సిల్వర్ సల్ఫడియజైన్ + క్లోరహెక్సిడిన్ ఆయింట్‌మెంట్, సిల్వర్ సల్ఫడియజైన్ క్రీమ్ , విటమిన్ డీ3 డ్రాప్స్, జింక్ ట్యాబ్లెట్.

పాముకాటు మందు కోసం 17 కి.మీ..

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన శ్రీను కొన్నిరోజుల క్రితం ఓ ఇంటి దగ్గర ఉదయం వేళ పనిచేస్తుండగా విషపు పాము చేతిపై కాటేసింది. అక్కడే ఉన్న శ్రీను బావ తాడుతో చేయికి కట్టుకట్టి, బైక్‌పైన గ్రామంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లాడు. అక్కడ పాము కాటుకు వేసే మందు 'పాం' అందుబాటులో లేదు. కరీంనగర్ వెళ్లాలని సిబ్బంది సూచించారు. దాంతో బైక్ పైనే అక్కడికి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీంనగర్ పెద్దాసుపత్రికి వెళ్లగా వైద్యులు చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు.

మందుల కొరత లేదు..

టీజీఎంఐడీసీ ద్వారా 568 రకాల మందులను కొనుగోలు చేసి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రులకు పంపిస్తున్నాం. ఇందులో ఒక కేటగిరీ కింద 293 రకాల మందులు, మరో కేటగిరీలో 100 రకాల మందులు అవసరానికి అనుగుణంగా పంపిస్తాం. ప్రధాన ఆసుపత్రులైన ఉస్మానియా, గాంధీ, ఎంఎన్‌జే, నీలోఫర్, ఎంజీఎం ఆసుపత్రులను వారానికోసారి సంప్రదించి ఇండెంట్ ద్వారా వారికి అవసరమైన మందులను పంపిస్తాం. అలాగే జిల్లాల్లోని సీడీఎస్‌లకు కూడా వారు పంపే ఇండెంట్లను బట్టి మందులు పంపిస్తున్నాం. మందుల కొరత లేదు. ఎక్కడైనా ఉన్నట్లు మా దృష్టికి వస్తే వెంటనే పంపించే ఏర్పాటు చేస్తాం.



– హేమంత్ (టీజీఎంఐడీసీ ఎండీ)



కోడిగుడ్లు ఇస్తారా.. ప్లీజ్!

డెన్మార్క్, యూరప్ దేశాలను వేడుకుంటున్న అమెరికా

వాషింగ్టన్: అమెరికాలో కోడిగుడ్ల ధరల ఆకాశాన్నంటుతున్నాయి. నానాటికీ పెరిగిపోతున్నాయే తప్ప ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. బర్డ్‌ఫ్లూ వల్ల కోళ్లు చాలావరకు చనిపోయాయి. దాంతో గుడ్ల కొరత తలెత్తింది. అమెరికా మార్కెట్‌లో గుడ్ల ధరలు కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గుడ్ల ధరలను నేలకు దించడానికి డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విదేశాల నుంచి దిగుమతులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. తమకు తగినన్ని కోడిగుడ్లు సరఫరా చేయాలని డెన్మార్క్‌తోపాటు ఇతర యూరప్ దేశాలకు తాజాగా విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అమెరికా వ్యవసాయ విభాగం ఆయా దేశాలకు లేఖలు రాసింది. ట్రంప్ ప్రభుత్వం ఒకవైపు యూరప్ దేశాల ఉత్పత్తులపై సుంకాలు విధిస్తూ, మరోవైపు గుడ్లు సరఫరా చేయాలని కోరుతుండడం గమనార్హం. యూరప్‌లో కూడా తగినంత గుడ్ల ఉత్పత్తి లేదని, అమెరికాకు ఇప్పట్లో భారీగా గుడ్లు ఎగుమతి చేయడం కష్టమేనని డెన్మార్క్ ఎగ్ అసోసియేషన్ వెల్లడించింది. ఇదిలా ఉంటే, డెన్మార్క్‌పై డొనాల్డ్ ట్రంప్ గుడ్లురుముతున్నారు. గ్రీన్‌లాండ్‌ను తమకు అప్పగించకపోతే డెన్మార్క్‌పై ఆర్థిక ఆంక్షలు విధిస్తామని ఇప్పటికే హెచ్చరించారు. అమెరికాలో గత ఏడాది డిసెంబర్ నుంచి గుడ్ల ధరలు క్రమంగా ఎగబాకుతున్నాయి. ఈ నెల 5వ తేదీన డజన్ గుడ్ల ధర 8.64 డాలర్లకు (రూ.751) చేరుకుంది. అంటే ఒక్కో గుడ్డు ధర 62 రూపాయలు. ఈ నెల 5 నుంచి గుడ్ల ధరలు తగ్గుతున్నట్లు అమెరికా వ్యవసాయ విభాగం వెల్లడించింది. ప్రస్తుతం డజన్ గుడ్ల ధర 4.90(రూ.425) డాలర్లుగా ఉన్నట్లు పేర్కొంది.



అమెరికా విమానంలో మంటలు

రెక్కల మీదుగా ప్రయాణికులను తరలించిన సిబ్బంది

డెన్వర్: అమెరికాలో కొలరాడోలోని డెన్వర్‌లో పెను ప్రమాదం తప్పింది. నిలిపి ఉంచిన అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానంలో మంటలు చెలరేగాయి. స్ప్రింగ్స్ నుంచి బయలుదేరిన బోయింగ్ 737–800 విమానం డెన్వర్ విమానాశ్రయంలో గేట్ సీ38 వద్ద నిలిపి ఉండగా విమానం నుంచి దట్టమైన పొగలు వచ్చాయి. దీంతో.. అప్రమత్తమైన సిబ్బంది ప్రయాణికులను ఖాళీ చేయించారు. మరోవైపు అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. విమానం తరలింపు స్లైడ్లను ఉపయోగించి.. ప్రయాణికులను రెక్కల మీదుగా తరలిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. జెట్ ఫ్యూయల్ ఇగ్నిషన్ వల్ల మంటలు వచ్చాయని సమాచారం. విమానంలో పొగలు కమ్ముకున్నాయని, ప్రయాణికులందరినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చామని డెన్వర్ అంతర్జాతీయ విమానాశ్రయం వెల్లడించింది. అమెరికాలో వరుస ప్రమాదాల నేపథ్యంలో విమానయాన భద్రతపై ఆందోళనలు పెరిగాయి. ఈ నేపథ్యంలో మరో ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. అమెరికాలో రద్దీగా ఉండే డెన్వర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రోజూ 1,500 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

గ్రీన్ కార్డు శాశ్వత నివాసానికి... హక్కు కాదు: వాన్స్

బాంబు పేల్చిన అమెరికా ఉపాధ్యక్షుడు | **గ్రీన్‌కార్డున్నా తిప్పి పంపుతామని వ్యాఖ్యలు**

వాషింగ్టన్/న్యూఢిల్లీ: అమెరికా వలస విధానంపై ఇప్పటికే ప్రపంచ దేశాల్లో నెలకొన్న ఆందోళనలను మరింతగా పెంచే పరిణామం చోటుచేసుకుంది. డాలర్ డ్రీమ్స్‌ను నిజం చేసుకోవడానికి రాచబాటగా భావించే అమెరికా గ్రీన్‌కార్డుపై ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రీన్‌కార్డు ఉన్నంతమాత్రాన అమెరికాలో నివాసానికి, పని చేయడానికి శాశ్వత హక్కులు దఖలు పడ్డట్టు కాదని స్పష్టం చేశారు. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత కొలంబియా యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ విద్యార్థి మహ్మద్ ఖలీల్ యూదు విద్వేష ఆరోపణలపై ఇటీవలే అరెస్టవడం తెలిసిందే. అతను గ్రీన్‌కార్డు హోల్డరే కావడాన్ని ప్రస్తావిస్తూ వాన్స్ పలు వ్యాఖ్యలు చేశారు. ''ఇదేమీ వాక్ స్వాతంత్ర్యానికి సంబంధించిన అంశం కాదు. జాతీయ భద్రతకు సంబంధించిన అతి కీలకమైన విషయం. అంతకుమించి, అమెరికాలో శాశ్వత నివాసులుగా మాతోపాటు ఎవరుండాలన్న దానికి సంబంధించిన అంశం. దీన్ని నిర్ణయించేది అమెరికన్లు మాత్రమే'' అంటూ కుండబద్దలు కొట్టారు. ఆయన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా, ముఖ్యంగా భారత్‌లో దుమారం రేపుతున్నాయి. ఏటా భారీ సంఖ్యలో అమెరికా బాట పట్టే భారత విద్యార్థులందరికీ గ్రీన్‌కార్డు ఒక బంగారు కల. అది చిక్కిందంటే అమెరికాలో శాశ్వత నివాసం దక్కినట్టేనని భావిస్తారు. వాన్స్ వ్యాఖ్యలు వారినేగాక అమెరికాలో గ్రీన్‌కార్డు హోల్డర్లయిన లక్షలాది మంది భారతీయులను కూడా కలవరపాటుకు గురిచేస్తున్నాయి.

గురువారం ఫాక్స్ న్యూస్ చానల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందర్భంగా వలస విధానాలకు సంబంధించి వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ''కొలంబియా వర్సిటీలో హమాస్ భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్న విద్యార్థి ఖలీల్ కూడా గ్రీన్‌కార్డు హోల్డరే. అందుకే చెబుతున్నా, గ్రీన్‌కార్డు హోల్డర్‌కు అమెరికాలో శాశ్వతంగా ఉండిపోయే హక్కు లేదు'' అని స్పష్టం చేశారు. గ్రీన్‌కార్డు హోల్డర్లయినా సరే, అమెరికా భద్రతకు ముప్పు కలిగించే కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్టు అనుమానిస్తున్న విద్యార్థులు తదితరులపై కఠిన చర్యలకు ట్రంప్ సర్కారు సిద్ధమవుతోందని ఉపాధ్యక్షుడు ప్రకటించారు. ''వారి ఉనికి అమెరికాకు ముప్పని తేలిన పలువురిని త్వరలో తిప్పి పంపుతున్నాం. ఈ జాబితాలో విద్యార్థులతో పాటు ఇతరులు కూడా ఉన్నారు'' అని వివరించారు. ట్రంప్ రాకతో అమెరికాలోకి అక్రమ వలసలు 95 శాతానికి పైగా తగ్గిపోయాయన్నారు.



ఏమిటీ గ్రీన్‌కార్డు?



పర్మనెంట్ రెసిడెంట్ (శాశ్వత నివాస) కార్డు. గ్రీన్‌కార్డుగా భారత్‌లో దాదాపు ఇంటింటికీ పరిచయం. ఇది విదేశీ పౌరులకు అమెరికాలో నివసించేందుకు, పని చేసుకునేందుకు హక్కు కల్పిస్తుంది. అంతేగాక కోరుకున్న కంపెనీలో పని చేయవచ్చు. సొంత వ్యాపారం వంటివీ చేసుకోవచ్చు. గ్రీన్‌కార్డు పొందిన మూడు నుంచి ఐదేళ్లకు పౌరసత్వం కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే నిజానికిది పేరుకే శాశ్వత నివాస కార్డు. వాన్స్ చెప్పినట్టుగా అమెరికాలో శాశ్వతంగా ఉండేందుకు హక్కు కల్పించదు. దీన్ని పదేళ్ల కాలపరిమితితో జారీ చేస్తారు. కొన్ని పరిస్థితుల్లో గ్రీన్‌కార్డును రద్దు చేయవచ్చు. నేర కార్యకలాపాల్లో పాల్గొన్నా, చాలాకాలం పాటు అమెరికాకు దూరంగా ఉన్నా, వలస నిబంధనలను ఉల్లంఘించినా గ్రీన్‌కార్డును కోల్పోతారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయులు దశాబ్దాలుగా గ్రీన్‌కార్డుల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. వారిలో చాలామందికి కార్డు దక్కాలంటే 50 ఏళ్ల దాకా పట్టొచ్చట. కొన్ని కేటగిరీల వాళ్లకైతే ఇప్పుడున్న పరిస్థితులను బట్టి గ్రీన్‌కార్డు రావాలంటే 134 సంవత్సరాలు పడుతుంది! 3.4 కోట్ల మందికి పైగా గ్రీన్‌కార్డు కోసం ఎదురు చూస్తుండగా వారిలో 11 లక్షల మందికి పైగా భారతీయులే! వీరిలో 4 లక్షల మంది తమ జీవితకాలంలో కార్డును కళ్లజూడలేరన్నది ఇమిగ్రేషన్ నిపుణుల మాట. అమెరికా ఏటా గరిష్ఠంగా 6.75 లక్షల గ్రీన్ కార్డులు మాత్రమే జారీ చేస్తుంది. వాటిలో ఏ దేశానికీ 7 శాతానికి మించి ఇవ్వరాదన్న నిబంధన ఉంది. ఇదే భారతీయులకు పెద్ద అడ్డంకిగా మారింది. ప్రస్తుతం అమెరికాలో గ్రీన్‌కార్డున్న భారతీయుల సంఖ్య 3 లక్షలకు పైగా ఉంటుంది.

గోల్డ్ కార్డు రాకతో...

అమెరికాలో శాశ్వత నివాసానికి ట్రంప్ ఇటీవల కొత్తగా గోల్డ్ కార్డు స్కీమును ప్రకటించిన నేపథ్యంలో గ్రీన్‌కార్డు ప్రాధాన్యతను తగ్గించేలా వాన్స్ చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ''ఇప్పటి దాకా గ్రీన్‌కార్డుంది. ఇకపై గోల్డ్‌కార్డు తెస్తున్నాం. గ్రీన్‌కార్డు ఇచ్చే సదుపాయాలన్నింటినీ ఇదీ ఇస్తుంది. వాటితో ఆదనంగా అమెరికాలో శాశ్వత నివాసానికి, పౌరసత్వానికి కూడా గోల్డ్‌కార్డు రాచమార్గం'' అని ట్రంప్ చెప్పు కొచ్చారు. అమెరికాలోని అత్యున్నత వర్సిటీల్లో చదివే ప్రతిభావంతులు, భారతీయ విద్యార్థులు దేశం దాటకుండా ఆపడంలో తమ వలస విధానం విఫలమైందని ఆయన ఆక్షేపించారు. గోల్డ్‌కార్డుకు 50 లక్షల డాలర్లు (రూ.43.54 కోట్లు) ఫీజుగా నిర్ణయించారు. ''కనీసం కోటి గోల్డ్‌కార్డులు అమ్మాలన్నది మా లక్ష్యం. తద్వారా వచ్చే ఆదాయంతో అమెరికా అప్పు తీరుస్తాం'' అని ట్రంప్ ప్రకటించారు. 1990 నుంచి అమల్లో ఉన్న ఈబీ-5 వీసాలను గోల్డ్‌కార్డు భర్తీ చేసింది.


ఉగ్రవాద మూలకేంద్రం పాకిస్తానే

- ఆధారాల్లేకుండా భారత్‌పై ఆరోపణలు చేయొద్దు
- పాకిస్తాన్‌కు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ హితవు

న్యూఢిల్లీ: ఉగ్రవాదాన్ని భారతదేశం ప్రోత్సహి స్తోందంటూ పాకిస్తాన్ చేసిన ఆరోపణలను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ గట్టిగా తిప్పికొట్టారు. అంతర్జాతీయ ఉగ్రవాదానికి మూలకేంద్రం ఏమిటో ప్రపంచం మొత్తానికి తెలుసని తేల్చిచెప్పారు. ఉగ్రవాదుల ఉత్పత్తి కర్మాగారం పాకిస్తానేనని పరోక్షంగా మండిపడ్డారు. ఆధారాల్లేకుండా ఆరోపణలు చేయొద్దని పాకిస్తాన్‌కు స్పష్టంచేశారు. రణధీర్ జైశ్వాల్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పాకిస్తాన్ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇతరులపై వేలెత్తి చూపించే బదులు మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి, ఆత్మ సమీక్ష చేసుకోండి అని పాక్ పాలకులకు, అధికారులకు సూచించారు. మీ అంతర్గత సమస్యలు, వైఫల్యాలకు కారణాలను ఇతరులపైకి నెట్టేయడం మానుకోండి అని హితవు పలికారు. తప్పుడు ఆరోపణలు ఖండిస్తున్నామని స్పష్టంచేశారు. బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ ఘటన తర్వాత పాకిస్తాన్ విదేశాంగ శాఖ కార్యాలయ ప్రతినిధి షఫ్‌ఖత్ అలీ ఖాన్ గురువారం భారతదేశంపై నిందలు మోపారు. భారత ప్రభుత్వం ఉగ్రవాదులకు అండగా నిలుస్తోందని ఆరోపించారు. రైలు హైజాక్ ఘటనకు భారతదేశమే కారణం అనే రీతిలో పరోక్షంగా విమర్శలు చేశారు.

ఉద్యోగాల కంటే నిరుద్యోగులు ఎన్నో రెట్లు ఎక్కువ

- ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పారదర్శకత పాటించాల్సిందే
- కొందరి స్వలాభం కోసం ఇతరులు నష్టపోవడానికి వీల్లేదు
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ: దేశంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల కంటే వాటిని ఆశించే నిరుద్యోగులు ఎన్నో రెట్ల ఎక్కువగా ఉన్నారని సుప్రీంకోర్టు వెల్లడించింది. వాస్తవ పరిస్థితి ఇదేనని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పూర్తి పారదర్శకత పాటించాలని, ఆయా ఉద్యోగాలు కచ్చితంగా అర్హులకే దక్కేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అవకతవకలకు చోటు లేకుండా జాగ్రత్త వహించాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ విభాగాల్లో ఖాళీలను సంబంధిత పరీక్ష లేదా ఇంటర్వ్యూ ద్వారానే భర్తీ చేయాలని, అక్రమ మార్గాలు అనుసరించకూడదని తేల్చిచెప్పింది. పరీక్షల్లో అక్రమాలను అరికట్టాలని పేర్కొంది. రాజస్తాన్‌లో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో నిబంధనలు పాటించకుండా రాజీపడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు వ్యక్తులకు కింది కోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. రాజస్తాన్‌లో 2022లో అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) పోస్టుల భర్తీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఓ సెంటర్‌లో ఒక అభ్యర్థి బదులు మరో అభ్యర్థి(డమ్మీ) హాజరైనట్లు తేలింది. ఇద్దరు అధికారుల ప్రోద్బలంతోనే ఇదంతా జరిగినట్లు విచారణలో గుర్తించారు. ఆ ఇద్దరు అధికారులు రాజస్తాన్ హైకోర్టును ఆశ్రయించడంతో బెయిల్ మంజూరయ్యింది. హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఆర్డర్‌ను సవాలు చేస్తూ రాజస్తాన్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కింది కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వును తోసిపుచ్చింది. రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఈ నెల 7వ తేదీన నిందితులను ఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేలాది మంది అభ్యర్థులు పోటీ పడుతుంటారని, వారికి అన్యాయం జరిగేలా ఎవరూ ప్రవర్తించకూడదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. కొందరు స్వలాభం కోసం ఉద్దేశపూర్వకంగా చేసే తప్పులతో ఇతరులు నష్టపోవడానికి వీల్లేదని ఉద్ఘాటించింది. పోటీ పరీక్షల పారదర్శకతను దెబ్బతీయొద్దని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

పిల్లలు ఫిర్యాదు చేయగానే... టీచర్ల అరెస్టు కూడదు

నిర్ధారించుకున్నాకే చర్యలు... పోలీసులకు కేరళ హైకోర్టు ఆదేశం

- ఆందోళనకరంగా విద్యార్థుల ప్రవర్తన
- స్కూళ్లలోకి ఆయుధాలు, డ్రగ్స్, మద్యం
- టీచర్లపై బెదిరింపులు, భౌతిక దాడులు
- సదుద్దేశంతో శిక్షించినా వారిపై కేసులు
- ఉపాధ్యాయుల చేతిలో బెత్తం తప్పనిసరి
- అప్పుడే పిల్లల్లో భయం: న్యాయమూర్తి

కొచ్చి: ఉపాధ్యాయులు, ఇతర బోధన సిబ్బందిపై ఫిర్యాదుల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై కేరళ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ''విద్యార్థులు, తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగానే నేరుగా టీచర్ల అరెస్టు వంటి చర్యలకు దిగొద్దు. ప్రాథమికంగా దర్యాప్తు చేసి, నేరం జరిగినట్టు రుజువయ్యాకే చర్యలు తీసుకోవాలి'' అని పోలీసులను ఆదేశించింది. ఈ దిశగా తక్షణం సర్క్యులర్ జారీ చేయాల్సిందిగా డీజీపీకి ఆదేశాలు జారీచేసింది. విద్యార్థులు స్కూళ్లలోకి ఆయుధాలు, మద్యం, డ్రగ్స్ తదితరాలను యథేచ్ఛగా తీసుకెళ్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇది తప్పనిసరని న్యాయమూర్తి జస్టిస్ పి.వి.కున్హికృష్ణన్ అభిప్రాయపడ్డారు. విద్యార్థిని బెత్తంతో కొట్టిన కేసులో ఓ టీచరుకు ఆయన ముందస్తు బెయిల్ మంజూరు చేశారు. కేరళలో విద్యార్థులు, యువత ప్రవర్తన చాలా ఆందోళనకరంగా ఉందని ఈ సందర్భంగా ఆవేదన వెలిబుచ్చారు. ''వారు తీవ్ర నేరాలకు కూడా పాల్పడుతున్నారు. టీచర్లనే బెదిరిస్తున్నారు. వారిని ఘెరావ్ చేస్తున్నారు. భౌతిక దాడులకు దిగుతున్నారు. దీనికి తక్షణం అడ్డుకట్ట వేయాల్సిన అవసరముంది'' అన్నారు. క్లాసురూముల్లో బెత్తం పట్టుకునేందుకు టీచర్లను అనుమతించాలని అభిప్రాయపడ్డారు. ''ప్రతిసారీ బెత్తం వాడాలని కాదు. అది టీచర్ల చేతిలో ఉంటే చాలు, తప్పు చేసేందుకు విద్యార్థులు జంకుతారు. తప్పు చేసిన విద్యార్థులకు టీచర్లు చిన్నపాటి శిక్ష విధించాలి. అది నేరమేమీ కాదు. పైగా అంతిమంగా మన విద్యావ్యవస్థ మరింత బలోపేతమయ్యేందుకు తోడ్పడుతుంది. కానీ బాగుపడాలనే సదుద్దేశంతో గిల్లినా, గిచ్చినా, మందలించినా టీచర్లపై క్రిమినల్ కేసులు పెడుతున్నారు. దీన్నుంచి వారికి రక్షణ కల్పించాలి. లేదంటే పని చేయలేరు'' అన్నారు. ''టీచర్లంతా సాధుసత్తములని చెప్పడం లేదు. వాళ్లలోనూ కొందరు చెడ్డవాళ్లు ఉండవచ్చు. కానీ విద్యార్థిని మనిషిగా తీర్చిదిద్దడంలో టీచర్లది కీలక పాత్ర అని మర్చిపోవద్దు'' అన్నారు.

ప్రశాంతంగా ముగిసిన హోలీ, రంజాన్ ప్రార్థనలు



అహ్మదాబాద్‌లోని కాలూపూర్ స్వామినారాయణ్ ఆలయంలో..

న్యూఢిల్లీ: దేశమంతటా హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. జనం రంగుల్లో మునిగితేలారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ మిఠాయిలు పంచుకున్నారు. హోలీ రంగులతో ఇళ్లు, వీధులు కొత్తరూపు సంతరించుకున్నాయి. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా ప్రజలంతా ఆనందోత్సాహాలతో గడిపారు. పలువురు రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు సైతం హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మరోవైపు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు రెండో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ఏడాది హోలీ, రంజాన్ శుక్రవారం ప్రార్థనలు ఒకేరోజు వచ్చాయి. ఈ నేపథ్యంలో వివిధ రాష్ట్రాల్లో మతపరంగా సున్నితమైన ప్రాంతాల్లో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అదనపు బలగాలను రంగంలోకి దించారు. మసీదుల వద్ద పెద్ద సంఖ్యలో సీసీటీవీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల డ్రోన్లు సైతం మోహరించారు. కొన్ని ప్రాంతాల్లో మసీదు కమిటీల పిలుపు మేరకు హోలీ ఉత్సవాలు ముగిసిన తర్వాత మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ పట్టణంలో మొఘల్ పాలకుల కాలంనాటి షాహీ జామా మసీదులో గత ఏడాది నవంబర్‌లో సర్వే ప్రారంభించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో అక్కడ భద్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. రంజాన్ ప్రార్థనలకు ఎలాంటి అవాంతరాలు తలెత్తలేదు. సంభాల్‌లో సంప్రదాయ 'చౌపాయ్ కా జులూస్' శాంతియుతంగా జరిగింది. పోలీసుల చర్యలు సత్ఫలితాలిచ్చాయి. దేశవ్యాప్తంగా హోలీ వేడుకలు, రంజాన్ ప్రార్థనలు ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఉక్రెయిన్ సైనికులను దయతలచి వదిలేయండి

పుతిన్‌కు ట్రంప్ ఫోన్

వాషింగ్టన్/మాస్కో: ''పాపం ఉక్రెయిన్ సైనికులు! అత్యంత నిస్సహాయ స్థితిలో ఉన్నారు. వాళ్లను రష్యా సైన్యం అన్నివైపుల నుంచీ దిగ్బంధించింది. వారినింకా వేటాడితే సామూహిక హననానికి, రెండో ప్రపంచయుద్ధం తర్వాత అతి దారుణమైన రక్తపాతానికి దారితీస్తుంది. కనుక వాళ్లను చంపకండి. దయచేసి వదిలేయండి'' రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా విజ్ఞప్తులివి! ఈ విషయమై పుతిన్‌తో ఫోన్ చర్చలు జరిపినట్టు శుక్రవారం ఆయన ప్రకటించారు. ''చర్చలు ఫలప్రదంగా సాగాయి. ఉక్రెయిన్ యుద్ధానికి, భయానక రక్తపాతానికి అతి త్వరలో తెర పడుతుందని ఆశిస్తున్నా'' అని తన సొంత సోషల్ మీడియా హాండిల్ ట్రూత్‌లో చెప్పుకొచ్చారు. అమెరికా ప్రతిపాదించిన 30 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణకు ఉక్రెయిన్ ఇప్పటికే అంగీకరించడం, పుతిన్ కూడా సూత్రప్రాయంగా సరేననడం తెలిసిందే. అయితే తాజాగా ఆయన స్వరం మార్చారు. కాల్పుల విరమణకు ముందు చర్చించుకుని తేల్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ''వాటిపై బహుశా అమెరికా, ఇతర భాగస్వామ్య పక్షాలతో చర్చిస్తాం. ట్రంప్‌కు కూడా కాల్‌చేసి మాట్లాడతా'' అని ప్రకటించారు. దీనిపై ఉక్రెయిన్ మండిపడింది. కావాలనే శాంతిప్రక్రియకు మోకాలడ్డుతున్నారని ఆక్షేపించింది.

కెనడా ప్రధానిగా కార్నీ ప్రమాణం

టొరంటో: కెనడా నూతన ప్రధానిగా మార్క్ కార్నీ (59) శుక్రవారం ప్రమాణం చేశారు. అమెరికాతో తీవ్రమవుతున్న విభేదాలు, టారిఫ్‌ల యుద్ధం తదితర పరిణామాల నేపథ్యంలో కార్నీకి ఇది ముళ్లకిరీటమే కానుంది. బ్యాంకింగ్ రంగంలో అపార అనుభవమున్న ఆయన ఈ సవాళ్లను ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరం.

'చిప్'ల కోసం ట్రంప్ స్కెచ్

- అమెరికాలో రూ.8.69 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్న తైవాన్ సంస్థ
- చిప్‌ల తయారీ రంగం తరలిపోతుందంటూ విపక్షాల ఆందోళన
- ట్రంప్‌కు 'ప్రొటెక్షన్ ఫీజు' చెల్లిస్తున్నారని ప్రభుత్వంపై మండిపాటు
- తైవాన్ గతి చివరికి ఉక్రెయిన్‌లా మారుతుందని అనుమానాలు



వాషింగ్టన్/తైపీ: సెమీ కండక్టర్ల తయారీలో ద్వీపదేశమైన తైవాన్‌దే అగ్రస్థానం. ప్రపంచవ్యాప్తంగా ఉపయోగిస్తున్న సెమీ కండక్టర్లలో 90 శాతానికి పైగా తైవాన్‌లో తయారైనవే. సెల్‌ఫోన్ల నుంచి అత్యాధునిక డ్రోన్ల దాకా ప్రతి ఎలక్ట్రానిక్ పరికరంలో ఈ చిప్‌లు ఉండాల్సిందే. చిప్‌ల రారాజుగా తైవాన్ తలపై ఉన్న కిరీటాన్ని తన్నుకుపోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద స్కెచ్ వేశారు. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన సంస్థగా పేరున్న తైవాన్ సెమీకండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ(టీఎస్ఎంసీ)తో అమెరికాలో 100 బిలియన్ డాలర్ల (రూ.8.69 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టిస్తున్నారు. ఈ మేరకు ఆ కంపెనీని ఒప్పించారు. గతవారం ఒప్పందం కూడా చేసుకున్నారు. ఈ నిధులతో టీఎస్ఎంసీ అమెరికాలో సెమీకండక్టర్ల తయారీ యూనిట్లు ఏర్పాటు చేయనుంది. అంటే సెమీకండక్టర్లు అమెరికాలోనే ఉత్పత్తి అవుతాయి. అక్కడి నుంచే విదేశాలకు చిప్‌ల ఎగుమతి జరుగుతుంది. ఆదాయం చాలావరకు అమెరికా ఖాతాలోకి వెళ్లిపోతుంది. చిప్‌ల ఉత్పత్తిలో తైవాన్ ప్రాధాన్యం తగ్గిపోతుంది. ఇదే ఇప్పుడు తైవాన్‌లో మంటలు రాజేస్తోంది.

జాతీయ భద్రతా సంక్షోభం

తైవాన్ అధికార డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(డీపీపీ)పై మాజీ అధ్యక్షుడు మా యింగ్-జియూ నిప్పులు చెరిగారు. చైనా బారి నుంచి తైవాన్‌ను కాపాడుతున్నందుకు ట్రంప్‌కు 'ప్రొటెక్షన్ ఫీజు' చెల్లిస్తున్నారని డీపీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. టీఎస్ఎంఎస్‌ను అమెరికాకు అమ్మేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామం జాతీయ భద్రతా సంక్షోభమేనని తేల్చిచెప్పారు. అమెరికాలో 8.69 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడాన్ని తప్పుపట్టారు. చిప్‌ల తయారీలో తైవాన్ స్థానాన్ని దిగజార్చడం తగదని అన్నారు. ట్రంప్‌తో కుదుర్చుకున్న ఒప్పందం తైవాన్ ప్రజల విశ్వాసాన్ని, ఇతర సంబంధాలను దెబ్బతీస్తుందని మా యింగ్-జియూ ఆందోళన వ్యక్తంచేశారు. భవిష్యత్తులో భౌగోళిక రాజకీయాల్లో తైవాన్ హోదాను దిగజారుస్తుందని అన్నారు. అయితే, అమెరికాలో పెట్టుబడులపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని తైవాన్ అధ్యక్షుడు లా చింగ్-తే స్పష్టంచేశారు. టీఎస్ఎంసీ విస్తరణ కోసమే ఈ పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించారు. దేశ ప్రతిష్టకు వచ్చే ముప్పేమీ లేదని ప్రజలకు హామీ ఇచ్చారు.

తైవాన్‌ను గాలికొదిలేస్తారా?

తైవాన్‌పై పొరుగు దేశం చైనా ఎప్పటి నుంచో కన్నేసింది. తైవాన్ తమ దేశంలో అంతర్భాగమేనని, ఏనాటికైనా విలీనం కాక తప్పదని చైనా చెబుతోంది. మరోవైపు అమెరికా మద్దతుతోనే తైవాన్ స్వతంత్ర దేశంగా మనుగడ సాగిస్తోంది. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం తైవాన్ రక్షణ బాధ్యతను అమెరికా స్వీకరించింది. ఇందుకోసం తైవాన్ రిలేషన్స్ యాక్ట్ తీసుకొచ్చారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తైవాన్ విషయంలో అమెరికా స్వరం మారింది. ప్రధానంగా తైవాన్‌కు జీవనాడిగా ఉన్న చిప్‌ల తయారీ రంగంపై ట్రంప్ దృష్టి పెట్టారు. అక్కడి పరిశ్రమను క్రమంగా అమెరికా తరలించాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. తమ దేశాన్ని పీల్చిపిప్పి చేసి, ఆఖరికి గాలికి వదిలేయాలన్నదే ట్రంప్ ప్లాన్ అని తైవాన్ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తైవాన్ మరో ఉక్రెయిన్‌లా మారినా ఆశ్చర్యం లేదని అంటున్నాయి. అమెరికా–తైవాన్ సంబంధాల భవితవ్యంపై అనిశ్చితి నెలకొన్నట్లు తాజా పరిణామాలను బట్టి తెలుస్తోంది. 'ఈ రోజు ఉక్రెయిన్, రేపు తైవాన్' అనే మాట తైవాన్‌లో తరచుగా వినిపిస్తోంది.



సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా శుక్రవారం కనువిందు చేసిన బ్లడ్ మూన్. చిలీలోని శాంటియాగో ఫోస్టర్ అబ్జర్వేటరీ ద్వారా దానిపైకి ఇలా లేజర్ కిరణాలను ఫోకస్ చేశారు. ఉత్తర, దక్షిణ అమెరికా, యూరప్, ఆఫ్రికా ఖండాలవారికి ఇది కనిపించింది. తదుపరి సంపూర్ణ చంద్రగ్రహణం మళ్లీ ఏడాది తర్వాత సంభవించనుంది.

యునెస్కో తాత్కాలిక జాబితాలోకి తెలంగాణలోని ముడమాల్ నిలువురాళ్లు

న్యూఢిల్లీ: తెలంగాణలోని నారాయణపేట జిల్లా ముడుమాల్‌లో ఉన్న నిలువురాళ్లకు యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా తాత్కాలిక జాబితాలో చోటు దక్కింది. వీటితోపాటు అశోకుని శాసన నిలయాలు, చౌసట్ యోగినీ దేవాలయాల వంటి ఆరు చారిత్రాత్మక కట్టడాలను జాబితాకు భారత్ నామినేట్ చేసింది. వీటిని మార్చి 7న తాత్కాలిక జాబితాలో చేర్చినట్లు యునెస్కోలోని భారత శాశ్వత ప్రతినిధి బృందం ఎక్స్‌లో తెలిపింది. ఒక ఆస్తిని ప్రపంచ వారసత్వ గుర్తింపు రావాలంటే.. వరల్డ్ హెరిటేజ్ సెంటర్ తాత్కాలిక జాబితాలో చేర్చాలి. ఈ ఏడాది భారత్ చేర్చిన జాబితాలో ఛత్తీస్‌గఢ్‌లోని కంగెర్ వ్యాలీ నేషనల్ పార్క్, తెలంగాణలోని ముడుమాల్ మెగాలిథిక్ మెన్హిర్స్, పలు రాష్ట్రాల్లోని అశోకుడి శాసన స్థలాలు, మౌర్య రూట్స్, పలు రాష్ట్రాల్లోని చౌసత్ యోగిని దేవాలయాలు, ఉత్తర భారతంలోని గుప్తుల దేవాలయాలు, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలోని బుందేలాల రాజభవనాలు, కోటలు ఉన్నాయి. వీటితో భారత్ నుంచి యునెస్కో తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకున్న ప్రాంతాల సంఖ్య మొత్తం 62కు చేరింది.

24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె

సాక్షి, న్యూఢిల్లీ: మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా సమ్మెకు బ్యాంకు ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి. కీలక డిమాండ్లపై ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)తో జరిపిన చర్చల్లో ఫలితం లేకపోవడంతో ప్రకటించిన విధంగానే రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెకు దిగనున్నట్లు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) తెలిపింది. నియామకాలు, ఐదు రోజుల పనిదినాలు సహా పలు డిమాండ్లపై ఏకాభిప్రాయం కుదరలేదని నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ (ఎన్‌సీబీఈ) జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ తెలిపారు.

సాక్షి హైదరాబాద్

శనివారం। 15। మార్చి। 2025



డబుల్ డెక్కర్.. డైలమా!
ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రతిపాదించిన ఫ్లై ఓవర్లలో విప్రో జంక్షన్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ స్వస్తి పలికినట్లు తెలుస్తోంది. -8లో



కుబేరులకు కునుకు లేదు?!
భాగ్య నగరంలో వ్యాపారవేత్తలు, టెక్ నిపుణులు, స్టార్టప్ వ్యవస్థాపకులు నిద్ర లేమితో బాధపడుతున్నారట. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 38.0/23.0
నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 38, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది.



రంగ్.. తరంగ్

ఆనందం అర్ణవమైంది. సంబరం అంబరాన్నంటింది. వర్ణమయమై.. రస రమ్యమయమైంది.. శుక్రవారం హోలీ వేడుకలతో నగరం తడిసిముద్దయింది. రంగుల తరంగం పరవళ్లు తొక్కింది. చిన్నా పెద్దా తేడా లేకుండా కలర్స్‌లో మునిగితేలారు. ఉస్మానియా వర్సిటీ ప్రాంగణంలో హోలీ ఉత్సవాల్లో వందలాది మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆట పాటలతో ఆకట్టుకున్నారు. సిటీలోని గల్లీలన్నీ 'రంగు'రంగ వైభోగంగా కనిపించాయి.



బేగం బజార్‌లో రంగుల హుషారు



ఓయూలో జోరుగా..



నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో యువత కేరింతలు






బండ్లగూడ జాగీర్ సన్‌సిటీలో హోలీ సంబరాలు..

ప్రాణం తీసిన లిఫ్టు గుంత

మరొకరికి తీవ్ర గాయాలు

మియాపూర్: నిర్మాణంలో ఉన్న మొదటి అంతస్తుపై నుంచి ప్రమాదవశాత్తు ఇద్దరు యువకులు లిఫ్టు గుంతలో పడగా ఒకరు మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సురేందర్ (36), కిషన్ (20) మియాపూర్ న్యూ హాఫీజ్‌పేట్‌లోని ప్రేమ్‌నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనంలో తాపీమేస్త్రీ వద్ద పని చేస్తున్నారు. వీరితో పాటు రాంశంకర్, మహేష్, భరత్‌లు కూడా అక్కడే పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరందరూ కలిసి నిర్మాణ భవనంలోని మొదటి అంతస్తులో ఉంటున్నారు. గురువారం రాత్రి సమయంలో సురేందర్, కిషన్‌లు ప్రమాదవశాత్తు మొదటి అంతస్తు నుంచి లిఫ్టు గుంతలో పడిపోయారు. అక్కడే ఉన్న స్నేహితులు చూడగా సురేందర్, కిషన్ తలలకు తీవ్ర గాయాలయ్యాయి. ఉలుకూ పలుకూ లేకుండా ఉన్న సురేందర్‌ను సమీపంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి సురేందర్ మృతి చెందినట్లు తెలిపారు. కిషన్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వీరి స్నేహితుడు భరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



లెక్కలు.. తప్పులు.. చిక్కులు!

దరఖాస్తుదారులకు చుక్కలు

- ఎల్ఆర్ఎస్‌తో ముప్పు తిప్పలు
- ముంచుకొస్తున్న గడువు
- తొలగని ఇబ్బందులు..
- హెచ్ఎండీఏలో 10 శాతం ఫైళ్లే పరిష్కారం



సాక్షి, సిటీబ్యూరో: స్థలాల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) జనానికి చుక్కలు చూపిస్తోంది. గడువులోగా స్థలాలను క్రమబద్ధీకరించుకొనేందుకు దరఖాస్తు చేసుకుంటున్నవారిని సాంకేతిక చిక్కుముడులు ముప్పు తిప్పలు పెడుతున్నాయి. ఫీజుల లెక్కలు సైతం గందరగోళానికి గురిచేస్తున్నాయి. దరఖాస్తు చేసుకున్న నాటి మార్కెట్ విలువతో సంబంధం లేకుండా ఒక్కో ప్లాట్‌కు ఒక్కో విధంగా ఫీజు విధించడంతో దరఖాస్తుదారులు అమీర్‌పేట్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. కొంతమంది దరఖాస్తుదారులకు ఎల్ఆర్ఎస్ ఫీజు కంటే ఓపెన్ స్పేస్ ఫీజులు ఎక్కువగా వస్తున్నాయి. కొందరికి భూమి మార్పునకు సంబంధించిన ఫీజులు తేలడం లేదు. మరోవైపు సాంకేతిక సమస్యల కారణంగా అధికారులు సైతం ఎలాంటి పరిష్కారం చూపలేక చేతులెత్తేస్తున్నారు. మార్చి 31వ తేదీ లోపు ఫీజు చెల్లిస్తే 25 శాతం తగ్గింపు లభిస్తుందనే ఉద్దేశంతో జనం ఆసక్తి చూపుతున్నారు. కానీ ఫీజులు చెల్లించిన వారికి ఇప్పటి వరకు ప్రొసీడింగ్స్ రాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఫీజు చెల్లించిన వారికి మార్చి అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత ప్రొసీడింగ్స్‌ను ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. దీంతో చాలామంది వెనుకడుగు వేస్తున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 3.44 లక్షల దరఖాస్తులు ఉండగా.. ఇప్పటి వరకు కనీసం 10 వేల దరఖాస్తులు కూడా పరిష్కారం కాకపోవడం గమనార్హం. ఎల్ఆర్ఎస్ ఫీజులో రాయితీ ప్రకటించిన తర్వాత ఒక్కో జోన్ పరిధిలో కనీసం వెయ్యి దరఖాస్తులను కూడా పరిష్కరించలేకపోయినట్లు అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వెంటాడుతున్న సాంకేతిక చిక్కులు..

ఎల్ఆర్ఎస్ పథకానికి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)సాంకేతిక వ్యవస్థను రూపొందించింది. దీనిపై హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగంతో పాటు వివిధ ప్రభుత్వ సంస్థల్లోని పట్టణ ప్రణాళికా విభాగాలకు అవగాహన కార్యక్రమాలను సైతం ఏర్పాటు చేశారు. ఎల్ఆర్ఎస్ కోసం వెబ్‌సైట్‌తో పాటు అధికారుల పనిని సులభతరం చేసేలా ఓ మొబైల్ యాప్‌ను కూడా రూపొందించారు. కానీ.. ఈ సాంకేతిక పరిజ్ఞానం అమలులో రకరకాల చిక్కులు ఎదురవుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. 'ఒక్కోసారి సేకరించిన డాటా మొత్తం డిలీట్ అవుతోంది. దాంతో మరోసారి డాటా నమోదు చేసుకోవాల్సి వస్తోంది. ఒక పనిని ఒకటికి రెండుసార్లు చేయడంతో జాప్యం జరుగుతోంది' అని ప్లానింగ్ అధికారి ఒకరు విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు హెచ్ఎండీఏ పరిధిలోని కొన్ని గ్రామాల్లో ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడంతో మొబైల్ యాప్ పని చేయడం లేదు. దీంతో చాలా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. సాధారణంగా ఎల్ఆర్ఎస్ ఫీజు నమోదైన తర్వాత స్థల మార్పిడికి చెల్లించాల్సిన ఫీజు వివరాలు కూడా నమోదు కావాలి. కానీ ఇందులో ఏదో ఒకటి మాత్రమే నమోదు కావడంతో అలాంటి ఫైళ్లను పెండింగ్ జాబితాలో పెట్టేస్తున్నారు.

దరఖాస్తుదారుల్లో గందరగోళం..

ప్రభుత్వం 2020లో ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రకటించింది. ఆ ఏడాది ఆగస్టు వరకు దరఖాస్తు చేసుకున్నవాళ్లకు మాత్రమే ఇప్పుడు క్రమబద్ధీకరణ పథకం వర్తిస్తుంది. ఆ సంవత్సరం ప్రభుత్వం నిర్ణయించిన భూముల మార్కెట్ ధర ప్రకారం ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ.. ఈ ఫీజుల లెక్కల్లోనూ రకరకాల తప్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో దరఖాస్తుదారులు గందరగోళానికి గురవుతున్నారు. ఇలా తప్పుడు ఫీజులు నమోదైన దరఖాస్తులను పరిశీలించి సవరించేందుకు సాంకేతికంగా మార్పులు చేయాల్సివస్తోంది. ఈ సవరణలు అధికారులు స్వయంగా చేసేందుకు అవకాశం లేదు. సీజీజీలోనే సవరణ జరగాలి. ఆ విధంగా మరికొంత జాప్యం జరుగుతోంది. హెచ్ఎండీఏలోని శంకర్‌పల్లి, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్ జోన్‌ల పరిధిలో ఇలాంటి తప్పులు పెద్ద ఎత్తున నమోదవుతున్నాయి. కేవలం రూ.4000 చొప్పున ఓపెన్ స్పేస్ ఫీజు నమోదు కావాల్సి ఉండగా.. కందుకూరు మండలం పులిమామిడిలో ఒక స్థలంలో ఓపెన్ స్పేస్ ఫీజు ఏకంగా రూ.లక్షకు పైగా రావడంతో అధికారులే విస్మయానికి గురయ్యారు.

ఒత్తిడి పెంచడంతోనే..

సీజీజీ రూపొందించిన టెక్నాలజీలో తరచూ మార్పులు, చేర్పులు చేయడంతోనే ఈ ఇబ్బందులు, పొరపాట్లు జరుగుతున్నట్లు టెక్నికల్ సిబ్బంది చెబుతున్నారు. మొదట్లో హెచ్ఎండీకు మాత్రమే పరిమితమైన ఈ పథకాన్ని తర్వాత నీటిపారుదల, రెవిన్యూ శాఖలకు కూడా విస్తరించాల్సి వచ్చింది. ఆ తర్వాత చెరువులు, కుంటలు, నీటి వనరులకు 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలను మరోసారి మార్పు చేయాల్సి వచ్చింది. ఇలా తరచూ టెక్నాలజీలో మార్పుల వల్ల కూడా తప్పులు చోటుచేసుకుంటున్నాయని సీజీజీ ప్రతినిధి ఒకరు తెలిపారు.

హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు పోరాటం

ఎస్ఎఫ్ఐ

రాయదుర్గం: హెచ్‌సీయూలోని భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం ద్వారా విక్రయించడంపై ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ నాయకత్వంలోని పలు విద్యార్థి సంఘాలు భావిస్తున్నాయి. విద్యార్థి సంఘం 2024- 25 ఆధ్వర్యంలో పోరాడేందుకు విద్యార్థి సంఘాలు, వర్కర్స్ యూనియన్, నాన్ టీచింగ్ స్టాఫ్ యూనియన్, టీచర్స్ అసోసియేషన్‌లతో ప్రత్యేక జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)ని రెండు రోజుల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. జేఏసీ ద్వారా పోరాటం చేస్తూనే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని, హెచ్‌సీయూలోని భూములను ఇప్పటికే చాలా తీసుకున్నారని, ఇక ఇలాంటి చర్యలకు పూనుకోకూడదని విద్యార్థి సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం నుంచి జేఏసీ ఏర్పాటు, పోరాట వివరాలను తెలియజేస్తామని ప్రకటించారు. హెచ్‌సీయూకి ప్రస్తుతం ప్రహరీ లోపల ఉన్న భూములను ఎలాంటి అవసరాలకు వినియోగించకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మనవడి పుట్టిన రోజు నాడే తాత బలవన్మరణం

మియాపూర్ పరిధిలో విషాద ఘటన



రాఘవేందర్ రావు (ఫైల్)

మియాపూర్: మనవడి పుట్టిన రోజు నాడే అతడి తాత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు చెప్పిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మాధవనగర్‌కు చెందిన రాఘవేందర్ రావు(60) భార్య విజయలక్ష్మితో కలిసి మియాపూర్‌లోని దీప్తిశ్రీనగర్ కాలనీలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాఘవేందర్‌రావు కాలనీలో విజయ స్వగృహ ఫుడ్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాఘవేందర్ రావు మనవడు అర్జున్ పుట్టిన రోజు కావడంతో సాయంత్రం వేడుకలు నిర్వహించాలనుకున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులంతా కలిసి షాపింగ్‌కు వెళ్లారు. రాఘవేందర్ రావును కూడా రావాలని కోరగా.. తాను ఇంట్లోనే ఉంటానని, మీరు వెళ్లి రండి అని చెప్పారు. సాయంత్రం కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూడగా బెడ్రూం లోపలి నుంచి డోర్ వేసి ఉంది. రాఘవేందర్‌రావును ఎంత పిలిచినా సమాధానం రాకపోవడంతో.. కిటికిలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే తలుపు బద్దలు కొట్టి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మియాపూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కొంతకాలంగా రాఘవేందర్ రావు అనారోగ్యంతో బాధపడుతున్నాడని, దీంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. మనవడి పుట్టిన రోజు నాడే రాఘవేందర్ రావు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగారు.



మక్కా మసీదులో జుమ్మా ప్రార్థనలు



భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద భక్తులు

ఇటు జుమ్మా ప్రార్థనలు.. అటు హోలీ వేడుకలు

పాతబస్తీలో ప్రశాంతంగా జంట ఉత్సవాలు



మీరాలంమండిలో యువకుల హోలీ వేడుకలు..

నగరంలో జంట వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. 35 ఏళ్ల తర్వాత రంజాన్ మాసంలోని రెండో శుక్రవారంతో పాటు హోలీ ఒకేరోజు వచ్చాయి. దీంతో పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా, శాంతి సంఘం సభ్యులతో కలిసి గురువారం రాత్రి చార్మినార్‌ను సందర్శించి పరిస్థితిని అంచనా వేశారు. హోలీ వేడుకల్లో భాగంగా కామదహనం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రంజాన్ మాసంలోని రెండో శుక్రవారం సందర్భంగా మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు జరిగాయి. ఒకవైపు మక్కా మసీదులో ముస్లింల సందడి నెలకొనగా.. మరోవైపు చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయంలో హిందువులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసుల ముందస్తు వ్యూహం ఫలించడంతో ఇరు వర్గాల ప్రజలు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

– చార్మినార్


సైబర్ నేరాలకు చెక్ పెట్టేలా..

కొత్తగా ఐదు సైబర్ క్రైమ్ ఠాణాల యోచన

- జోన్‌కు ఒకటి చొప్పున ఏర్పాటుకు నిర్ణయం
- ప్రభుత్వానికి సైబరాబాద్ ఉన్నతాధికారుల ప్రతిపాదనలు
- ఏటా నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం

సైబరాబాద్ పరిధిలో ఇలా..

సంవత్సరం	కేసుల సంఖ్య	పోగొట్టుకున్న సొమ్ము
2022	4,866	రూ.77,92,46,505
2023	5,361	రూ.2,69,48,87,696
2024	11,914	రూ.7,93,18,94,102



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. ఎక్కడో విదేశాల్లో నక్కి, కమీషన్ల ఆశ చూపించి మధ్యవర్తులు, షెల్ కంపెనీలతో సైబర్ నేరస్తులు రూ.కోట్లు కొట్టేస్తున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలను మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు సైబరాబాద్ పోలీసులు సన్నద్ధమవుతున్నారు. కొత్తగా ఐదు సైబర్ క్రైమ్ రాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కమిషనరేట్ పరిధిలో జోన్‌కు ఒకటి చొప్పున ఉండేలా కసరత్తు చేస్తున్నారు.

అత్యధికంగా ఇక్కడే..

రాష్ట్రంలో అత్యధికంగా సైబర్ నేరాలు నమోదయ్యే పోలీసు యూనిట్లలో సైబరాబాద్ కమిషనరేట్ తొలి స్థానంలో ఉంది. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్లు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. రాష్ట్రానికి కీలకమైన ఐటీ కారిడార్‌తో పాటు అంతర్జాతీయ సంస్థలు సైబరాబాద్ పరిధిలో ఉన్నాయి. వీటికి తోడు వివిధ రాష్ట్రాలకు చెందిన ఐటీ సంస్థలూ ఇక్కడే ఉన్నాయి. ఫలితంగా కేసుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. గతేడాది కమిషనరేట్‌లో 11,914 కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో బాధితులు రూ.7,93,18,94,102 సొమ్మును పోగొట్టుకున్నారు. ప్రస్తుతం రోజుకు సగటున 30–35 కేసులు నమోదవుతున్నాయి.

అరెస్టులు 5 శాతం కంటే తక్కువే..

ప్రస్తుతం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ఒక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఉంది. రూ.50 వేల కంటే తక్కువ పోగొట్టుకుంటే స్థానిక స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నారు. అంతకుమించి అయితే సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సైబర్ క్రైమ్ కేసులలో డబ్బు రికవరీ సగటున 30 శాతం మించడం లేదు. నేరగాళ్ల అరెస్టులు సగటున 5 శాతం కూడా ఉండటం. లేదు. గతేడాది సైబరాబాద్‌లో కేవలం 372 కేసుల్లో 534 మంది నేరస్తులను మాత్రమే పోలీసులు అరెస్టు చేయగలిగారు. కేవలం ఒకే పోలీస్ స్టేషన్ ఉండటంతో ఈ సమస్య వస్తోంది. జోన్‌కు ఒకటి చొప్పున సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఉంటే కేసుల పరిష్కారం పెరిగే అవకాశముందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

కుల్ఫీ ఐస్‌క్రీమ్, బర్ఫీ స్వీట్‌లలో గంజాయి

స్పెషల్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి..

సాక్షి, సిటీబ్యూరో/అబిడ్స్ : హోలీ సంబరాలను సొమ్ము చేసుకొనేందుకు గంజాయి విక్రేతల ముఠా కొత్త పన్నాగం పన్నింది. హోలీ వేడుకల్లో భాగంగా శుక్రవారం లోయర్ ధూల్‌పేట్‌లో కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లు, బర్ఫీ స్వీట్లకు సిల్వర్ కోటెడ్ బాల్స్‌ను వినియోగిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. 100 కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లు, 72 బర్ఫీ స్వీట్లు, సిల్వర్ కోటెడ్ బాల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సత్యనారాయణ సింగ్ అనే వ్యక్తి కుల్ఫీ ఐస్‌క్రీమ్‌ల్లో గంజాయిని కలిపి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు. గంజాయితో తయారైన వీటిని స్వాధీనం చేసుకుని, సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.





స్వాధీనం చేసుకున్న కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లు (ఇన్‌సెట్‌లో) సిల్వర్ కోటెడ్ బాల్స్

ఆదివాసీ సంఘీభావ వేదిక ఏర్పాటు


ఆదివాసీ సంఘీభావ వేదిక సమావేశంలో పాల్గొన్న వివిధ ప్రజాసంఘాల నేతలు

ముషీరాబాద్: ఉమ్మడి హైదరాబాద్ ఆదివాసీ సంఘీభావ వేదికను ఏర్పాటు చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక కన్వీనర్లుగా దళిత లిబరేషన్ ఫ్రంట్ నుంచి ఇందిర, ప్రజా కళామండలి నుంచి రాణి, చైతన్య మహిళా సంఘం నుంచి జయ, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం నుంచి రవి, ఏఐ ఎఫ్‌టీయూ నుంచి మల్లేష్, పీడీఎస్‌యూ నుంచి మహేష్, అమరుల బంధుమిత్రుల సంఘం నుంచి సత్యను ఎంపిక చేశారు. అలాగే పౌర హక్కుల సంఘం హైదరాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ వేదిక కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని లక్ష్మణ్ తెలిపారు. ఆదివాసీలపై మారణహోమాన్ని నిలిపి వేయాలని, సహజ వనరుల దోపిడీని అరికట్టాలని, పర్యావరణాన్ని రక్షించాలని, పోలీసు క్యాంపులను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.

హెచ్‌సీయూ భూములు అమ్మితే గుణపాఠం తప్పదు

కాచిగూడ: హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పరిధిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అమ్మడానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. అఖిల భారత బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన శుక్రవారం కాచిగూడలో జరిగిన హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ విద్యార్థుల కార్యాచరణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం మానుకొని ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. ప్రభుత్వ స్థలాలు ప్రజల ఆస్తులని, వీటిని ప్రజా అవసరాలకు ఉపయోగపడే విధంగా ఉపయోగించాలని సూచించారు.

డబుల్ డెక్కర్..డైలమా!

- విప్రో జంక్షన్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ స్వస్తి
- మిగతా మార్గాల్లోనూ డౌటే..



సాక్షి, సిటీబ్యూరో: ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ ప్రతిపాదించిన ఫ్లై ఓవర్లలో విప్రో జంక్షన్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ స్వస్తి పలికినట్లు తెలుస్తోంది. వాస్తవంగా ఖాజాగూడ జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్, విప్రో జంక్షన్‌ల వద్ద ఫ్లై ఓవర్ల నిర్మాణాల అంచనా వ్యయం రూ.837 కోట్లుగా చెప్పి..నాలుగో ప్యాకేజీలో భాగంగా ఈ మూడింటికీ కలిపి టెండర్లు పిలవాల్సి ఉంది. కానీ విప్రో జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి మాత్రం టెండర్లు పిలవకుండా పెండింగ్‌లో ఉంచి మిగతా రెండు జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్ల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. వాటి నిర్మాణ అంచనా వ్యయం రూ.650 కోట్లు. విప్రో జంక్షన్ వద్ద టెండరు పిలవకపోవడానికి కారణం ఆ మార్గంలో మెట్రో రైలు మార్గం కూడా రానున్నందున ఒకే పిల్లర్‌పై మెట్రో మార్గం, జీహెచ్ఎంసీ ఫ్లై ఓవర్‌ను డబుల్ డెక్కర్‌గా నిర్మించాలని భావించారు. ఆ మేరకు జరిగిన జీహెచ్ఎంసీ, రైల్వే అధికారుల సమావేశంలో డబుల్ డెక్కర్ నిర్మాణానికి రైల్వే నుంచి సానుకూల స్పందన రాలేదని తెలిసింది. దాంతోపాటు మెట్రో మార్గం నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు, తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని రైల్వేతో సమన్వయం కుదరదని జీహెచ్ఎంసీ కూడా భావించింది. అంతే కాకుండా జంక్షన్ల వద్ద ట్రాఫిక్ జామ్‌లు లేకుండా సిగ్నల్ ఫ్రీగా ఉండేందుకు జీహెచ్ఎంసీ ఫ్లై ఓవర్లను నిర్మిస్తోంది. మెట్రో రైలు స్టేషన్ జంక్షన్‌లోనే ఉంటుంది. ఇలా వివిధ అంశాల్లో వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకొని ఆ ఫ్లై ఓవర్‌కు టెండర్ పిలవలేదు.

అది మా జాగా.. మేమే నిర్మిస్తాం

మరోవైపు, విప్రో జంక్షన్ స్థలం తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు చెందినది కావడంతో తమ స్థలంలో అవసరమైన ఫ్లై ఓవర్‌ను తామే నిర్మిస్తామని సదరు కార్పొరేషన్ అధికారులు జీహెచ్ఎంసీకి తెలిపినట్లు సమాచారం. దీంతో ఇక విప్రో జంక్షన్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ విరమించుకుంది.

మిగతా మార్గాల్లో డౌటే

ఈ నేపథ్యంలో మిగతా ప్రాంతాల్లోనూ డబుల్ డెక్కర్ల నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. జీహెచ్ఎంసీ కొత్తగా నిర్మించబోయే ఫ్లై ఓవర్ల మార్గాల్లో మెట్రో రైలు మార్గాలున్నట్లయితే ఫ్లై ఓవర్ల పై వరుసలో మెట్రో రైలు మార్గానికి అనుగుణంగా పిల్లర్లు నిర్మించాలని భావించారు. ఎత్తయిన పిల్లర్లు నిర్మించి డబుల్ డెక్కర్‌గా రెండు నిర్మాణాలు చేయాలనుకున్నారు.

- నాగోల్- ఎయిర్‌పోర్టు మార్గంలో మెట్రో మార్గంలో జీహెచ్ఎంసీ ఫ్లై ఓవర్లు వచ్చే ప్రాంతాలు
- టీకేఆర్ కాలేజ్,గాయత్రినగర్, మందమల్లమ్మ జంక్షన్లు
- ఒమర్ హోటల్- సోయబ్‌హోటల్ (వయా మెట్రో ఫంక్షన్‌హాల్)
- బండ్లగూడ- ఎర్రకుంట క్రాస్ రోడ్స్
- మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్ రోడ్, కాటేదాన్ జంక్షన్.
- మియాపూర్ క్రాస్‌రోడ్- ఆల్విన్ క్రాస్‌రోడ్ మార్గంలో మదీనగూడ గంగారం వద్ద.

అందులో భాగంగానే విప్రో జంక్షన్ వద్ద కూడా సిద్ధమైనప్పటికీ, ప్రభుత్వశాఖలు వేటికవిగా అందుకు విభేదించడంతో జీహెచ్ఎంసీ విరమించుకుంది. మియాపూర్ -పటాన్‌చెరు మార్గంలో ఆల్విన్ క్రాస్‌రోడ్, మదీనగూడ, చందానగర్, బీహెచ్‌ఈఎల్,ఇక్రిశాట్‌ల మార్గాల్లో, నాగోల్- ఎయిర్‌పోర్ట్ మార్గంలో ఎల్‌బీనగర్, కర్మన్‌ఘాట్, ఒవైసీ హాస్పిటల్, చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ తదితర ప్రాంతాల్లో మెట్రో రైలు రానుంది. ఆ మార్గాల్లో జీహెచ్ఎంసీ ఫ్లై ఓవర్లు వచ్చేచోట డబుల్‌డెక్కర్లుగా డబుల్ డెక్కర్లు నిర్మించేందుకు ఆలోచనలు చేసినప్పటికీ, తాజా పరిస్థితులతో డైలమాలో పడ్డాయి.

నగరంలో నేడు

- సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో ఉదయం 9.45 గంటలకు బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన తరగతుల గిన్నిస్ రికార్డు సెలబ్రేషన్స్ జరుగుతాయి. ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరవుతారు.
- రాజేంద్రనగర్ కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు 'ఇతిహాస్ సంకలన్ సమితి' నేషనల్ సెమినార్ నిర్వహిస్తారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొంటారు.
- బంజారాహిల్స్‌లోని హోటల్ పార్క్ హయత్‌లో మధ్యాహ్నం 3.45 గంటలకు యశోద ఆసుపత్రి ఆశ్వర్యంలో హైదరాబాద్ ఆర్థోస్కోపీ కాన్‌క్లేవ్-2025 జరుగుతుంది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొంటారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఎఫ్‌సీఎస్ పీటర్‌కు వైఎస్ సోదరి ఘన నివాళి


హెబ్రోన్ చర్చిలో పీటర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న విమలారెడ్డి, సుగుణమ్మ తదితరులు

చిక్కడపల్లి: హెబ్రోన్ చర్చి ట్రస్టు వ్యవస్థాపకుడు, ఎఫ్‌సీఎస్ పీటర్ భౌతికకాయాన్ని శుక్రవారం మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోదరి విమలారెడ్డి, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సతీమణి భారతీరెడ్డి మాతృమూర్తి సుగుణమ్మ, కడపకు చెందిన పలువురు సందర్శించారు. పీటర్ చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు పీటర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా విమలారెడ్డి మాట్లాడుతూ ఎఫ్‌సీఎస్ పీటర్ నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. ఆయన ప్రభుత్వ ఉద్యోగిగా, ట్రస్టు వ్యవస్థాపకునిగా అంకిత భావంతో పనిచేశారన్నారు.

ఆలయంలో యాసిడ్ దాడి కలకలం


గాయపడిన నర్సింగ్‌రావు

సైదాబాద్: ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై గుర్తు తెలియని యువకుడు యాసిడ్‌తో దాడి చేసి పరారయ్యాడు. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి...ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి లక్ష్మీనగర్ కాలనీలో నివసించే నర్సింగ్‌రావు (52) పెద్దతోటలోని శ్రీభూలక్ష్మీ మాత ఆలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఆలయంలో ఉండగా అక్కడికి వచ్చిన గుర్తు తెలియని యువకుడు మొదట ఆలయంలో పూజలు, హోమాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. కొన్ని పూజలకు ఇంత ధరలు ఎందుకు పెట్టారని వాగ్వాదానికి దిగాడని తెలుస్తోంది. అంతలోనే ఆ యువకుడు తనతో తెచ్చుకున్న యాసిడ్ వంటి కెమికల్‌తో నర్సింగ్‌రావుపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో నర్సింగ్‌రావు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని మలక్‌పేటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న సైదాబాద్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఆలయం, పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపులకు యువతి బలి


స్వప్న (ఫైల్)

అత్తాపూర్: వరకట్న వేధింపులతో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటకలోని బీదర్‌కు చెందిన స్వప్న(27)కు అత్తాపూర్ పాండురంగ నగర్‌కు చెందిన అమరేష్‌కు రెండున్నర సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇటీవల కొద్దిరోజులుగా అమరేష్ అదనంగా కట్నం కావాలని భార్యను వేధిస్తున్నాడు. పెళ్లి సమయంలో పెట్టిన బంగారాన్ని తన అవసరాల నిమిత్తం తాకట్టు పెట్టడంతో పాటు అదనంగా డబ్బు కావాలని డిమాండ్ చేస్తూ వేధించసాగాడు. ప్రతిసారి ఇంటి నుంచి డబ్బులు తేలేక..వేధింపులు తట్టుకోలేక శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ధ్యానోత్సవం

ఇబ్రహీంపట్నం: హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీ రామచంద్ర మిషన్ సంయుక్తంగా శని, ఆది, సోమవారాల్లో ఇబ్రహీంపట్నంలోని ఓసీ కమ్యూనిటీ హాల్‌లో ధ్యానోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15 సంవత్సరాలు దాటిన వారంతా ఈ ధ్యానోత్సవానికి హాజరు కావొచ్చని తెలిపారు. ధ్యానంతో కలిగే భౌతిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలను ఈ కార్యక్రమంలో వివరించనున్నట్లు వెల్లడించారు.

మహిళా బిల్లులో బీసీలకు సబ్‌కోటా కల్పించాలి

జాజుల శ్రీనివాస్ గౌడ్



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

నాంపల్లి: కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లు ద్వారా చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తీసుకువస్తుందని, ఈ బిల్లు వల్ల బీసీ మహిళలకు ఎలాంటి ఉపయోగం లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో శుక్రవారం సగర, ఉప్పర మహిళ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా హాజరైన జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించాలంటే మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా పెట్టాలని, దీనిపై కేంద్రంపై తెగించి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. సగర మహిళలంతా సంఘటితమైనప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని ఆయన చెప్పారు. బీసీ కమీషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్, గౌరవాధ్యక్షులు ముత్యాల హరికిషన్, నగర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం, కోశాధికారి వడ్లకొండ కుమారస్వామి, రాష్ట్రం ముఖ్య సలహాదారు ఆర్.బి.ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సగర మహిళలకు సత్కారం చేశారు.

విలీనం చేస్తేనే.. 'ఫ్యూచర్'

మా గ్రామాలను ఎఫ్‌సీడీఏలో కలపండి
సమీప గ్రామస్తుల నుంచి విజ్ఞప్తుల వెల్లువ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్‌సిటీలో తమ గ్రామాలను సైతం విలీనం చేయాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. 56 రెవెన్యూ గ్రామాలతో పాటు 765.25 స్క్వేర్ కిలోమీటర్ల పరిధిని 12 జోన్లుగా విభజించి.. భావినగరాన్ని అభివృద్ధి చేయనున్నట్లు సర్కార్ ప్రకటించింది. ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలోని 36 గ్రామాలను తొలగించి, ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీలో విలీనం చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా ఇప్పటికే ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కోసం ప్రత్యేక పాలక మండలిని ఏర్పాటు చేసింది. ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా ఆర్ఆర్ఆర్(ఆమనగల్లు) వరకు 330 ఫీట్ల రేడియల్ గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డు ఏర్పాటుకు భూ సేకరణ చేపట్టింది. అంతర్జాతీయ హంగులతో సుమారు 30 వేల ఎకరాల్లో కొత్తగా నిర్మించబోయే ఫ్యూచర్‌సిటీలో తమ గ్రామాలను కూడా విలీనం చేయాలనే విజ్ఞప్తులు ప్రభుత్వానికి అందుతున్నాయి. కొన్ని గ్రామాల ప్రజలైతే ఏకంగా అఖిలపక్షంగా ఏర్పడి ధర్నాలకు సైతం దిగుతుండడం విశేషం.

బతుకులు మారతాయనే..

ఐటీ, ఇండస్ట్రియల్ పరిశ్రమల రాకతో సమీప భూముల ధరలకు రెక్కలొచ్చే అవకాశం లేకపోలేదు. ఇప్పటి వరకు కనీస అభివృద్ధికి నోచుకోని తమ గ్రామాలను కొత్తసిటీలో కలపడం ద్వారా తమ జీవితాలు పూర్తిగా మారిపోతాయనే ఆశ స్థానికుల్లో వ్యక్తమవుతోంది. కాగా ప్రభుత్వ ప్రతిపాదిత ఫోర్త్‌సిటీ కోసం ఇప్పటికే 13,973 ఎకరాలను సేకరించిన ప్రభుత్వం.. తాజా గా మరికొంత భూమిని సేకరించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఐటీ, పారిశ్రామిక, ఆతిథ్య, పర్యాటక, క్రీడారంగాలకు పెద్దపీట వేయాలని నిర్ణయించింది. కృత్రిమమేధ (ఏఐ) సిటీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు అత్యాధునిక వాణిజ్య భవనం సహా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, క్రికెట్ స్టేడియం తదితర ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు ఇందులో చోటు కల్పించనుంది. ఐటీ, ఇండస్ట్రియల్ పార్కుల పేరుతో కొత్తగా మహేశ్వ రం మండలం రావిర్యాల గ్రామం కొంగర కుర్దు సర్వే నంబర్ 289లోని 94 మంది రైతుల నుంచి 275.12 ఎకరాలు, కందుకూరు మండలం తిమ్మాయిపల్లి సర్వే నంబర్ 9లోని 439 మంది రైతుల నుంచి 350.22 ఎకరాల భూసేకరణకు నోటిఫి కేషన్ జారీ చేసింది. అదనంగా తిమ్మాపూర్‌లో 600 ఎకరాలు, పంజాగూడలో 300 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

కన్సల్టెన్సీకి నోటిఫికేషన్

మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లోని 14 గ్రామాల మీదుగా వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డును రెండు దశల్లో నిర్మించాలని నిర్ణయించారు. ఫేజ్-1లో ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్ పేట వరకు 19.02 కిలోమీటర్ల మేర రూ.1,665 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. ఫేజ్-2లో భాగంగా మీర్‌ఖాన్‌పేట నుంచి ఆమనగల్లు ఆర్ఆర్ఆర్ వరకు 22.30 కిలోమీటర్లు రూ.2,365 కోట్ల ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ మేరకు ఫిబ్రవరి 28న టెక్నికల్ బిడ్‌లను ఆహ్వానించడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా హద్దురాళ్లను నాటే పనిలో నిమగ్నమయ్యారు. మార్చి 21న టెక్నికల్ బిడ్స్ తెరవనున్నారు. తాజాగా రోడ్డు నిర్మాణ సమయంలో పనులు పర్యవేక్షించేందుకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ సర్వీసులకు టెండర్లు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది.

- మహేశ్వరం మండలంలో 31 పంచాయతీలు ఉండగా, వీటిలో హర్షగూడ పంచాయతీ తుక్కుగూడ మున్సిపాలిటీలో విలీనం అయింది. తాజాగా తుమ్మలూరు, మహబత్‌నగర్‌ను ఫోర్త్‌సిటీలో విలీనం చేశారు. ఇదే మండలం నుంచి మరికొన్ని విజ్ఞప్తులు ప్రభుత్వానికి అందుతున్నాయి.
- కందుకూరు మండల పరిధిలోని నేదునూరు, బాచుపల్లి, జైత్వారం, పులిమామిడి, ధన్నారం, చిప్పలపల్లి, మురళీనగర్, దావుద్ గూడతండా, పెద్దమ్మతండా పంచాయతీలను సైతం ఫోర్త్‌సిటీలో కలపాలని కోరుతున్నారు.

వినియోగదారుడా.. బీ అలర్ట్!

- ఆర్థిక భారం లేకుండా న్యాయం పొందే అవకాశం
- ఈ చట్టం గురించి తెలుసుకుంటే ఎంతో మేలు

సిటీ కోర్టులు: మార్కెట్‌లో కొనుగోలు చేసిన వస్తువు నాణ్యత, సేవల పరంగా వినియోగదారుడికి ఏ విధమైన మోసం జరిగినా మేమున్నామంటూ వినియోగదారుల ఫోరం అండగా నిలుస్తోంది. కొనుగోలు చేసే వస్తువులపై గరిష్ట ధర (ఎమ్మార్పీ), ఎక్స్‌పైరీ తేదీ, కంపెనీ చిరునామా, ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబరు తదితర వివరాలు ఉత్పత్తులపై ముద్రించాల్సి ఉంటుంది. పేర్కొన్న వివరాలకు, వస్తువు, సేవల్లో పొందిన వాస్తవానికి తేడాలున్నపుడు వినియోగదారుడు ఫోరాన్ని ఆశ్రయించవచ్చు. పైసా ఖర్చు లేకుండా కమిషన్‌లో కేసు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తుంది. ఆర్థిక స్తోమత లేనివారు సొంతంగా తమ కేసును తామే వినిపించుకునే వెసులుబాటూ ఉంది. ఆన్‌లైన్‌లోనూ కేసు నమోదు చేసుకోవచ్చు. వర్చువల్‌గా కేసుల వాదనలు వినిపించుకోవచ్చు. రూ.50 లక్షల విలువైన వస్తువు, సేవల కోసం జిల్లా కమిషన్‌లో ఫిర్యాదు చేయాలి.

రూ.2 కోట్ల వరకు రాష్ట్ర కమిషన్‌లో, అంతకుమించితే జాతీయ కమిషన్‌లో ఫిర్యాదు చేయాలి. వినియోగదారుడి హక్కులు, ప్రయోజనాల గురంచి తెలియజెప్పేందుకు మార్చి 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం కూడా నిర్వహిస్తున్నారు.

వినియోగదారుల కమిషన్ల ఫోన్ నెంబర్లు

టోల్ ఫ్రీ నెంబర్	: 180042500333
జాతీయ వినియోగదారుల కమిషన్, న్యూఢిల్లీ	: 011-24608724.
తెలంగాణ రాష్ట్ర కమిషన్, హైదరాబాద్	: 040-23394399
హైదరాబాద్ జిల్లా కమిషన్ ఎంజే రోడ్, నాంపల్లి	: 040-24733368,
రంగారెడ్డి జిల్లా కమిషన్, ఎన్‌టీఆర్ నగర్,	: 040-24031275

కేసుల పరిష్కారం ఇలా..

సంవత్సరం	నమోదైన కేసులు	పరిష్కారమైనవి
2023	1,274	1,076
2024	1,358	1,340
2025	159	113

త్వరితగతిన న్యాయం..



రాష్ట్రంలోని వినియోగదారులకు త్వరితగతిన న్యాయ సేవలు అందుతున్నాయి. న్యాయం కోసం కమిషన్‌ను ఆశ్రయించిన వారికి సత్వర న్యాయం జరిగేలా కృషి చేస్తున్నాం. వివిధ కంపెనీల నుంచి నష్టపోయిన వినియోగదారులు కేసులు వేసేవరకు రాక్క ముందే ఆయా కంపెనీల యాజమన్యాలు వారి సమస్యలు పరిష్కరిస్తున్నాయి. ఇక కొత్తగా అమల్లోకి వచ్చిన జాగృతి ఆన్‌లైన్ సర్వీస్ ద్వారా వినియోగదారులు కేసులు ఆన్‌లైన్‌లోనే దాఖలు చేయవచ్చు. వర్చువల్‌లో కూడా కేసుకు హాజరుకావొచ్చు.

– మీనా రామనాథన్, రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఇన్‌చార్జి అధ్యక్షురాలు

సరైన రసీదు తీసుకోవాలి



వినియోగదారులు ఏదైనా వస్తువు కొన్నప్పుడు రసీదు తప్పక తీసుకోవాలి. ఆ వస్తువులో ఏదైనా లోపం ఉందని భావించినప్పుడు మీరు కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందడానికి ఆ రసీదు చాలా ఉపయోగపడుతుంది.

– రాంగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు, హైదరాబాద్ వినియోగదారుల ఫోరం-3

ఏఐపై ఆంగ్ల అధ్యాపకులకు అవగాహన



బంజారాహిల్స్: ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం, నిట్-వరంగల్ ఆంగ్ల విభాగం, ఉట్నూర్ ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆంగ్ల అధ్యాపకులకు 'కృత్రిమ మేధతో సమూల మార్పు దిశగా సాధికారత' అంశంపై ఒక రోజు జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఉన్నత విద్య ఆర్జేడీలు, వివిధ కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, డిగ్రీ విద్యార్థులు ఎంతో ఆసక్తిగా నిపుణుల ప్రసంగాలను విన్నారు. కార్యక్రమంలో నిట్-వరంగల్ అధ్యాపకులు డాక్టర్ స్ఫూర్తి, జెల్లీ రవిప్రకాష్, కొరమి ప్రత్యూష, అనుపమ, వేణుగోపాల్ తదితరులు వర్క్‌షాప్‌కు హాజరై ఏఐ గురించి అవగాహన కల్పించారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాటా రూ.11, నల్లవంకాయ.23, పొడుగువంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 18, క్యాప్సికం 28, పచ్చికాకరకాయ 45, పందిరి బీర 45, క్యాబేజీ 08, క్యారెట్ 15, దొండకాయ 45, గుండు బీన్నీస్ 45, గింజచిక్కుడు 55, గోకరకాయ 35, కీర 15, దోసకాయ 21, బీట్‌రూట్ 13, ఉల్లిగడ్డ 24, ఆలుగడ్డ 20, చామగడ్డ 45, మొరంగడ్డ 28, కందగడ్డ 70, క్యాలిఫ్లవర్ 18, సొరకాయ 09, పొట్లకాయ 18, అరటికాయ 09, మునగకాయ 5, మామిడికాయ 40, ముల్లంగి 5–6, ఉల్లిపొరక 35 ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

జాతీయ సదస్సును విజయవంతం చేయాలి

లిబర్టీ: అఖిల భారత అసంఘటిత ఉద్యోగుల, కార్మికుల కాంగ్రెస్ జాతీయ సదస్సును ఢిల్లీలోని కేంద్ర కార్యాలయం ఇందిరా భవన్‌లో ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి రుద్రక్ష మల్లేష్ తెలిపారు. ఈ సదస్సుకు మాజీ లోక్‌సభ సభ్యులు, జాతీయ చైర్మన్ డాక్టర్ ఉదిత్‌రాజ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. అన్ని రాష్ట్రాల నుంచి సదస్సుకు ప్రతినిధులు పాల్గొంటారని, రాష్ట్రం నుంచి ప్రతినిధి బృందం రాష్ట్ర అధ్యక్షుడు కౌశిక్ సమీర్ ఆధ్వర్యంలో తరలి వెళ్లనున్నట్లు ఆయన వివరించారు.

మహిళపై దాడిచేసిన కుటుంబ సభ్యులపై కేసు

ఫిలింనగర్: ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బుల విషయంలో తనను మోసం చేశారని, అడగడానికి వెళ్లిన మహిళపై ఆమె మరిదితో పాటు కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపర్చిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ బస్తీలో ఆర్.దివ్యదుర్గా కూతురుతో కలిసి నివసిస్తోంది. ఆమె భర్త 2021లో కరోనాతో మృతి చెందాడు. ఇటీవల భర్తకు భాగస్వామ్యంగా వచ్చే ఇంటిని విక్రయిద్దామని మరిది ఆర్.సురేష్ ఆమెను ఒప్పించాడు. రూ.32 లక్షలకు ఇల్లు అమ్మినట్లు చెప్పాడు. అయితే ఈ ఇంటిని రూ.39 లక్షలకు అమ్మినట్లుగా ఆమెకు తెలిసింది. తనను మోసం చేశాడని తెలుసుకుని ఇదే విషయం అడగడానికి సురేష్ వద్దకు వెళ్లింది. అయితే ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సురేష్ కొట్టి నేలపైకి నెట్టేశాడు. సురేష్‌తో పాటు ప్రవీణ్, శైలజ, సలీం తదితరులు కూడా తనను కొట్టడమే కాకుండా అసభ్యకరంగా ప్రవర్తించి దుర్భాషలాడారంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ పోలీసులు సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్ద ఎత్తున మద్యం స్వాధీనం

ఫిలింనగర్: హోలీ రోజు మద్యం దుకాణాలు బంద్ కావడంతో ముందు రోజు తెచ్చిపెట్టుకున్న మద్యం విక్రయించి భారీగా లాభాలు ఆర్జించాలని ఆశపడ్డ ఓ యువకుడిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి భారీ ఎత్తున మద్యం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ బస్తీలో నివసించే ఉదయ్‌కుమార్ ఫ్లవర్ డెకరేషన్ వర్క్ చేస్తుంటాడు. అయితే హోలీ రోజున మద్యం అమ్మితే అధిక ధరలతో బాగా సంపాదించుకోవచ్చని ఆశపడి ఫిలింనగర్ వైన్స్‌మార్ట్‌లో గురువారం 58 మద్యం బాటిళ్లను కొనుగోలు చేశాడు. నిబంధనలు ఉల్లంఘించి బెల్టు షాపులో శుక్రవారం ఉదయం మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేశారు. మద్యం స్వాధీనం చేసుకున్న ఫిలింనగర్ పోలీసులు ఉదయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోరబండ బస్తీల్లో డీసీపీ పర్యటన



రహమత్‌నగర్: హోలీని పురస్కరించుకుని వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్ గురువారం రాత్రి రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పీస్ కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఎస్‌ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటరమణ, బోరబండ ఎస్‌హెచ్‌ఓ సురేందర్, డీఐ సైదులు, సెక్టార్ ఎస్సైలు, పీస్ కమిటీ సభ్యులు డీసీపీ వెంట ఉన్నారు.



బంజారాహిల్స్‌లో హోలీ వేడుకలు



పంజగుట్టలో..



పీపుల్స్ ప్లాజా మైదానంలో వేడుకలు





శోభాయమానం.. సప్తవర్ణాల సంబురం



సాగర్ సొసైటీలోని బీజేపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ఫాల్గుణ మాసంలో వచ్చే హోలీకి ఎంతో ప్రత్యేకత ఉంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా.. వసంత రుతువు ప్రారంభోత్సవానికి గుర్తుగా.. హోలి సంబరాలు నిర్వహిస్తారు. సప్తవర్ణాల సంబురం అంబరాన్ని తాకింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే వాడవాడలా యువతీ, యువకులు చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఈ వేడుకను ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ప్రాంతాలు, భాష, యాస వేరైనాప్పటికీ అంతా కలిసి ఈ వేడుకలను తమ ఆచార సంప్రదాయాల ప్రకారం ఘనంగా జరుపుకున్నారు. ఎటు చూసినా యువతీ, యువకుల కేరింతలతో హోలీ వేడుక కనుల పండువగా సాగింది. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఖైరతాబాద్, సోమాజిగూడ డివిజన్ల పరిధిలో వేడుకలు ఆట, పాటలతో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ప్రజాప్రతినిధులు తమ ఇళ్ల వద్దే ఉత్సాహంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

– బంజారాహిల్స్



ఎఫ్ఎన్‌సీసీ కల్చరల్ సెంటర్‌లో హోలీ వేడుకల్లో రెయిన్ డ్యాన్స్



బంజారాహిల్స్ రోడ్ నెం.12లో మార్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు



జూబ్లీహిల్స్ రోడ్ నెం.5 దుర్గా భవానీనగర్ బస్తీలో..



పీపుల్స్ ప్లాజాలో హోలీ వేడుకల్లో సినీ నటుడు సుమేధ్ ముద్గాల్కర్



శ్రీనగర్ కాలనీలో..



మధురానగర్‌కాలనీ బీ-బ్లాక్‌లో...



వెంకటగిరిలో..



బంజారాహిల్స్ గౌరీశంకర్ కాలనీలో..



ఎన్బీటీ నగర్‌లో హోలీ వేడుకల్లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

అతివేగంతో దూసుకొచ్చి.. ఫెన్సింగ్‌ను ఢీకొట్టి..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-1లో మద్యం మత్తులో అదుపు తప్పిన వేగంతో దూసుకొచ్చిన ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో సినీ హీరో బాలకృష్ణ ఇంటి ఎదుట వేసిన ఫెన్సింగ్ ధ్వంసమైంది. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మాదాపూర్ వైపు నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–45 మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు మితిమీరిన వేగంతో శుక్రవారం తెల్లవారుజామున కారు దూసుకొచ్చి బాలకృష్ణ ఇంటి మలుపు వద్ద అదుపుతప్పింది. ఫుట్‌పాత్, డివైడర్‌తో పాటు ఫెన్సింగ్‌ను ఢీకొట్టడంతో కారు ముందు భాగం దెబ్బతింది. నిర్లక్ష్యం, డ్రైవర్



అతివేగం, నిద్ర మత్తు ఈ ప్రమాదానికి కారణమై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో శ్రీగౌర పూర్ణిమ వేడుకలు



బంజారాహిల్స్ హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో శ్రీగౌర పూర్ణిమ వేడుకలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో శ్రీగౌర పూర్ణిమ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వయంగా శ్రీకృష్ణ భగవానుడే తన భక్తుడి అవతారమైన శ్రీచైతన్య మహాప్రభువుగా 539 సంవత్సరాల క్రితం పశ్చిమబెంగాల్‌లో ఉన్న మయాపూర్‌లోని నవద్వీపంలో ఫాల్గుణ పూర్ణిమ నాడు జన్మించాడు. ఈ విశేష సందర్భాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో తయారు చేసిన 56 రకాల వంటకాలను 'ఛప్పన్ భోగ్' నైవేద్యంగా స్వామివారికి సమర్పించారు. వివిధ తీపి మిఠాయిలు, పకోడాలు, పండ్ల రసాలు, వివిధ రకాల పిండి వంటలతో చేసిన పదార్థాలు ఉన్నాయి. సాయంత్రం వివిధ రకాల పండ్ల రసాలు, పుష్పాలు, పంచామృతం, పంచగవ్యం, సుగంధ ద్రవ్యాలతో వేద మంత్రోచ్చారణల మధ్య నితాయ్ గౌరాంగ అష్టోత్తర శత(108) కలశ మహా అభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గౌర నితాయ్ మహా పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షులు సత్యగౌర చంద్రదాస్ మాట్లాడుతూ వేదాల ప్రకారం శ్రీకృష్ణ భగవానుడు ఈ యుగంలో బంగారు రంగు గల దివ్య రూపంలో గౌరాంగ లేదా శ్రీచైతన్య మహా ప్రభువుగా బెంగాల్‌లో అవతరించి నేటి యుగ ధర్మమైన భగవన్నామ సంకీర్తనోద్యమాన్ని ప్రారంభించారన్నారు. కాగా నగరం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొని భక్తిపారవశ్యంలో తన్మయులయ్యారు.

సీఎంపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు

బంజారాహిల్స్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో సీఎంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలంటూ బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, పదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగిన మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటాన్ని తెలంగాణ సమాజం క్షమించదని, సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కేసు నమోదు చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు



బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి

రాంచందర్, రావుల విజయ్‌కుమార్, కొమ్ము విజయ్‌కుమార్, భీమ్‌షా తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ షీట్స్ చోరీ

వెంగళరావునగర్: ఇంటి నిర్మాణానికి తీసుకువచ్చిన సెంట్రింగ్స్ మాయమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఎండి మునావర్ తన ఇంటిపైన మరో రెండు అంతస్తులు నిర్మించడానికి మేస్త్రీ ద్వారా 220 సెంట్రింగ్ షీట్స్ తెప్పించాడు. రెండో ఫ్లోర్ వేసిన తర్వాత వాటిని తొలగించి మూడో అంతస్తుపై ఉంచారు. మూడో ఫ్లోర్ నిర్మించే క్రమంలో 28 షీట్స్ కనిపించలేదు. దాంతో అక్కడ ఓ వ్యక్తిని కాపలా ఉంచారు. గురువారం అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి రెండు షీట్స్ దొంగిలించుకుని వెళ్తుండగా అతడిని పట్టుకుని మధురానగర్ పోలీసులకు అప్పగించగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులను దూషిస్తూ.. పోస్టు పెట్టిన వ్యక్తిపై క్రిమినల్ కేసు

బంజారాహిల్స్: ఇ–చలాన్ జారీ చేసిందుకు ఓ ద్విచక్ర వాహనదారుడు ట్రాఫిక్ పోలీసులపై అసభ్య పదజాలంతో దూషిస్తూ పెట్టిన పోస్ట్ పోలీసు విధులకు ఆటంకం కలిగించేదిగా ఉందంటూ ఇ–చలాన్ ఆఫీసు ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రవీణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాలు.. రామంతాపూర్ సత్యానగర్ కాలనీలో నివసించే ఎర్ర నర్సింహులు ఇటీవల తన బైక్ టీఎస్ 11 ఈఈ 5789ను బాలంరాయి జంక్షన్‌లో అక్రమంగా పార్కింగ్ చేశాడు. ట్రాఫిక్ పోలీసులు అక్రమ పార్కింగ్‌లో ఉన్న బైక్ ఫొటో తీసి ఎర్ర నర్సింహులుకు ఇ–చలాన్ జారీ చేశారు. అయితే ఈ నెల 5వ తేదీన ఎర్ర నర్సింహులు 'రిపోర్ట్ అజ్ యాప్'లో తనకు జారీ చేసిన ఇ–చలాన్‌పై స్పందిస్తూ ఆ రోజు తాను అక్కడ బైక్ పార్కింగ్ చేయలేదని అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ పోస్ట్ చేశాడు. పోలీసు విధులకు ఆటంకం కలిగించే విధంగా ఉన్నాయని, చర్యలు తీసుకోవాలంటూ ట్రాఫిక్ ఇ–చలాన్ ఆఫీసు ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హష్ ఆయిల్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



బంజారాహిల్స్: అక్రమంగా నిబంధనలు ఉల్లంఘించి హష్ ఆయిల్ విక్రయిస్తున్న ఇద్దరి నిందితులను జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. రాజేష్‌చౌహాన్, ఎస్.అఖిల్ అనే ఇద్దరు యువకులు ఈజీ మనీ కోసం హష్ ఆయిల్ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–10సీలోని ఎంపీ ఎమ్మెల్యే కాలనీ ఫస్ట్ బెటాలియన్ గేటు వద్ద ఈ ఇద్దరు హష్ ఆయిల్ విక్రయించేందుకు బైక్‌పై వెళ్తుండగా జూబ్లీహిల్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావుతో పాటు సిబ్బంది దాడులు నిర్వహించి వారిని అరెస్టు చేసి హష్ ఆయిల్, బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

వర్క్‌ఫ్రం హోం పేరుతో నగదు మాయం

వెంగళరావునగర్: ఉద్యోగం పేరుతో మహిళను మోసం చేసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం జవహర్‌నగర్ నివాసి మల్లేశ్వరికి రెండేళ్ల క్రితం వర్క్ ఫ్రం హోమ్ పేరుతో వాట్సాప్ మెసేజ్ వచ్చింది. లింక్ ఓపెన్ చేయగా రూ.200 చెల్లించాలని చెప్పడంతో ఆమె పంపింది. తమ ఉత్పత్తులు కొనుగోలు చేస్తే రెట్టింపు ఆదాయం వస్తుందని చెప్పడంతో ఇప్పటి వరకు రూ.97 వేల వరకు ఉత్పత్తులను కొనుగోలు చేసింది. అయినా ఆమె నగదు తిరిగి రాకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లో ప్రెషర్ సమస్యను పరిష్కరించండి

రహమత్‌నగర్: రంజాన్ మాసం ఉపవాస దీక్షల సందర్భంగా లో ప్రెషర్ లేకుండా నీటిని సరఫరా చేయాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్ జలమండలి అధికారులకు సూచించారు. తాగునీరు లోప్రెషర్‌తో సరఫరా అవుతోందని పలు బస్తీవాసుల ఫిర్యాదు మేరకు ఆయన గురువారం బోరబండ రిజర్వాయర్‌కు చేరుకుని జలమండలి అధికారులతో మాట్లాడారు. లో ప్రెషర్ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇకపై ఒక నిర్దిష్ట సమయంలో నీటిని సరఫరా చేయాలని ఆయన వారికి సూచించారు.



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న బాబా ఫసియుద్దీన్

రోడ్డుపై నుంచి పక్కకు వెళ్లాలన్నందుకు దాడి

ఖైరతాబాద్: రాకపోకలకు అడ్డుగా ఉన్న యువకులను పక్కకు తప్పుకోవాలని కోరగా వారితో పాటు మరికొందరు వచ్చి వ్యక్తిపై దాడి చేసిన ఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ డబుల్ బెడ్ రూం సముదాయంలో నివసించే డీబీ నరేష్(40) ప్రైవేటు ఉద్యోగి. విధులు ముగించుకొని గురువారం రాత్రి ఇంటికి వెళ్తుండగా ఐమాక్స్ మూలమలుపు సమీపంలో కొందరు యువకులు రోడ్డుపై ద్విచక్ర వాహనాలపై కూర్చొని మాట్లాడుకుంటున్నారు. రోడ్డు మధ్య నుంచి పక్కకు వెళ్లాలని నరేష్ ఆ యువకులకు చెప్పి ముందుకు వెళ్లాడు. అతడిని అడ్డుకొని దూషించడమే కాకుండా మరికొందర్ని పిలిచి అతడిపై దాడి చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. దాడి చేసిన యువకులు ఖైరతాబాద్ గాంధీనగర్‌కు చెందిన వారుగా గుర్తించిన పోలీసులు గతంలో పలు దాడుల్లో వీరి ప్రమేయం ఉందన్నారు.



రంగ్‌దే..

నగరంలో ఘనంగా హోలీ వేడుకలు

- ఈవెంట్లకు ఆసక్తి చూపిన యువత
- ఓ వైపు హోలీ.. మరో వైపు డీజే హోరు
- ఉత్సవ ప్రాంతాలు మినహా రోడ్లన్నీ ఖాళీ
- కలర్‌ఫుల్ పోస్టులతో సోషల్ మీడియాలో హంగామా

రంగులే.. హే రంగులే.. నీ రాకతో లోకమే రంగులై పొంగెనే.. వింతలే.. కేరింతలే..నీ చేతిలో చెయ్యిగా.. ఆకసం అందెనే.. స్నేహమే మెల్లగా గీతలే దాటెనే.. అన్నట్లు.. నగరంలో హోలీ సంబరాలు అంబరాన్ని తాకాయి. ఎప్పుడెప్పుడా అని హోలీ కోసం ఎదురు చూసిన నగర వాసులు శుక్రవారం ఒకరిపై ఒకరు రంగులు చల్లుతూ ఉత్సాహంగా గడిపారు. భాగ్యనగరంలోని గల్లీలు మొదలుకుని.. గేటెడ్ కమ్యూనిటీల వరకూ.. పలు రకాల ఈవెంట్లతో, డీజేలతో, లైవ్ మ్యూజిక్‌తో ఎంజాయ్ చేశారు. దీంతో మహానగరంలో నీలాకాశం సప్త వర్ణాల ఇంద్రధనస్సును తలపించింది. వినువీధుల్లో రంగులు పూశాయా అన్నట్లు అద్భుత దృశ్యాన్ని తలపించింది.
- సాక్షి, సిటీ బ్యూరో





నగరంలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. భారీ ప్రాంగణాల్లో వేలాదిమంది రంగులు చల్లుకుని ఎంజాయ్ చేశారు. ఓ వైపు రంగుల ఉత్సవం.. మరోవైపు హోరెత్తించే లైవ్ మ్యూజిక్, డీజే వంటివి యువతకు మరింత కిక్కిచ్చాయి. టాప్ డీజే రాకింగ్ మ్యూజిక్కుకు అనుగుణంగా లయబద్ధంగా స్టెప్పులేశారు. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, సికింద్రాబాద్, ఓల్డ్ సిటీ, బేగంబజార్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, ఓయు వంటి ప్రాంతాల్లో చిన్నా పెద్దా, యువత ఈవెంట్లలో పాల్గొన్నారు. పలు ఈవెంట్లలో సినీ తారలు, బిగ్ బాస్ కంటెస్టెంట్స్, జబర్దస్త్ కమెడియన్స్, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు సందడి చేశారు. ఒక్కో ఈవెంట్‌లో పదివేల మందికి పైగా పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. కొన్ని ఈవెంట్లలో డ్రెస్ కోడ్‌తో పాటు, పలు థీమ్‌లతో ధరించిన దుస్తులు ఆకర్షణగా నిలిచాయి. సుమారు రూ.200 మొదలు, 5 వేలకు పైగా ఎంట్రీ ఫీజు వసూలు చేశారు నిర్వాహకులు. ఇందులో భాగంగా పలు చోట్ల రంగు రంగుల ఆహారాన్ని అందించారు. ఇంకొన్ని ప్రాంతాల్లో రంగుల శీతల పానియాలతో ఆకట్టుకున్నారు. హోలీ సంబరాల నేపథ్యంలో ఉదయం, మధ్యాహ్న సమయంలో నగర రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.

ఆర్గానిక్ హోలీ..

నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోని గేటెడ్ కమ్యూనిటీల్లో పలువురు ఆర్గానిక్ హోలీని జరుపుకున్నారు. చర్మానికి హాని చేయని ప్రకృతి సిద్ధమైన పళ్లు, కూరగాయలు, ఆకులతో తయారు చేసిన రంగులను చల్లుకున్నారు. ప్రకృతిలోని వర్ణాల మాదిరిగానే తమ జీవితాల్లోనో రంగులు పూయాలని కోరుకుంటూ, హానికారక రంగులకు దూరంగా.. సంప్రదాయ రంగులను వినియోగించారు. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఆర్గానిక్ కలర్స్ అమ్మే స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు ఔత్సాహికులు. ఆర్గానిక్ రంగులు వాడకం వల్ల ప్రకృతితో మమేకమైనట్లు అనిపించిందని పలువు చెప్పడం విశేషం.



డీజేలతో స్టెప్పులేస్తూ..

ఓ వైపు రంగులు చల్లుకుంటూ.. మరోవైపు డీజేలు, లైవ్ మ్యూజిక్‌కు అనుగుణంగా స్టెప్పులేస్తూ కుటుంబ సభ్యులతో, మిత్రులతో కాలనీ వాసులు ఉత్సాహంగా గడిపారు. పలు చోట్ల మ్యూజిక్ కాన్సర్ట్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా ముంబై, బెంగళూరు, నోయిడా వంటి ప్రాంతాల నుంచి వచ్చిన లేడీ డేజేలు రాకింగ్ మ్యూజిక్‌తో హోలీ కార్నివాల్‌లో నగర వాసులను అలరించారు.









కలర్‌ఫుల్..సోషల్ ఫీల్..

హోలీని భౌతికంగానే కాదు.. ఆన్‌లైన్‌లోనూ జరుపుకోవచ్చని నిరూపించారు నగరవాసులు. ఈసారి హోలీ నేపథ్యంలో సోషల్ మీడియా మొత్తం కలర్‌ఫుల్ సోషల్ ఫీల్ కలిగించింది. ముఖ్యంగా యువత తమ ప్రాంతాల్లో జరిగిన ఉత్సవాలను, రంగులు నిండిన సన్నివేశాలను రీల్స్ రూపంలో సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. ఇన్‌స్టా మొదలుకుని ఎఫ్‌బి, ఎక్స్ వంటి పలు వేదికల్లో తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

కుబేరులకు కునుకు లేదు..?!

హార్ట్‌ఫుల్‌నెస్, టీఐఈ గ్లోబ్ నివేదికలో వెల్లడి

- ఆర్థిక పరిస్థితులు, పని ఒత్తిడితో నిద్రకు దూరం
- వ్యవస్థాపకులు, బిజినెస్ మెన్‌లలో 80 శాతం సమస్య
- ఐదు ప్రధాన నగరాల్లో హైదరాబాద్ కూడా

సాక్షి, సిటీ బ్యూరో: భాగ్యనగరంలో వ్యాపారవేత్తలు, టెక్ నిపుణులు, స్టార్టప్ వ్యవస్థాపకులు నిద్రలేమితో బాధపడుతున్నారట. హైదరాబాద్ సహా ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై నగరాలతో పాటు మొత్తం 260 మందిని సర్వే చేయగా ఆర్థిక అనిశ్చితి, ఎక్కువ సమయం పని చేయడం, నిర్ణయాలు తీసుకోడానికి అధిక ఒత్తిడిని ఎదుర్కోడం, నిరంతర డిమాండ్లు తదితర అంశాలతో 55 శాతం మంది ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నారట. ఇటీవల హార్ట్‌ఫుల్‌నెస్, టీఐఈ గ్లోబల్ సంయుక్తంగా నిద్ర సంక్షోభంపై సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో పేద, మధ్య తరగతి ప్రజలే కాదు ధనవంతులు, పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ యజమానులు, టెక్ నిపుణులకు సైతం నిద్ర పట్టడంలేదని తేలింది. మార్చి 14న ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా ఈ నివేదికను విడుదల చేశారు.



కేవలం విశ్రాంతి కాదు..

నిద్ర అనేది కేవలం విశ్రాంతి కాదు. మనసు, శరీరం, ఆత్మ పునరుజ్జీవనం పొందడానికి ఒక పవిత్ర అవకాశం. ఆరోగ్యకరమైన నిద్ర పద్ధతులతో జ్ఞానం, సృజనాత్మకత, సమతుల్యతతో నడిపించే సామర్థ్యం మెరుగ్గా ఉంటాయి. అంతర్ దృష్టి బలపడుతుంది. స్పష్టమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది. - రెవరెండ్ దాజీ, హార్ట్‌ఫుల్ నెస్ గైడ్, శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు

నిద్రను త్యాగం చేస్తున్నారు..

స్టార్టప్ వ్యవస్థాపకులు, వ్యాపార వేత్తలు తమ విజయాల్లో నిద్రను త్యాగం చేస్తున్నారు. ఉత్పాదకత, నిర్ణయాలు తీసుకోవడం, పనితీరుపై నిద్ర లేమి ప్రభావాన్ని స్పష్టం చేస్తుంది. స్థిరమైన విజయానికి కీలకమైన ఆరోగ్యకరమైన పని–జీవన సమతుల్యతను సాధించడంలో వ్యవస్థాపకులకు మద్దతు ఇచ్చే వనరులను అందించడానికి మేము కట్టుబడి ఉన్నాం.
- మురళి, గ్లోబల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ చైర్మన్

పనితీరుపై ప్రభావం..

ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 80 శాతం మంది తగినంత సమయం నిద్ర లేకపోవడంతో పనితీరుపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని, అలసటకు గురవుతున్నామని అభిప్రాయపడ్డారు. విధి నిర్వహణలో ఏకాగ్రత కోల్పోతున్నామని, ఫలితంగా కార్యాలయ పనితీరును గణనీయంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. నిద్రలేమితో సృజనాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమవుతున్నారట. 26 శాతం మంది రాత్రి 6 గంటలే నిద్రపోతున్నారని, 19 శాతం మంది చాలా పేవలమైన నిద్రతో ఒత్తిడి, ఆందోళనల కారణంగా నిద్రకు దూరమవుతున్నారు.

విద్యార్థుల సంస్కారం

- పేదల ఆకలి తీర్చేందుకు ఫిస్ట్ ఆఫ్ రైస్ ప్రాజెక్టు
- బియ్యం సేకరణకు పిడికిలి బిగించిన విద్యార్థులు
- మోతీనగర్ సంస్కార్ ది లైఫ్ స్కూల్ ఆపన్నహస్తం



వారంతా పాఠశాలలో చదివే విద్యార్థులు.. అయితేనేం పేదల పట్ల వారికున్న బాధ్యతను తెలియజేసే ప్రాజెక్టుకు నాంది పలికారు. వీరంతా కలిసి వందలాది మంది ఆకలి తీర్చే ఆపన్న హస్తంలా మారారు. వారే మోతీనగర్‌కు చెందిన సంస్కార్ ది లైఫ్ స్కూల్ విద్యార్థులు. ఫిస్ట్ ఆఫ్ రైస్ పేరుతో చేపట్టిన ప్రాజెక్టు వేలాది కిలోల బియ్యం సేకరణకు చక్కని వేదికైంది. అనాథలకు తోడుగా మహత్తర ఉద్యమంగా మారి పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ఈ క్రమంలో స్కూల్ సీఈఓ మోహనవంశీ, విద్యార్థులు సాక్షితో పంచుకున్న పలు విశేషాలు..
- శ్రీనగర్‌కాలనీ





స్కూల్ విద్యార్థుల సంకల్పమే నాందిగా 2022 అకడమిక్ ఇయర్‌లో తొలుత ఫిస్ట్ ఆఫ్ రైస్ ప్రాజెక్టు ప్రారంభమైంది. స్కూల్ విద్యార్థుల్లో బలంగా ఈ ఉద్యమం 2023 నుండి ఊపందుకుంది. ప్రాజెక్టులో భాగంగా విద్యార్థులు ప్రతిరోజూ స్కూల్‌కు వచ్చేటప్పుడు ఇంటి నుండి పిడికెడు బియ్యాన్ని తీసుకొచ్చి స్కూల్ గేటు వద్ద ఏర్పాటు చేసిన బియ్యం కంటెయినర్‌లో వేస్తారు. ఆ విధంగా సంస్కార్ స్కూల్స్ నుండి నెలకు 600 నుండి 800కిలోలకు పైగా బియ్యాన్ని సేకరిస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని 25, 50కిలోల బ్యాగులుగా తయారు చేస్తారు. అనంతరం పలు భాగాలుగా విభజించి అనాథ శరణాలయాలకు అందిస్తారు. ఒక్కోసారి విద్యార్థులు పిడికెడుతో పాటు అదనంగా పలు సందర్భాల్లో, పుట్టిన రోజు వంటి ప్రత్యేక తేదీల్లో అధిక మొత్తంలో బియ్యాన్ని అందిస్తారు. దీనికి దాతలు కూడా సహకారం అందిస్తున్నారు. రోటరీక్లబ్ ఆఫ్ హైదరాబాద్ లెజెండ్స్ గైడెన్స్‌లో ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ సంస్కార్ స్కూల్ సంయుక్తంగా దీనిని ముందుకు తీసుకెళ్తున్నారు.

- 2024 అకడమిక్‌లో 15వేల కిలోల బియ్యాన్ని సేకరించారు.
- 2025లో 20వేల కిలోల బియ్యాన్ని సేకరణే లక్ష్యంగా ఎంచుకున్నారు.
- ప్రతి యేటా మెజారిటీ బియ్యాన్ని స్పర్శ హాస్పీస్–పలియేటివ్ కేర్ సెంటర్‌కు ఇవ్వనున్నారు.
- రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3150లో యూత్ సర్వీసెస్ కేటగిరీలో ప్రథమ బహుమతి లభించింది. రోటరీ ఇండియా మ్యాగజీన్‌లో ఫిస్ట్ ఆఫ్ రైస్ బెస్ట్ ప్రాజెక్టుగా ప్రచురణ పొందింది.

ఓ మహత్తర ఉద్యమం..

ఫిస్ట్ ఆఫ్ రైస్ ఓ మహత్తర ఉద్యమం. పిడికెడు బియ్యం నినాదంతో సంస్కార్ స్కూల్స్ విద్యార్థుల్లో సేవ చేయాలన్న తపన పెరిగింది. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ లెజెండ్స్ గైడెన్స్‌తో పాటు పలువురు దాతల సహకారం మరువలేనిది. ఈ ఫిస్ట్ ఆఫ్ రైస్ మరికొందరికి ఆదర్శంగా నిలవాలి.
- మోహనవంశీ, సంస్కార్ స్కూల్స్ సీఈఓ



ప్రాజెక్ట్ లక్ష్యాలు..

- విద్యార్థులు చిన్నతనం నుండే సహాయ సహకారాలను అలవర్చుకోవడం.
- సమాజం పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం.
- ప్రజలు, తల్లిదండ్రుల్లో మార్పును తీసుకురావడంతోపాటు ఆకలితో, పేదరికంలో ఉన్నవారికి తోడుగా ఉండటం.
- ఉన్నత విలువలు, భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా, సమాజహితాన్ని కోరే నాయకులుగా తీర్చిదిద్దటం.

ప్రస్తుతం యువతను సోషల్ మీడియా గురించి అడిగితే.. రీల్స్ గురించి, షార్ట్స్ గురించి చెబుతారు.. కానీ అదే సామాజిక మాధ్యమాల్లో ఒకటైన యూట్యూబ్‌ను వినియోగించుకుని గ్రూప్స్‌లో టాపర్‌గా నిలిచింది ఆ యువతి. ప్రతి నిమిషం అదే లక్ష్యంతో ఏకాగ్రతగా నిర్దేశిత ప్రణాళికతో ముందుకు కదిలింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా మూడు ప్రభుత్వ పోటీ పరీక్షల్లో విజయం సాధించింది. ఆమె నగరానికి చెందిన డాక్టర్ వినీషా రెడ్డి.. యూట్యూబ్‌లో పోటీ పరీక్షల క్లాసులు వీక్షిస్తూ రికార్డును సృష్టించింది.. - సాక్షి, సిటీ బ్యూరో

ప్రతి నిమిషం.. అదే లక్ష్యం..



- గ్రూప్స్‌లో టాపర్‌గా వినీషా రెడ్డి
- మొదటి అటెంప్ట్‌లోనే విజయం
- ఇప్పటికి మూడు పరీక్షల్లో ర్యాంకులు
- వైద్య వృత్తిని వదిలి ఐఏఎస్ వైపు
- యూట్యూబ్ క్లాసులతో 'గ్రూప్స్' టాప్

ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్స్ పరీక్షల్లో మహిళా విభాగంలో అత్యధిక మార్కులు సాధించి వరుసగా టాపర్‌గా నిలిచారు వినీషా రెడ్డి. చదివింది వైద్య వృత్తి అయినప్పటికీ తల్లిదండ్రుల మాదిరిగా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. బీహెచ్ఎంఎస్ పూర్తి కాగానే డాక్టర్ ప్రాక్టీస్ వైపు మొగ్గు చూపకుండా 2022 నుంచి పోటీ పరీక్షలపై దృష్టి సారించారు. కోచింగ్ సెంటర్‌కు వెళ్లడం కంటే ఇంట్లోనే కూర్చొని ఆన్‌లైన్ క్లాసుల ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధం అయితే సమయం వృథా కాదని తల్లిదండ్రులు సలహా ఇచ్చారు. చదివిన వైద్య వృత్తితో సంబంధం లేకుండా యూట్యూబ్‌లో సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల టాపర్స్ ఇంటర్వ్యూలను వీక్షించారు. తద్వారా ఓ అంచనాకు వచ్చారు. గ్రూప్స్ నోటిఫికేషన్ వెలువడగానే దరఖాస్తు చేసుకుని యూ ట్యూబ్‌లో క్లాసులను వీక్షించారు. చక్కని ప్రణాళికతో రోజుకు ఎనిమిది గంటలు సమయం కేటాయించి సబ్జెక్టుల వారీగా క్లాసులు వింటూ తన కున్న అనుమానాలను నివృత్తి చేసుకున్నారు.

మొదటి అటెంప్ట్‌లోనే..

అనుకున్న లక్ష్యాన్ని చేరేలా చక్కని ప్రణాళికతో ప్రాక్టీస్ చేసినట్లు డాక్టర్ వినీషా రెడ్డి చెబుతున్నారు. టీజీపీఎస్సీ నిర్వహించిన సీడీపీవో పరీక్షలకు హాజరై స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. గ్రూప్–1లో సైతం అత్యధిక మార్కులు సాధించారు. గ్రూప్–2 మహిళా విభాగంలో టాపర్‌గా నిలిచారు. తాజాగా టీజీపీఎస్సీ గ్రూప్–3 మహిళా విభాగంలోనూ మొత్తం 450 మార్కులకు గానూ 325.157 మార్కులు సాధించారు. 8వ జనరల్ ర్యాంకింగ్‌లో నిలిచారు. సివిల్స్ పరీక్షలతో ఐఏఎస్ కావాలన్నదే తన ముందున్న ఏకైక లక్ష్యమని వినీషారెడ్డి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి రియల్టీ
శనివారం
15-03-2025



1.05 లక్షల కోట్లు!

గతేడాది నగరంలో విక్రయించిన గృహాల విలువ ఇదీ..

సాక్షి, సిటీబ్యూరో: గతేడాది నగరంలో రూ.1.05 లక్షల కోట్ల విలువ చేసే గృహాలు అమ్ముడుపోయాయి. అంతకు క్రితం ఏడాదిలో రూ.1.28 లక్షల కోట్ల విలువైన ఇళ్లతో పోలిస్తే ఇది 18 శాతం తక్కువ. 2024లో దేశంలోని తొమ్మిది ప్రధాన నగరాల్లో విక్రయించిన యూనిట్ల విలువల్లో గ్రేటర్ వాటా 21 శాతంగా ఉందని ప్రాప్ ఈక్విటీ నివేదిక వెల్లడించింది. గతేడాది టాప్-9 నగరాల్లో రూ.6.73 లక్షల కోట్ల విలువ చేసే గృహాలు అమ్ముడుపోయాయి.

- దేశంలోని తొమ్మిది ప్రధాన నగరాల్లో గృహ విక్రయాల విలువలు 12 శాతం మేర పెరిగింది. గతేడాది దేశంలోని 9 ప్రధాన నగరాల్లో 6.73 లక్షల కోట్ల విలువైన గృహాలు అమ్ముడుపోయాయి. అత్యధికంగా ఢిల్లీ-ఎన్సీఆర్‌లో 63 శాతం, ముంబైలో 13 శాతం విక్రయాల విలువ పెరగగా.. హైదరాబాద్‌లో 18 శాతం క్షీణించాయి. గతేడాది నగరంలో గృహాల సప్లయి 25 శాతం, డిమాండ్ 49 శాతం తగ్గాయి. ఫలితంగా అమ్ముడుపోకుండా ఉన్న గృహాలు(ఇన్వెంటరీ) 2023లో 17 నెలలుగా ఉండగా.. 2024 నాటికి 20 నెలలకు పెరిగింది.

ఏడాదిలో రివర్స్..

2023లో ఢిల్లీ-ఎన్సీఆర్, ముంబై, గుర్గావ్‌ల కంటే హైదరాబాద్‌లోనే ఎక్కువ విలువైన గృహాలు అమ్ముడుపోయాయి. ఆ సంవత్సరం నగరంలో రూ.1.28 లక్షల కోట్ల విలువ చేసే ఇళ్లు అమ్ముడుపోగా ముంబైలో రూ.1.22 లక్షల కోట్లు, ఢిల్లీ-ఎన్సీఆర్‌లో.. రూ.94,143 కోట్లు, గుర్గావ్‌లో రూ.64,314 కోట్ల విలువైన ఇళ్లు సేల్ అయ్యాయి. కానీ, గతేడాదికి నాటికి ఈ మూడు నగరాల్లో హైదరాబాద్ కంటే ఎక్కువ విలువైన ఇళ్లు అమ్ముడుపోయాయి. ఢిల్లీ-ఎన్సీఆర్‌లో రూ.1.53 లక్షల కోట్లు, గుర్గావ్‌లో రూ.1.06 లక్షల కోట్లు, ముంబైలో రూ.1.38 లక్షల కోట్లు విలువ చేసే యూనిట్లు అమ్ముడుపోయాయి.

గృహాలు, కార్యాలయ స్థలాలకే కాదు.. గిడ్డంగులకూ నగరంలో ఆదరణ పెరుగుతోంది. నగరంలో గతేడాది 35 లక్షల చ.అ. వేర్‌హౌస్ స్పేస్‌ల లావాదేవీలు జరిగాయి. మరో 1.64 కోట్ల చ.అ. స్థలాలకు డిమాండ్ ఉందని, ఇది 2024లో వార్షిక లావాదేవీలతో పోలిస్తే దాదాపు ఐదు రెట్లు అదనమని నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది. గ్రేటర్‌లో శంషాబాద్, మేడ్చల్, పటాన్‌చెరు క్లస్టర్లు వేర్‌హౌస్‌లకు కేంద్ర బిందువులుగా ఉన్నాయి. గ్రేటర్‌లో గిడ్డంగుల అద్దె నెలకు చ.అ.కు రూ.20.7గా ఉంది. ఏడాది కాలంలో అద్దెలు ఒక శాతం మేర పెరిగాయి. అత్యధికంగా గ్రేడ్-ఏ వేర్‌హౌస్ అద్దెలు పటాన్‌చెరు పారిశ్రామిక క్లస్టర్‌లో రూ.24-28గా ఉంది.

– సాక్షి, సిటీబ్యూరో

వేర్‌హౌస్ స్పేస్‌కు ఆదరణ

గతేడాది 35 లక్షల చ.అ. లావాదేవీలు

- ఇందులో 34 శాతం తయారీ రంగం వాటానే..
- మరో 1.64 కోట్ల చ.అ. స్థలాలకు డిమాండ్
- శంషాబాద్ క్లస్టర్ వేర్‌హౌస్ స్పేస్‌లకు ఆదరణ
- గతేడాది 47 శాతం లావాదేవీలు ఈ జోన్‌లోనే..



గతేడాది లావాదేవీల్లో అత్యధికంగా 34 శాతం తయారీ రంగంలోనే జరిగాయి. పునరుత్పాదక, సస్టైయినబుల్ ఎనర్జీ, ఆటోమోటివ్, ఆటో అనుబంధ పరిశ్రమలు డిమాండ్‌కు చోదకశక్తిగా నిలిచాయి. మేకిన్ ఇండియా, ప్రొడెక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్(పీఎల్ఐ) వంటి ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలతో తయారీ, లాజిస్టిక్ హబ్‌గా హైదరాబాద్ ఆకర్షణగా నిలిచాయి. ఆ తర్వాత 33 శాతం రిటైల్ విభాగంలో లావాదేవీలు జరిగాయి. ఈ-కామర్స్, ఎఫ్ఎంసీజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ విభాగాలు రిటైల్ డిమాండ్‌కు ప్రధాన కారణాలు.

గతేడాది నగరాల వారీగా గిడ్డంగుల లావాదేవీలు(చ.అ., లక్షల్లో)	
ముంబై	1.03 కోట్లు
ఎన్సీఆర్	92
పుణె	86
బెంగళూరు	66
కోల్‌కతా	65
చెన్నై	58
అహ్మదాబాద్	58
హైదరాబాద్	35

శంషాబాద్ హాట్ ఫేవరేట్..

గతేడాది గిడ్డంగుల లావాదేవీలు అత్యధికంగా శంషాబాద్ క్లస్టర్‌లో జరిగాయి. బెంగళూరు-హైదరాబాద్ హైవేకు అనుసంధానమై ఉండటం ఈ క్లస్టర్ అడ్వాంటేజ్. ఈ క్లస్టర్‌లో శంషాబాద్, శ్రీశైలం హైవే, కొంగ్లూరు, కొత్తూరు, షాద్ నగర్ గిడ్డంగులకు ప్రధాన ప్రాంతాలు. విత్తన ప్రాసెసింగ్ యూనిట్, థర్డ్ పార్టీ లాజిస్టిక్ కంపెనీలు(3పీఎల్), ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ వంటి పారిశ్రామిక రంగం ఈ క్లస్టర్ డిమాండ్‌ను ప్రధాన కారణాలు. గతేడాది గ్రేటర్‌లో జరిగిన గిడ్డంగుల లావాదేవీల్లో ఈ క్లస్టర్ వాటా 47 శాతం. ఈ క్లస్టర్‌లో వేర్‌హౌస్ స్థలాలు ఎకరానికి రూ.4-6 కోట్ల మధ్య ఉండగా.. అద్దె చ.అ.కు రూ.18-25 ఉంది.

మేడ్చల్, పటాన్‌చెరుల్లో..

మేడ్చల్, పటాన్‌చెరు క్లస్టర్లలోనూ వేర్‌హౌస్‌లకు డిమాండ్ ఉంది. మేడ్చల్ క్లస్టర్‌లో మేడ్చల్, దేవరయాంజాల్, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, శామీర్‌పేట ప్రాంతాలు హాట్ ఫేవరేట్‌గా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు ఎకరం రూ.3-5 కోట్లు ఉండగా.. అద్దెలు చ.అ.కు రూ.18-24 మధ్య ఉన్నాయి. పటాన్‌చెరు క్లస్టర్‌లో పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం, రుద్రారం, పాశమైలారం, ఏదులనాగులపల్లి, సుల్తాన్‌పూర్ ప్రాంతాలు హాట్ ఫేవరేట్. ఇక్కడ స్థలాల ధరలు రూ.4-7 కోట్ల మధ్య పలుకుతుండగా అద్దె చ.అ.కు రూ.18-28 మధ్య ఉన్నాయి.

డిమాండ్ ఎందుకంటే?

వ్యూహాత్మక స్థానం, అద్భుతమైన కనెక్టివిటీ, పెరుగుతున్న పారిశ్రామిక కార్యకలాపాలు, లాజిస్టిక్స్‌కు హైదరాబాద్ కేంద్ర బిందువుగా అభివృద్ధి చెందింది. వీటికి తోడు మెరుగైన రోడ్లు, రైలు, విమాన నెట్‌వర్క్‌లతో సమర్థవంతమైన రవాణా వ్యవస్థ కలిగి ఉంది. దీంతో ఫార్మాసూటికల్స్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, పునరుత్పాదక ఇంధనం వంటి పరిశ్రమల ద్వారా నగరంలో గిడ్డంగులకు ఆదరణ పెరుగుతుంది. వీటికి తోడు స్థానిక ప్రభుత్వ విధానాలు, ప్రోత్సాహకాలు, మెరుగైన మౌలిక సదుపాయాలతో గిడ్డంగుల విభాగంలో డిమాండ్‌కు మరో కారణం.



ముంబై, ఢిల్లీ-ఎన్సీఆర్‌లలో ఎక్కువగా కనిపించే హైరైజ్ నిర్మాణాలు క్రమంగా హైదరాబాద్‌లోనూ జోరందుకుంటున్నాయి. అత్యంత ఎత్తులో నివాసం ఉండాలని కోరుకునే వాళ్ల సంఖ్య పెరగడం, భవనాల ఎత్తుకు నిబంధనలు లేకపోవడం వంటి కారణాలతో నగరంలో ఆకాశహర్మ్యాలు పెరుగుతున్నాయి. గతేడాది హైదరాబాద్‌లో 10, అంతకంటే ఎత్తయిన హైరైజ్ ప్రాజెక్ట్‌లు 57 ప్రారంభం కాగా.. బెంగళూరులో 51, చెన్నైలో 10 ప్రాజెక్ట్‌లు మొదలయ్యాయి. దక్షిణాది రాష్ట్రాలలోనే భాగ్యనగరం ప్రథమ స్థానంలో నిలిచిందని అనరాక్ రిపోర్ట్ తెలిపింది. హైదరాబాద్‌లో ఏటా సగటున 1,400 అపార్ట్‌మెంట్లు నిర్మాణం చేపడితే అందులో సగటున 200 వరకు ఐదు అంతస్తుల పైన ఉండే బహుళ అంతస్తుల నివాస సముదాయాలుంటాయి. ఇందులో నాలుగో వంతు 10 అంతకంటే ఎక్కువ అంతస్తులపైన ప్రాజెక్ట్‌లుంటాయి. – సాక్షి, సిటీబ్యూరో

- ఆధునిక హంగులతో ఆకాశహర్మ్యాలు
- హైరైజ్ ప్రాజెక్ట్‌లలో నివాసానికి కస్టమర్ల ఆసక్తి
- నగరంలో విలాసవంతమైన గృహాలకు ఆదరణ

దక్షిణాది రాష్ట్రాల్లోనే.. భాగ్యనగరం ప్రథమం

క్రమంగా పెరుగుతున్న అంతస్తులు

ముంబై, ఢిల్లీ-ఎన్సీఆర్‌లలో భూమి లభ్యత తక్కువ కాబట్టి వర్టికల్ నిర్మాణాలు సహజమే. కానీ, హైదరాబాద్‌కు ఆ సమస్య లేదు. ఔటర్ చుట్టుపక్కల కొన్ని వేల ఎకరాలు అందుబాటులో ఉన్నాయి. అయినా ఆకాశహర్మ్యాలు పెరగడానికి కారణం సిటీలోనే ఉండాలని ఎక్కువ మంది కోరుకోవడమేనని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీంతో డెవలపర్లు కూడా స్కై స్క్రాపర్లను నిర్మించేందుకే ఆసక్తి చూపిస్తున్నారు. హైదరాబాద్‌లో ఐదేళ్లలో భూముల ధరలు బాగా పెరిగాయి. ప్రభుత్వమే వీటిని వేలం వేయడంతో ఈ ప్రభావం ధరల పెరుగుదలకు కారణమైందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

వెస్ట్‌లోనే ఎక్కువ..

వెస్ట్ హైదరాబాద్‌లోని హైరైజ్ ప్రాజెక్ట్‌లలో నివసించేందుకు నివాసితులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ఎస్ఏఎస్, బ్రిగేడ్, అపర్ణా, ప్రణీత్ గ్రూప్, పొలోమీ, రాఘవ, మైహోమ్, వాసవి, ఐరా రియాల్టీ, హానర్ వంటి సంస్థలు నగరం నలువైపులా హైరైజ్ ప్రాజెక్ట్‌లను చేపడుతున్నాయి. కోకాపేట వంటి ప్రాంతాల్లో ఎకరా ధర రూ.50 కోట్లకు చేరింది. మరోవైపు అపరిమిత ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్(ఎఫ్ఎస్ఐ)తో ఎన్ని అంతస్తులైనా నిర్మించుకునే వెసులుబాటు ఏర్పడింది. దీంతో ఎకరా రూ.10 కోట్లు ఉన్న చోట పది అంతస్తులు, రూ.20 కోట్లుంటే 20 ఫ్లోర్లు.. ఇలా పెంచుకుంటూ పోతున్నారు. కోకాపేట, రాయదుర్గం, శేరిలింగంపల్లి, మణికొండ, నార్సింగి, గచ్చిబౌలి, గోపన్‌పల్లి, మదీనాగూడ, మియాపూర్, తెల్లాపూర్, పుప్పాల్‌గూడ వంటి పశ్చిమ హైదరాబాద్‌లోనే ఎక్కువగా హైరైజ్ ప్రాజెక్ట్‌లు వస్తున్నాయి.

హోదా, అద్దె ఆదాయం కోసం..

హైరైజ్ అపార్ట్‌మెంట్‌లలో నివాసం ఉండటాన్ని కొనుగోలుదారులు సమాజంలో హోదాగా భావిస్తున్నారు. మెరుగైన రాబడి, అద్దెలు వస్తాయని మంచి పెట్టుబడి సాధనంగా చూస్తున్నారు. ఆయా ప్రాంతాలు ఇప్పటికే అభివృద్ధి చెంది ఉండటం, మెరుగైన రవాణా సదుపాయాలు, దగ్గర్లో విద్యా, వైద్య సదుపాయాలు ఉండటం అన్నింటికీ మించి సకల సౌకర్యాలతో గేటెడ్ కమ్యూనిటీగా తీర్చిదిద్దుతుండటంతో కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆకాశమంత ఎత్తులో అపార్ట్‌మెంట్ ఉంటుంది కాబట్టి వాహనాల ధ్వని, వాయు కాలుష్య సమస్యలూ ఉండవు. ఏకాంతం కోరుకునేవారికి అనువైన గృహాలివే. పైగా ఇంట్లోకి ధారాళమైన గాలి, వెలుతురు, సూర్యరశ్మి వస్తాయి.



ఇలా నియంత్రించాలి..

- ప్రస్తుతం పశ్చిమ హైదరాబాద్‌లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌లు పూర్తయితే అక్కడ జనసాంద్రత, వాహనాల రద్దీ తట్టుకోలేం. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అక్కడ మౌలిక వసతులను కల్పించాలి. వ్యయాలలో ఆయా ప్రాంతాల్లోని నిర్మాణ సంస్థలనూ ఇందులో భాగస్వామ్యం చేయాలి.
- ప్రాజెక్ట్ మొత్తం స్థలంలో 20 శాతంలోపు మాత్రమే నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి. మిగిలిన స్థలాన్ని గ్రీనరీకి, మౌలిక వసతుల కల్పనకు వినియోగించాలి.
- సాధారణ భవన నిర్మాణలతో పోలిస్తే హైరైజ్ భవనాల అనుమతుల జారీలో ప్రత్యేక శ్రద్ధ, నిరంతర తనిఖీ, పర్యవేక్షణ అవసరం. పర్మిషన్ ఫీజులు వస్తున్నాయి కదా అని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా.. భవిష్యత్తులో జరిగే ప్రమాద నష్టాలను ఊహించలేం.
- ప్రతి అంతస్తును ప్రత్యక్షంగా పర్యవేక్షించాలి. పార్కింగ్, డ్రైనేజీ, అగ్ని ప్రమాద నివారణ ఏర్పాట్లు వంటి ఇతరత్రా అంశాలను తనిఖీ చేయాలి.
- హైరైజ్ భవనాలు భూకంపాలు, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నిర్మాణంలో నాణ్యతను పరిశీలించాలి.
- ఇతర మెట్రో నగరాలలో అందుబాటులో ఉన్నంత స్థాయిలో హైదరాబాద్‌లో మెయింటనెన్స్, సపోర్టింగ్ సర్వీసులు అందించే కన్సల్టెన్సీలు అందుబాటులో లేవు. అందుకే కనీసం ఐదేళ్ల పాటు హైరైజ్ భవనాల నిర్వహణ నిర్మాణ సంస్థలే సామాజిక బాధ్యతలా చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. ఎందుకంటే మెయింటనెన్స్‌లలో బిల్డర్లకు ఉన్నంత అనుభవం నివాసిత సంఘాలకు ఉండవు.



ఐదేళ్లుగా సామాన్య, మధ్యతరగతి కొనలేని స్థితికి చేరిన గృహాల ధరలకు ఈ ఏడాది కాస్త బ్రేక్ పడనుంది. ఇది తుది గృహ కొనుగోలుదారులకు ఎంతో మేలు చేకూర్చే విషయం. సామాన్యులు సొంతింటి కలను సాకారం చేసుకునే సమయమిదే.. ఇన్నాళ్లూ పెట్టుబడిదారుల మార్కెట్‌గా ఎదిగిన నగర రియల్టీ క్రమంగా తుది గృహ కొనుగోలుదారుల చేతికి అందిందని ప్రణీత్ గ్రూప్ డైరెక్టర్ నరేంద్ర కుమార్ కామరాజు అన్నారు. – సాక్షి, సిటీబ్యూరో



- మార్కెట్ బాగుండాలంటే.. కావాల్సింది బయ్యర్లే.. ఇన్వెస్టర్లు కాదు!
- ఏడాదిన్నర కాలంగా ప్రతికూలంగా మార్కెట్..
- దీంతో ఈ ఏడాది ప్రాపర్టీ ధరల స్థిరీకరణ
- పెట్టుబడిదారులతో తాత్కాలిక రియల్ బూమ్
- తుది గృహ కొనుగోలుదారులతోనే స్థిరమైన వృద్ధి
- దక్షిణ హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు
- ఆయా ప్రాంతాలలో భూములు, ప్రాపర్టీలకు డిమాండ్

సొంతింటి కల సాకారానికి సమయమిదే..



నరేంద్ర కుమార్ కామరాజు, డైరెక్టర్, ప్రణీత్ గ్రూప్

రియల్ ఎస్టేట్‌లో రెండు విభాగాల కస్టమర్లు ఉంటారు. సొంతంగా తాము ఉండేందుకు ఇంటిని కొనుగోలు చేసే తుది గృహ కొనుగోలుదారులు, లాభాలను ఆశించి ప్రాపర్టీలను కొనుగోలు చేసే పెట్టుబడిదారులు. స్థిరాస్తి పరిశ్రమ స్థిరంగా అభివృద్ధి చెందాలంటే ఎండ్ కస్టమర్లే అవసరం. ఇన్వెస్టర్లతో మార్కెట్‌లో తాత్కాలిక బూమ్ వస్తుందే తప్ప స్థిరమైన వృద్ధి జరగదు. లాభాలు, ఆదాయం కోసం పాకులాడే ఇన్వెస్టర్లతో రాత్రికి రాత్రే ధరలు పెరుగుతాయి. వచ్చే 6-12 నెలల్లో నిర్మాణం పూర్తికానున్న ప్రాజెక్ట్‌లలో ధరలు స్థిరపడ్డాయి. ప్రత్యేకించి సెమీ లగ్జరీ విభాగంలో అపార్ట్‌మెంట్ల ధరలు చదరపు అడుగుకు రూ.8-10 వేలుగా ఉన్నాయి. జీఎస్టీ మినహాయింపు, అద్దె ఒప్పందాలు, ముందస్తు బుకింగ్‌లపై రాయితీలు వంటి వాటితో డెవలపర్లూ అదనపు ఆఫర్లను అందిస్తున్నారు.

ఇన్వెస్టర్లు గాయబ్..

సాధారణంగా హైదరాబాద్ ప్రాపర్టీ విక్రయాలలో 5-20 శాతం వరకు పెట్టుబడిదారుల వాటా ఉంటుంది. కానీ, కరోనా తర్వాత వీరి వాటా 30 శాతానికి మించిపోయింది. నగదు ప్రవాహం పెరగడంతో మార్కెట్‌లో ఒక్కసారిగా రియల్ బూమ్ నెలకొంది. అప్పటి వరకు పశ్చిమ హైదరాబాద్‌లో రూ.1.5 కోట్ల ధరలు ఉండే అపార్ట్‌మెంట్లు.. క్రమంగా రూ.2.5-3.5 కోట్లకు పెరిగాయి. ఇదే సమయంలో ఫ్లాట్ల విస్తీర్ణాలూ పెరిగాయి. డిమాండ్‌కు మించి 2 వేలకు చ.అ.ల కంటే ఎక్కువ విస్తీర్ణమైన అపార్ట్‌మెంట్ల సరఫరా పెరిగింది. ఏడాదిన్నర కాలంగా మార్కెట్ ప్రతికూలంలో ఉండటంతో చాలా వరకు రిటైల్ ఇన్వెస్టర్లు మార్కెట్ నుంచి వెళ్లిపోయారు. దీంతో ఖరీదైన ఇళ్లకు డిమాండ్ తగ్గడంతో ధరలు స్థిరపడ్డాయి. విక్రయాలు లేకపోవడం, నగదు ప్రవాహం తగ్గడం, వడ్డీలు, నిర్వహణ భారం తదితర కారణాలతో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌లలో డెవలపర్లు ధరలు తగ్గించి విక్రయించక తప్పని పరిస్థితి నెలకొంది.

నలువైపులా వృద్ధిపై ఫోకస్..

ఐదేళ్లలో హైదరాబాద్‌లో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ఏ నగరమైనా నలువైపులా సమాంతరంగా అభివృద్ధి చెందాలి. దురదృష్టవశాత్తు అది జరగలేదు. గత ప్రభుత్వం కేవలం పశ్చిమంవైపే దృష్టి పెట్టింది. దీంతో మౌలిక వసతులు, అభివృద్ధి అంతా వెస్ట్‌లోనే కేంద్రీకృతమైపోయింది. దీని ప్రభావం నగరం మూడు దిశల్లో పడే స్థాయికి పరిస్థితి వచ్చిందంటే అర్థం చేసుకోవచ్చు. కనీసం తాజా ప్రభుత్వమైనా నగరం నలువైపులా అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టాలి. ప్రస్తుతం ప్రభుత్వం కేవలం దక్షిణ హైదరాబాద్ మీదనే దృష్టిసారించింది. ఇతర జోన్లలో మార్కెట్ కుంటుపడకుండా ఉండాలంటే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు ఉండాలి. ఎలివేటెడ్ కారిడార్లు, ఔటర్‌లో రేడియల్ రోడ్లు, ఐటీ, ఇండస్ట్రియల్ పార్క్‌ల వంటి అభివృద్ధి పనులను చేపట్టాలి.

రాయితీలతో కల సాకారం..

ఐదేళ్లలో మార్కెట్‌లోకి విపరీతంగా సప్లయి వచ్చింది. దీనికి తగినట్లుగా డిమాండ్ డెవలప్ కాలేదు. సప్లయి తగినట్లు డిమాండ్ ఉండాలంటే ప్రభుత్వం నుంచి సానుకూల విధానాలు, ప్రోత్సాహం, కార్యాచరణ ఉండాలి. గృహ కొనుగోలుదారులను ప్రోత్సహించాలి. ఆదాయ పన్ను మినహాయింపులు, జీఎస్టీని 5 శాతం నుంచి 1 శాతానికి తగ్గించడంతో పాటు స్టాంప్ డ్యూటీలో 1 శాతం రాయితీ అందించాలి. దీంతో ఎక్కువ మంది గృహ కొనుగోలుదారులు ముందుకు వస్తారు. సొంతింటి కలను సాకారం చేసుకుంటారు.

విశాలమైన ఇళ్లకే ప్రాధాన్యం

సాక్షి, సిటీబ్యూరో: ఇంటి డిజైన్ల విషయంలో టేస్ట్ ఎప్పటికప్పుడు మారుతున్నట్లే.. ఇంటీరియర్‌లోనూ ఎన్నో మార్పులు వస్తున్నాయి. గతంలో చిన్న ఇల్లు ఉండాలనే ఆశలతో ఉన్నవారు కరోనా తర్వాతి నుంచి విశాలంగా ఉండే ఇళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆలస్యమైనా సరే.. కాస్త స్పేస్ ఎక్కువ ఉన్న ఇళ్లనే కొనుగోలు చేయాలని అనుకుంటున్నారు. నగరం మధ్యలో ఇరుకు ఇళ్లలో ఉండేకంటే శివారు ప్రాంతాలు, పచ్చదనం ఉండే ప్రాంతాలను ఇష్టపడుతున్నారు. అపార్ట్‌మెంట్లలో అయితే డబుల్, ట్రిబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కొనుగోలు చేస్తున్నారని హౌసింగ్.కామ్ ఇండియన్ రెసిడెన్షియల్ ఇండెక్స్ ఫర్ ఆన్‌లైన్ సెర్చ్(ఐఆర్ఐఎస్) తెలిపింది.

- గతంలో ప్రాపర్టీ కొనాలంటే ధర, వసతులు ప్రధాన అంశాలుగా ఉండేవి. కరోనా తర్వాతి నుంచి వైద్య సదుపాయాలకు ఎంత దూరంలో ఉంది? భద్రత ఎంత? అనే అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా వైద్య సదుపాయాలు, భద్రత, ఓపెన్ స్పేస్ ఎక్కువగా ఉన్న ప్రాజెక్ట్‌లకు డిమాండ్ పెరిగింది. త్రీ బీహెచ్‌కే, ఆపై పడక గదుల గృహాలలో అంతకు క్రితం ఏడాదితో పోలిస్తే 2024లో 15 శాతం వృద్ధి నమోదైందని పేర్కొన్నారు. గతేడాది పెద్ద సైజు ప్లాట్లలో 42 శాతం పెరుగుదల కనిపించింది.

క్లుప్తంగా...

డీఎంకే ప్రాంతీయ సెంటిమెంట్‌ను రెచ్చగొడుతోంది

బీజేపీ నేత కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాల్లో ఎంపీ సీట్లు తగ్గుతాయంటూ డీఎంకే పార్టీ ప్రాంతీయ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మండిపడ్డారు. డీఎంకే ముసుగులో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ లున్నాయని, దక్షిణాదిలో బీజేపీ బలపడటం చూసి ఈ పార్టీలు భయపడుతున్నాయన్నారు. శుక్రవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అనేది రాజ్యాంగబద్ధ ప్రక్రియ అని, దీనికి కూడా రాజకీయాలు అంటగడతారా? అని ప్రశ్నించారు. డీఎంకే ఆధ్వర్యంలో జరగనున్న అఖిలపక్ష భేటీకి సీఎం రేవంత్‌రెడ్డి, కేటీఆర్ పోటీ పడి హాజరయ్యేందుకు సిద్ధమయ్యారన్నారు. కాంగ్రెస్ హామీలపై నిలదీయాల్సిన బీఆర్ఎస్.. అఖిలపక్షానికి ఆ పార్టీతోనే కలిసి హాజరు కావడం ఏంటని లక్ష్మణ్ ప్రశ్నించారు. బ్రిటిష్ నినాదం విభజించు–పాలించును కాంగ్రెస్ అనుసరిస్తోందన్నారు. గతంలో కాంగ్రెస్ బలవంతపు కుటుంబ నియంత్రణ చేపట్టిందని, జనాభా తగ్గదలపై ఆ పార్టీకి మాట్లాడే అర్హత లేదన్నారు. డీలిమిటేషన్‌తో ఎస్సీ, ఎస్టీలకు సీట్లు పెరుగుతాయని, మహిళలకు 33 శాతం సీట్లు దక్కుతాయని లక్ష్మణ్ చెప్పారు.

21న గౌడ సంఘాల 'చలో జనగామ'



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలన్న డిమాండ్‌తో మార్చి 21న జనగామ చౌరస్తాలో గౌడ సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో 'చలో జనగామ'నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక్కరోజు దీక్ష పోస్టర్‌ను శ్రీనివాస్ గౌడ్ హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని నీరా కేఫ్‌లో ఆవిష్కరించారు.

ముస్సోరీ శిక్షణకు 23 మంది ఐఏఎస్‌లు

మే 5 నుంచి జూన్ 13 వరకు..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సర్వీస్ నుంచి ఐఏఎస్‌లుగా పదోన్నతి పొందిన 23 మంది అధికారులు.. మే 5 నుంచి జూన్ 13 వరకు ముస్సోరిలో శిక్షణ కోసం వెళ్లనున్నారు. ఐఏఎస్‌లుగా పదోన్నతి పొందిన తరువాత విధిగా వారు శిక్షణ పొందాల్సి ఉన్నప్పటికీ.. వివిధ కారణాలతో వాయిదా వేస్తూ వచ్చారు. ఈసారి తప్పనిసరిగా శిక్షణకు రావాలని కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం సంయుక్త కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. శిక్షణకు వెళ్లనున్న ఐఏఎస్ అధికారుల్లో కొర్ర లక్ష్మి, శివలింగయ్య, చిట్టెం లక్ష్మి, అమోయకుమార్, హనుమంతరావు, ఎం.హరిత, టి.వినయకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, అయేషా మస్రత ఖానం, జి.రవి, కె.నిఖిల, కె.స్నేహ, సత్యశారదాదేవి, నారాయణరెడ్డి, హరీశ్, సంగీత సత్యనారాయణ, వెంకట్రావు, యాస్మిన్ బాషా, నిర్మల కాంతి వెస్లీ, జె.అరుణశ్రీ, కాత్యాయని దేవి, ఫణీంద్ర రెడ్డి, కె.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

40 ఏళ్ల టీడీపీని నిలబెట్టాం

జనసేన 12వ ఆవిర్భావ సభలో పవన్ కల్యాణ్



సాక్షి ప్రతినిధి, కాకినాడ: మొన్నటి ఎన్నికల్లో మనం నిలబడ్డంతో పాటు 40 ఏళ్ల చరిత్ర కలిగిన టీడీపీని కూడా నిలబెట్టామని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం సమీపంలోని చిత్రాడలో శుక్రవారం రాత్రి జరిగిన ఆ పార్టీ 12వ ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని ఛాలెంజ్ చేశారని, 21 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో, ఇద్దరు ఎంపీలతో పార్లమెంట్‌లో అడుగు పెట్టామన్నారు. దేశమంతా మనవైపు చూసేలా 100 శాతం స్ట్రైక్ రేట్‌తో గెలిచామని చెప్పారు. తాను రాజకీయాల్లోకి వచ్చేందుకు సినిమా ఉపకరణం మాత్రమేనని, ఖుషీ సినిమా చూసి గద్దరన్న తనను ప్రోత్సహిస్తే, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీపతి రాముడు ఎంతో ప్రభావితం చేశారన్నారు. సగటు మధ్య తరగతి మనిషిగా బతకడమే తన కోరిక అని చెప్పారు. చంటి సినిమాలో మీనాను పెంచినట్టు తనను పెంచారని, అలాంటి తాను సినిమాలు చేస్తానని.. రాజకీయాల్లోకి వస్తానని ఎవరూ ఊహించి ఉండరన్నారు. జనసేన విజయానికి ఏడు సిద్ధాంతాలే కారణమని, ఎంతో ఆలోచించి వీటిని రూపొందించామని పవన్ కళ్యాణ్ తెలిపారు. సనాతన ధర్మం తన రక్తంలోనే ఉందని, దానిని నిరూపించుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. హైదరాబాద్‌లో పోలీసులు 15 నిమిషాలు కళ్లు మూసుకుంటే హిందువులకు తమ సత్తా చూపుతామని ఒక నాయకుడు వ్యాఖ్యానించడం దారుణం అని మండిపడ్డారు.



ఫైర్ లేని వాల్స్!

- హ్యాకర్ల దాడులకు గురైన దేశాల్లో మొదటిస్థానంలో భారత్
- ప్రపంచవ్యాప్త దాడుల్లో 13% ఇండియాలోనే..
- విద్యాసంస్థలు, ప్రభుత్వరంగ, ఆర్థికసేవల నెట్‌వర్క్‌లే లక్ష్యంగా..
- హైటెక్ క్రైమ్ ట్రెండ్స్ రిపోర్ట్ 2025లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రతీ రంగంలో సాంకేతికత అత్యంత కీలకంగా మారింది. అదేస్థాయిలో సైబర్ దాడుల ముప్పు పొంచి ఉంటోంది. ఏదైనా సంస్థ నెట్‌వర్క్‌ను భద్రంగా ఉంచేందుకు పటిష్టమైన ఫైర్‌వాల్ రక్షణ వ్యవస్థ తప్పనిసరి. అయితే, హ్యాకర్ల దాడుల విషయంలో భారతీయ కంపెనీలకు చెందిన నెట్‌వర్క్‌లు బలహీనమని గ్రూప్–ఐబీ సంస్థ ఇటీవల విడుదల చేసిన హైటెక్ క్రైం ట్రెండ్స్ రిపోర్ట్–2025లో వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా 2024లో జరిగిన సైబర్ దాడుల్లో అత్యధికంగా 13 శాతం ఘటనలు భారత్‌లోనే జరిగినట్టు ఆ నివేదిక స్పష్టంచేసింది. ప్రధానంగా విద్యాసంస్థలకు సంబంధించిన నెట్‌వర్క్‌లపైనే హ్యాకర్లు దాడులకు పాల్పడుతున్నట్లు వెల్లడించింది. ఆ తర్వాత ప్రభుత్వరంగ సంస్థల నెట్‌వర్క్, మిలిటరీ, ఆర్థికసేవల సంస్థల నెట్‌వర్క్‌లు హ్యాకర్లకు లక్ష్యంగా మారుతున్నాయని పేర్కొంది. హ్యాకర్లు ఫైర్‌వాల్స్‌ను ఛేదించి సదరు నెట్‌వర్క్‌లోకి చొరబడి మొత్తం వ్యవస్థను తమ అధీనంలోకి తీసుకుని సున్నితమైన సమాచారాన్ని తస్కరిస్తున్నట్టు తెలిపింది.

డేటా లీకేజీలో అమెరికాది తొలిస్థానం

పబ్లిక్ డొమైన్‌లో ఉండే డేటా లీకేజీలో అమెరికా తొలిస్థానంలో ఉన్నట్టు నివేదిక తెలిపింది. 2024లో ఈ తరహా ఘటనలు అమెరికాలో 214 నమోదైనట్టు పేర్కొంది. తర్వాత స్థానంలో రష్యా (195 ఘటనలు) ఉండగా.. భారత్ 60 ఘటనలతో మూడో స్థానంలో నిలిచినట్టు గ్రూప్–ఐబీ నివేదిక పేర్కొంది. ప్రధానంగా ఈ–మెయిల్ అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లు ఈ డేటా లీకేజీలో ఉంటున్నాయి. 2024లో కేవలం ఈ–మెయిల్ అడ్రస్‌లు, పాస్‌వర్డ్‌లను డార్క్‌వెబ్‌లో విక్రయించడం ద్వారానే సైబర్ నేరగాళ్లు రూ.248.9 కోట్లు కొల్లగొట్టినట్టు నివేదిక పేర్కొంది.


ఫైర్‌వాల్స్ అంటే?

అనధికారికంగా నెట్‌వర్క్‌లోకి చొరబడకుండా, హానికరమైన డేటాను నెట్‌వర్క్‌లోకి చొప్పించకుండా రక్షించే భద్రతా పరికరమే ఫైర్‌వాల్. ఇది హార్డ్‌వేర్ లేదా సాఫ్ట్‌వేర్ కావొచ్చు. నెట్‌వర్క్ ప్యాకెట్‌లను పరిశీలించి వాటిని అనుమతించాలా లేదా నిరోధించాలా అనేదాన్ని ఫైర్‌వాల్ నిర్ణయిస్తుంది. ఫైర్‌వాల్స్ ఇంటర్నెట్ ద్వారా కంప్యూటర్ లేదా నెట్‌వర్క్‌ను యాక్సెస్ చేయకుండా హానికరమైన సాఫ్ట్‌వేర్‌ను నిరోధించగలవు.

2024లో అత్యధికంగా హ్యాకింగ్‌కు గురైన దేశాలివీ.. (దాడుల శాతం)	
భారత్	13
ఇజ్రాయెల్	7
రష్యా	4
ఇండోనేషియా	3.5
ఉక్రెయిన్	3.5



2024లో డార్క్‌వెబ్‌లో విక్రయించిన ఘటనలు ఎక్కువగా నమోదైన దేశాలు	
అమెరికా	214
రష్యా	195
భారత్	60
ఇండోనేషియా	29
బ్రెజిల్	27
ఫ్రాన్స్	27



మెడికల్ బిల్ ఎప్పుడొస్తదో

- డీఎంఈలో పేరుకుపోయిన మెడికల్ బిల్లులు
- 2024లో డీఎంఈకి వచ్చిన బిల్లులు 67 వేలు
- క్లియరెన్స్ కోసం నెలలుగా ఎదురుచూస్తున్న ఉద్యోగులు
- బిల్లుల క్లియరెన్స్‌లో వేగం పెంచాం: డీఎంఈ నరేంద్ర కుమార్

సాక్షి, హైదరాబాద్:

ప్రభుత్వ ఉద్యోగులు మెడికల్ బిల్లుల కోసం పడిగాపులు పడుతున్నారు. వైద్యం కోసం ఆసుపత్రుల్లో ముందుగానే చెల్లించిన బిల్లులను రీయింబర్స్‌మెంట్ ద్వారా తిరిగి పొందేందుకు నెలల తరబడి హైదరాబాద్‌కు తిరుగుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కలిసి 25 లక్షల నుంచి 30 లక్షల వరకు ఉన్నారు. వీరు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటే.. వారు చెల్లించిన బిల్లులను ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది. రూ.50 వేల లోపు బిల్లులైతే జిల్లా స్థాయిలోనే రీయింబర్స్‌మెంట్ ప్రక్రియ పూర్తవుతుంది. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల లోపు బిల్లు అయితే డీఎంఈ కార్యాలయం స్క్రూటినీ చేసి ప్రభుత్వానికి పంపిస్తుంది. ఆర్థిక శాఖ లేదా పే అండ్ అకౌంట్స్ విభాగం ద్వారా ఆ బిల్లులు రీయింబర్స్‌మెంట్ జరుగుతాయి. రూ.2 లక్షలు పైబడిన బిల్లులయితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ పరిశీలించి, చికిత్సకు అయిన ఖర్చులో ఎంత ఇవ్వాలో నిర్ణయిస్తుంది.

నెలకు 5 వేలకు పైనే..

రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలకు చెందిన ఉద్యోగుల నుంచి రూ.50 వేల పైబడి రూ.2 లక్షల లోపు బిల్లులు ఏటా 60 వేల నుంచి 70 వేల వరకు డీఎంఈ కార్యాలయానికి వస్తుంటాయి. 2024లో 67 వేల బిల్లులు వచ్చాయి. అంటే సగటున నెలకు 5,500 బిల్లులు. వీటిని ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలంటే రోజుకు కనీసం 200 బిల్లులు స్క్రూటినీ చేయాల్సి ఉంటుంది. అయితే డీఎంఈ కార్యాలయంలో సంవత్సర కాలంగా బిల్లుల క్లియరెన్స్ చాలా నెమ్మదించిందన్న విమర్శలు ఉన్నాయి. చాలావరకు కొర్రీలు పెట్టి వెనక్కి పంపారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గత ఏడాదికి సంబంధించిన బిల్లులే ఇంకా వేల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. డీఎంఈ కార్యాలయంలోనే ఒక బిల్లు స్క్రూటినీ పూర్తి కావడానికి ఐదారు నెలలు పడుతుందని, అక్కడి నుంచి ఆర్థిక శాఖకు, పే అండ్ అకౌంట్స్ ఆఫీసుకు వెళ్లి రీయింబర్స్ కావాలంటే కనీసం ఏడాది పడుతోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని పత్రాలు పరిశీలించాల్సిందే..

డీఎంఈకి వచ్చే బిల్లులకు సంబంధించి అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లు అందజేయాల్సి ఉంటుంది. డిశ్చార్జి సమ్మరీ, ఎసెన్షియాలిటీ సర్టిఫికెట్, ఎమర్జెన్సీ అడ్మిషన్ సర్టిఫికెట్, డిక్లరేషన్ సర్టిఫికెట్, నాన్ డ్రాన్ సర్టిఫికెట్, హాస్పిటల్ రికగ్నిషన్ లిస్ట్‌తోపాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు ఉండాలి. వాటిని డీఎంఈ కార్యాలయంలోని సిబ్బంది చెక్ చేస్తే, జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారి ద్వారా క్లియర్ అవుతాయి.

సిబ్బంది కొరతతో ఆలస్యం

డీఎంఈ కార్యాలయంలో మెడికల్ బిల్లుల స్క్రూటినీకి సిబ్బంది కొరత ఉందని చెబుతున్నారు. ఇద్దరు చొప్పున ఉన్న సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఓ సూపరింటెండెంట్ ద్వారానే బిల్లుల స్క్రూటినీ జరుగుతోంది. ఇటీవల కొత్తగా డీఎంఈ, జాయింట్ డైరెక్టర్లు బాధ్యతలు చేపట్టిన తరువాత చెక్‌లిస్ట్ విషయంలో మార్పులు చేసి, వేగంగా మెడికల్ బిల్లులు డిస్పోజ్ చేస్తున్నట్లు తెలిసింది. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ సాధ్యం కావడం లేదు. బిల్లులను ఉద్యోగి మాతృశాఖ నుంచే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా డీఎంఈతో ప్రభుత్వ శాఖలన్నీ ఆన్‌లైన్‌లో అనుసంధానమైతే తప్ప వీలుకాని పరిస్థితి ఉంది. ప్రస్తుతం డీఎంఈకి 34 మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ ఆసుపత్రులు, నర్సింగ్ కళాశాలలు, హైదరాబాద్‌లోని స్పెషాలిటీ ఆసుపత్రుల పర్యవేక్షణ వంటి కీలక బాధ్యతలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల స్క్రూటినీకి సిబ్బంది పెరగాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

స్క్రూటినీ వేగం పెరిగింది

బిల్లుల స్క్రూటినీపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. ప్రతిరోజు వందలాది బిల్లులు వస్తుండడంతో వాటిని క్షుణ్ణంగా పరిశీలించి క్లియర్ చేయడంలో ఆలస్యం జరిగింది. ఇప్పుడు దాన్ని అధిగమించాం. అదనపు సిబ్బంది కోసం ప్రభుత్వానికి లేఖ రాశాం. కొత్త బడ్జెట్ తరువాత సిబ్బంది వస్తారు. ఎప్పటికప్పుడు బిల్లుల స్క్రూటినీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

– నరేంద్ర కుమార్, డీఎంఈ



మహేశ్వర్‌రెడ్డి ముందు బీజేపీ హామీల గురించి మాట్లాడాలి

భువనగిరి ఎంపీ చామల

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి పాలన చేతకాకపోతే రాజీనామా చేసి ప్రజాతీర్పు కోరాలంటూ బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్రంలో గత 11 ఏళ్లుగా బీజేపీకి పాలన చేయడం చేతకావట్లేదని, దానికి ముందు మహేశ్వర్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశా రు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహేశ్వర్‌రెడ్డి అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నారన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు, ప్రతివ్యక్తి అకౌంట్‌లో రూ.15 లక్షల జమ హామీలు ఏమయ్యాయని, 11 ఏళ్లుగా తెలంగాణ ప్రజలకు రావాల్సిన ఈ రెండింటి వాటా గురించి ఏలేటి మాట్లాడాలని సూచించారు. కార్పొరేట్లకు రుణమాఫీ చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని కేంద్రం నుంచి తెలంగాణకు హక్కుగా రావాల్సిన నిధు లు ఇవ్వకపోతే ప్రజలు బీజేపీని చెప్పుతో కొడతారన్న విషయాన్ని మర్చిపోవద్దని అన్నారు.

అసెంబ్లీని కౌరవ సభగా మార్చిన కాంగ్రెస్

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీని కాంగ్రెస్ పార్టీ కౌరవ సభగా మార్చిందని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. చట్టసభలు, స్పీకర్, దళితులు అంటే బీఆర్ఎస్ పార్టీకి గౌరవమని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పీకర్‌ను జగదీశ్‌రెడ్డి అవమానించలేదని, జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేసి ప్రజా సమస్యలపై చర్చించాలని, అసెంబ్లీ సమయాన్ని వృథా చేయొద్దని హితవు పలికారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరినీ సస్పెండ్ చేసి సభ నడుపుకుంటారా? అని శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. సీఎం రేవంత్ చేసిన మార్చురీ వ్యాఖ్యలు అత్యంత హేయనీయమైనవని, సీఎం వెంటనే వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలన్నారు.

బీజేపీలో రాజాసింగ్ రచ్చ

పార్టీ ముఖ్య నేతలను టార్గెట్ చేస్తూ వ్యాఖ్యలు

- పాతసామాను బయటకు పంపితేనే.. పార్టీకి భవిష్యత్ అంటూ పరోక్షంగా తీవ్ర విమర్శలు
- కొంతకాలంగా వివాదాస్పదంగా మారిన గోషామహల్ ఎమ్మెల్యే తీరు

సాక్షి, హైదరాబాద్ : బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో తీవ్ర కలకలానికి దారితీశాయి. బీజేపీ ముఖ్యనేతలు రాష్ట్రంలో అధికారంలో ఏ ప్రభుత్వం ఉంటే.. ఆ ప్రభుత్వంతో రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారంటూ తాజాగా రాజాసింగ్ పేల్చిన బాంబు ప్రకంపనలు సృష్టిస్తోంది. బీజేపీలో కమిట్‌మెంట్ ఉన్న నాయకులనే 'పాత సామాను'గా పోల్చుతూ వారిని బయటపడేయకపోతే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం కష్టం అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాను ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశానన్న దానిపై రాజాసింగ్ సూటిగా సమాధానం ఇవ్వకపోగా, అసలు దీనికి సంబంధించి ప్రత్యక్షంగా మీడియాకు ఎలాంటి బైట్ విడుదల చేయకపోవడం విశేషం. అయితే వాట్సాప్ టెక్ట్స్ రూపంలో మీడియా ప్రతినిధులకు పంపించి తన వ్యాఖ్యలకు విస్తృత ప్రచారం కల్పించేలా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఇవీ రాజాసింగ్ పంపించిన సంక్షిప్త సందేశాలు

'తెలంగాణలో హిందువులు సురక్షితంగా ఉండాలంటే రాష్ట్రంలో బీజేపీ గవర్నమెంట్ రావాలి. ఇది జరగాలంటే పార్టీలోని పాత సామాను బయటకు వెళ్లాలి. జాతీయనాయకత్వం దీనిపై ఆలోచించాలి. తెలంగాణలో ఏ ప్రభుత్వం వస్తే ఆ గవర్నమెంట్‌తో రహస్య సమావేశాలు పెట్టుకుంటారు. అలాంటి మీటింగ్‌లు పెట్టుకుంటే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుందా ? పార్టీ జాతీయ నేతలు ఈ విషయాన్ని గమనించాలి. ఇది నా పార్టీ.. నా అయ్య పార్టీ అనేవారు తెలంగాణలో చాలామంది ఉన్నారు. వారిని రిటైర్ చేయిస్తేనే బీజేపీలో మంచిరోజులు వస్తాయి. ఈ విషయాన్ని తానే కాదు ప్రతీ ఒక్క సీనియర్ నాయకుడు, కార్యకర్త ఇలానే భావిస్తున్నారు'అని పేర్కొన్నారు.



సస్పెండ్ చేస్తారా ?

కొంతకాలంగా వివాదాస్పదంగా మారిన రాజాసింగ్ తీరుతో పార్టీ నాయకత్వం కూడా ఆచితూచి స్పందిస్తోంది. కఠోర హిందుత్వవాదిగా ముద్రపడిన ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తే, అది పార్టీ అభిమానుల్లోనూ ప్రతికూలతకు దారితీయొచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే గతం నుంచి వివిధ సందర్భాల్లో రాజాసింగ్ ఇదే ధోరణితో వ్యాఖ్యలు చేశారని, తాజాగా చేసిన విమర్శలనూ పట్టించుకోకపోవడమే మంచిదని భావిస్తున్నట్టు ఓ ముఖ్యనేత 'సాక్షి'కి వెల్లడించారు. అయితే రాజాసింగ్ విమర్శలు, ఆరోపణలకే పరిమితం కాకుండా...పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం లేదని, ముఖ్యమైన సమావేశాలకు హాజరుకావడం లేదని, ఆయన ప్రతికూలతను పరిగణనలోకి తీసుకోవాలని మరోనేత చెబుతున్నారు. గతంలో మతపరమైన వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో రాజాసింగ్‌ను బీజేపీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు సస్పెన్షన్ ఎత్తేయడంతో మళ్లీ పోటీచేసి మూడోసారి గెలిచారు. గతనెలలో పార్టీ సంస్థాగత ఎన్నికల సందర్భంగా తాను సూచించిన వారిని గోల్కొండ జిల్లా (హైదరాబాద్ 4 శాఖల్లో ఒకటి) అధ్యక్షుడిగా నియమించకపోవడం పట్ల రాజాసింగ్ తీవ్ర విమర్శలు చేశారు. 2014లో పార్టీలో చేరిన నాటినుంచి వేధింపులు తట్టుకోలేక పోతున్నాని, పార్టీకి తన అవసరం లేదంటే బయటకు వెళ్లేందుకు కూడా సిద్ధమేనన్నారు. తాను ఇప్పటిదాకా బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్‌లతో పోరాడుతున్నానని, ఇప్పుడు సొంతపార్టీలోనే యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. జీవితంలో తాను ధర్మ ప్రచారం, ధర్మయుద్ధం నేర్చుకున్నానని, కొందరిలా బ్రోకరిజం నేర్చుకోలేదని చెప్పారు. వారి కారణంగా పార్టీ ప్రస్తుతం వెనుకబడిందని, రాష్ట్రంలో ఎప్పుడో బీజేపీ ప్రభుత్వం రావాల్సి ఉండగా, ఇలాంటి రిటైరైన వ్యక్తులతో ఎప్పటికీ అధికారంలోకి రాదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే దీనిపై పార్టీ నాయకత్వంగానీ, ముఖ్యనేతలుగానీ స్పందించలేదు. మొత్తంగా రాజాసింగ్ వ్యవహారశైలి ఎవరికీ కొరుకుడు పడటం లేదు. ఆయన విషయంలో ఎలా వ్యవహరించాలనే దానిపైనా స్పష్టత లేక తర్జనభర్జన పడుతున్నారు.



శుక్రవారం రాజ్‌భవన్‌లో చిన్నారులతో హోలీ జరుపుకుంటున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



విద్యార్థిగా ఉన్న సమయంలో తన మిత్రులతో హోలీ పండుగ జరుపుకున్న సీఎం రేవంత్‌రెడ్డి. ఈ ఫొటోను సీఎంఓ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

తెలుగు యూనివర్సిటీ పేరు 'సురవరం ప్రతాప్‌రెడ్డి' వర్సిటీ

నేడు అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల రెండో రోజు శనివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రతిపాదనకు సంబంధించిన చర్చ ముగియనుంది. ధన్యవాదాలు తెలిపే ప్రతిపాదనపై జరిగిన చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం ఇస్తారు. ఈనెల 12న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అసెంబ్లీ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రతిపాదనపై గురువారం చర్చ ప్రారంభమైంది. శుక్రవారం హోలీ పండుగ నేపథ్యంలో సమావేశానికి ఒక రోజు విరామం ప్రకటించారు. తిరిగి శనివారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైన తర్వాత చర్చ కొనసాగి సీఎం సమాధానంతో ముగుస్తుంది. కాగా, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం సవరణ బిల్లు (2025)ను ప్రవేశ పెట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి సభ అనుమతి కోసం ప్రతిపాదిస్తారు. ఈ సవరణ బిల్లులో ప్రధానంగా యూనివర్సిటీ పేరు మార్పు ఉన్నట్లు సమాచారం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వ విద్యాలయంగా మార్చాలని ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించింది. ఇప్పుడు ఈ సవరణ బిల్లు దానికి సంబంధించినదే అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా, శాసనమండలిలోనూ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రతిపాదనపై చర్చ కొనసాగుతుంది.

కొత్త 'విద్యుత్' డైరెక్టర్లు ఏరీ?

- ప్రస్తుత డైరెక్టర్ల నియామకం అక్రమమని గతేడాది జనవరిలోనే జీవో
- ఏడాది దాటినా మొదలవని కొత్తవారి నియామక ప్రక్రియ
- అంతులేని జాప్యంతో అభ్యర్థుల్లో తీవ్ర అనుమానాలు
- దళారుల రంగప్రవేశం.. ఒక్కో పోస్టుకు రూ. కోట్లలో డిమాండ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో కొత్త డైరెక్టర్ల నియామకం విషయంలో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. కొత్తవారి నియామకానికి సంబంధించి గతేడాది జనవరి 29న ప్రకటన జారీ చేసి దరఖాస్తులు స్వీకరించిన విద్యుత్ సంస్థల యాజమాన్యాలు.. ఏడాది గడిచినా ఇంకా నియామకాల ప్రక్రియను చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఓవైపు ఆశావహులు పైరవీలు చేసుకుంటుండగా మరో వైపు దళారులు డైరెక్టర్ పోస్టులు ఇప్పిస్తామని రూ. కోట్లలో డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో డైరెక్టర్ పోస్టు రూ. కోట్లలో పలుకుతోందని విద్యుత్‌సౌధ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. అన్ని విద్యుత్ సంస్థల్లోని వివిధ డైరెక్టర్ పోస్టులకు కలిపి సుమారు 150 దరఖాస్తులు రాగా వాటిపై నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వం ఏడాదికిపైగా సమయం తీసుకోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొనే కొందరు దళారులు బేరాలు ప్రారంభించారన్న చర్చ జరుగుతోంది. డైరెక్టర్ల నియామకంపై ఉన్నతస్థాయి నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తే వారంలోగా ప్రక్రియ పూర్తవుతుందని ఇంధన శాఖ వర్గాలు తెలిపాయి.

ఈఆర్సీ ముందు అభ్యంతరం వ్యక్తం చేసినా...

తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) డైరెక్టర్లందరితోపాటు తెలంగాణ విద్యుత్ సరఫరా సంస్థ (ట్రాన్స్‌కో) జేఎండీ, డైరెక్టర్ల నియామకంలో నిబంధనలు పాటించలేదంటూ గతేడాది జనవరి 27న రాష్ట్ర ఇంధనశాఖ ఉత్తర్వులు (జీవో ఆర్టీ నం.3) జారీ చేసింది. జేఎండీ సహా ట్రాన్స్‌కోలోని ఐదుగురు డైరెక్టర్లు, జెన్‌కోలోని ఆరుగురు డైరెక్టర్ల నియామకంలో జీవోలు 18, 45 ప్రకారం మార్గదర్శకాలను పాటించలేదని, వారి నియామకం అక్రమమని ఆ ఉత్తర్వుల్లో ఇంధన శాఖ స్పష్టం చేసింది. దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా నియమితులయ్యారనే కారణంతో ఒకేసారి 11 మంది డైరెక్టర్లకు అదేరోజు ఉద్వాసన పలికింది. వారి స్థానంలో చీఫ్ ఇంజనీర్లు/సీజీఎంలను ఇన్‌చార్జ్ డైరెక్టర్లుగా నియమించింది. జెన్‌కో, ట్రాన్స్‌కోలో మాత్రం కొత్త డైరెక్టర్ల నియామకం పూర్తయ్యే వరకు ప్రస్తుత డైరెక్టర్లనే కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా నియమితులైన డైరెక్టర్ల స్థానంలో కొత్త వారి నియామకానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల సీఎండీని ఆదేశించింది. అయితే ఉత్తర్వులు జారీ చేసి ఏడాది గడిచినా జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల్లో ఇంకా ఆ డైరెక్టర్లనే రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తోంది. ప్రభుత్వ పెద్దలు చెప్పే ప్రతి మాటకు తలూపుతుండడంతోనే వారిని కొనసాగిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. విద్యుత్ టారిఫ్ ప్రతిపాదనలపై గతేడాది విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) నిర్వహించిన బహిరంగ విచారణలో ప్రస్తుత డైరెక్టర్లు పాల్గొని సమాధానాలివ్వడంపై పలువురు విద్యుత్‌రంగ నిపుణులు అభ్యంతరం తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం గమనార్హం.



ఆమె పేరు వసుంధర.. విధి పెట్టిన అన్ని పరీక్షల్లో నెగ్గింది.. వీల్ చెయిర్‌తోనే విజయానికి అడుగులు వేసింది! మాతృత్వాన్నీ సాధించింది! డేరెస్ట్ ఉమన్‌గా మన్ననలు అందుకుంటున్నారు హైదరాబాద్‌కు చెందిన వసుంధర. ఈ విజేత గురించి ఆమె మాటల్లోనే..

భర్త నరేందర్, బాబుతో వసుంధర

వీల్ పవర్

'మన దగ్గర ఫిజికల్లీ చాలెంజ్డ్ వాళ్లకు అనువైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇప్పటికీ లేదు. అంటే నా చిన్నప్పటి పరిస్థితి ఊహించుకోండి.. ర్యాంప్స్, సపరేట్ వాష్ రూమ్స్ అనే ఊసే ఉండేది కాదు. ఫిజికల్లీ చాలెంజ్డ్ పిల్లలు చదువుకోవాలన్నా.. ఏదైనా యాక్టివిటీ నేర్చుకోవాలన్నా వాళ్లతో ఒక మనిషి ఉండాల్సిందే పనులన్నీ మానుకొని! అందుకే సాధారణంగా దిగువ, మధ్యతరగతి కుటుంబాల్లో వైకల్యం ఉన్న పిల్లలను ఇంట్లోనే ఉంచేస్తారు. కానీ నన్ను మా అమ్మ చదివించింది. ఆవిడ సింగిల్ పేరెంట్. పెద్దగా చదువుకోలేదు. కానీ బ్రహ్మాండమైన లీడర్‌షిప్ క్వాలిటీస్‌తో నెగ్గుకొచ్చింది. టైలరింగ్ చేసేది అమ్మ. వీల్ చెయిర్ కొనేంత స్తోమత లేదు. అయినా నా చదువు విషయంలో వెనకడుగు వేయలేదు. స్కూల్‌కి, కాలేజీకి తమ్ముడే నన్ను ఎత్తుకుని తీసుకెళ్లేవాడు. కాలేజీలో క్లాసెస్ మారాల్సి వచ్చినప్పుడు ఫ్రెండ్స్ హెల్ప్ చేసేవారు.

కలాం గారిని అడిగాను కానీ...

నేను సీఏ చదువుతున్నప్పుడు అబ్దుల్ కలాం గారిని కలిశాను. ఫిజికల్లీ చాలెంజ్డ్ పర్సన్స్ నడుపుకోగలిగే వెహికిల్స్‌ని సమకూర్చొచ్చు కదా అని అడిగాను. అడిగాక ఆలోచించాను.. వాళ్లకోసం నేను కూడా ఏమైనా చేయొచ్చు కదా.. మాకున్న సమస్యల గురించి మనమే పోరాడాలి.. ఒకరికొకరం సపోర్ట్ చేసుకోవాలనిపించింది. అది మీడియాలో ఉంటేనే సాధ్యమవుతుందని గ్రహించాను. దాంతో సీఏ డ్రాప్ అయిపోయి, పీజీ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం చదివాను.

చాలా నేర్చుకున్నాను..

జర్నలిస్ట్‌గా నా పయనాన్ని ఆరంభించాను. చాలెంజింగ్‌గా ఉండిందా జాబ్. నేనొక డిజేబుల్డ్ పర్సన్‌ని అన్న విషయమే మర్చిపోయాను. సమీక్షకురాలిగా... కంటెంట్ రైటర్‌గా, కొన్నిసార్లు న్యూస్ రీడర్‌గా, ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్‌గా.. ఇలా అన్ని బాధ్యతలూ తీసుకున్నాను. రిపోర్టర్ లేకుండా అరగంట విమెన్ బులెటిన్‌ని ఆరునెలల పాటు రన్ చేశాను. దాంతో చాలా నేర్చుకున్నాను. అయితే పది గంటలపాటు అలా ఒకేచోట కూర్చోవడం వల్ల హెల్త్ ప్రాబ్లమ్స్ వచ్చాయి. దాంతో ఆ ఉద్యోగాన్ని వదిలేశాను. కానీ దివ్యాంగుల సమస్యలను తెలపడానికి ఒక వేదికైతే ఉండాలి కదా! అందుకే వేవ్ మీడియాను స్టార్ట్ చేశాను. దివ్యాంగులకు అన్నిరకాల అవకాశాలను అందించడానికి 'గుర్తింపు ఫౌండేషన్'ను మొదలుపెట్టాను. దివ్యాంగుల్లోని ఆంట్రప్రెన్యూర్ స్కిల్స్‌ని వెలికి తీసి, వాళ్లను ఆంట్రప్రెన్యూర్స్‌గా తయారుచేయడానికి 'డీ హబ్'ను ప్రారంభించాను. రీసెంట్‌గా ఇంటర్నేషనల్ లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ పూర్తి చేసుకున్నాను. దీనికి తెలుగు రాష్ట్రాల నుంచి నేనొక్కదాన్నే సెలెక్ట్ అయ్యాను.

> నేనొక డిజేబుల్డ్ పర్సన్‌ని అన్న విషయమే మర్చిపోయాను. సమీక్ష కురాలిగా... కంటెంట్ రైటర్‌గా, కొన్నిసార్లు న్యూస్ రీడర్‌గా, ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్‌గా.. ఇలా అన్ని బాధ్యతలూ తీసుకున్నాను. రిపోర్టర్ లేకుండా అర గంట విమెన్ బులెటిన్‌ని ఆరునెలల పాటు రన్ చేశాను.

వైవాహిక జీవితానికి వస్తే..

డిజేబుల్డ్ పర్సన్స్ వైవాహిక జీవితానికి పనికిరారనే అపోహ, ఆరోగ్యవంతుడు డిజేబుల్ అమ్మాయిని పెళ్లిచేసుకున్నాడంటే అతనిలో ఏం లోపం ఉందో అనే కామెంట్ల మధ్య.. నన్నర్థం చేసుకొనే స్నేహితుడు నరేందర్‌ని పెళ్లి చేసుకున్నాను. తల్లిని కావాలనీ ఆశపడ్డాను. కానీ నా ఆరోగ్యం అందుకు సహకరిస్తుందో లేదో అనే భయం ఉండేది నరేందర్‌కి. దాంతో ఆయన్ని కౌన్సెలింగ్‌కి తీసుకెళ్లాల్సి వచ్చింది!

ప్రెగ్నెన్సీ కన్‌ఫర్మ్ అయ్యే వరకు చాలా కాన్ఫిడెంట్‌గానే ఉన్నాను కానీ.. తర్వాతే చాలా ఒత్తిడి ఫీలయ్యాను. నాలాగే నా బిడ్డకూ వైకల్యం వస్తుందేమోననే భయం. పోలియో తప్ప జెనెటికల్‌గా నాకెలాంటి ప్రాబ్లం లేదు. అయినా టెస్ట్‌లు చేయించుకున్నాను. బ్యాక్ బోన్ పెయిన్ వల్ల ఒకసారి ఆర్థోపెడిక్ డాక్టర్ దగ్గరికీ వెళ్లాను. అప్పుడే నాకు సివియర్ స్కోలియోసిస్ ఉందని తేలింది. 150 డిగ్రీల వంపు తిరిగినట్లు ఉంటుంది నా బాడీ. దీనివల్ల నాకు ఒక లంగ్ చిన్నగా.. ఒక లంగ్ పెద్దగా, ఒక కిడ్నీ చిన్నగా.. ఒక కిడ్నీ పెద్దగా ఉంటుంది. అలాగే నా గర్భాశయంలో కూడా బిడ్డ ఒక సైడ్‌కు పెరుగుతోందని తెలిసింది.

ఎన్నో పరీక్షలను తట్టుకుని...

డీ హబ్‌ని డెవలప్ చేస్తున్న సమయంలోనే ప్రెగ్నెన్సీ రావడంతో ఫైనాన్సియల్‌గా కూడా స్ట్రగుల్ అయ్యాం. ఫ్యామిలీ సపోర్ట్ ఎక్కడా లేదు. ముందు జాగ్రత్తగా ఏడోనెలలోనే ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకున్నారు డాక్టర్. ఆసుపత్రిలోంచే వర్క్ చేశాను డెలివరీ ముందు రోజు వరకు. లక్కీగా ఏ కాంప్లికేషన్స్ లేకుండా తొమ్మిదోనెల వరకు రాగలిగాను. సిజేరియన్ డెలివరీతో బాబు పుట్టాడు. కానీ జాండీస్‌తో ఐసీయూలో పెట్టారు. వాడు ఇంటికి రావడానికి 27 రోజులు పట్టింది. వచ్చాక అనిమియా .. వీక్లీ చెకప్ అన్నారు. అది జనరల్ కండిషన్‌నే అని తెలిసినా... తలసేమియానా? నా డిజేబిలిటీ వల్లే ఇలా అవుతోందేమో అనే భయం. ఆ మానసిక వేదనను మాటల్లో చెప్పలేను. అన్ని అవాంతరాలు దాటి బిడ్డ ఆరోగ్యంగా కేరింతలు కొడుతుంటే అన్నీ మరచిపోయాను. ఇప్పుడనిపిస్తుంటుంది.. నేనేనా అంతలా భయపడ్డది అని! నాకున్న కండిషన్‌లో మాతృత్వమనేది నిజంగానే నేను సాధించిన అతిపెద్ద అచీవ్‌మెంట్ అనిపిస్తుంది'' అంటూ తన విజయగాథను వివరించారు వసుంధర.

– శిరీష చల్లపల్లి



మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఉన్న పథకాలు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెట్ మెలకువలు, అందుతున్న రుణాలు, వడ్డీ రేటు, సబ్సిడీలు, ఎక్కడ.. ఎలా దరఖాస్తు చేసుకోవాలి, అవసరమైన డాక్యుమెంట్లు, సక్సెస్ రేట్ వంటి వివరాలను "ఓనర్‌'షి'ప్" పేరుతో ప్రతి శనివారం అందిస్తున్నాం! ఈ వారం స్కీమ్ .. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్‌ఎల్‌ఎమ్).



పశు పోషణతో పారిశ్రామికవేత్తలుగా..



కేంద్ర ప్రభుత్వ పథకమైన నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా గొర్రెలు, మేకలు, పందులు, నాటుకోళ్ల పెంపకానికి 50 శాతం సబ్సిడీతో రుణ సదుపాయాన్ని అందిస్తోంది. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నాబార్డ్ సహకారంతో అన్ని సామాజిక వర్గాలూ దీన్ని పొందవచ్చు.

అయితే ఈ లోన్ కోసం బ్యాంకులను సంప్రదించినప్పుడు ఎన్.ఎల్.ఎమ్. ద్వారా అందుతున్న ముందస్తు సబ్సిడీ అవకాశం గురించి సిబ్బందికి చెప్పాలి. సిబిల్ స్కోర్ కూడా బాగుండాలి. సొంత లేదా కనీసం అయిదేళ్ల లీజు కింద ఎకరం నుంచి అయిదు ఎకరాల వరకు భూమిని కలిగి ఉండాలి. నాటుకోళ్లు, పందుల పెంపకానికైతే ఎకరం భూమి సరిపోతుంది. గొర్రెలు, మేకలకు సంబంధించి అయితే.. 500 గొర్రెలకు గడ్డిసాగు, షెడ్లులాంటి వాటికోసం అయిదు ఎకరాల భూమి కావాలి. తగిన అర్హత ఉంటే ఒకే కుటుంబంలో ఎంతమందైనా ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చు.

దరఖాస్తుకు..

ఉద్యమ్ మిత్ర పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు, వ్యక్తిగత గుర్తింపు, చిరునామా వగైరాలన్నిటికీ రుజువుగా పాస్‌పోర్ట్ లేదా ఆధార్‌కార్డ్, పాన్ కార్డ్ వంటివి సమర్పించాలి. ఆదాయ రుజువు పత్రం, గడచిన రెండేళ్ల ఐటీఆర్, బ్యాంక్‌స్టేట్‌మెంట్, ప్రాజెక్ట్‌కు సంబంధించిన కొటేషన్స్‌తోపాటు ఎక్కడైతే యూనిట్ పెట్టాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రాముఖ్యం, అక్కడ వ్యాపార అనుకూలతలు మొదలైన అంశాలతో పూర్తి ప్రాజెక్ట్ రిపోర్ట్‌నూ సమర్పించాలి. పై వివరాలన్నిటిలో ఏ మాత్రం తప్పుల్లేకుండా చూసుకోవాలి. దరఖాస్తును, ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను పశుసంవర్ధక శాఖా సిబ్బంది పరిశీలించి, అప్రూవ్ చేసిన పత్రాన్ని సంబంధిత బ్యాంకుకు పంపిస్తారు. అప్పుడు బ్యాంకు ద్వారా రుణం పొంది, సొంతపెట్టుబడినీ కూడబెట్టుకోవాలి. సబ్సిడీకి కూడా అప్లయ్ చేసుకోవాలి. సబ్సిడీ పొందడానికి కొంత సమయం పడుతుంది. సబ్సిడీ పొందిన వెంటనే యూనిట్‌ను ప్రారంభించవచ్చు. ఈలోపు ఎక్కడైతే యూనిట్‌ను పెట్టాలనుకుంటారో అక్కడ గ్రాసాన్ని పెంచాలి. ప్రభుత్వం సూచించిన నమూనాలోనే షెడ్డును నిర్మించాలి. అందులోని పశువులకు పోషకాహారం, పశువైద్య సౌకర్యం వంటివీ చూసుకోవాలి.

ఇటు గ్రామీణ... అటు పట్టణప్రాంతాల్లో విజయవంతంగా ముందుకు సాగుతోందీ పథకం.



– బి.ఎస్. రత్న, బిజినెస్ కన్సల్టెంట్, దలీప్

మీ సందేహాలను పంపవలసిన మెయిల్ ఐడీ : ownership.sakshi@gmail.com

నిర్వహణ : సరస్వతి రమ



కేరెంటింగ్

మన మీద పవర్ ఇవ్వకూడదు

స్కూల్ ఫంక్షన్ నుంచి చిన్నబుచ్చుకుని ఇంటికొచ్చిన కూతురిని చూసి 'ఏమైంది?' అడిగింది అమ్మ.

'నా డ్రెస్ ఏం బాగో లేదట, ఇది నాకస్సలు సూటవలేదంది రీతూ' బాధగా చెప్పింది శ్రుతి.

అమ్మ చిన్నగా నవ్వుతూ ఫ్రిజ్‌లోంచి జామకాయ తీసి 'జామకాయ ఆరోగ్యానికి మంచిది' అంటూ కూతురికి ఇచ్చింది. అవునన్నట్టుగా తలాడించింది శ్రుతి. 'జామకాయ ఆరోగ్యానికి మంచిది అనేది నిజమా? ఒపీనియనా?' అడిగింది అమ్మ.

'నిజం' చెప్పింది శ్రుతి. 'జామకాయను మించిన పండులేదు..' అంటూ సాభిప్రాయంగా కూతురి వైపు చూసింది అమ్మ.

'అది నీ ఒపీనియన్' శ్రుతి.

'కదా.. అలాగే నీ డ్రెస్ బాగాలేదు, నీకు సూటవలేదు అనేది కూడా రీతూ ఒపీనియనే! నిజాలకు విలువివ్వాలి, అది నిజమో కాదో సమీక్షించుకోవాలి. ఒపీనియన్స్, కామెంట్స్‌కి ఫీలైపోయి ఎదుటివాళ్లకు మన మీద పవర్ ఇవ్వకూడదు' చెప్పింది అమ్మ.

అర్థమైనట్టుగా శ్రుతి ముఖంలో నవ్వు.

మీ పిల్లలు తమ తోటివాళ్ల దగ్గర్నుంచి ఇలాంటివి ఎదుర్కొన్నప్పుడు వాళ్లను ఓదార్చడానికి బదులు ఇలా నిజాలకు, అభిప్రాయాలకు మధ్య తేడాను గ్రహించేలా చేయాలి. దానివల్ల విమర్శలను పాజిటివ్‌గా తీసుకునే తత్వాన్ని అలవరచుకుంటారు. ప్రతికూల పరిస్థితులకు కుంగిపోకుండా వ్యక్తిత్వాన్ని దృఢంగా మలచుకుంటారు.

వెయ్యి కళ్ల పహారా



కనురెప్పే కాటేస్తే..?

'ఆ దుర్మార్గాన్ని గురించి చెప్పడానికి మాటలు రావు' అంటుంటాం.

అయితే అలాంటి పరిస్థితుల్లోనే మాట్లాడడం తప్పనిసరి. ఎందుకంటే 'మౌనం' 'పరువు భయం' మరిన్ని దుర్మార్గాలు జరిగేలా చేస్తాయి.

దేశవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట ఉపాధ్యాయుల ద్వారా లైంగిక వేధింపులు, దాడులకు గురి అవుతున్న చిన్నారుల గురించిన వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో బడి అనేది పిల్లలను భయపెట్టేలా ఉండకూడదు. బడి అనేది సురక్షిత ప్రదేశంగా ఉండేలా తగిన కార్యాచరణ ఉండాలి. దీన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లా ఉన్నతాధికారులు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు.

కామారెడ్డి జిల్లా స్కూళ్లలో లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటనల్లో 15 పోక్సో కేసులు నమోదయ్యాయి. ఇటీవల నవోదయ విద్యాలయంలో విద్యార్థినులను వేధించిన కేసులో నలుగురు టీచర్లు, సిబ్బందిపై పోక్సో కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. కొన్ని కేసుల్లో విషయాన్ని దాచిపెట్టిన పాఠశాల హెడ్మాస్టర్లు, ఇతరులపైనా కేసులు నమోదు చేశారు. స్కూళ్లలో లైంగిక వేధింపుల సంఘటనలతో తల్లిదండ్రుల్లో ఆందోళన పెరిగింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ సింధుశర్మ, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, జిల్లా పిల్లల సంరక్షణ అధికారి స్రవంతి తదితరులు స్కూళ్లలో ఆడపిల్లలపై వేధింపులను నిరోధించేందుకు చర్యలు మొదలుపెట్టారు.

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, కస్తూర్బా స్కూళ్లు, ఆదర్శ పాఠశాలలన్నింటిలో 'చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్'గా మహిళా ఉపాధ్యాయురాలిని నియమించారు. మహిళా టీచర్లు లేని స్కూళ్లలో ఉపాధ్యాయుడిని నియమించారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌తో పాటు సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్/ప్రిన్సిపాల్ కూడా బాధ్యుడిగా ఉంటారు. వీరికి పోక్సో చట్టంపై ఓరియంటేషన్ ఇచ్చారు.

– ఎస్.వేణుగోపాల్‌చారి, సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

అదే మా లక్ష్యం



చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలతో పాటు 'సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆఫ్ చిల్డ్రన్స్ ఇన్ స్కూల్' కాన్సెప్ట్‌పై అవగాహన కల్పిస్తున్నాం. స్కూళ్లలో వేధింపులు అనేవి లేకుండా చేయడమే లక్ష్యం.

– ఆశీష్ సంగ్వాన్, జిల్లా కలెక్టర్, కామారెడ్డి

ఆడపిల్లలు ఇబ్బందులు పడకుండా...



చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌తో పాటు పాఠశాల హెడ్మాస్టర్లకు పోక్సో చట్టం, ఇతర అంశాలపై యునిసెఫ్ రిసోర్స్ పర్సన్లతో ఓరియంటేషన్ ఇప్పిస్తున్నాం. జిల్లాలో 1250 స్కూళ్లలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం.

– ప్రమీల, జిల్లా సంక్షేమ అధికారి, కామారెడ్డి

ఇంటిప్స్



- రోజూ వాడని వెండి వస్తువులు నల్లగారంగు మారుతుంటాయి. అలాంటప్పుడు వాటిని క్లీనింగ్ పౌడర్‌తో శుభ్రం చేసిన తర్వాత పచ్చిపాలతో కాని పాలు కలిపిన నీటితో కాని కడిగితే నలుపు వదులుతుంది. అలా కుదరనప్పుడు పాలలో ముంచిన క్లాత్‌తో తుడిచినా కూడా ఫలితం ఉంటుంది.
- లెదర్ చెప్పులు కాని షూస్ కాని కొత్తవాటిలా మెరవాలంటే ఉల్లిపాయ తొక్కలతో రుద్దాలి.

దావత్ చేసుకుందాం..

వంటిల్లు

తెలుగు రుచుల్లో తెలంగాణది ఒక ప్రత్యేకత. కడుపు నిండా తినాలనుకునేవారికి మనసు నిండా ప్రేమతో కొసరి కొసరి తినిపిస్తారు. అందుకే తెలంగాణా ఆతిథ్యానికి 'అదబ్ ఔర్ ఖాతిర్దారీ' అని పేరు. దావత్ కి పిలిస్తే తప్పకుండా వెళ్ళండి... బగారా రైస్, నాటు కోడి కూర, పచ్చిపులుసు, చేప వేపుడు, సర్వప్ప అస్సలు వదిలి పెట్టద్దు. దిల్‌ఫుల్‌గా దావత్ చెయ్యండి.

సర్వప్ప



కావల్సినవి: **బియ్యప్పిండి**–కప్పు; **తెల్ల నువ్వులు** – పావు కప్పు (వేడి నీళ్లలో నానబెట్టి, నీళ్లు వడకట్టి, పక్క నుంచాలి); **శనగపప్పు** – 3 టేబుల్ స్పూన్లు, **పల్లీలు** – 2 టేబుల్ స్పూన్లు (వేయించి, పొట్టు తీసి, పలుకులు చేయాలి); **పచ్చిమిర్చి** – 5 (తరగాలి); **పచ్చిమిర్చి ముద్ద** – అర టీ స్పూన్; **జీలకర్ర** – టీ స్పూన్; వెల్లుల్లి – 10 రెబ్బలు (తరగాలి); **ఉల్లి పాయ** – 1 (తరగాలి); **కొత్తిమీర తరుగు** – పావు కప్పు, **ఉల్లికాడలు** (సన్నగా తరిగినవి) – పావు కప్పు; **కారం** – పావు టీ స్పూన్; **కరివేపాకు** – 2 రెమ్మలు (సన్నగా తరగాలి); **ఉప్పు** – రుచికి తగినంత ; **నీళ్లు** – ముప్పావు కప్పు (తగినన్ని); **నూనె** – 3 టీ స్పూన్లు

తయారీ: ● నువ్వులను, శనగపప్పును విడివిడిగా గంట నానబెట్టి, వడకట్టాలి. ఉల్లి తరుగును కచ్చాపచ్చాగా దంచాలి. పెద్ద గిన్నెలో బియ్యప్పిండి, నువ్వులు, శనగపప్పు, పల్లీల పలుకులు, ఉప్పు, పచ్చిమిర్చి తరుగు–ముద్ద, కారం, వెల్లుల్లి, కరివేపాకు, కొత్తిమీర, ఉల్లి తరుగు, ఉప్పు వేసి బాగా కలపాలి. కొద్దిగా నీళ్లు వేసి, కలిపి గట్టి ముద్ద చేయాలి. ● మందపాటి గిన్నె (సర్వ) అడుగున నెయ్యి రాసి, పిండిని చిన్న చిన్న ముద్దలుగా తీసుకొని రొట్టెలా చేత్తో వెడల్పుగా వత్తి, సన్నని మంట మీద కాల్చాలి. (పిండిని రొట్టెలా చేసి, పెనం మీద నూనె వేసి రెండు వైపులా కాల్చుకోవచ్చు)

బగారా రైస్



కావల్సినవి: **బాస్మతి బియ్యం/బియ్యం** – 2 కప్పులు+ **ఉల్లిపాయలు** – 3 (సన్నగా నిలువుగా తరగాలి); **బిర్యానీ ఆకు** – 3; **పచ్చిమిర్చి** – 7 (సన్నగా తరగాలి); **కొత్తిమీర** – 2 టేబుల్ స్పూన్లు ; **పుదీనా ఆకులు** – గుప్పెడు; **అల్లం – వెల్లుల్లి పేస్ట్** – 2 టీ స్పూన్లు; **ఉప్పు** – తగినంత; **నెయ్యి / నూనె** – అర కప్పు; **నీళ్లు** – 5 కప్పులు; **లవంగాలు** – 10; యాలకులు – 7; **కరివేపాకు** – 2 రెమ్మలు

తయారీ: ● గిన్నెలో నూనె వేడి చేసి, ఉల్లి తరుగు గోధుమరంగు వచ్చేవరకు వేయించాలి. అందులో పచ్చిమిర్చి, లవంగాలు, దాల్చిన చెక్క, యాలకులు, కరివేపాకు, పుదీనా ఆకులు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి సన్నని మంట మీద పచ్చివాసన పోయేవరకు వేయించాలి. ● దీంట్లో బియ్యం వేసి 2 నిమిషాలు వేయించాలి. ● ఉప్పు కూడా వేసి మరో మారు కలిపి, 5 కప్పుల నీళ్లు పోసి ఉడికించాలి. చివరగా కొత్తిమీర, వేయించిన ఉల్లి తరుగు చల్లి దించాలి.

నోట్: పోపులో పచ్చిబఠాణీలు, మొక్కజొన్న గింజలు, బీన్స్ వేసి కూడా బగారా రైస్ చేసుకోవచ్చు. దీనిలోకి మాంసాహార వంటకాలే కాదు బంగాళదుంప కూర, గుత్తి వంకాయ కూర, పప్పు వంటి శాకాహార రుచులను కూడా వడ్డించవచ్చు.



నాటు కోడి కూర

కావల్సినవి: నాటు కోడి ముక్కలు – అరకేజీ; **పచ్చిమిర్చి** – 4, **టొమాటోలు** – 2(తరగాలి); **అల్లం–వెల్లుల్లి పేస్ట్** – 2 టీ స్పూన్లు; **గరం మసాలా** (లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, ధనియాలు) – 2 టీ స్పూన్లు; **ఉల్లి పాయలు** – 2, ఎండుమిర్చి – 2; **పసుపు** – అర టీ స్పూన్; **ఉప్పు** – తగినంత; **కారం** – టీ స్పూన్; **ఎండుకొబ్బరి** – 2 టీ స్పూన్లు; **నూనె** – 3 టేబుల్ స్పూన్లు; **కొత్తిమీర తరుగు** – 2 టేబుల్ స్పూన్లు

తయారీ: ● నాటుకోడి ముక్కలలో కారం, పసుపు, ధనియాల పొడి, అల్లం- వెల్లుల్లి పేస్ట్ కలిపి పక్కనుంచాలి. ● మందపాటి గిన్నె/కుకర్‌లో నూనె వేడయ్యాక జీలకర్ర, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, పసుపు వేసి, కలపాలి. ● అల్లం–వెల్లుల్లి ముద్ద వేసి, వేగాక కలిపి ఉంచిన చికెన్ వేసి 10 నిమిషాలు ఉడికించాలి. టొమాటో వేసి మగ్గనివ్వాలి. 2 కప్పుల నీళ్లు పోసి, ఉప్పు, కారం, ఎండుకొబ్బరి వేసి మరో 15 నిమిషాలు ఉడికించాలి. కుకర్‌లో అయితే 3 విజిల్స్ వచ్చేవరకు ఉంచాలి. ● దించే ముందు సిద్ధం చేసుకున్న గరం మసాలా, కొత్తిమీర వేయాలి. రోటీలు, అన్నంలోకి ఈ కూరను వడ్డించాలి.



చేప వేపుడు

కావల్సినవి: చేప ముక్కలు – 6; **కారం** – అర టీ స్పూన్; **మొక్కజొన్న పిండి** – టీ స్పూన్; **ఉప్పు** – తగినంత; **నిమ్మరసం** – అర టీ స్పూన్; **గుడ్డు** – 1; **నూనె** – తగినంత; **ధనియాల పొడి** – టీ స్పూన్; **గరం మసాలా** – అర టీ స్పూన్; **అల్లం–వెల్లుల్లి పేస్ట్** – టీ స్పూన్; **కొత్తి మీర** – టీ స్పూన్; **నూనె** – 3 టేబుల్ స్పూన్లు (తగినంత).

తయారీ: ● గిన్నెలో చేప ముక్కలు వేసి కారం, మొక్కజొన్న పిండి, ఉప్పు, నిమ్మరసం, గుడ్డు, ధనియాల పొడి, అల్లం వెల్లుల్లి పేస్ట్, గరం మసాలా, నిమ్మరసం వేసి కలిపి అరగంట పక్క నుంచాలి. కడాయిలో నూనె వేసి అందులో చేప ముక్కలు వేసి, వేయించాలి. ● చేప ముక్కలు వేగిన తర్వాత కొత్తిమీర చల్లి దించాలి. ● గుండ్రంగా తరిగిన ఉల్లిపాయలను అలంకరించి చేప ముక్కలను అన్నంలోకి సైడ్ డిష్‌గా వడ్డించాలి. ఇవి స్నాక్స్‌గానూ బాగుంటాయి.

పచ్చి పులుసు



కావల్సినవి: **చింతపండు** – నిమ్మకాయ పరిమాణం (వేడి నీళ్లలో నానబెట్టి, గుజ్జు తీయాలి); **ఉప్పు** – తగినంత; **నీళ్లు** – 3 కప్పులు; **పచ్చిమిర్చి** – 4; జీలకర్ర – టీ స్పూన్; **కొత్తిమీర** – టేబుల్‌స్పూన్; **పసుపు** – పావు టీ స్పూన్; **ఉల్లి పాయ** – 1; **ఎండుమిర్చి** – 2; **వెల్లుల్లి** – 4 రెబ్బలు; **నూనె** – 2 టేబుల్ స్పూన్లు; **కరివేపాకు** – రెమ్మ; **ధనియాల పొడి** – అర టీ స్పూన్.

తయారీ: ● చింతపండు గుజ్జులో నీళ్లు కలపాలి. ● రోట్లో పచ్చిమిర్చి, ఉప్పు, అర టీ స్పూన్ జీలకర్ర, కొత్తిమీర, పసుపు వేసి కచ్చాపచ్చాగా దంచాలి. ఈ మిశ్రమాన్ని చింతపండు రసంలో కలపాలి. ● స్టౌ మీద మూకుడు పెట్టి నూనె వేసి అందులో మిగిలిన జీలకర్ర, ఎండుమిర్చి, వెల్లుల్లి, కరివేపాకు, ధనియాల పొడి వేసి, వేయించి ఈ పోపు మిశ్రమాన్ని చింతపండు రసంలో కలపాలి. తీపి కావాలనుకున్న వారు టీ స్పూన్ పంచదార / బెల్లం కలుపుకోవచ్చు. ● ఉల్లిపాయ తరుగు పైన వేసి, అన్నంలోకి వడ్డించాలి.


జపనీయుల దీర్ఘాయువు వెనక...

స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అయితే, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, అస్తవ్యస్తమైన జీవనశైలి, ఒత్తిడి, కాలుష్యం వంటి కారణాల వల్ల అనుకున్నంత కాలం జీవించలేకపోతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం జపాన్? ప్రజలు మాత్రం ప్రపంచంలోనే అత్యధిక ఆయుర్దాయంతో ఎక్కువకాలం పాటు జీవిస్తున్నారు. అందుకు కారణాలేమిటో తెలుసుకుందాం.. మనం కూడా వారిని అనుసరిద్దాం.





డబ్ల్యు. హెచ్. ఓ. అంచనాల మేరకు... జపాన్ ప్రజల సగటు ఆయుర్దాయం 83.7 సంవత్సరాలు (మహిళలకు 86.8 సంవత్సరాలు పురుషులకు 80.5 సంవత్సరాలు)గా ఉంది. జపాన్ ప్రజల జీవన విధానం, ఆహారపు అలవాట్లు, వ్యాయామం, సంస్కృతి, జెనెటిక్స్? దీనికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.



ఇకిగై (సంతోషంతో జీవించడం): జపనీయులు 'ఇకిగై' అనే సిద్ధాంతంతో సంతోషంగా జీవిస్తారు. ఆనందంతో జీవించాలని ఈ పురాతన తత్వశాస్త్రం బోధిస్తుంది. అంతేకాక, ఎందుకు జీవిస్తున్నామనే దానిపై స్పష్టతతో జీవితానికి లక్ష్యాన్ని ఏర్పర్చుకోవడం, ఇతరులకు సహాయం చేయడం, సమతుల ఆహారాన్ని తీసుకోవడం, స్నేహితులు, కుటుంబ సభ్యులతో ప్రేమతో కలిసి ఉండటం వంటి అంశాలు వారి ఆయుష్షును పెంచుతాయి.

హరా హాచ్ బన్ మి. ఇది జపాన్‌లో ఒక సామెత. అంటే తగిన మోతాదులోనే ఆహారం తినాలని అర్థం. కడుపులో 80 శాతం నిండినంత వరకు మాత్రమే తింటే దీర్ఘాయువు కలిగి ఉంటామని జపనీయుల నమ్మకం. అంతేకాదు, పెద్ద పళ్లెంలో కాకుండా చిన్న చిన్న ప్లేట్లలో లేదా బౌల్స్‌లో నెమ్మదిగా తినడానికి ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సభ్యులంతా కలిసి తింటారు. భోజనం చేసేటప్పుడు టీవీ, సెల్ ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంటారు. కింద కూర్చునే తింటారు.

సమతుల ఆహారం: జపనీస్ ఆహారంలో పండ్లు, ఒమేగా ఫాటీ ఆమ్లాలు అధికంగా ఉండే చేపలు, బియ్యం, తృణధాన్యాలు, టోఫు, సోయా, మిసో, ఆకుపచ్చ కూరగాయలు ఎక్కువగా తీసుకుంటారు. ఇవన్నీ తక్కువ కొవ్వులు, చక్కెరలను కలిగి ఉంటాయి. వీటిలో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా లభిస్తాయి. తద్వారా కాన్సర్, గుండె జబ్బుల నుంచి బయట పడొచ్చు. ఈ ఆహారం కారణంగానే జపాన్‌లో ఊబకాయం రేటు చాలా తక్కువగా ఉందని చెప్పవచ్చు.

హెర్బల్ టీ: జపనీస్ ప్రజలు టీ తాగడాన్ని ఇష్టపడతారు. అది వారి సంస్కృతిలో భాగంగా భావిస్తారు. జపాన్ ద్వీప సమూహంలో మాచా టీ చాలా ప్రాచుర్యం పొందింది. టీ తయారీలో ఉపయోగించే టీ ఆకులు అధిక పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు కాన్సర్‌తో పోరాడే శక్తినిస్తాయి.





కాలి నడకకు ప్రాధాన్యం: జపాన్ ప్రజలు ఒకేచోట కూర్చుని పని చేసే జీవన శైలిని అంతగా ఇష్టపడరు. యువకుల నుంచి వృద్ధుల వరకు అంతా నడవడానికే ఇష్టపడతారు. విద్యార్థులు, ఉద్యోగులు సమీపంలోని రైల్వే స్టేషన్‌కు నడవడం లేదా సైక్లింగ్? చేయడం వంటివి చేస్తుంటారు. ఇవన్నీ వారి ఆయుర్దాయం పెరగడానికి దోహదం చేస్తాయి.



జీన్స్: ఇవి వారు ధరించే జీన్స్ కాదు.. జపనీస్‌లో సహజసిద్ధంగా ఉండే జన్యువులు. ఇవే వారి ఆయుష్షును పెంచుతున్నాయి. టైప్ 2 డయాబెటిస్, స్ట్రోక్స్, గుండెపోటు, సెరెబ్రోవాస్కులర్, హృదయ సంబంధ వ్యాధులను నిరోధించడానికి ఈ జన్యువులు సహాయపడతాయి.



వృద్ధుల సంరక్షణ: ఇతర దేశాలలా జపాన్ ప్రజలు వయసు పైబడిన తమ కుటుంబ సభ్యులను ఓల్డ్? ఏజ్?హోమ్‌లకు పంపించరు. కుటుంబ సభ్యుల సంరక్షణ బాధ్యతను చూసుకోవడం అక్కడి వారి సాంప్రదాయం. వృద్ధాప్యంలో కుటుంబంతో కలిసి జీవిస్తే మానసికంగా అనేక ప్రయోజనాలు కలుగుతాయని, సంతోషంగా జీవిస్తారని అక్కడి వారి నమ్మకం.

ఆరోగ్య సంరక్షణ: జపాన్‌లో అనారోగ్యాలను నివారించి, ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యతనిచ్చే ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ఉంది. క్రమం తప్పకుండా తనిఖీలు చేయడం, వ్యాధులను ముందుగానే గుర్తించడం మొత్తం ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.

సామాజిక నిర్మాణం: బలమైన సామాజిక సంబంధాలు, సమాజ మద్దతు మెరుగైన మానసిక ఆరోగ్యానికి, ఒత్తిడి స్థాయిలను తగ్గించడానికి దారి తీస్తుంది. ఇవి దీర్ఘాయువుకు ముఖ్యమైనవి.

చూశారుగా... పైన చెప్పుకున్న వాటిలో ఒక్క జన్యుపరమైన కారణాలు తప్ప మిగతావన్నీ మనం సులువుగా అనుసరించదగ్గవే. వీలయిన వాటిని వీలయినంత వరకు అనుసరించి ఆయురారోగ్యాలతో హాయిగా ఉందాం. దీర్ఘాయుష్మాన్ భవ!

ఇక్కడ జిమ్‌లో చేరాలంటే నెలకు తొమ్మిది లక్షలు!



జిమ్‌లో చేరాలంటే నెలకు ఎంత కడతాం? మిగిలిన చోట్ల ఎంత ఉన్నా, న్యూయార్క్‌లోని గ్రీన్‌విచ్‌కి దగ్గరలోని ఒక గ్రామంలో కొంటినూమ్ అనే వెల్‌నెస్ సోషల్ క్లబ్‌లో జిమ్ చేయాలంటే అక్షరాలా 8000 పౌండ్లు కట్టాలి. గత ఏడాది ఏప్రిల్‌లో ఆరంభం అయిన ఈ జిమ్‌లో లగ్జరీ లాంజ్ ఉంది. సభ్యులకు ఫిట్‌నెస్ పెంచుకోవడం కోసం టాప్‌క్లాస్ జిమ్ తరగతులు జరుగుతుంటాయి. 25000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ వెల్‌నెస్ సెంటర్ 250 మంది సభ్యులకు మాత్రమే పరిమితం. చిత్రం ఏమిటంటే, కళ్లు తిరిగేటంత సభ్యత్వ రుసుము కండలు పిండి మరీ వసూలు చేస్తున్నా కూడా ఇక్కడ మెంబర్‌షిప్ తీసుకోవడం కోసం వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న వారి జాబితా చాలానే ఉందట.

ఇక్కడ చేరి శారీరక దృఢత్వాన్ని పెంచుకుంటున్న వారందరికోసం ఇంటి దగ్గర ఉండి మరీ కసరత్తులు చేసేందుకు ఆన్‌లైన్‌లో ప్రత్యేకమైన హోమ్ వర్క్ (వర్కవుట్లు చేయిస్తారట) కూడా ఇస్తారట. డబ్బు కట్టగానే ఇక్కడ సభ్యులకు పూర్తి వివరాలతో కూడిన 'ఆన్‌బోర్డింగ్ అసెస్‌మెంట్' ఉంటుంది. శరీరంలోని ప్రతి పార్ట్‌నూ స్కాన్ చేసి, ఉండవలసిన దానికన్నా హెచ్చుతగ్గులు ఏమైనా ఉంటే పరీక్షించి, వాటిని బ్యాలన్స్ చేసుకునేందుకు తగిన స్పెషల్ వర్కవుట్లు చేయిస్తారు. అంతేకాదు, శరీరంలో బ్లడ్ సర్క్యులేషన్ ఎలా ఉంది, ఆక్సిజన్ లెవెల్స్ ఎలా ఉన్నాయి, నిద్ర నాణ్యత ఎలా ఉంది... వంటి పరీక్షలన్నీ చేసి అందుకు తగ్గట్టు జిమ్ చేయిస్తారట. ఏమైనా.. పిండికొద్దీ రొట్టె అన్నట్టు మనం చెల్లించిన డబ్బుకు తగ్గట్టు వర్కవుట్లు చేయించి మన ఫిట్‌నెస్‌ను పరిరక్షిస్తారన్నమాట!

ఆత్మస్థైర్య సిద్ధి

ప్రతికూలతలను దూరం చేసి, మనసును ప్రశాంతంగా, ఆత్మస్థైర్యంతో మిమ్మల్ని మీరు కొత్తగా మలుచుకోవడానికి సహకరించే ఐదు ఆసనాలు...

- **తాడాసనం:** ఇది పర్వతాన్ని పోలి ఉంటుంది. అందుకే మౌంటెయిన్ పోజ్ అని కూడా అంటారు. చేతులను, కాళ్లను కదల్చకుండా స్థిరంగా, నిటారుగా నిల్చోవడం అలవాటవుతుంది.
- **బాలాసన:** చంటి పిల్లలు మోకాళ్లపై బోర్లాపడుకొని ఉన్న భంగిమ ఇది. ఈ ఆసనంలో మ్యాట్‌పైన మోకాళ్లపైన కూర్చుంటూ, ముందుకు వంగి, నుదుటిని నేలకు ఆనించాలి. తలమీదుగా రెండువైపులా చేతులను ముందుకు తీసుకుంటూ, అరచేతులను నేలమీద ఉంచాలి.
- **వీరభద్రాసన:** దీనిని వారియర్ పోజ్ అని కూడా అంటారు. నేలపైన నిల్చొని కుడి పాదాన్ని ముందుకు ఉంచాలి. రెండు చేతులను విశాలంగా భుజాలకు ఇరువైపులా చాపాలి.


యోగా

ఈ సమయంలో తల నిటారుగా ఉండాలి. దీర్ఘ శ్వాస తీసుకుంటూ వదలాలి. దీనివల్ల మిమ్మల్ని మీరు శక్తిమంతులుగా భావిస్తారు. ఆత్మగౌరవం, స్వీయ ప్రేమ మెరుగుపడుతుంది.


- **అధోముఖస్వానాసన:** మ్యాట్‌పైన బోర్లా పడుకొని, చేతులు, కాలివేళ్ల మీదుగా శరీరాన్ని ఉంచుతూ, హిప్ భాగాన్ని పైకి లేపాలి. దీనిని డాగ్ పోజ్ అని కూడా అంటారు. సాధన ప్రారంభంలో ఈ ఆసనం శరీరాన్ని వామప్ చేయడానికి ఉపయోగ పడుతుంది. ఇది భావోద్వేగ సమతుల్యతను పెంచుతుంది.
- **ఉష్ట్రాసన:** మ్యాట్‌పైన మోకాళ్లను నేలకు ఆనిస్తూ కూర్చొని, రెండు చేతులతో కాలి మడమలను పట్టుకుంటూ, వెన్నెముకను వంపుగా, తలను వెనక్కి వంచాలి. దీంతో పొత్తికడుపు స్ట్రెచ్ అవుతుంది. ఈ ఆసనం వల్ల మానసిక స్థైర్యం పెరుగుతుంది.

సాక్షి సినిమా

మాస్ యాక్షన్ షురూ

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న మల్టీ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్ 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జగపతిబాబు, కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఓ సెట్‌లో నైట్ షూట్ జరుగుతోందని తెలిసింది. రామ్ చరణ్, జాన్వీ కపూర్, శివ రాజ్ కుమార్‌ల కాంబినేషన్‌లోని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట.

అలాగే ఈ సినిమాలో క్రికెట్, కుస్తీ గురించే కాకుండా... మరికొన్ని ఇతర స్పోర్ట్స్ గురించిన ప్రస్తావన కూడా ఉంటుందని తెలిసింది. ఇంకా ఈ షెడ్యూల్‌లోనే ఓ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌ను తీసేందుకు టీమ్ రెడీ అయిందని, 'జైలర్' ఫేమ్ కెవిన్ కుమార్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌కు కొరియోగ్రఫీ చేయనున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్‌ల సమర్పణలో వద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సినిమాకు సంగీతం: ఏఆర్ రెహమాన్.


రామ్‌చరణ్

వీరమల్లు డేట్ చేంజ్


నిధీ అగర్వాల్, పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న 'హరి హర వీరమల్లు: పార్ట్–1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' చిత్రం విడుదల తేదీ మారింది. తొలుత ఈ సినిమాని ఈ నెల 28న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించిన మేకర్స్... తాజాగా మే 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి, బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాత ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్‌పై ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ''హరి హర వీరమల్లు' చిత్రంలో చారిత్రాత్మక యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ కల్యాణ్ సరికొత్తగా కనిపించనున్నారు. మొఘల్ రాజుల నుండి కోహినూర్ వజ్రాన్ని దొంగిలించడంతో పాటు ప్రేక్షకుల మనసు దోచుకోవడానికి వీరమల్లు సిద్ధమవుతున్నాడు. ఈ చిత్రాన్ని మొదట ఈ నెల 28న విడుదల చేయాలనుకున్నాం. కానీ నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నందున విడుదలను మే 9కి వాయిదా వేశాం. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం. కీరవాణి, కెమేరా: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్ వీఎస్.

కోర్ట్‌తో నా కల నెరవేరింది



''కోర్ట్ సినిమాలో నేను చేసిన మంగపతి పాత్రకి అద్భుతమైన స్పందన వస్తోంది. ఇలాంటి బలమైన పాత్ర చేయాలన్న నా 25 ఏళ్ల కల ఈ సినిమాతో నెరవేరింది'' అని నటుడు శివాజీ తెలిపారు. ప్రియదర్శి, శివాజీ, రోషన్, శ్రీదేవి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'కోర్ట్'. రామ్ జగదీశ్ దర్శకత్వం వహించారు. నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సినిమాలో మంగపతి పాత్ర పోషించిన శివాజీ విలేకరులతో మాట్లాడుతూ– ''నాకు నటనలో దాదాపు 12 ఏళ్ల విరామం వచ్చింది. నన్ను మళ్లీ నటించమని నా పిల్లలు కోరేవారు. నాకూ చేయాలని ఉండేది కానీ ఎవర్నీ అవకాశం అడగలేదు. సొంతంగా నేనే ఓ సినిమా నిర్మిద్దామనుకున్న సమయంలో '90స్ ఎ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్ చేశాను. అది చేస్తున్నప్పుడు 'బిగ్ బాస్' అవకాశం వస్తే, చేశాను. ఆ షోతో నేనంటే ఏంటో ప్రపంచానికి తెలిసింది. వెబ్ సిరీస్ పెద్ద హిట్ కావడంతో దాదాపు ఎనభై కథలు విన్నాను. చాలావరకూ తండ్రి పాత్రలే కావడంతో తిరస్కరించాను. 'కోర్ట్'లో మంగపతి పాత్ర క్రెడిట్ డైరెక్టర్ రామ్‌దే. ఎస్వీ రంగారావు, గుమ్మడి, జగ్గయ్య, రాజనాలగార్లు మరపురాని పాత్రలు చేశారు. అలాంటి పాత్రలు చేయాలని నాకూ ఉండేది కానీ హీరోగా ఉండాలనే ఆలోచన ఎప్పుడూ లేదు. కొత్తవారిని ప్రోత్సహించడంలో నాని గొప్ప చొరవ చూపిస్తున్నారు. సూపర్ గుడ్ ఫిలిమ్స్, సురేష్ ప్రొడక్షన్, ఉషా కిరణ్ మూవీస్ వంటి బ్యానర్స్‌లా వాల్ పోస్టర్ సినిమా అవుతుంది. ఇక మంగపతి తరహాలో మెడికల్ షాప్ మూర్తి అనే ఓ క్యారెక్టర్ విన్నాను. ప్రస్తుతం నేను నిర్మాతగా, హీరోగా, లయ హీరోయిన్‌గా ఓ సినిమా చేస్తున్నా. అలాగే 'దండోరా' అనే మరో చిత్రంలో నటిస్తున్నాను'' అని తెలిపారు. ఇంకా రాజకీయాల గురించి మాట్లాడుతూ – ''నేను ఏ పార్టీకి సపోర్ట్‌గా ఉండలేదు... మాట్లాడలేదు. నేను ప్రజల కోసం నిలబడ్డాను. ప్రాంతం కోసం, భావితరాల కోసం పోరాటం చేశాను'' అని శివాజీ స్పష్టం చేశారు.

– శివాజీ

హోలీ స్పెషల్


'తెలుసు కదా' సంబరాలు

హోలీ సందర్భంగా హీరో సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా', హీరో సాయిదుర్గా తేజ్ 'సంబరాల యేటిగట్టు' సినిమాల నుంచి ప్రత్యేక పోస్టర్స్ విడుదల చేశారు మేకర్స్.

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' వంటి హిట్ చిత్రాల తర్వాత సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమా ద్వారా డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం హోలీ సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లో సిద్ధు, రాశి, శ్రీనిధి కలిసి పండగను ఆనందంగా సెలబ్రేట్ చేసుకుంటూ కలర్‌ఫుల్‌గా కనిపించారు. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమేరా: జ్ఞానశేఖర్ బాబా, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

- సాయి దుర్గా తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల యేటిగట్టు). నూతన దర్శకుడు రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'హనుమాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ పాన్ ఇండియా మూవీ నిర్మిస్తున్నారు. హోలీని పురస్కరించుకుని న్యూ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. టీమ్ అంతా ఆనందంగా ఈ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నట్లు పోస్టర్ చూస్తే తెలుస్తోంది. ''యాక్షన్ ప్యాక్డ్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'ఎస్‌వైజీ. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఒక పాటను చిత్రీకరిస్తున్నాం. సెప్టెంబర్ 25న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: వెట్రి పళనిసామి, సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్.


'సంబరాల యేటిగట్టు' సందడి

సందడే సందడి


తమన్నా

బాలీవుడ్ నటి రవీనా టాండన్ ఏర్పాటు చేసిన హోలీ సంబరాల్లో పలువురు సినీ ప్రముఖులు సందడి చేశారు. హోలీ శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాల్లో తేలిపోయారు. ఈ వేడుకలో హీరోయిన్ తమన్నా కూడా పాల్గొని, సందడి చేశారు. రవీనా టాండన్ కుమార్తె రాషా, తమన్నా క్లోజ్ ఫ్రెండ్స్ అని సమాచారం. రవీనా ఇంట్లో జరిగిన వేడుకల్లో తమన్నా పాల్గొనడానికి ఇదొక కారణం అట. అలాగే రాషా క్లోజ్ ఫ్రెండ్, నటుడు విజయ్ వర్మ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఓటీటీ — ఇది చూడొచ్చు

ఊహకందని... ఊహించలేని ఇన్వెస్టిగేషన్ ఇది

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'రేఖా చిత్రం' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ఇదో ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్. ఈ తరహా సినిమాలు ఇప్పటికే మనకు పరిచయమున్నా క్షణం కూడా మీ చూపును మరల్చకుండా చేస్తుంది ఈ సినిమా స్క్రీన్‌ప్లే. 'రేఖా చిత్రం' ఓ మలయాళ సినిమా. సోనీ లివ్, ఆహాలో తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా ఉంది. ఈ సినిమాకి దర్శకుడు జోఫిన్ టి చాకో. కథ రాము సునీల్ అందించారు. ప్రముఖ నటులు ఆసిఫ్ అలీ, అనస్వరా రాజన్ ప్రధాన తారాగణంగా నటించారు. సినిమా చూసే ప్రేక్షకులను ఆద్యంతం ఉత్కంఠతతో, ఊహకందని ట్విస్టులతో ఉర్రూతలూగిస్తుంది. అంతలా ఈ సినిమాలో ఏముందో కథలోకి వెళ్లి తెలుసుకుందాం. వివేక్ అనే పోలీస్ ఆఫీసర్‌కి మలక్కపరా అనే ప్రాంతంలో కొత్తగా పోస్టింగ్ వస్తుంది. అప్పటిదాకా అది క్రైమ్ ఫ్రీ ఫారెస్ట్ ప్రాంతం. కానీ వివేక్ ఛార్జ్ తీసుకున్న వెంటనే ఓ ఆత్మహత్య జరుగుతుంది. ఆత్మహత్య చేసుకున్నది రాజేంద్రన్ అనే బిజినెస్ మేన్. అది కూడా ఓ సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకుంటాడు. సెల్ఫీ వీడియోలో తాను కూర్చుని ఉన్న ప్రదేశంలో కొన్నేళ్ల క్రితం ఓ శవాన్ని మరో కొంత మందితో కలిసి పాతి పెట్టానని, ఆ బాధ తనను వేధిస్తుందని ఆత్మహత్య చేసుకుంటాడు. వివేక్ వెంటనే ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టి ఆ ప్రాంతంలో తవ్వగా ఓ అస్థిపంజరం బయటపడుతుంది. అది ఓ అమ్మాయిదని ఫోరెన్సిక్ నివేదికలో తేలుతుంది. ఇప్పుడు వివేక్ చేతిలో రాజేంద్రన్ సెల్ఫీ వీడియో తప్ప ఈ అస్థిపంజరానికి సంబంధించిన ఎటువంటి సాక్ష్యాధారాలు లేవు. మరి... వివేక్ ఈ కేసు ఎలా పరిష్కరించాడో సినిమాలోనే చూడాలి. పైన చెప్పుకున్నట్టు సినిమా మొత్తం ఊహించని ట్విస్టులతో క్లైమాక్సులో ఊహకందని మలుపుతో మతి పోగొడుతుంది. పెద్దవాళ్లు మాత్రమే చూడదగ్గ ఈ సినిమా వీకెండ్‌కు మంచి కాలక్షేపం. వర్తుపుల్ వాచ్ ఫర్ థ్రిల్లింగ్.



– ఇంటూరు హరికృష్ణ

సాక్షి బిజినెస్

శనివారం 15-3-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)

	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
	201	73
	73,829	22,397

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	17,665	▲	363
డోజోన్స్	41,346	▲	533
ఎఫ్‌టీఎస్ఈ 100	8,632	▲	90
డాక్స్	22,987	▲	420
షాంఘై	3,420	▲	61
నికాయ్	30,053	▲	263

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.75	87.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	111.50	114.41
€	యూరో	ఎస్‌బీఐ	93.68	96.37
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.14	59.63
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.37	57.14
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.84	67.48
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.30	23.86
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.80	24.58
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.13	12.95

పసిడి @ 3,000 డాలర్లు

చరిత్రలో తొలిసారి...


న్యూయార్క్: కొన్నేళ్లుగా నిరవధికంగా మెరుస్తున్న పసిడి తాజాగా సరికొత్త రికార్డ్ సృష్టించింది. అంతర్జాతీయ మార్కెట్లలో తొలిసారి ఔన్స్(31.1 గ్రాములు) 3,000 డాలర్ల మైలురాయిని అధిగమించింది. తద్వారా వారాంతాన సైతం బులియన్ మార్కెట్ కళకళలాడుతోంది. న్యూయార్క్ కమోడిటీ ఎక్స్ఛేంజీ(కామెక్స్)లో 3 శాతం బలపడి 3,001 డాలర్లకు చేరింది. ఒకానొక దశలో 3,017 డాలర్ల గరిష్టాన్ని కూడా తాకింది. ఈ ప్రభావం దేశీయంగా నేడు(శనివారం) ఆభరణ మార్కెట్లో ప్రతిఫలించనున్నట్లు బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. వెరసి తరతరాలుగా రక్షణాత్మక పెట్టుబడి సాధనంగా తళతళలాడుతున్న బంగారం మరోసారి ప్రపంచ అనిశ్చితులలో బలాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలియజేశాయి. గత 25ఏళ్లలో చూస్తే పసిడి 10 రెట్లు జంప్‌చేసింది. తద్వారా యూఎస్ స్టాక్ మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ ఎస్అండ్‌పీ-500ను సైతం మించి ర్యాలీ చేయడం గమనార్హం.

ర్యాలీ తీరిలా

గోల్డ్ ఔన్స్ ధర తొలుత 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం తదుపరి 1,000 డాలర్ల మార్క్‌ను అధిగమించింది. తదుపరి కరోనా మహమ్మారి కాలంలో 2,000 డాలర్ల మైలురాయిని తాకింది. తిరిగి 2023, 2024లలో పరుగందుకుంది. ప్రధానంగా వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు డాలర్లకు బదులుగా బంగారాన్ని భారీ స్థాయిలో కొనుగోలు చేస్తుండటం ధరల నిరంతర ర్యాలీకి దోహదపడుతున్నట్లు బులియన్ వర్గాలు తెలియజేశాయి. గతేడాది చివర్లో యూఎస్ ప్రెసిడెంట్‌గా ట్రంప్ ఎన్నికయ్యాక పసిడి మరింత దూకుడు చూపుతోంది. 2024లో 26 శాతం బలపడగా.. 2025లోనూ ఇప్పటివరకూ 14% పెరగడం విశేషం!

20 ట్రిలియన్ డాలర్లు

గత మూడేళ్లుగా పలు దేశాల కేంద్ర బ్యాంకులు పుత్తడిలో కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. దీంతో 2022, 2023, 2024లో 1,000 మెట్రిక్ టన్నులు చొప్పున సొంతం చేసుకున్నాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా పసిడి మార్కెట్ విలువ 20.2 ట్రిలియన్ డాలర్లను తాకగా.. గత 13 నెలల్లోనే 7 ట్రిలియన్ డాలర్ల విలువ జత కలిసింది. యూఎస్ లిస్టెడ్ టాప్-10 దిగ్గజాలు యాపిల్, ఎన్‌విడియా, మైక్రోసాఫ్ట్, మెటా తదితరాల మార్కెట్ విలువసహా.. బిట్‌కాయిన్, సిల్వర్‌ను సైతం పరిగణిస్తే మొత్తం విలువ 19.6 ట్రిలియన్ డాలర్లు మాత్రమే!



ఇండస్‌ఇండ్‌లో అవకతవకలపై ఐసీఏఐ సమీక్ష



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో ఆర్థిక అవకతవకలపై ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లను సమీక్షించే అవకాశం ఉన్నట్లు ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ప్రెసిడెంట్ చరణ్‌జ్యోత్ సింగ్ నందా తెలిపారు. ఫైనాన్షియల్ రిపోర్టింగ్ రివ్యూ బోర్డ్ (ఎఫ్ఆర్ఆర్‌బీ) దీన్ని చేపట్టవచ్చని ఆయన పేర్కొన్నారు. డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో రూ.2,100 కోట్ల మేర వ్యత్యాసాన్ని గుర్తించినట్లు బ్యాంక్ ఇటీవల ప్రకటించడం దుమారం రేపిన సంగతి తెలిసిందే. మరోవైపు, ఇండస్‌ఇండ్ వ్యవహారంపై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ కూడా ప్రాథమిక విచారణ ప్రారంభించే అవకాశం ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-3-2025	
విశాఖ	400-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	390-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	385-00
వరంగల్	387-00
రిటైల్ ధర	4.45

డిజిటల్ జోరు..!

కొన్నాళ్ల క్రితం వరకు ప్రకటనలంటే పత్రికలు, టీవీలు, రేడియోల్లాంటి సాంప్రదాయ మాధ్యమాలకే పరిమితమయ్యేవి. ఇంటర్నెట్ వాడకం పెరిగిన తర్వాత నెమ్మదిగా డిజిటల్ వైపు మళ్లడం మొదలైంది. ఇక అందరి చేతుల్లోకి స్మార్ట్‌ఫోన్లు వచ్చేస్తుండటం, డేటా చౌకగా లభిస్తుండటంలాంటి అంశాల కారణంగా ఇది మరింతగా జోరందుకుంది. ఎంతలా అంటే .. అడ్వర్టైజింగ్ సంస్థలు తమ బడ్జెట్‌లో దాదాపు సగభాగాన్ని డిజిటల్‌కే కేటాయిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఆఖరు నాటికి దేశీయంగా డిజిటల్ అడ్వర్టైజింగ్ విభాగం, సాంప్రదాయ మాధ్యమాలకు మించి ఏకంగా రూ. 62 వేల కోట్లకు చేరుతుందనే అంచనాలు నెలకొన్నాయి.

- సాక్షి, బిజినెస్‌డెస్క్

- ప్రకటనల్లో సాంప్రదాయ మాధ్యమాలను దాటి ముందుకు
- అడ్వర్టైజింగ్ బడ్జెట్లలో సింహభాగం
- టాప్‌లో సోషల్ మీడియా, ఆన్‌లైన్ వీడియోలు, పెయిడ్ సెర్చ్‌లు

అడ్వర్టైజింగ్ పరిశ్రమలో డిజిటల్ మీడియా చాలా వేగంగా ప్రాచుర్యంలోకి వచ్చేసింది. నగరాలు మొదలుకుని గ్రామాల వరకు ఇది అసాధారణ స్థాయిలో విస్తరిస్తోంది. దీంతో డిజిటల్ యూజర్ల దృష్టిని ఆకట్టుకునేందుకు కంపెనీలు ఒకదానితో మరొకటి పోటీపడుతున్నాయి. సాంప్రదాయ మీడియాని మించి డిజిటల్‌పై భారీగా వెచ్చిస్తున్నాయి. అంతర్జాతీయ అడ్వర్టైజింగ్ దిగ్గజం డెంట్సు నివేదిక ప్రకారం.. దేశీఅడ్వర్టైజింగ్ పరిశ్రమ ప్రస్తుతం రూ. 93,166 కోట్లుగా ఉంది. 2025 ఆఖరు నాటికి ఇది సుమారు మరో 10 శాతం పెరిగి రూ. 1,12,453 కోట్లకు చేరుతుందని అంచనా. 2022లోలో రూ. 40,685 కోట్లుగా ఉన్న డిజిటల్ విభాగం ఈ ఏడాది ఆఖరుకల్లా రూ. 62,045 కోట్లకు.. అంటే మొత్తం అడ్వర్టైజింగ్ బడ్జెట్లలో సగానికి పైగానే వాటా దక్కించుకునే అవకాశం ఉంది. గతేడాది విషయం తీసుకుంటే 44 శాతం వాటాతో డిజిటల్ అగ్రస్థానంలో ఉండగా, టీవీ 32 శాతం, ప్రింట్ మీడియా 20% వాటాతో తర్వాత స్థానాల్లో నిల్చాయి. ఏఐలాంటి టెక్నాలజీ ఊతంతో టార్గెట్ ఆడియన్స్‌ను సరిగ్గా చేరుకునే వెసులుబాటు ఉండటం డిజిటల్‌కి సానుకూలాంశంగా ఉంటోంది.

టెలికం అత్యధిక కేటాయింపులు..

టెలికం రంగ సంస్థలు తమ మీడియా బడ్జెట్లలో 64 శాతం భాగాన్ని డిజిటల్‌కి కేటాయిస్తున్నాయి. ఎఫ్ఎంసీజీ సెగ్మెంట్ తమ బడ్జెట్లలో 94 శాతం భాగాన్ని డిజిటల్, టీవీ మాధ్యమాలకు కేటాయిస్తోంది. సాంప్రదాయ అడ్వర్టైజర్లే కాకుండా, డైరెక్ట్ టు కన్జూమర్ బ్రాండ్లు, స్టార్టప్‌లు మొదలైనవి ఎక్కువగా ఆన్‌లైన్ ప్రకటనలపైనే దృష్టి పెడుతున్నాయి. క్విక్-కామర్స్, ఈ-కామర్స్, విద్యా రంగ సంస్థల్లాంటివి మరింతగా కస్టమర్లకు చేరువయ్యేందుకు డిజిటల్ మాధ్యమాల మీదే ఆధారపడుతున్నాయి. షార్ట్ వీడియోలు, సోషల్ కామర్స్‌లపై ఇన్వెస్ట్ చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల డిజిటల్ బడ్జెట్లూ ఎక్కువగానే ఉంటున్నాయి. దేశీయంగా డిజిటల్ విప్లవం ప్రజల జీవితాలు, పరిశ్రమలు, సమాజంలో పెను మార్పులు తీసుకొస్తోందని, కృత్రిమ మేథ కూడా ఇందుకు దోహదపడుతోందని డెంట్సు దక్షిణాసియా సీఈవో హర్ష రజ్దాన్ చెప్పారు. టెక్నాలజీ ఎంత పెరిగినా మానవీయ కోణానికి కూడా ప్రాధాన్యతనివ్వాలని, పారదర్శకత, జవాబుదారీతనం, నైతిక విలువలకు పెద్ద పీట వేస్తూ పరిశ్రమ భవిష్యత్తును తీర్చిదిద్దాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సోషల్ మీడియా హవా...

డిజిటల్ మీడియా కేటగిరీలో చూస్తే 30% వాటాతో (రూ. 11,962 కోట్లు) సోషల్ మీడియా అగ్రస్థానంలో ఉండగా, ఆన్‌లైన్ వీడియోలు 29%, పెయిడ్ సెర్చ్ 23% వాటా దక్కించుకున్నాయి. టెలికం కంపెనీలు తమ డిజిటల్ మీడియా బడ్జెట్లో 80% భాగాన్ని ఆన్‌లైన్ వీడియో, సోషల్ మీడియా, పెయిడ్ సెర్చ్‌లకు కేటాయిస్తున్నాయి. ఈ-కామర్స్ కంపెనీలైతే తమ మొత్తం మీడియా బడ్జెట్లో 61 శాతాన్ని డిజిటల్ మీడియాకు కేటాయిస్తున్నాయి.



డిజిటల్ అడ్వర్టైజింగ్ 2022లో	రూ.40,685 కోట్లు
రూ.62,045 కోట్లు	2025లో చేరుతుందని అంచనా
టెలికం రంగం మీడియా బడ్జెట్‌లో డిజిటల్‌కే	64 శాతం
తర్వాత స్థానాల్లో ఈ-కామర్స్, ఫార్మా కేటగిరీలు	తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీల కేటాయింపులూ ఎక్కువే

తెలుగు రాష్ట్రాల్లోనూ అదే తీరు..

తెలుగు రాష్ట్రాల్లోనూ డిజిటల్, సోషల్ మీడియా ప్రకటనలు జోరుగానే ఉంటున్నాయి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు వీటికి భారీగానే బడ్జెట్లు కేటాయిస్తున్నాయి. రాజకీయేతర డిజిటల్ ప్రకటనల వ్యయాలపై నిర్దిష్ట డేటా లేకపోయినప్పటికీ గత కొన్నాళ్లుగా, చాలా వేగంగా వృద్ధి చెందుతోందని ఓటీఎస్ అడ్వర్టైజింగ్ అకౌంట్ డైరెక్టర్ సాయి సిద్ధార్థ్ నల్లూరి తెలిపారు. దక్షిణాదివ్యాప్తంగా 2020 నాటి నుంచి గణాంకాలు చూస్తే డిజిటల్ అడ్వర్టైజింగ్ 30 శాతం వృద్ధి రేటు కనపర్చిందని చెప్పారు. విద్య తదితర రంగాలు డిజిటల్‌పై ప్రధానంగా దృష్టి పెడుతున్నాయని, ఈ సేవల కోసం స్పెషలైజ్డ్ ఏజెన్సీలు కూడా వచ్చాయని పేర్కొన్నారు. కోవిడ్ తర్వాత సాంప్రదాయ మీడియాపై ప్రకటనల వ్యయాలు తగ్గాయని వివరించారు.

సాక్షి స్పోర్ట్స్



ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లకు బుమ్రా దూరం

న్యూఢిల్లీ: భారత స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ సీజన్ ఐపీఎల్ ఆరంభం నుంచి ముంబై ఇండియన్స్‌కు అందుబాటులో ఉండటం లేదని ఫ్రాంచైజీ వర్గాలు తెలిపాయి. వెన్నుగాయం కారణంగా జనవరి నుంచి ఆటకు దూరమైన స్టార్ పేసర్ భారత్ గెలిచిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడలేకపోయాడు. తాజాగా లీగ్‌కు దూరమయ్యే అవకాశాలున్నాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో ముంబై ఇండియన్స్ అభిమానులకు కాస్త ఊరటనిచ్చే కబురు బయటికొచ్చింది. స్పష్టంగా ఏ రోజు నుంచి, ఏ మ్యాచ్‌కు అతను ఆడేది వెల్లడించనప్పటికీ ఏప్రిల్ రెండో వారంలో బుమ్రా ముంబై ఇండియన్స్ జట్టుతో కలిసే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల చివరి వారం, వచ్చే నెల మొదటి వారం రోజుల్లో జరిగే ముంబై ఇండియన్స్ ఆరంభ మ్యాచ్‌లకు బుమ్రా గైర్హాజరు కానున్నాడు. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాస శిబిరంలో ఉన్న పేసర్ వెన్నుగాయం నుంచి వేగంగా కోలుకుంటున్నాడు.

'క్యాపిటల్స్' కెప్టెన్‌గా అక్షర్ పటేల్

కొత్త సారథిని ప్రకటించిన ఢిల్లీ యాజమాన్యం

న్యూఢిల్లీ: ఐపీఎల్-2025లో అందరికంటే చివరగా ఢిల్లీ క్యాపిటల్స్ తమ సారథి పేరును వెల్లడించింది. టీమ్‌లో అందరికంటే సీనియర్ ఆటగాడైన ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ ఢిల్లీ టీమ్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. కొత్త సీజన్ కోసం అక్షర్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు టీమ్ యజమానులు గ్రంధి కిరణ్ కుమార్, పార్థ్ జిందాల్ ప్రకటించారు. 2019 నుంచి అక్షర్ ఢిల్లీ టీమ్‌లో సభ్యుడిగా కొనసాగుతున్నాడు. ఈ ఏడాది వేలానికి ముందు ఆ టీమ్ అట్టి పెట్టుకున్న ఆటగాళ్లలో అతనూ ఒకడు. రూ.16 కోట్ల 50 లక్షలకు అక్షర్‌ను ఢిల్లీ తమతో కొనసాగించింది. ఇప్పుడు కెప్టెన్సీతో అతనిపై పెద్ద బాధ్యతను ఉంచింది. దీంతో ఈ ఏడాది మొత్తం 10 జట్లలో ఐదు టీమ్‌లు కొత్త కెప్టెన్‌లతో బరిలోకి దిగుతున్నాయి. సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్ మినహా మిగతా 9 జట్లకు భారత ప్లేయర్లే సారథ్యం వహిస్తుండటం విశేషం. ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్సీ విషయంలో కేఎల్ రాహుల్ పేరుపై కూడా చర్చ జరిగినా... అతను వెనక్కి తగ్గినట్లు సమాచారం. 'క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ఇన్నేళ్లుగా ఇదే జట్టు తరఫున నేను క్రికెటర్‌గా ఎంతో ఎదిగాను. సమర్థులైన ఆటగాళ్లతో కూడిన ఈ టీమ్‌కు మంచి ఫలితాలు అందించగలనని నమ్మకంగా ఉన్నా' అని అక్షర్ పటేల్ స్పందించాడు.

ఒక్కో మెట్టే ఎదుగుతూ...

ప్రస్తుతం భారత క్రికెట్ జట్టులో అత్యంత నిలకడ ప్రదర్శిస్తున్న ఆటగాళ్లలో ఒకడిగా అక్షర్ పటేల్ గుర్తింపు తెచ్చుకున్నాడు. గత ఏడాది టి20 వరల్డ్ కప్, ఇటీవలి చాంపియన్స్ ట్రోఫీ విజయాల్లో అతను కీలక పాత్ర పోషించాడు. అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో రాణిస్తుండటంతో ఆల్‌రౌండర్‌గా అతని విలువ మరింత పెరిగింది. ఐపీఎల్‌లో 2014 నుంచి ఐదు సీజన్ల పాటు అక్షర్ పంజాబ్ జట్టు సభ్యుడిగా ఉన్నాడు. ఆ తర్వాత 2019-2024 మధ్య ఆరు సీజన్లలో కలిపి ఢిల్లీ తరఫున 82 మ్యాచ్‌లు ఆడిన అక్షర్ ప్రస్తుత టీమ్‌లో అందరికంటే ఎక్కువ మ్యాచ్‌లలో జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఓవరాల్‌గా ఐపీఎల్‌లో 150 మ్యాచ్‌లు ఆడి 1653 పరుగులు చేయడంతో పాటు 123 వికెట్లు తీసిన రికార్డు అతని సొంతం. సీనియర్ స్థాయిలో కెప్టెన్‌గా అక్షర్‌కు పెద్దగా అనుభవం లేదు. దేశవాళీలో వన్డేలు, టి20లు కలిపి గుజరాత్ జట్టుకు అతను 23 మ్యాచ్‌లలో సారథ్యం వహించాడు. అయితే గత ఏడాది ఐపీఎల్ చివరి లీగ్ మ్యాచ్‌లో అతను ఢిల్లీకి కెప్టెన్‌గా వ్యవహరించాడు. స్లో ఓవర్‌రేట్ సమస్యతో రిషభ్ పంత్‌పై నిషేధం పడటంతో అక్షర్ సారథిగా నిలబడాల్సి వచ్చింది. ఈ ఏడాది ఆరంభంలో భారత జట్టు వైస్ కెప్టెన్‌గా కూడా అక్షర్ వ్యవహరించాడు.




రాత మారేనా...

ఐపీఎల్ ఆరంభమైనప్పుడు ఉన్న ఎనిమిది జట్లలో చూస్తే ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ నెగ్గని మూడు టీమ్‌లలో బెంగళూరు, పంజాబ్‌లతో పాటు ఢిల్లీ కూడా ఉంది. 2020లో ఫైనల్‌కు చేరడం క్యాపిటల్స్ అత్యుత్తమ ప్రదర్శన. తుది పోరులో ముంబై చేతిలో ఓడి రన్నరప్‌గా ముగించింది. లీగ్ తొలి రెండు సీజన్లలో సెమీఫైనల్ చేరిన ఢిల్లీ జట్టు ప్రమాణాలు ఒక్కసారిగా పడిపోయాయి. ఎన్ని మార్పులు, ఎన్ని ప్రయోగాలు చేసినా ఆ జట్టు రాత మారలేదు. 2010-2024 మధ్య 15 సీజన్లలో ఒకసారి ఫైనల్ చేరిన జట్టు మరో మూడుసార్లు 'ప్లే ఆఫ్స్' వరకు వెళ్లగలిగింది. మిగతా 11 సార్లు లీగ్ దశకే పరిమితమైంది. కేఎల్ రాహుల్, కుల్దీప్ యాదవ్, మిచెల్ స్టార్క్, డుప్లెసిస్, జేక్ ఫ్రేజర్, ట్రిస్టన్ స్టబ్స్, మోహిత్ శర్మ, నటరాజన్ ప్రస్తుత టీమ్‌లో కీలక ఆటగాళ్లు. 2025 సీజన్ కోసం ఢిల్లీ సహాయక సిబ్బందిలో కూడా పలు మార్పులు చేసి బరిలోకి దిగుతోంది. హేమంగ్ బదాని (హెడ్ కోచ్), ఆంధ్ర మాజీ క్రికెటర్ వేణుగోపాలరావు (డైరెక్టర్), మాథ్యూ మాట్ (అసిస్టెంట్ కోచ్), మునాఫ్ పటేల్ (బౌలింగ్ కోచ్), కెవిన్ పీటర్సన్ (మెంటార్)లు జట్టు బాధ్యతలు తీసుకుంటున్నారు. ఈ కొత్త బృందంతో కలిసి కెప్టెన్‌గా అక్షర్ పటేల్ ఎలాంటి ఫలితాలు రాబడతాడనేది ఆసక్తికరం.

2025 సీజన్‌లో ఐపీఎల్ జట్ల కెప్టెన్లు

- ముంబై ఇండియన్స్: హార్దిక్ పాండ్యా
- చెన్నై సూపర్ కింగ్స్: రుతురాజ్ గైక్వాడ్
- కోల్‌కతా నైట్‌రైడర్స్: అజింక్య రహానే
- రాజస్తాన్ రాయల్స్: సంజూ సామ్సన్
- గుజరాత్ టైటాన్స్: శుబ్‌మన్ గిల్
- పంజాబ్ కింగ్స్: శ్రేయస్ అయ్యర్
- లక్నో సూపర్ జెయింట్స్: రిషభ్ పంత్
- రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: రజత్ పాటీదార్
- ఢిల్లీ క్యాపిటల్స్: అక్షర్ పటేల్
- సన్‌రైజర్స్ హైదరాబాద్: ప్యాట్ కమిన్స్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



ఢిల్లీ ఈ సారైనా సాధించేనా!

నేడు డబ్ల్యూపీఎల్ ఫైనల్
- ముంబై ఇండియన్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ 'ఢీ'
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో 17 సీజన్ల పాటు ఆడినా ఢిల్లీ జట్టు టైటిల్ గెలవలేకపోయింది. అదే యాజమాన్యానికి చెందిన మహిళల జట్టు ఢిల్లీ క్యాపిటల్స్ కూడా ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో వరుసగా రెండు సీజన్ల పాటు నిరాశపర్చింది. 2023, 2024 సీజన్లలో గ్రూప్ దశలో టాపర్‌గా నిలవడంతో ఫైనల్‌కు చేరిన క్యాపిటల్స్ రెండుసార్లూ ఫైనల్ మ్యాచ్‌లలో ఓడి రన్నరప్‌గానే సంతృప్తి చెందాల్సి వచ్చింది. ఇప్పుడు తాజా సీజన్‌లో కూడా టాపర్‌గా ఫైనల్ చేరిన టీమ్ మరోసారి ట్రోఫీ కోసం తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. నేడు జరిగే ఫైనల్లో 2023 చాంపియన్ ముంబై ఇండియన్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ ఆడుతుంది. తాజా సీజన్ లీగ్ దశలో ఇరు జట్ల మధ్య జరిగిన రెండు మ్యాచ్‌లలోనూ ఢిల్లీనే నెగ్గి 2-0తో ఆధిక్యం ఉంది.

అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో ఆల్‌టైమ్ గ్రేట్ కెప్టెన్‌గా ఉన్న మెగ్ లానింగ్ గత ఏడాది ఢిల్లీకి టైటిల్ అందించడంలో విఫలమైంది. ఈసారి అది పునరావృతం కాకుండా సత్తా చాటాలని ఆమె పట్టుదలగా ఉంది. సీజన్‌లో ఏకంగా 157.89 స్ట్రయిక్ రేట్‌తో 300 పరుగులు చేసిన షఫాలీ వర్మ మరోసారి టీమ్‌కు కీలకం కానుంది. మెగ్ లానింగ్ కూడా 263 పరుగులతో టీమ్ విజయాల్లో ప్రధాన పాత్ర పోషించింది. జెమీమా రోడ్రిగ్స్ మాత్రం ఆశించినంత మెరుగైన ప్రదర్శన ఇవ్వలేదు. ఫైనల్లోనైనా ఆమె రాణించాల్సి ఉంది. ఆల్‌రౌండర్‌గా జెస్ జొనాసెన్ టోర్నీలో చక్కటి ప్రదర్శన కనబర్చింది. 137 పరుగులతో పాటు 11 వికెట్లు తీసిన ఆమెకు శిఖా పాండే (11) అండగా నిలిచింది. వీరిద్దరితో పాటు అనాబెల్ సదర్లాండ్ తమ బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేయగలరు.

దూకుడైన బ్యాటింగే ముంబై ప్రధాన బలం. నాట్ సివర్ 156.50 స్ట్రయిక్‌రేట్‌తో 5 అర్ధసెంచరీలు సహా 493 పరుగులు సాధించి అగ్ర స్థానంలో ఉంది. హేలీ మాథ్యూస్ (304) కూడా దూకుడైన ఆటకు మారు పేరు. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా 156.29 స్ట్రయిక్ రేట్‌తో 236 పరుగులు చేసి తన వంతు పాత్ర పోషించింది. బౌలింగ్‌లో హేలీ, అమెలియా కెర్ కలిసి 33 వికెట్లతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. సమష్టిగా సత్తా చాటడంతో ముంబై జట్టుదే పైచేయి. ఈ నేపథ్యంలో అంతిమ విజేత ఎవరు అవుతారనేది చూడాలి.

వరుసగా 24వ ఏడాది టైటిల్ లేకుండానే...

- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో ముగిసిన భారత్ పోరు
- క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయిన లక్ష్య సేన్, గాయత్రి-ట్రెసా జోడీ

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నుంచి వరుసగా 24వ ఏడాది భారత క్రీడాకారులు టైటిల్ లేకుండానే తిరిగి రానున్నారు. భారత్ నుంచి ఐదు విభాగాల్లో కలిపి మొత్తం 17 మంది క్రీడాకారులు ఈ మెగా టోర్నీలో బరిలోకి దిగగా... ఒక్కరు కూడా క్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేకపోయారు. సంచలన విజయాలతో ఆశలు రేకెత్తించిన లక్ష్య సేన్, పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ లక్ష్య సేన్ 10-21, 16-21తో ఆరో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)ను ఓడించిన లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్లో అదే ఫలితాన్ని పునరావృతం చేయడంలో విఫలమయ్యాడు.



గాయత్రి, ట్రెసా

మహిళల డబుల్స్‌లో 2022, 2023లలో సెమీఫైనల్ చేరిన పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ ఈసారి క్వార్టర్ ఫైనల్లో 14-21, 10-21తో రెండో సీడ్ లియు షెంగ్‌షు-టాన్ నింగ్ (చైనా) జంట చేతిలో ఓడింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా జోడీ 15-21, 21-18, 21-18తో ఎనిమిదో సీడ్ కిమ్ హై జియోంగ్-కాంగ్ హీ యోంగ్ (కొరియా) జంటను ఓడించిది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన లక్ష్య సేన్‌కు 7,975 డాలర్లు (రూ. 6 లక్షల 93 వేలు)... గాయత్రి-ట్రెసాలకు 9,062 డాలర్లు (రూ. 7 లక్షల 87 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

2 గతంలో భారత్ నుంచి ప్రకాశ్ పదుకొనే (1980లో), పుల్లెల గోపీచంద్ (2001లో) మాత్రమే ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో టైటిల్స్ సాధించారు. 2015లో సైనా నెహ్వాల్, 2022లో లక్ష్య సేన్ ఫైనల్ చేరుకున్నా రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకున్నారు.



మాదక ద్రవ్యాల అక్రమ రవాణా

దేశంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులు 2022లో 1,02,769 నమోదుకాగా, 2023లో 1,09,546, 2024లో 89,913 నమోదయ్యాయి. ఈ మూడేళ్లలో మొత్తం కేసుల్లో శిక్షలు పడినవారు కేవలం 268. ఏపీలో 2023లో 1,749 నమోదైతే 2024లో 1,869 కేసులు నమోదయ్యాయి. కేరళలో రికార్డు స్థాయిలో 2023లో 30వేలకుపైగా కేసులు నమోదు కాగా.. 2024లో 27,701 నమోదయ్యాయి.

రాష్ట్రం	2024లో కేసులు
కేరళ	27,701
పంజాబ్	9,025
మహారాష్ట్ర	7,536
యూపీ	6,204
రాజస్థాన్	5,462
మధ్యప్రదేశ్	4,351
ఒడిశా	3,187
హర్యానా	3,062
తెలంగాణ	2,387

ఆధారం : నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో

అగ్నివీర్‌కు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: భారత సైన్యంలో అగ్నివీర్ పోస్టుల భర్తీకి.. అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ 2025–26 పేరిట నోటిఫికేషన్ జారీ అయ్యింది అన్ని కేటగిరీల్లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు 'www.joinindianarmy.nic.in' వెబ్‌సైట్‌లో చూడాలని అధికారులు సూచించారు.

రెవెన్యూలో కొత్త 'కేడర్ స్ట్రెంగ్త్'

ప్రతిపాదనలు పంపాలని సీసీఎల్‌ఏకు ప్రభుత్వం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల (ఎస్‌జీడీసీ)ల కేడర్ స్ట్రెంగ్త్ ఫిక్స్ కానుంది. ఈ పోస్టుల సంఖ్యను రాష్ట్ర ప్రభుత్వం 39 నుంచి 50కి పెంచడం, కొత్తగా 33 అదనపు కలెక్టర్ పోస్టులను అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో ఎస్‌జీడీసీల కేడర్ స్ట్రెంగ్త్ కు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ అదనపు కార్యదర్శి ఎల్ఎల్‌వి సుబ్బమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌జీడీసీల కేడర్ స్ట్రెంగ్త్ ఫిక్స్ చేయాలని, అదే విధంగా ప్రభుత్వం కొత్తగా అప్‌గ్రేడ్ చేసిన 33 అదనపు కలెక్టర్ పోస్టుల కోసం అర్హులైన వారికి పదోన్నతులివ్వాలని కోరుతూ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి. లచ్చిరెడ్డి చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సీసీఎల్‌ఏకు ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో వీలున్నంత త్వరలోనే రెవెన్యూ శాఖలో ఎస్‌జీడీసీల కేడర్ స్ట్రెంగ్త్ ఫిక్స్ కావడంతో పాటు అర్హులైన ఎస్‌జీడీసీలు అదనపు కలెక్టర్లుగా పదోన్నతులు పొందడానికి మార్గం సుగమం అయింది.

హోలీ పండుగ వేళ పిడిగుద్దులాట



హున్స గ్రామంలో రెండు వర్గాలుగా విడిపోయి కొట్టుకుంటున్న గ్రామస్తులు

బోధన్: మహారాష్ట్ర సరిహద్దు, మంజీర నది తీరాన నిజామాబాద్ జిల్లా బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని సాలూర మండలం హున్స గ్రామంలో హోలీ పండుగ వేళ ఆనవాయితీగా వస్తున్న పిడిగుద్దులాట శుక్రవారం సాయంత్రం యథావిధిగా కొనసాగింది. గ్రామంలోని హనుమాన్ మందిరం ఎదుట పిడిగుద్దులాటకు ఏర్పాట్లు చేశారు. కర్ర స్తంభాలు పాతి.. మధ్యలో బలమైన తాడు కట్టారు. గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి బిగి పిడికిళ్లతో ఒకరినొకరు కొట్టుకున్నారు. డప్పు వాయిద్యాలు, కేరింతల మధ్య ఈ ఆట ప్రారంభమైంది. ఆట ముగిసిన అనంతరం ఒకొరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఆటను తిలకించేందుకు గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు వందలాదిగా తరలి వచ్చారు. మొదట పిడిగుద్దులాట చట్టవిరుద్ధమంటూ పోలీసులు ఆంక్షలు విధించారు. గ్రామ పెద్దలకు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పిడిగుద్దులాట కొనసాగింపుపై రెండు రోజులుగా సందిగ్ధం, ఉత్కంఠ కొనసాగింది. వందేళ్ల క్రితం నుంచి ఆనవాయితీగా పిడిగుద్దులాట వస్తోందని గ్రామస్తులు పోలీసులను ఒప్పించారు. సాయంత్రం 5.58 గంటలకు ప్రారంభమైన పిడిగుద్దులాట.. 10 నిమిషాల పాటు సాగింది. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మన దగ్గరే మఖానా

బిహార్‌లో మఖానా సాగుచేస్తున్న మడుగు



రాష్ట్రంలో మొదటిసారిగా నల్లగొండ జిల్లాలో సాగుకు కసరత్తు

కలెక్టర్ ప్రత్యేక చొరవతో బిహార్‌కు వెళ్లొచ్చిన అధికారుల బృందం

ఆగస్టులో సాగుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖ సన్నాహాలు



మఖానా పువ్వు



మఖానా కాయలు



మఖానా గింజలు



ప్రాసెసింగ్ తరువాత మఖానా

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సమృద్ధిగా పోషకాలు అందించే మఖానా దేశంలో బిహార్‌లో మాత్రమే అధికంగా సాగవుతోంది. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు వీటిని స్వేచ్ఛగా తినొచ్చు. ప్రస్తుతం రాష్ట్రంలో సూపర్ మార్కెట్లలో మాత్రమే లభ్యమవుతున్న ఈ సీడ్స్ పంట త్వరలో రాష్ట్రంలో, అదీ నల్లగొండ జిల్లాలో సాగు చేసేందుకు కసరత్తు మొదలైంది. నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక చొరవతో ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అధికారుల బృందం దీనిపై అధ్యయనం చేసింది. ఇటీవల బిహార్‌లోని దర్భంగా జిల్లాలోని పలు గ్రామాలను సందర్శించి మఖానా పంట సాగుపై అధ్యయనం చేసింది. వచ్చే ఆగస్టులో జిల్లాలోని ఐదు ప్రాంతాల్లో ఈ పంట సాగుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మఖానా సాగుకు అనువైన భూములున్నాయి. ఈ పంట సాగు కేవలం నీటి నిల్వ చేయగలిగిన మడుగులలో మాత్రమే చేయొచ్చని, సాగుచేసిన 8 నెలల్లో పంట చేతికొస్తుందని అధికారులు చెప్పారు. సీడ్స్‌ను బిహార్ నుంచి తెప్పించేందుకు చర్యలు చేపట్టారు. కంపాసాగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం, కొండమల్లేపల్లిలోని ఉద్యాన పరిశోధన సెంటర్‌తోపాటు దేవరకొండ, నల్లగొండ, తిప్పర్తి ప్రాంతాల్లో ఎంపిక చేసిన ఆదర్శ రైతులతో సాగు చేయించేలా ప్రణాళికను సిద్ధం చేశారు. సాగుకు ఎకరాకు రూ.50–75 వేల వరకు పెట్టుబడి అవసరం అవుతుంది. 8 నెలల తర్వాత పెట్టుబడిపోను ఎకరాకు రూ.లక్షన్నర వరకు లాభం వస్తుందని అంటున్నారు.

పెట్టుబడి 50వేలు.. లాభం లక్షన్నర



అనంతరెడ్డి, ఉద్యానవన శాఖ, నల్లగొండ డివిజన్ అధికారి

సాగు విధానం ఇలా..

మడుగులను సిద్ధం చేసుకుని మడుగులో 2 అడుగుల వరకు నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి. అందులో మఖానా గింజలను నారు పోసుకోవాలి. నారు పెరిగాక పొలంలో మీటర్ దూరంలో ఒక్కో మొక్కను నాటుకోవాలి. నీటిపై తేలియాడే ఆకు మీటర్ విస్తీర్ణం వరకు విస్తరిస్తుంది. ఆ తర్వాత ఆకు కింద నుంచి పువ్వు వస్తుంది. అందులో కాయలు కాస్తాయి. ఆ కాయలు రాలి నీటిలో పడతాయి. వాటిని గంపలతో తీసుకోవాలి. ఒక్కో కాయలో 60 నుంచి 100 వరకు గింజలు ఉంటాయి. వాటిని ప్రాసెసింగ్ చేసి మార్కెటింగ్ చేయొచ్చు.

రైతులకు ప్రయోజనం

మఖానా పంటను సాగుచేస్తే రైతులు ఆర్థికంగా లాభపడతారు. వానాకాలంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ పంట సాగును ప్రారంభిస్తాం. పంట కోతకు వచ్చిన తర్వాత సాగుపై రైతులకు అవగాహన కలిగించి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని భావిస్తున్నాం.



శ్రీనివాస్, నల్లగొండ మండల వ్యవసాయ అధికారి

మయన్మార్ సైబర్ స్కాం కేసులో 8 మంది ఏజెంట్ల అరెస్టు

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో ఉద్యోగాల పేరిట అమాయకులను మయన్మార్‌లోని సైబర్ నేరగాళ్ల ముఠాలకు అమ్మేస్తున్న స్థానిక ఏజెంట్లపై టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఫోకస్ పెట్టింది. ఈ కేసులో పాల్గొన్న మొత్తం 15 మంది ఏజెంట్లను, మధ్యవర్తులను గుర్తించినట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు వెల్లడించారు. మరో ఐదుగురు విదేశాల్లో ఉన్నట్టు సమాచారం ఉందని, వారిని గుర్తించి అవసరమైన చర్యలు తీసుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నట్టు వెల్లడించారు. కాగా, మయన్మార్ సైబర్ మోసగాళ్ల దగ్గర బానిసలుగా మారిన 540 మంది భారత పౌరులను కేంద్ర ప్రభుత్వం రక్షించి, స్వదేశానికి తిరిగి రప్పించినట్టు తెలిపారు. ఇందులో తెలంగాణకు చెందిన 24 మంది రెండు దఫాల్లో ఈనెల 10, 11 తేదీల్లో స్వస్థలాలకు చేరుకున్నట్టు తెలిపారు. వీరిని మోసగించి విదేశాలకు తరలించిన ఏజెంట్లపై తెలంగాణలోని వివిధ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు 9 కేసులు నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతున్నట్టు శిఖాగోయల్ తెలిపారు. విదేశాల్లో ఉద్యోగాల పేరిట వచ్చే ఆఫర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. మోసాలపై 1930 లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని ఆమె పేర్కొన్నారు.

ఇలా కొట్టేశారు.. అలా పట్టేశారు..

గంటల వ్యవధిలోనే రూ.1.95 కోట్లు కాపాడిన టీజీసీఎస్‌బీ అధికారులు

- కంపెనీ సీఎండీ పేరిట అకౌంట్స్ అధికారికి సైబర్ నేరగాళ్ల మెసేజ్
- నిజమేనని నమ్మి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసిన సదరు అధికారి

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు తెలివిగా ఓ కంపెనీ ఖాతా నుంచి కొట్టేసిన రూ.1.95 కోట్లను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు గంటల వ్యవధిలోనే కాపాడారు. మోసం జరిగినట్టు గుర్తించిన వెంటనే సదరు కంపెనీ ప్రతినిధులు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన టీజీసీఎస్‌బీ అధికారులు బ్యాంక్ నోడల్ అధికారులతో సమన్వయం చేసుకున్నారు. సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన రూ.1.95 కోట్లు డ్రా చేసుకునేలోపే ఆ మొత్తాన్ని టీజీసీఎస్‌బీ అధికారులు ఫ్రీజ్ చేయించారు. ఈ కేసు వివరాలను టీజీ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మార్చి 13న (గురువారం) ఒక కంపెనీలోని అకౌంట్స్ అధికారికి సదరు కంపెనీ సీఎండీ ప్రొఫైల్ చిత్రంతో ఉన్న వాట్సాప్ నంబర్ నుంచి ఒక సందేశం వచ్చింది. కొత్త ప్రాజెక్ట్ కోసం డబ్బులు పంపాల్సి ఉందని, తాను ఎస్ఎంఎస్‌లో పేర్కొన్న ఖాతాకు రూ. 1.95 కోట్ల అడ్వాన్స్ చెల్లింపు చేయాలని అందులో ఉంది. సీఈఓ మెసేజ్‌ని నిజమని భావించిన అధికారి గురువారం మధ్యాహ్నం 1:02 గంటలకు ఆ మొత్తాన్ని బదిలీ చేశాడు. కొద్దిసేపటి తర్వాత, నిజమైన సీఎండీకి బ్యాంక్ నోటిఫికేషన్ వచ్చింది. అప్రమత్తమైన అతను తాము సైబర్ మోసానికి గురయ్యామని గ్రహించాడు. వెంటనే నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం 2.51 నిమిషాలకు సమాచారం అందుకున్న టీజీసీఎస్‌బీ అధికారులు ఫిర్యాదుదారుని నుంచి వివరాలు సేకరించి, బ్యాంక్ అధికారులతో సమన్వయం చేసుకున్నారు. డబ్బులు కొట్టేసిన సైబర్ మోసగాళ్లు డ్రా చేసుకునేలోపు మొత్తం రూ. 1.95 కోట్లు ఫ్రీజ్ చేశారు.

టిక్ టిక్ టిక్

రాష్ట్రంలో ఎవరెంత పనిచేస్తున్నారు? పట్టణం, పల్లె మధ్య వ్యత్యాసాలేమిటి? ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల పని గంటల మధ్య తేడా ఉందా? స్త్రీ, పురుషుల పరిస్థితి ఏమిటి? కేంద్ర గణాంకాల శాఖ రూపొందించిన నివేదిక ప్రకారం వివరాలివిగో..



తెలంగాణలో ఉద్యోగి రోజుకు ఎన్ని గంటలు పని చేస్తాడు?

దేశ సగటు	7.03
ఢిల్లీ (అత్యధికం)	8.26
గోవా (అత్యల్పం)	5.53
తెలంగాణ	7.21

ఎవరు ఎక్కువ పని చేస్తున్నారు? (గంటల్లో)

పట్టణమా.. పల్లెనా?


దేశ పట్టణ సగటు	7.81
దేశ పల్లె సగటు	6.65
పట్టణ తెలంగాణ	8.06
పల్లె తెలంగాణ	6.71

తెలంగాణలో ఏ రంగంలో పని గంటలు ఎక్కువ?


ప్రాథమిక రంగం (వ్యవసాయం, మైనింగ్, చేపలు పట్టడం, అడవుల్లో పని)	6.48
ద్వితీయ రంగం (ఉత్పత్తి, ప్రాసెసింగ్, నిర్మాణం)	7.10
తృతీయ రంగం(సేవలు, రవాణా, రీటైల్, విద్య, ఆరోగ్యం)	8.23

తెలంగాణలో ఐటీ, ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్ పరిశ్రమలు విస్తృతంగా ఉండటంతో సర్వీసు రంగంలో పని గంటలు ఎక్కువగా ఉన్నాయి

పురుషులు, స్త్రీలు సమానంగా పనిచేస్తున్నారా?



మహిళలు వేతనం లేని పనులు(ఇంటి పనులు, పిల్లలను చూసుకోవడం) కూడా చేస్తుండటం వల్ల వేతనంతో కూడిన పని గంటల విషయంలో వారి శాతం కొంత తగ్గింది



సాక్షి, సెంట్రల్‌డెస్క్

వచ్చే జనవరి 21 నుంచి వింగ్స్ ఇండియా ప్రదర్శన



సాక్షి, హైదరాబాద్: వింగ్స్ ఇండియా–2026 వైమానిక ప్రదర్శనకు తేదీలు ఖరారయ్యాయి. 2026 జనవరి 21 నుంచి 24 వరకు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో ఈ కార్యక్రమం జరగనుంది. పౌర విమానయాన రంగంలో ఆసియాలో అతిపెద్ద కార్యక్రమం అయిన వింగ్స్ ఇండియాను రెండేళ్లకోసారి బేగంపేట ఎయిర్‌పోర్టులో నిర్వహిస్తున్నారు. 2024లో జరిగిన వింగ్స్ ఇండియా కార్యక్రమంలో 25 విమానాలు, హెలికాప్టర్లు కొలువుదీరాయి. 130 కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించాయి. దేశ, విదేశాల నుంచి అనేక వ్యాపార సంస్థలకు చెందిన 5,000 పైచిలుకు ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే 1,20,000 మందికిపైగా సాధారణ పౌరులు ప్రదర్శనను తిలకించారు.

ఫోన్‌పే సౌండ్ బాక్స్ యాప్ పేరిట నకిలీ లింకులు

- ఏపీకే ఫైల్స్ పంపుతున్న సైబర్ నేరగాళ్లు
- డౌన్‌లోడ్ చేస్తే మన డేటా మొత్తం చోరీ
- అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయొద్దు: పోలీసులు

సాక్షి, హైదరాబాద్



చాయ్ హోటల్ మొదలు.. సూపర్ మార్కెట్‌లో కొనుగోళ్ల వరకు ఇప్పుడు ఫోన్‌పే లేదా గూగుల్‌పేలో మొబైల్ ఫోన్ ద్వారా డబ్బులు చెల్లించడం సర్వసాధారణంగా మారింది. మనం డబ్బులు పంపిన విషయాన్ని నిర్ధారించుకునేందుకు కొందరు వ్యాపారులు స్పీకర్ పెట్టుకోవడం గమనిస్తూనే ఉన్నాం. అయితే సైబర్ నేరగాళ్లు ఇప్పుడు దీనిని కూడా తమ మోసాలకు అవకాశంగా మార్చుకుంటున్నారు. ఫోన్‌పే స్పీకర్ లేకుండా కూడా మీ ఫోన్‌లో వాయిస్ రావాలంటే మేం పంపే లింక్‌పై క్లిక్ చేసి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి.. అంటూ సైబర్ నేరగాళ్లు లింక్‌లు పంపుతున్నారు. ఇలాంటి వాటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఫోన్‌పే సౌండ్ బాక్స్ అని సూచిస్తూ ఏపీకే (ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజ్) ఫైల్స్ వస్తే వాటిపై ఎట్టిపరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు. వాస్తవానికి ఫోన్‌పే పేరిట ఇలాంటి యాప్‌లు ఏమీ లేవని, మార్కెట్‌లో బాగా ప్రాచుర్యంలో ఉండే యాప్‌ల బ్రాండ్ ఇమేజ్‌ని వాడుకుని ప్రజలను మోసగించేందుకు సైబర్ దొంగలే ఇలాంటి ఫేక్ లింక్‌లు పంపుతున్నారని వారు పేర్కొన్నారు. ఇలాంటి లింక్‌లపై క్లిక్ చేసి ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేస్తే.. మన ఫోన్ సైబర్ నేరగాళ్ల అధీనంలోకి వెళ్లడంతోపాటు మన కీలక వివరాలు, బ్యాంకు ఖాతాల వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. అనుమానాస్పద లింక్‌లతో వచ్చే మెసేజ్‌లపై వెంటనే సైబర్ క్రైం బ్యూరో వెబ్‌సైట్ cybercrime.gov.in లోకి వెళ్లి report and check status ఆప్షన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

నగరం.. హోలీ వర్ణ శోభితం..

శుక్రవారం హోలీ పండుగను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ కనిపించారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు రంగుల పండుగలో సందడి చేశారు. పలుచోట్ల డీజేల హోరులో యువత నృత్యాలు చేస్తూ కనిపించారు.









డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు లేఖ అందజేస్తున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నేతలు

అనుమతులకు ఆగని డిమాండ్

- పదేళ్లలో అనేక బొగ్గు గనుల మూత
- కొత్త గనుల టెండర్లలో సింగరేణికి అనుమతివ్వాలి
- సింగరేణి గుర్తించిన గనులు సంస్థకే ఇవ్వాలి
- కార్మిక సంఘాల డిమాండ్

గోదావరిఖని:

పదేళ్లలో బొగ్గు నిల్వలు అడుగంటనున్నాయి. గనులు మూతపడనున్నాయి. ఈ తరుణంలో కొత్త గనుల ఏర్పాటు అవశ్యం.. నూతన బొగ్గు గనుల కోసం నిర్వహించనున్న టెండర్ల వేలంలో పాల్గొనేందుకు సింగరేణి సంస్థకు అనుమతివ్వాలన్న కార్మిక సంఘాల డిమాండ్ ఊపందుకుంటోంది.

టెండర్లలో పాల్గొనాల్సిందేనా?

నూతన బొగ్గు గనుల కోసం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంఎండీఆర్ చట్టం ప్రకారం టెండర్లలో పాల్గొనాల్సిందేనా? గుజరాత్ తరహాలో.. తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించేందుకు పోరాటం నిర్వహించాలా? లేక బేషరతుగా అప్పగిస్తారా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఈక్రమంలో సింగరేణి గుర్తించిన బొగ్గు బ్లాకులను సంస్థకే అప్పగించాలని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ అందజేశాయి. మరో పదేళ్ల తర్వాత చాలా గనుల్లో బొగ్గు నిల్వలు అడుగంటిపోతాయి. ఈ క్రమంలో కొత్తగనుల ఏర్పాటు తప్పనిసరిగా మారింది.

రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి

సింగరేణి కొత్త బొగ్గు బ్లాకులు దక్కించుకోవడానికి.. టెండర్లలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ నేతలు ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు లేఖ రాశారు. ఇప్పటికే గుర్తించిన సత్తుపల్లి ఓసీపీ-3, ఇల్లెందు ఓసీపీ-3, తాడిచర్ల గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు.



సింగరేణి కార్మికులు

ఉద్యమానికి కార్మిక సంఘాలు సన్నద్ధం

కొత్త గనులను సాధించుకుంటామని, దీని కోసం కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్న టెండర్లలో పాల్గొనేది లేదని చెప్పి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలుపొందిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు... కార్మికులను మోసగించాయని సింగరేణిలో ఐక్యవేదిక నాయకులు మండిపడుతున్నారు. పోరాటం చేసి సంస్థ గుర్తించిన బొగ్గు బ్లాకులను దక్కించుకోవాలని కోరుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి.. నూతన గనుల కోసం అనుమతులు తీసుకురావాలని కోరుతున్నాయి.

కొత్త గనులతోనే భవిత



కొత్తగనుల రాకతోనే సింగరేణికి ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. దీనికోసం టెండర్లలో పాల్గొనాలి. రాబోయే పదేళ్లలో అనేక గనుల్లో బొగ్గు నిల్వలు అడుగంటుతాయి. ఈక్రమంలో టెండర్లకు వెళ్లడమే ఏకైక మార్గం.

– వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

ప్రభుత్వం అనుమతివ్వాలి



కొత్త గనులు రావాలంటే టెండర్లలో పాల్గొనాల్సిందే. దీనికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి. సంస్థ భవిష్యత్ కోసం టెండర్లలో పాల్గొనాలి. లేకుంటే వేలాది మంది సింగరేణి కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుంది.

– జనక్‌ప్రసాద్, సెక్రటరీ జనరల్, ఐఎన్‌టీయూసీ

డిప్యూటీ సీఎంను కలుస్తాం



గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల తీరుపై పోరాటాన్ని ఉధృతం చేస్తాం. గతంలో డిప్యూటీ సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతాం. గెలిచిన సంఘాల తీరును ఎండగడుతాం. డిప్యూటీ సీఎంను కలిసి సమస్య వివరిస్తాం.


– రియాజ్ అహ్మద్, ఐక్యవేదిక కన్వీనర్

గిరులకు వెలుగుల సిరి

అటవీ గ్రామాలకు విద్యుత్ సరఫరా

ఆదివాసీ గూడేలకు లైన్ల ఏర్పాటు

- వ్యవసాయ క్షేత్రాలకు కనెక్షన్లు
- గృహావసరాలు, సాగు కోసం సరఫరా
- సౌర విద్యుత్‌పై రైతులకు ప్రోత్సాహం



నెహ్రూసెంటర్: మారుమూల అటవీ కుగ్రామాల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఆదివాసీ గూడేలు కాంతులు వెదజల్లుతున్నాయి.

గృహావసరాలతో పాటు వ్యవసాయానికి.. పోడు సాగుదారుల భూములకు లైన్లు వేసి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, కేసముద్రం, బయ్యారం, డోర్నకల్, మరిపెడ, మహబూబాబాద్, గంగారంతో పాటు ఇతర మండలాల్లో రైతుల కోసం విద్యుత్ లైన్లు వేస్తున్నారు. రెండేళ్ల క్రితం గిరివికాసం పథకంలో భాగంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని 180 మంది రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఆ సమయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బోర్లు వేసి కొన్నిటికి మోటార్లు బిగించారు. దీంతో ఏజెన్సీ ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది.

ప్రస్తుతం 200 మంది రైతులకు..

ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతమైన కంబాలపల్లితో పాటు ఇతర ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు వేసేందుకు విద్యుత్ శాఖ కసరత్తు చేస్తోంది. 200 మంది రైతులకు లబ్ధి చేకూరేలా నిర్ణయం తీసుకుంది. సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, విద్యుదుత్పత్తికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రైతులతో పాటు మహిళా సంఘాలకు సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలను అప్పగించనున్నారు.

సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా...

ఆసక్తి గల రైతులు ముందుకు వచ్చి సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు సూచిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు 57 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. రైతులతో పాటు మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు గ్రామైక్య సంఘాలకు ప్లాంట్లు మంజూరు చేస్తున్నారు. దీనిద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.

నాలుగెకరాల్లో సాగు



గిరివికాసం పథకం కింద విద్యుత్ లైన్లు వేశారు. నాలుగెకరాల వ్యవసాయ క్షేత్రంలో పంటలు సాగు చేస్తున్నాను. గిరిజన రైతుల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలి. మరిన్ని పథకాలు అమలు చేయాలి.

– రామచందర్, రైతు, రేగడితండా

మోటార్లు అందించలేదు



ఏజెన్సీ ప్రాంతాల్లో కొత్త లైన్లను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ సమస్య పరిష్కారమైంది. గిరి వికాసం పథకం కింద.. గిరిజన రైతుల కోసం బోర్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. కానీ బోరు వేసిన డీఆర్‌డీఏ అధికారులు.. ఇప్పటివరకు మోటారు అందించలేదు.

– పూనక శ్రీనివాస్, గిరిజన రైతు మట్టెవాడ

త్వరలో నిరంతర విద్యుత్



జిల్లాలోని ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయానికి, గృహావసరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. కొత్త సబ్ స్టేషన్ల ఏర్పాటు, నూతన స్తంభాలు వేయడం, లూజ్ లైన్లను సరిచేయడంతో పాటు ఇతర విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నాం. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు వేసేందుకు చర్యలు చేపడుతున్నాం. నూతన సబ్ స్టేషన్లు, కొత్త పనులు చేపడుతున్నాం. త్వరలోనే నిర్మాణాలు పూర్తి చేసి నిరంతర విద్యుత్ సరఫరా చేస్తాం.

– జె.నరేశ్, విద్యుత్‌శాఖ ఎస్ఈ

విద్యుత్ అవసరాలు తీర్చేలా..



డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడుతున్నాం. ఎక్కడ విద్యుత్ సమస్యలు వచ్చినా.. వెంటనే సమాచారం అందిస్తే పరిష్కరించేందుకు విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. విద్యుత్ సమస్యలుంటే మా దృష్టికి తీసుకురండి.

– విజయ్, డీఈ, మహబూబాబాద్



రాజవ్వ అటుకులు.. ఆహా!



25 ఏళ్లుగా రుచికరమైన అటుకులు, చాయ్‌హోటల్ నిర్వహణ

టేస్ట్‌కు ఫిదా అవుతున్న టిఫిన్ ప్రియులు



జగిత్యాల టౌన్: రాజవ్వ అటుకులంటే జగిత్యాలలో తెలియని వారుండరు. ఆ టేస్టుకు ఫిదా కాని వారుండరంటే అతిశయోక్తి కాదు. జగిత్యాల పట్టణ టవర్ సర్కిల్‌లోని ప్రధాన కూరగాయల మార్కెట్‌లో రాజవ్వ అనే మహిళ గత 25 ఏళ్లుగా రుచికరమైన అటుకులు, చాయ్ హోటల్ నిర్వహిస్తున్నారు. శుచి, శుభ్రతతో తయారు చేసిన అటుకులకు దాల్చా చేర్చి నిమ్మకాయ పిండి ఇచ్చే అటుకులకు టిఫిన్ ప్రియులు ఫిదా అవుతున్నారు. ఉదయం నుంచే రాజవ్వ అటుకుల కోసం టిఫిన్ ప్రియులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ప్లేట్ కేవలం రూ. 20కే అందిస్తున్న రాజవ్వ అటుకులను మార్కెట్‌కు వచ్చే కొనుగోలు దారులు, కూరగాయల అమ్మకం దారులు, వ్యాపారులు తెగ ఇష్టపడి తింటుంటారు. దేశ విదేశాల్లో కూడా రాజవ్వ అటుకుల గురించి చర్చ జరగడం ఇక్కడి అటుకుల రుచికి నిదర్శనమని పలువురు టిఫిన్ ప్రియులు చెబుతున్నారు. జగిత్యాల కూరగాయల మార్కెట్ అంటే టక్కున గుర్తుకు వచ్చేది రాజవ్వ అటుకులే కావడం విశేషం. అటుకులే కాదు రాజవ్వ చేసే చాయ్ అంటే కూడా చాయ్ ప్రియులు ఎంతో ఇష్టపడి తాగుతుండటం విశేషం.

ఇంట్లో తిన్నట్లుంటుంది

రాజవ్వ చేసే అటుకులు తింటే ఇంట్లో చేసిన అటుకులు తిన్న అనుభూతి కలుగుతుంది. శుచి, శుభ్రతతో పాటు మంచి రుచితో ఉండే రాజవ్వ అటుకులంటే నాతో పాటు నా మిత్రులు ఇష్టపడతారు. మిత్రులతో కలిసి రాజవ్వ హోటల్లో అటుకులు తింటాను.

– ప్రసాద్‌గౌడ్, స్థానికుడు

అటుకులు బాగుంటాయి

మాది జగిత్యాల మండలం నర్సింగాపూర్. నేను రైతును. పలు రకాల కూరగాయలు మార్కెట్‌కు తెచ్చి అమ్ముతుంటాను. రాజవ్వ హోటల్ వద్ద రుచికరమైన అటుకులు తిన్నాకే దందా మొదలు పెడతాను. రాజవ్వ చేసే అటుకులు చాలా రుచిగా ఉంటాయి.

– గంగవ్వ, రైతు





రంగుల పండుగ హోళీని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఆనందో త్సాహాలతో జరుపుకున్నారు. ప్రజలు వీధుల్లోకి వచ్చి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఆనందించారు. రహదారుల పైన, పార్కుల్లో యువత రంగులు చల్లుకుని కేరిం తలు కొడుతూ సంతోషంగా గడిపారు. విశాఖ నగరంలో తీరంలో వేడుకలు జరుపుకున్న వారు ఒక్కసారిగా సముద్రంలోకి దిగడం తో సముద్రపు నీరు రంగు నీరుగా మారింది.

రంగుల హోలీ.. ఆనందాల కేళీ





క్లుప్తంగా...

కోలుకోలేక వైద్య విద్యార్థిని మృతి

కర్నూలు(హాస్పిటల్): వ్యక్తిగత సమస్యలతో గత నెల 14న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థిని రమ్యతేజ ఆసుపత్రిలో కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు. అనంతపురం మెడికల్ కాలేజీలో అనెస్తీషియా ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ నవీన్‌కుమార్ కుమార్తె కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. గత నెలలో స్నేహితులతో కలిసి అహోబిలం వెళ్లి తిరిగి వచ్చింది. అనంతరం వ్యక్తిగత కారణాలతో హాస్టల్ గదిలో పారాక్వాట్ రసాయన మందు(గడ్డిమందు) తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అప్పటి నుంచి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకునే పరిస్థితికి వచ్చింది. ఈ నేపథ్యంలో కళాశాలకు వచ్చి 28 నుంచి 3వ తేది వరకు ప్రాక్టికల్ పరీక్షలు కూడా రాసింది. ఆ తర్వాత అనంతపురం వెళ్లి అక్కడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం చేరింది. పరిస్థితి విషమించి కోలుకోలేక శుక్రవారం ఉదయం మరణించింది.

జనసేన కార్యకర్తల గూండాగిరీ



పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో శుక్రవారం నిర్వహించిన జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన కార్యకర్తలు గూండాగిరీ చేయడంతో సామాన్యులు బెంబేలెత్తిపోయారు. ట్రాఫిక్ నిలుపుచేసి, తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ అడిగిన సామాన్య ప్రయాణికులపై జనసేన జెండా కర్రలతో దాడి చేసి, గాయపరిచారు. మమ్మల్నే అడుగుతారా? అధికారం మాది.. అడిగితే చంపుతామంటూ బెదిరించి, కర్రలతో దాడి చేయడంతో ప్రయాణికులు గాయాలపాలయ్యారు. దీనిని ఆపాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం విమర్శలకు దారి తీసింది. మరోపక్క 216 జాతీయ రహదారిపై జనసేన కార్యకర్తలు బైక్‌లపై ప్రమాదకర ఫీట్లు చేస్తూ ప్రయాణికులకు చుక్కలు చూపించారు. వారిని కనీసంగా కూడా నిలువరించకపోవడంతో పోలీసులపై ప్రయాణికులు దుమ్మెత్తి పోశారు.

కాశినాయన ఆశ్రమంలో కట్టడాలను ప్రభుత్వమే పునర్నిర్మించాలి

కాశినాయన: జ్యోతిక్షేత్రం కాశినాయన ఆశ్రమంలో అటవీ అధికారులు కూల్చివేసిన కట్టడాలను ప్రభుత్వమే పునర్నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూపాల్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం వైఎస్సార్ జిల్లా కాశినాయన ఆశ్రమంలో అటవీ అధికారులు కూల్చివేసిన కట్టడాలను వారు పరిశీలించి ఆశ్రమ నిర్వాహకులతో చర్చించారు.

పడిపోతున్న సిబిల్!





- హిందూపురానికి చెందిన కరీముల్లా ఆర్నెళ్ల క్రితం రూ.లక్ష విలువ చేసే ఫర్నీచర్‌ను ఓ ప్రైవేటు సంస్థ ద్వారా ప్రతి నెలా రూ.5 వేలు చెల్లించేలా ఒప్పందంపై కొనుగోలు చేశాడు. తొలి నాలుగు నెలలు సజావుగానే ఈఎంఐ చెల్లించాడు. ఆ తర్వాత అతడు చేస్తున్న చిరుద్యోగం కాస్త ఊడిపోయింది. దీంతో కంతులు చెల్లించడంలో జాప్యం నెలకొంది. ఫలితంగా ఆర్నెల్ల తర్వాత చూసుకుంటే ఆయన సిబిల్ స్కోరు ఒక్కసారిగా 300కు పడిపోయింది.
- పుట్టపర్తికి చెందిన చిరు వ్యాపారి కృష్ణసాయి తన అవసరాల నిమిత్తం ఓ బ్యాంకులో వ్యక్తిగత రుణం తీసుకున్నాడు. అనివార్య కారణాలతో వ్యాపారం తీసేయాల్సి వచ్చింది. దీంతో నెలవారీ కంతులు చెల్లించడంలో ఇబ్బందులు నెలకొని సిబిల్ స్కోరు 200కు పడిపోయింది. ఆ తర్వాత ఎన్ని బ్యాంకుల్లో ప్రయత్నించినా.. కొత్త రుణం ఆయనకు పుట్టలేదు.

.... ఇప్పట్లో సిబిల్ స్కోరుకు పెరిగిన ప్రాధాన్యతకు ఈ ఘటనలు ఓ ఉదాహరణ మాత్రమే. ఆర్థిక నియంత్రణ కోల్పోతే భవిష్యత్తు కష్టమని ఆర్థిక నిపుణులు కూడా హెచ్చరిస్తున్నారు.

- ఈఎంఐ లు చెల్లించలేక వినియోగదారుల అవస్థలు
- భవిష్యత్తులో నగదు సహిత రుణాలకూ ఇబ్బందులు
- ఆర్థిక నియంత్రణ లేకపోతే భవిష్యత్ కష్టమంటున్న నిపుణులు

సాక్షి, పుట్టపర్తి: ఎవరైనా వ్యక్తి ఆర్థిక చరిత్రకు అద్దం పట్టేది క్రెడిట్ స్కోరు. ఇక్కడ తీసుకున్న లోన్లు.. చెల్లింపుల తీరు.. క్రెడిట్ కార్డుల వినియోగం.. అప్పుల కోసం ఎన్ని సార్లు ప్రయత్నించారు. గతంలో ఏమైనా లోన్లు ఎగ్గొట్టారా.. ఇప్పటికీ ఈఎంఐ కడుతున్నారా.. ఇలా అన్ని విషయాలు తెలుసుకోవచ్చు. ఈ క్రెడిట్ రిపోర్టుతో వ్యక్తి ఆర్థిక క్రమశిక్షణ ఏపాటిదో సులువుగా తెలుసుకోవచ్చు. ఆర్థిక నియంత్రణ క్రమశిక్షణ లేకపోవడం కారణంగా చాలామంది చిరుద్యోగులు, చిరు వ్యాపారులు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు.

అప్పు చేసి విలాసాలు..

పులిని చూసి నక్క వాత పెట్టుకున్న చందంగా మారింది ప్రస్తుతం మధ్య తరగతి ప్రజల పరిస్థితి. తమ చుట్టుపక్కల వారు ఏదైనా వస్తువు కొనుగోలు చేస్తే తమ ఇంట్లోనే ఉండాలనే ఆకాంక్ష తప్పు కాదు. అయితే ఇందు కోసం అప్పు చేసి ఆ తర్వాత రుణాలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి లేని తలనొప్పులు తెచ్చుకుంటున్నారు. చిన్నపాటి లావాదేవీల విషయంగానే సిబిల్ స్కోరు పడిపోయి.. భవిష్యత్తులో బ్యాంకుల ద్వారా రుణాలు పొందే సదుపాయాన్ని కోల్పోతున్న వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. మధ్య తరగతి ప్రజల అవసరాలను తెలివిగా ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ఆఫర్ల పేరుతో రుణాల ఎర వేసి ఆకట్టుకుంటున్నారు. అయితే రుణం తీసుకునే సమయంలో సరైన ప్లానింగ్ లేకపోవడంతో నెలవారీ కంతులు చెల్లించడంలో జాప్యం చోటు చేసుకుని భారీగా నష్టపోతున్నారు. ఆర్థిక క్రమశిక్షణ, అవగాహన లేకుంటే ప్రమాదకర స్థాయికి చేరుకునే అవకాశముందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పెరిగిపోతున్న డిఫాల్టర్లు..

జిల్లా వ్యాప్తంగా రకరకాల ప్రైవేటు సంస్థల ద్వారా రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించలేని స్థితిలో చాలా మంది డిఫాల్టర్లుగా మారిపోతున్నారు. ఇటీవల వీరి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. మొబైల్ ఫోన్లు, వాషింగ్ మెషీన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు, ఫర్నీచర్లు... తదితరాలను కొనుగోలు చేసిన వారే ఎక్కువ మంది డిఫాల్టర్లుగా మారినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణంగా సిబిల్ స్కోరు 650 దాటితే ఏవైనా రుణాలొస్తాయి. కానీ తీసుకున్న రుణం సక్రమంగా చెల్లించకపోవడంతో ప్రతి పది మందిలో ఇద్దరు డిఫాల్టర్లుగా మారుతున్నారు.

సున్నా వడ్డీతో ఆకర్షిస్తూ..

పలు ఫైనాన్స్ కంపెనీలు జీరో ప్రాసెసింగ్, సున్నా వడ్డీ అంటూ ఇచ్చే ప్రకటనలతో చాలామంది వినియోగదారులు మోసపోతున్నారు. ఎలాంటి వడ్డీ లేకుండా, ప్రాసెసింగ్ ఫీజు లేకుండా వస్తువుకు డబ్బు కట్టి, పది నెలలు మనతో రీపేమెంట్ ఎందుకు చేసుకుంటాయనే లోగుట్టును చాలా మంది అర్థం చేసుకోలేకపోతున్నారు. ఓ కంపెనీ ఎలాంటి లాభాపేక్ష లేకుండా జీరో ప్రాతిపదికన రుణం ఎందుకు ఇస్తుందనే విషయాన్ని వినియోగదారులు ఆలోచించాలని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఉంటే ఉత్తమమని సూచిస్తున్నారు.

సిబిల్ స్కోరు కీలకం



ప్రస్తుత పరిస్థితుల్లో సిబిల్ స్కోరు చాలా కీలకంగా మారింది. చిన్నపాటి అప్పుల సమాచారాన్ని సైతం ఆయా ఫైనాన్స్ సంస్థలు సిబిల్‌కు తెలియజేస్తాయి. చెల్లింపుల్లో జాప్యం లేదా మొండి బకాయిలు.. ఇలా రకరకాల కారణంగా చాలామందికి సిబిల్ స్కోరు లేక బ్యాంకుల్లో రుణాలు అందడం లేదు. వస్తువు తీసుకున్నాక సకాలంలో చెల్లింపులు చేయకపోతే భవిష్యత్తులో పరపతి లభించడం చాలా కష్టం. – రాధాకృష్ణారెడ్డి, ఆడిటర్, పుట్టపర్తి

గుండెపోటుతో ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుడి మృతి


విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉద్రిక్తత



ట్రాక్టర్ నడుపుతూ కుప్పకూలిన వెంకటరమణ

కూర్మన్నపాలెం (గాజువాక): విశాఖ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్ట్ ఉద్యోగి శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు ప్రధాన ద్వారం వద్దకు చేరుకుని మృతదేహంతో ఆందోళనకు దిగారు. యూనియన్ పెద్దలు, కాంట్రాక్టర్ మృతుడి బంధువులతో చర్చలు జరిపి ఒక నిర్ణయానికి వచ్చిన తరువాత మృతదేహాన్ని తరలించారు. పెదగంట్యాడ దరి ముసలినాయుడుపాలెంలో నివసిస్తున్న వేపాడ సూర్యవెంకటరమణ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టర్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులకు హాజరై జోన్ ఎంఎంజెడ్‌లో ట్రాక్టర్ నడుపుతుండగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు వైద్యులకు సమాచారం అందించగా వైద్యులు వచ్చి పరీక్షించి మరణించినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో తరలిస్తుండగా ప్రధాన ద్వారం వద్ద బంధువులు అంబులెన్స్‌ను నిలిపేసి తమకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. తోటి కార్మికులు దీనికి మద్దతు తెలపడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను సముదాయించి కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపారు. సుమారు నాలుగు గంటలపాటు కొనసాగిన చర్చల్లో మృతుని బంధువులకు పరిహారం కింద రూ.2 లక్షలు, మట్టి ఖర్చుల నిమిత్తం మరో రూ.30వేలు ఇవ్వడానికి ఒప్పందం కుదరడంతో మృతదేహాన్ని తరలించడానికి ఏర్పాట్లు చేశారు.

ఆధ్యాత్మిక సమాచారం



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 51,148 మంది స్వామివారిని దర్శించుకోగా 21,236 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.56 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వైభవంగా దోలా పౌర్ణమి ఉత్సవం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రంలో శుక్రవారం డోలా పౌర్ణమి ఉత్సవం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా ఉభయ దేవేరులతో శ్రీవారు తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ముందుగా ఆలయంలో ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అర్చకులు తొళక్క వాహనంపై ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపి, హారతులిచ్చారు. ఆ తర్వాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా తిరువీధులకు పయనమైంది.

బోయకొండలో రాహుకాల పూజలు



చౌడేపల్లె : చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తి శ్రద్ధలతో రాహుకాల పూజలు నిర్వహించారు. రాహుకాల సమయంలో సంప్రదాయ రీతిలో అర్చనలు , అభిషేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో అమ్మవారిని ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తజన సంద్రంగా శింగరకొండ

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ప్రసన్నాంజనేయ స్వామి 70వ వార్షిక తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం రాత్రి శింగరకొండ భక్తజనసంద్రంగా మారింది. ప్రసన్నాంజనేయ స్వామివారిని దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంతో మునిగిపోయారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ రాజగోపురాలు, పరిసరాల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ సెట్టింగులతో క్షేత్రం మొత్తం దేదీప్యమానంగా వెలిగిపోయింది.

విద్యా సమాచారం



బాస్కెట్‌బాల్ క్రీడాభివృద్ధికి పకడ్బందీ చర్యలు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు జిల్లాలో బాస్కెట్‌బాల్ క్రీడాభివృద్ధికి పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంగల్రాయనాయుడు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో అండర్ 23 రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపిక చేసిన రాష్ట్రస్థాయి జట్లు ఈ నెల 18 నుంచి 24 వ తేదీ వరకు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. జాతీయ స్థాయి పోటీలు గౌహతిలో నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర స్థాయి జట్లల్లో మంచి ప్రతిభ చాటిన 25 మంది పురుషులు, 25 మంది మహిళలను ఎంపిక చేసినట్లు తెలిపారు.

బీఈడీ, ఎంబీఏ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీలో జనవరిలో జరిగిన ఎంబీఏ మీడియా మేనేజ్‌మెంట్ తొలి సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఫిబ్రవరిలో జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాలను సైతం విడుదల చేసినట్లు తెలియజేశారు. ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం వెనుక వైపు ఉన్న మైదానంలో శుక్రవారం టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. షటిల్ డబుల్స్‌లో రమాదేవి, నీలిమ జట్టు విజయం సాధించగా, దేవి, దామర సెల్వి జట్టు రన్నరప్‌గా నిలిచింది. సింగిల్స్‌లో రమాదేవి విజయం సాధించగా, మాధవి రన్నర్‌గా నిలిచారు. పురుషుల షటిల్ డబుల్స్‌లో గోవిందరాజన్, సురేంద్ర జట్టు విజేతగా, వెంకటేశ్వర్లు, పార్థసారథి జట్టు రన్నర్ స్థానాలు కైవసం చేసుకుంది.


● టాలెంట్

లండన్‌లో స్టెప్పులే స్టెప్పులు!



బినితా చెత్రీ







బినితా చెత్రీ.. వయసు ఎనిమిదేళ్లు. కాని ఇవాళ దేశమంతా పేరు మారుమోగిపోతోంది. అందుకు కారణం 'బ్రిటన్స్ గాట్ టాలెంట్' షో. ప్రపంచవ్యాప్తంగా ఉండే రకరకాల టాలెంట్‌ను ఆహ్వానించి గుర్తింపునిచ్చే ఈ షోలో పాల్గొనాలని ఎందరికో కల. అలాంటి షోలో బినితా తన డ్యాన్స్‌తో అందర్నీ స్టన్ చేసింది. చురుకైన స్టెప్స్‌తో, చిరుతలాంటి మెరుపుతో బినితా చేసిన డ్యాన్స్, హావభావాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

బినితా స్వస్థలం ఈశాన్య రాష్ట్రమైన అస్సాం. షోలోకి అడుగుపెట్టిన వెంటనే బినితా తనను తాను పరిచయం చేసుకుంటూ 'నేను భారతదేశం నుంచి వచ్చాను. బ్రిటన్స్ గాట్ టాలెంట్ నా కలల వేదిక' అని చెప్పింది. ఇక్కడ గెలవడం తన లక్ష్యం అని, తాను పింక్ ప్రిన్సెస్ హౌస్ కొనాలని అనుకుంటున్నానని చెప్పి అందరి మనసుల్నీ కొల్లగొట్టింది. తన ముద్దు మాటలతో జడ్జీలను సమ్మోహనపరిచింది. అనంతరం ఆ స్టేజీ మీద చేసిన డ్యాన్స్ చూసి ప్రేక్షకులంతా తన్మయంతో చప్పట్లు కొట్టారు. ఇంత చిన్నవయసులో శివంగిలా చేస్తున్న డ్యాన్స్ చూసి జడ్జీలు, ప్రేక్షకులందరూ లేచి మరీ తనకు అభినందనలు తెలిపారు. ఈ వీడియో వైరల్‌గా మారి, తన గురించి దేశమంతా చెప్పుకునేలా చేసింది. నిరంతర సాధన, పట్టుదల, అనుకున్నది సాధించేదాకా ఆగిపోని దీక్షే తన విజయ రహస్యం అంటోంది బినిత. తన వయసులోని ఎంతో మంది చిన్నారులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.



● పరిశోధన

మార్స్‌పై కాలనీ కడదామా

పిల్లలూ! ఈ సృష్టిలో మొత్తం 8 గ్రహాలున్నాయి. గతంలో ప్లూటోను కూడా కలిపి 'నవ(తొమ్మిది) గ్రహాలు' అని అనుకునేవారు కానీ అది గ్రహం కాదని శాస్త్రవేత్తలు తేల్చడంతో దాన్ని గ్రహాల జాబితాలోంచి తీసేశారు. మిగిలిన 8 గ్రహాల్లో భూమి లాంటి పోలికలతో ఉన్న గ్రహం 'కుజుడు' (మార్స్). దీన్నే 'అరుణగ్రహం'(Red Planet) అంటారు. ఈ గ్రహంపై మనుషులు జీవించే అవకాశంపై కొన్ని దశాబ్దాలుగా పరిశోధనలు జరుగుతున్నాయి.

అక్కడున్న వాతావరణ పరిస్థితుల కారణంగా మనుషుల కొన్ని ప్రత్యేక విధానాల మధ్య జీవించాల్సి వస్తుందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. దీంతో అక్కడి జీవనంపై మరిన్ని పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో త్వరలోనే మనం మార్స్ గ్రహంపైకి వెళ్లే అవకాశం ఉందన్న సంకేతాలు అందుతున్నాయి.

అయితే ఇదంతా అసాధ్యం అని కొందరు, సాధ్యమే అని కొందరు వాదించుకుంటున్నారు. మానవ సమూహాలు మార్స్ గ్రహంపైకి వెళ్లేందుకు అనేక అనుకూలమైన అంశాలున్నాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. అవేంటో చూద్దామా..

➡ మార్స్ భూగ్రహానికి దగ్గరగా ఉంది. ఈ లెక్కన భూమి మీద నుంచి మార్స్ గ్రహం చేరుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది నెలల కాలం పడుతుంది. మరింత అత్యాధునిక స్పేస్‌షిప్‌లు అందుబాటులోకి వస్తే రెండు నెలల్లోనే భూమ్మీద నుంచి మార్స్ గ్రహానికి వెళ్లవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

➡ మార్స్ గ్రహంపైనున్న భూభాగం మనుషులు జీవించేందుకు అనువుగా ఉంది. ఈ గ్రహం మీద కార్బన్, నైట్రోజన్, హైడ్రోజన్, ఆక్సిజన్ పుష్కలంగా ఉన్నాయి. వాటిని మనకు అనుకూలంగా మార్చుకోగలిగితే అక్కడ జీవించడం సాధ్యమే.

➡ మార్స్ మీదున్న వాయువులు, అక్కడి వాతావరణాన్ని అనుకూలంగా మార్చుకునేందుకు కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు మోక్సీ(మార్స్ ఆక్సిజన్ ఇన్–సిట్యు రిసోర్స్ యుటిలైజేషన్ ఎక్స్‌పరిమెంట్) అనే ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. దీని ద్వారా మార్స్‌పై వాయువులను వేరు చేసి, ప్రజలు జీవించేందుకు అనువైన వాతావరణాన్ని ఏర్పాటు చేయొచ్చు.

ఈ మూడు ప్రధాన కారణాలతో త్వరలో మనుషులు మార్స్ గ్రహంపైకి వెళ్లి, అక్కడ జీవించవచ్చనే సంకేతాలు అందుతున్నాయి. అయితే అక్కడ ఉండే పరిస్థితుల్ని తట్టుకునేలా భూమ్మీదే కొందరి మీద శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేస్తున్నారు. అవి విజయవంతమైతే వారిని అక్కడికి పంపి, అక్కడ జీవనంపై మరిన్ని పరిశోధనలు చేయాలని భావిస్తున్నారు. ఎలాన్ మస్క్ కూడా తన స్టార్‌షిప్ వాహనాన్ని ఉపయోగించి మార్స్ గ్రహంపై మనుషుల జీవనాన్ని స్థిరపరచాలని భావిస్తున్నారు. త్వరలో మనందరం మార్స్ గ్రహంపైన తిరిగే రోజులు రావచ్చొమో! అక్కడి జీవనాన్ని అందరం కలిసి ఆస్వాదించొచ్చు. భలే బాగుంటుంది కదా!

● పాడుదాం గేయం

అద్భుత సృష్టి



చూడు చూడు ఆకాశం
ఎంతో ఎత్తున ఆకాశం
నీలంరంగులో ఆకాశం
చేతికి అందదు ఆకాశం

అదిగో అదిగో సూరీడు
మిలమిల మెరిసే సూరీడు
వెలుగును పంచే సూరీడు
భగభగమండే సూరీడు

వచ్చే వచ్చే చందురుడు
పాలనురగ రంగువాడు
చల్లని వెన్నెల పంచేవాడు
చిన్నారులకెంతో నచ్చేవాడు

భలే భలే తారకలు
తళతళ మెరిసే తారకలు
వజ్రాల మెరుపులో తారకలు
నింగికి అందం తారకలు

అన్నీ కలిసి అనంత సృష్టి
అద్భుతమైనది ఈ జగతి
చూసే కొద్దీ ఎన్నో వింతలు
జీవితమంతా సాగే యాత్రలు

● ఈ జాతీయాలు తెలుసా?

● మేకపోతు గాంభీర్యం

అర్థం: ధైర్యం నటించడం

వాక్యం: రాత్రి పూట హఠాత్తుగా ఎదురైన కుక్కను చూసి మేకపోతు గాంభీర్యం నటించాడు.

● మన సినిమా

రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చదువుతారా?



కిడ్స్... మీరంతా ఇప్పుడు మీ యాన్యువల్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతున్నారా... మీ ఎగ్జామ్స్ తరువాత ఒకవేళ ఏదైనా రెసిడెన్షియల్ స్కూల్‌లో చదవాలనుకుంటే దానికి సంబంధించి ఓ డాక్యుమెంటరీ ఇప్పుడు ఓటీటీలో ఉంది. జియో హాట్‌స్టార్‌లో 'ది గ్రేట్ ఇండియన్ రెసిడెన్షియల్ స్కూల్స్ సీజన్ 2' స్ట్రీమ్ అవుతోంది. 'ది గ్రేట్ ఇండియన్ రెసిడెన్షియల్ స్కూల్స్ సీజన్ 1' లో కొన్ని స్కూల్స్ చూపించగా ఇప్పుడు సీజన్2లో కొన్ని స్కూల్స్ చూపించారు. మీరు మీ పేరెంట్స్‌తో కలిసి చూడగలిగిన డాక్యుమెంటరీ ఇది. ఓ రెసిడెన్షియల్ స్కూల్‌లో స్టడీ ఎలా ఉంటుంది, యాక్టివిటీస్ ఎలా ఉంటాయి, అసలు స్కూల్ ఎలా ఉంటుంది... వీటన్నిటి డీటైల్స్‌తో చాలా సూపర్‌గా ఉంటుంది ఈ డాక్యుమెంటరీ. ఇప్పుడు కాకపోయినా ఫ్యూచర్‌లో ఒకవేళ మీరు రెసిడెన్షియల్ స్కూల్‌లో చదవాలనుకుంటే ఈ డాక్యుమెంటరీ హెల్ప్‌ఫుల్‌గా ఉంటుంది. సో ఆల్ ది బెస్ట్ కిడ్స్ ఫర్ యువర్ ఎగ్జామ్స్.

● తెలుసుకుందాం

ఏడు రోజులు... వాటి పేర్లెవరు పెట్టారు?



Sunday, Monday, Tuesday... అంటూ వారం రోజుల పేర్లు టకటకా చెప్పేస్తారు కదా, మరి వాటికి ఆ పేర్లు ఎవరు పెట్టారో తెలుసా? వారానికి ఏడు రోజులనీ, అందులో మొదటి రోజు ఆదివారం (Sunday) అనీ వాడుకలోకి తేవడం హిబ్రూ క్యాలెండర్ నుంచి మొదలైందని చరిత్రకారులు అంటున్నారు. అంతకుముందు వారానికి సంబంధించి ఎక్కడికక్కడ వేర్వేరు లెక్కలు ఉండేవి. హిబ్రూ క్యాలెండర్ వచ్చిన తర్వాత కూడా కొందరు వారానికి 8 రోజులుగా లెక్కించేవారు. వారానికి ఏడు రోజులని నిర్ధారించిన తర్వాత ఒక్కోరోజుకు ఒక్కోపేరు పెట్టాలన్న ఆలోచన మొదలైంది. ఆ సమయంలో హెల్లెనిస్టిక్ ఖగోళశాస్త్రాన్ని ఆధారంగా తీసుకొని, భూమికి దగ్గరగా ఉండే గ్రహాల పేర్లను పెట్టాలని కొందరు భావించారు.

అలా వారంలో మొదటి రోజుకు సూర్యుడి (Sun) పేరు మీద 'Sunday' అని నామకరణం చేశారు. ఆపై చంద్రుడు (Moon) పేరు మీద 'Monday' అని పెట్టారు. ఆ తర్వాత మార్స్ గ్రహం పేరుతోపాటు జర్మన్ పురాణ దేవుడు Tyr (టియా) పేరు మీద 'Tuesday' అని, జర్మన్ పురాణాల్లోని మరో దేవుడు 'Woden' పేరు మీద 'Wednesday' అని పేర్లు పెట్టారు. ఆపై మరో దేవుడు 'Thunra' పేరుపై 'Thursday', 'Frigg' అనే దేవత పేరు మీద 'Friday' వచ్చాయి. 'Saturday' అనే పేరు ఎలా వచ్చిందనే దానిపై చాలా వాదనలే ఉన్నాయి. Saturday అంటే ఆదివారం (Sunday)కి ముందు వచ్చేదని అర్థమని కొందరు అంటుంటారు. ఇదీ వారాల పేర్ల వెనకున్న కథ.

● మహనీయులు

ఇంజినీర్లకే ఇంజినీర్... మోక్షగుండం విశ్వేశ్వరయ్య

పిల్లలూ! మీకు సివిల్ ఇంజినీర్ల గురించి తెలుసా? పెద్ద పెద్ద భవంతులు, ఆనకట్టలు, వంతెనలు, రహదారుల రూపకల్పనలో వారిదే కీలకపాత్ర. మనం ఉండే అపార్ట్‌మెంట్లు, ఇళ్లు ఇంత బలంగా, మన్నికగా ఉన్నాయంటే అవి వారి ప్రతిభే. మరి మనదేశంలో అత్యంత ప్రఖ్యాతి పొందిన ఇంజినీర్ ఒకరున్నారు. ఆయనే మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన గురించి తెలుసుకుందామా!

మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1861 సెప్టెంబర్ 15న అప్పటి మైసూరు సంస్థానంలోని ముదినేహళ్లిలో జన్మించారు. ఆయన పూర్వీకులు తెలుగువారే. వారిది ప్రకాశం జిల్లాలోని మోక్షగుండం. అదే వారి ఇంటిపేరుగా స్థిరపడింది. చిన్ననాటి నుంచే చదువులో ఎంతో చురుకుగా ఉండే విశ్వేశ్వరయ్య బెంగళూరులో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. ఆ తర్వాత యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ నుంచి బీఎస్సీ పట్టా పొందారు. ఆపై పూణె ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లమో ఇన్ సివిల్ ఇంజినీరింగ్ చదివారు.



అక్కడ చదువుతున్న సమయంలోనే ఎంతోమంది ప్రముఖులతో ఆయనకు పరియం ఏర్పడింది.

చదువు పూర్తయ్యాక 1885లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం ఆయన్ను బొంబాయి సంస్థానంలో ఇంజినీరుగా నియమించింది. అక్కడ అసిస్టెంటు ఇంజినీరుగా ఉద్యోగ జీవితం మొదలుపెట్టిన ఆయన 1899లో ఇండియన్ ఇరిగేషన్ కమిషన్‌లో చేరారు. అందులో భాగంగా 1903లో పూణెకు సమీపంలోని ఖడక్‌వాస్లా డ్యామ్‌కి తొలిసారి వరద గేట్లు ఏర్పాటు చేశారు. దీనివల్ల జలాశయంలో నీటి సామర్థ్యం పెరిగింది. అది విజయవంతం కావడంతో ఆ తర్వాత గ్వాలియర్, మైసూర్ తదితర ప్రాంతాల్లో డ్యామ్‌లకు సైతం ఆ గేట్లను అమర్చారు.

ఆపై అప్పటి హైదరాబాద్ సంస్థానానికి వచ్చి కొంతకాలం ఇంజినీర్‌గా పనిచేశారు. మూసీ నది వరదలు హైదరాబాదును ముంచెత్తకుండా రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారు. దీంతోపాటు విశాఖపట్నంలోని సముద్ర వరదలు పోర్టును ముంచెత్తకుండా రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. తెలుగు మూలాలున్న విశ్వేశ్వరయ్య తెలుగు రాష్ట్రం కోసం చేసిన రెండు అత్యద్భుతమైన పనులుగా ఇవి చరిత్రలో నిలిచిపోయాయి.

దేశంలోని తొలి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఒకటైన మైసూర్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఆయన హయాంలో రూపొందింది. మైసూరు రైల్వే లైన్‌ను దేశంలోని ఇతర రైలు మార్గాలతో అనుసంధానం చేయడంలో విశ్వేశ్వరయ్య విశేష కృషి చేశారు. దీంతోపాటు కన్నడ భాష పట్ల ఎంతో ప్రేమ కలిగిన ఆయన కన్నడ పరిషత్ స్థాపించారు. ఆయన చేసిన సేవలకు గౌరవసూచకంగా బ్రిటిష్ ప్రభుత్వం 'సర్' బిరుదు ఇచ్చి గౌరవించింది. దేశంలోని అనేక నిర్మాణాల వెనుక విశ్వేశ్వరయ్య కృషి ఉంది. అందుకే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1955లో ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న' ప్రకటించింది. అనేక ప్రాంతాల్లో ఆయన పేరు మీద ఇంజినీరింగ్ కళాశాలలు స్థాపించారు.

నిండు నూరేళ్లు బతికిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1962లో మరణించారు. నేటికీ అనేకమందికి ఆయన కట్టించిన కట్టడాలు స్ఫూర్తి పంచుతున్నాయి.

● బాలల కథ

లక్ష వరహాలు






కందనవోలు అనే నగరంలో రోజుకొక ఇంటిలో దొంగతనం మొదలయ్యింది. దొంగ ఎప్పుడు, ఎలా, ఎక్కడి నుంచి వచ్చి పోతున్నాడో ఎవరికీ తెలిసేది కాదు. దాంతో రాజు 'ఎవరైతే ఆ దొంగను పట్టుకుంటారో వాళ్ళకి లక్ష వరహాలు బహుమా'నమని చాటింపు వేయించినాడు.

ఆ వూరిలో ఆనందు అని ఒక పిల్లవాడు వున్నాడు. వాడు చానా తెలివైనోడు. దొంగను ఎలాగైనా పట్టుకోవాలని దొంగతనం జరిగిన అన్ని ఇళ్ళు పరిశీలించి వచ్చినాడు. దొంగ ఏ ఇంటి తలుపులు పగలగొట్టలేదు. వేటికీ తాళాలు తీయలేదు. దాంతో ఎలా లోపలికి పోతున్నాడా అని బాగా ఆలోచించసాగినాడు. అప్పుడు కిటికీలు కనబన్నాయి.

'ఓహో... ఐతే... దొంగ కిటికీ ఊచల్లోంచి దూరి లోపలికి పోతున్నాడు. కానీ మనుషులు అలా కిటికీల్లోంచి దూరలేరు. అంటే దొంగ వేరే ఏదో ఒక జీవిని కిటికీలో నుంచి పంపి దొంగతనానికి ఉపయోగిస్తున్నాడు' అనుకున్నాడు ఆనందు.

దొంగకు దొంగతనంలో సాయం చేసే తెలివి, పెట్టెలు ఎత్తుకొచ్చే వేగం కాకులకు గద్దలకు ఉండదు. జంతువుల్లో కుక్కలు, ఆవులు, ఎద్దులు, గుర్రాలు నాలుగు కాళ్ళతో నడిచేవి ఏవీ ఈ పని చేయలేవు. మరి రెండుకాళ్ళతో నడిచేవి ఏవి? మనిషికి మనిషిలా దొంగతనంలో సాయం చేసేది ఏది? అని ఆలోచిస్తుంటే కళ్ళ ముందు తటుక్కున కోతి రూపం మెదిలింది. కోతులైతే ఎటువంటి గోడలైనా ఎక్కగలవు. తలుపులూ కిటికీలు తీయగలవు. ఎత్తయిన చెట్టు మీద ఎవరికీ కనబడకుండా దాక్కోగలవు. ఆనందుకి చిక్కుముడి వీడిపోసాగింది. నగరంలో కోతులు ఎవరు పెంచుకుంటున్నారా అని వెదుకుతా తిరగసాగినాడు.



అప్పుడు వానికి ఒక వీధిలో ఒక కోతులు ఆడించేటోడు కనబడ్డాడు. వాని వద్ద ఒక కోతి వుంది. ఆరోజు చీకటి పడ్డాక ఆ కోతులు ఆడించేటోని గుడిసె వెనుక దాక్కుని గమనించసాగినాడు. కాసేపటికి వాడు ఒక్కడే బైలుదేరినాడు. నగరమంతా తిరుగుతా ఒక ఇంటి ముందు ఆగి ఒక అరటిపండు వేసి వెళ్ళిపోయినాడు. వాడు అలా వెళ్ళిపోగానే కోతి అక్కడికి వచ్చింది. అరటిపండు తిని ఆ ఇంటిగోడ దూకి లోపలికి వెళ్ళిపోయింది.

ఆనందు 'ఓహో! ఇదా సంగతి' అనుకోని రాజు దగ్గరికి పోయి జరిగిందంతా వివరించి చెప్పినాడు. వెంటనే రాజు సైనికులతో కోతులు ఆడించే వాడి ఇంటిని చుట్టుముట్టినాడు. లోపల దొంగతనం చేసిన నగలన్నీ కనబడ్డాయి. వెంటనే రాజు 'కోతుల వాణ్ణి, ఆ కోతిని బంధించి జైలులో వేయండి' అన్నాడు.



దానికి ఆనందు 'రాజా! ఆ కోతిని ఏమీ చేయకండి. దానికి మంచీ చెడు ఆలోచించే తెలివి లేదు. వీడు ఎలా చెబితే అలా చేయడం తప్ప దాని తప్పేం లేదు' అన్నాడు. రాజు ఆ కోతిని అడవిలో వదిలేసి వాన్ని జైలులో బంధించినాడు. ఆనందుకు లక్ష బంగారు వరహాలు కానుకగా ఇచ్చి వాని తెలివితేటలని మెచ్చుకున్నాడు.

– డా.ఎం.హరికిషన్

ఎన్‌బీసీకే ఒలింపిక్స్ మీడియా హక్కులు

- 2036 విశ్వక్రీడల వరకు కొత్త ఒప్పందం ఖరారు
- ఐఓసీకి రూ. 26 వేల కోట్లు చెల్లించనున్న ఎన్‌బీసీ



లూసానే: అమెరికాకు చెందిన ప్రముఖ బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ 'కామ్‌కాస్ట్ ఎన్‌బీసీ యూనివర్సల్' 2036 ఒలింపిక్స్ వరకు మీడియా హక్కుల్ని దక్కించుకుంది. దశాబ్దాల తరబడి విశ్వక్రీడల్ని ప్రసారం చేస్తున్న ఎన్‌బీసీ కంపెనీ తాజాగా 2034 (వింటర్), 2036 (సమ్మర్) హక్కుల్ని చేజిక్కించుకుంది. ఇందుకోసం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ), ఎన్‌బీసీ మధ్య 3 బిలియన్ డాలర్ల (రూ. 26 వేల కోట్లు) ఒప్పందం కుదిరింది. ఆస్ట్రేలియాలో జరిగే బ్రిస్బేన్-2032 ఒలింపిక్స్ వరకు సమ్మర్, వింటర్ విశ్వక్రీడల ప్రసార హక్కుల్ని కలిగియున్న ఎన్‌బీసీ సంస్థ కొత్త ఒప్పందంతో 2036 వరకు పొడిగించుకుంది. నిజానికి ఒలింపిక్స్ మీడియా రైట్స్‌ను ఎన్నో ఏళ్లుగా అమెరికా సంస్థే దక్కించుకుంటూ వస్తోంది. 1988 నుంచి సమ్మర్ ఒలింపిక్స్, 2002 నుంచి వింటర్ ఒలింపిక్స్ మీడియా హక్కులు ఎన్‌బీసీ వద్దే ఉన్నాయి. అయితే ఐఓసీ అధ్యక్షుడిగా థామస్ బాచ్ ఎన్నికైన కొత్తలో 2014లో ఐఓసీ, ఎన్‌బీసీల మధ్య భారీ ఒప్పందం కుదిరింది. 2032 వరకు జరిగే మెగా ఈవెంట్ల హక్కుల కోసం ఇరు సంస్థల మధ్య 7.75 బిలియన్ డాలర్ల (రూ.67, 369 కోట్లు) భారీ ఒప్పందం కుదిరింది. ఇప్పుడు కూడా థామస్ బాచ్ పదవీ విరమణ చేయనున్న సమయంలోనూ కొత్త ఒప్పందం జరిగింది. ఈ నెల 20తో థామస్ బాచ్ పదవీ కాలం ముగియడంతో ఆయన వారసుడి కోసం ఐఓసీ అధ్యక్ష ఎన్నికలు జరుగనున్నాయి. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య వేదిక ఇంకా ఖరారు కాలేదు. ఈ మెగా ఈవెంట్ ఆతిథ్యం కోసం భారత్ సహా ఖతర్, టర్కీ, హంగేరి, ఇండోనేసియా దేశాలు పోటీపడుతున్నాయి. ఇప్పటికే ప్రాథమిక ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యింది.

ఫైనల్లో రష్మిక జోడీ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక డబుల్స్ విభాగంలో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. థాయ్‌లాండ్‌లోని నొంతాబురి పట్టణంలో ఈ టోర్నీ జరుగుతోంది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ సెమీఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 5-7, 6-4, 10-5తో థాసాపోర్న్ నక్లో-బున్యావి (థాయ్‌లాండ్) జోడీపై గెలిచింది. నేడు జరిగే ఫైనల్లో యూకీ నైతో (జపాన్)-పునిన్ కొవాపుతుక్‌టెడ్ (థాయ్‌లాండ్)లతో రష్మిక-వైదేహి తలపడతారు.



రయ్... రయ్... రయ్...

నేటి నుంచి ఫార్ములావన్ సీజన్

- ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రితో ప్రారంభం
- నేడు క్వాలిఫయింగ్ సెషన్
- రేపు ప్రధాన రేసు
- ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

మెల్‌బోర్న్: వరుసగా ఐదో ఏడాది వరల్డ్ చాంపియన్‌గా నిలిచి దిగ్గజం మైకేల్ షుమాకర్ రికార్డును వెర్‌స్టాపెన్ సమం చేస్తాడా? జట్టు మారడంతో తన గెలుపు రాతను కూడా హామిల్టన్ మార్చుకుంటాడా? మూడో జట్టు తరఫున హామిల్టన్ మళ్లీ ప్రపంచ చాంపియన్‌గా అవతరిస్తాడా? ఈ ఇద్దరిని కాదని మూడో రేసర్ రూపంలో కొత్త విశ్వవిజేత ఆవిర్భవిస్తాడా? వీటన్నింటికీ సమాధానం నేటి నుంచి మొదలయ్యే ఫార్ములావన్ 75వ సీజన్‌లో లభిస్తుంది. 24 రేసులతో కూడిన ఈ సీజన్‌కు ఆదివారం ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రితో తెర లేస్తుంది. 2019 తర్వాత మళ్లీ ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రితో ఫార్ములావన్ సీజన్ మొదలుకానుండటం విశేషం. 10 జట్లకు చెందిన 20 మంది డ్రైవర్లు శుక్రవారం ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొన్నారు. శనివారం క్వాలిఫయింగ్ సెషన్ జరుగుతుంది. క్వాలిఫయింగ్ సెషన్‌లో నమోదు చేసిన అత్యుత్తమ సమయం ఆధారంగా ఆదివారం జరిగే ప్రధాన రేసును 20 మంది డ్రైవర్లు ఏ స్థానం నుంచి ప్రారంభిస్తారో నిర్ణయిస్తారు.

గత నాలుగేళ్లుగా రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ వెర్‌స్టాపెన్ ఎదురులేని విజేతగా నిలుస్తున్నాడు. ఫెరారీ జట్టు డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ నుంచి వెర్‌స్టాపెన్‌కు పోటీ లభిస్తున్నా... విజయాల పరంగా వెర్‌స్టాపెన్ ముందుకు దూసుకెళ్తున్నాడు. మెర్సిడెస్ జట్టు తరఫున 2013 నుంచి 2024 వరకు బరిలోకి దిగిన హామిల్టన్ ఈసారి తన కెరీర్‌లో తొలిసారి ఫెరారీ జట్టు తరఫున డ్రైవ్ చేయనున్నాడు. 2007 నుంచి 2012 వరకు మెక్‌లారెన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన హామిల్టన్ 2008లో తొలిసారి వరల్డ్ చాంపియన్ అయ్యాడు. ఆ తర్వాత 2013 నుంచి 2024 మధ్య కాలంలో ఆరుసార్లు విశ్వవిజేతగా నిలిచాడు. ఈ ఏడాది వెర్‌స్టాపెన్‌కు హామిల్టన్, లెక్‌లెర్క్, లాండో నోరిస్, కార్లోస్ సెయింజ్ జూనియర్, జార్జ్ రసెల్ నుంచి గట్టిపోటీ లభించే అవకాశం ఉంది.


పాయింట్లు ఎలా ఇస్తారంటే...

ఫార్ములావన్‌లో ప్రతి గ్రాండ్‌ప్రి మూడు రోజులు కొనసాగుతుంది. శుక్రవారం ప్రాక్టీస్ సెషన్... శనివారం క్వాలిఫయింగ్ సెషన్... ఆదివారం ప్రధాన రేసు జరుగుతుంది. కొన్ని గ్రాండ్‌ప్రిలలో శనివారం స్ప్రింట్ రేసులను నిర్వహిస్తారు. ఈ రేసు 100 కిలోమీటర్లు జరుగుతుంది. అయితే స్ప్రింట్ రేసు ఫలితాలకు ప్రధాన రేసు ఫలితాలకు సంబంధం ఉండదు. ఇక ప్రధాన రేసులో టాప్-10లో నిలిచిన వారికి పాయింట్లు కేటాయిస్తారు. తొలి స్థానం నుంచి పదో స్థానం వరకు నిలిచిన డ్రైవర్లకు వరుసగా 25, 18, 15, 12, 10, 8, 6, 4, 2, 1 పాయింట్ లభిస్తుంది. రేసు మొత్తంలో ఫాస్టెస్ట్ ల్యాప్ నమోదు చేసిన డ్రైవర్‌కు బోనస్‌గా ఒక పాయింట్ ఇస్తారు. సీజన్‌లోని 24 రేసులు ముగిశాక అత్యధిక పాయింట్లు సాధించిన డ్రైవర్‌కు వరల్డ్ చాంపియన్‌షిప్ టైటిల్ లభిస్తుంది. అత్యధిక పాయింట్లు సంపాదించిన జట్టుకు కన్‌స్ట్రక్టర్స్ చాంపియన్‌షిప్ టైటిల్ దక్కుతుంది.

ఏ జట్టులో ఎవరున్నారంటే...

ఈ ఏడాది కూడా ఫార్ములావన్ టైటిల్ కోసం 10 జట్ల నుంచి 20 మంది డ్రైవర్లు బరిలో ఉన్నారు. ఒక్కో జట్టు తరఫున ఇద్దరు డ్రైవర్లు ప్రధాన రేసులో పోటీ పడతారు. ఇద్దరు డ్రైవర్లలో ఎవరైనా పాల్గొనకపోతే అదే జట్టులో ఉన్న రిజర్వ్ డ్రైవర్‌కు అవకాశం లభిస్తుంది. ఈ సీజన్‌లో ఆయా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న డ్రైవర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

రెడ్‌బుల్: మాక్స్ వెర్‌స్టాపెన్ (నెదర్లాండ్స్), లియామ్ లాసన్ (న్యూజిలాండ్).
ఫెరారీ: లూయిస్ హామిల్టన్ (బ్రిటన్), చార్లెస్ లెక్‌లెర్క్ (మొనాకో).
మెర్సిడెస్: జార్జ్ రసెల్ (బ్రిటన్), ఆంటోనెలి (ఇటలీ).
మెక్‌లారెన్: లాండో నోరిస్ (బ్రిటన్), ఆస్కార్ పియాస్ట్రి (ఆస్ట్రేలియా)
ఆల్పైన్: పియరీ గ్యాస్లీ (ఫ్రాన్స్), జాక్ దూహన్ (ఆస్ట్రేలియా).
ఆస్టన్ మార్టిన్: లాన్స్ స్ట్రోల్ (కెనడా), ఫెర్నాండో అలోన్సో (స్పెయిన్).
హాస్: ఎస్టెబన్ ఒకాన్ (ఫ్రాన్స్), ఒలివెర్ బేర్మన్ (బ్రిటన్).
కిక్ సాబెర్: నికో హుల్కెన్‌బర్గ్ (జర్మనీ), బొర్టెలెటో (బ్రెజిల్).
రేసింగ్ బుల్స్: హాడ్జర్ (ఫ్రాన్స్), యూకీ సునోడా (జపాన్)
విలియమ్స్: ఆల్బన్ (థాయ్‌లాండ్), కార్లోస్ సెయింజ్ (స్పెయిన్)


వెర్‌స్టాపెన్

34 ఇప్పటి వరకు ఫార్ములావన్‌లో 34 వేర్వేరు డ్రైవర్లు ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సాధించారు. అత్యధికంగా 7 సార్లు చొప్పున మైకేల్ షుమాకర్ (జర్మనీ), లూయిస్ హామిల్టన్ (బ్రిటన్) టైటిల్స్ గెలిచారు. షుమాకర్ వరుసగా ఐదేళ్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచాడు. షుమాకర్ రికార్డును సమం చేసేందుకు వెర్‌స్టాపెన్‌కు ఈసారి అవకాశం లభించనుంది. గతంలో హామిల్టన్, సెబాస్టియన్ వెటెల్‌కు అవకాశం వచ్చినా సద్వినియోగం చేసుకోలేదు.

17 ఫార్ములావన్‌లో 17 మంది డ్రైవర్లు ఒక్కసారి మాత్రమే ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలిచారు.

105 ఫార్ములావన్ చరిత్రలో హామిల్టన్ గెలిచిన రేసులు. అత్యధిక రేసులు గెలిచిన డ్రైవర్ రికార్డు హామిల్టన్ పేరిట ఉంది. షుమాకర్ (91), వెర్‌స్టాపెన్ (63), వెటెల్ (53), అలైన్ ప్రాస్ట్ (51) వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నారు.

3 ఈ సీజన్‌లో బరిలో దిగుతున్న 20 మంది డ్రైవర్లలో ముగ్గురు ప్రపంచ చాంపియన్స్ ఉన్నారు. రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ (2021, 2022, 2023, 2024), తొలిసారి ఫెరారీ తరఫున పోటీపడుతున్న లూయిస్ హామిల్టన్ (2008, 2014, 2015, 2017, 2018, 2019, 2020), ఆస్టన్ మార్టిన్ జట్టు డ్రైవర్ ఫెర్నాండో అలోన్సో (2005, 2006) మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు.

ఫార్ములావన్-2025 షెడ్యూల్

మార్చి 16: ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి (మెల్‌బోర్న్)
మార్చి 23: చైనా గ్రాండ్‌ప్రి (షాంఘై)
ఏప్రిల్ 6: జపాన్ గ్రాండ్‌ప్రి (సుజుకా)
ఏప్రిల్ 13: బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి (సాఖిర్)
ఏప్రిల్ 20: సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి (జిద్దా)
మే 4: అమెరికా గ్రాండ్‌ప్రి (మయామి)
మే 18: ఇటలీ గ్రాండ్‌ప్రి (ఇమోలా)
మే 25: మొనాకో గ్రాండ్‌ప్రి (మోంటెకార్లో)
జూన్ 1: స్పెయిన్ గ్రాండ్‌ప్రి (బార్సిలోనా)
జూన్ 15: కెనడా గ్రాండ్‌ప్రి (మాంట్రియల్)
జూన్ 29: ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి (స్పీల్‌బర్గ్)
జూలై 6: బ్రిటన్ గ్రాండ్‌ప్రి (సిల్వర్‌స్టోన్)
జూలై 27: బెల్జియం గ్రాండ్‌ప్రి (స్పా ఫ్రాంకోర్‌చాంప్స్)
ఆగస్టు 3: హంగేరి గ్రాండ్‌ప్రి (బుడాపెస్ట్)
ఆగస్టు 31: డచ్ గ్రాండ్‌ప్రి (జాండ్‌వూర్ట్)
సెప్టెంబర్ 7: ఇటలీ గ్రాండ్‌ప్రి (మోంజా)
సెప్టెంబర్ 21: అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి (బాకు)
అక్టోబర్ 5: సింగపూర్ గ్రాండ్‌ప్రి (సింగపూర్ సిటీ)
అక్టోబర్ 19: యూఎస్‌ఏ గ్రాండ్‌ప్రి (ఆస్టిన్)
అక్టోబర్ 26: మెక్సికో గ్రాండ్‌ప్రి (మెక్సికో సిటీ)
నవంబర్ 9: బ్రెజిల్ గ్రాండ్‌ప్రి (సావోపాలో)
నవంబర్ 22: లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి (అమెరికా)
నవంబర్ 30: ఖతర్ గ్రాండ్‌ప్రి (దోహా)
డిసెంబర్ 7: అబుదాబి గ్రాండ్‌ప్రి (యూఏఈ)

కరీ...'3' చీర్స్

4000 'త్రీ' పాయింటర్లు సాధించిన స్టీఫెన్ కరీ ఎన్‌బీఏ చరిత్రలో తొలి ప్లేయర్‌గా రికార్డు



శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికా బాస్కెట్‌బాల్ స్టార్ స్టీఫెన్ కరీ అరుదైన ఘనత తన పేరిట లిఖించుకున్నాడు. 'త్రీ' పాయింటర్లు స్కోరు చేయడంలో సిద్ధహస్తుడైన కరీ.. ప్రతిష్టాత్మక జాతీయ బాస్కెట్‌బాల్ సంఘం (ఎన్‌బీఏ)లో 4 వేల త్రీ పాయింటర్లు సాధించిన తొలి ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. లీగ్‌లో భాగంగా 'గోల్డెన్ స్టేట్ వారియర్స్' జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న 37 ఏళ్ల కరీ... శుక్రవారం సాక్రమెంటో కింగ్స్ జట్టుతో జరిగిన పోరులో ఈ మైలురాయి దాటాడు. ఆట మూడో క్వార్టర్ 8వ నిమిషంలో నాలుగో ప్రయత్నంలో కరీ... త్రీ పాయింటర్ సాధించడం ద్వారా 4000 త్రీ పాయింటర్లు ఖాతాలో వేసుకున్నాడు. ఫలితంగా గోల్డెన్ స్టేట్ వారియర్స్ జట్టు 130-104 పాయింట్ల తేడాతో సాక్రమెంటో కింగ్స్‌పై విజయం సాధించింది. సుదీర్ఘ కాలంగా 'పాయింట్ గార్డ్' పొజిషన్‌లో ఆడుతున్న కర్రీ... తన జట్టుకు ఎన్నో మరపురాని విజయాలు అందించాడు. 2009 అక్టోబర్ 30న కరీ తన తొలి 'త్రీ' పాయింటర్ సాధించాడు. ఎన్‌బీఏ చరిత్రలో అత్యధిక త్రీ పాయింటర్లు సాధించిన ఆటగాడిగా రే అలెన్ (2,973) పేరిట ఉన్న రికార్డును 2021లో అధిగమించిన కరీ... అదే జోరు కొనసాగిస్తూ పుట్టినరోజున మరో ఘనత తన పేరిట లిఖించుకున్నాడు. ఓవరాల్‌గా ఈ జాబితాలో ప్రస్తుతం కరీ తర్వాత జేమ్స్ హార్డెన్ (3,127), డామియన్ లిలార్డ్ (2,794) ఉన్నారు. బాస్కెట్‌కు 23.9 ఫీట్ల (7.24 మీటర్లు) దూరంలోని గీత నుంచి నేరుగా బంతిని లక్ష్యాన్ని చేర్చగలిగితే 3 పాయింట్లు లభిస్తాయి. అంతర్జాతీయ పోటీల్లో 22.2 ఫీట్లు ఉన్న ఈ దూరం... ఎన్‌బీఏలో మాత్రం 23.9 ఫీట్లుగా ఉంది. ప్రత్యర్థి కళ్లు గప్పగల నైపుణ్యంతో పాటు... దూరం నుంచే లక్ష్యాన్ని గురిపెట్టగల సామర్థ్యం కలగలిసినప్పుడే త్రీ పాయింటర్లు సాధ్యమవుతాయి. ఈ విషయంలో కెరీర్ ఆరంభం నుంచి తన ప్రత్యేకత చాటుకుంటున్న కరీ... 'త్రీ' పాయింటర్ స్పెషలిస్ట్‌గా ఎదిగాడు. ఇప్పటి వరకు ఎన్‌బీఏలో రెండుసార్లు అత్యంత విలువైన ఆటగాడిగా నిలిచిన కరీ... ఈ క్రమంలో ఎన్‌బీఏ చరిత్రలో 25,000 పాయింట్లు సాధించిన 26వ ప్లేయర్‌గా నిలిచాడు. 'అతడు జట్టుకు ఎంతో ముఖ్యం. కీలక సమయాల్లో అతడు సాధించే పాయింట్లు టీమ్ భవితవ్యాన్ని నిర్ణయిస్తుంటాయి. ఆటను ఎలా మలుపుతిప్పాలో అతడికి బాగా తెలుసు. ఎలాంటి పరిస్థితుల్లోనూ తన ఏకాగ్రత కోల్పోడు. చిన్నప్పటి నుంచి అతడి నిశిత పరిశీలన నన్ను ఆకట్టుకుంటోంది' అని కోచ్ స్టీవ్ కెర్ అన్నాడు. 'నేనెప్పుడూ త్రీ పాయింటర్ల గురించి ఆలోచించలేదు. ఆటలో భాగంగా అవి వాటంతటవే వచ్చి చేరుతున్నాయి. నా వరకు మ్యాచ్ విజయమే ముఖ్యం. ఈ క్రమంలో 4 వేల త్రీ పాయింటర్లు సాధించడం ఆనందంగా ఉంది. అయితే అది ఒక నంబర్ మాత్రమే' అని 2024 పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం నెగ్గిన అమెరికా జట్టులో సభ్యుడిగా ఉన్న కరీ అన్నాడు.

పాక్‌లో మరో ఐసీసీ ఈవెంట్

ఏప్రిల్ 9 నుంచి లాహోర్‌లో మహిళల వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ



లాహోర్: సుదీర్ఘ విరామం తర్వాత ఇటీవల అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యమిచ్చిన పాకిస్తాన్... ఇప్పుడు మరో టోర్నమెంట్ నిర్వహణకు సిద్ధమవుతోంది. ఏప్రిల్ 9 నుంచి 19 వరకు పాకిస్తాన్‌లో మహిళల వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ జరగనుంది. ఆతిథ్య పాకిస్తాన్‌తో పాటు బంగ్లాదేశ్, ఐర్లాండ్, స్కాట్లాండ్, థాయ్‌లాండ్, వెస్టిండీస్ జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. ఈ ఏడాది అక్టోబర్‌లో భారత్ వేదికగా మహిళల వన్డే ప్రపంచకప్ జరగనుండగా... దానికి భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక నేరుగా అర్హత సాధించాయి. మిగిలిన రెండు స్థానాల కోసం 6 జట్ల మధ్య ఐసీసీ క్వాలిఫయింగ్ టోర్నీ నిర్వహిస్తోంది. ఇందులో మెరుగైన ప్రదర్శన కనబర్చిన 2 జట్లు వరల్డ్‌కప్ బరిలోకి దిగనున్నాయి. ఇటీవల చాంపియన్స్ ట్రోఫీ నిర్వహించిన లాహోర్ స్టేడియంలోనే ఈ పోటీలు జరగనున్నాయి. ఏప్రిల్ 9న ఐర్లాండ్‌తో పాకిస్తాన్, స్కాట్లాండ్‌తో వెస్టిండీస్ ఆడుతాయి. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఐసీసీ శుక్రవారం విడుదల చేసింది. క్వాలిఫయింగ్ టోర్నీలో పాకిస్తాన్ అర్హత సాధిస్తే... వన్డే ప్రపంచకప్ ఆడేందుకు ఆ జట్టు భారత్‌కు రాకపోవచ్చు. ఇటీవల చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా పాకిస్తాన్‌కు వెళ్లకపోవడంతో భారత జట్టు ఆడే మ్యాచ్‌లను దుబాయ్‌లో నిర్వహించారు. అలాగే పాకిస్తాన్ మహిళల జట్టు వరల్డ్‌కప్‌నకు అర్హత సాధిస్తే ఆ జట్టు ఆడే మ్యాచ్‌లను తటస్థ వేదికపై నిర్వహించాల్సి ఉంటుంది. భారత్‌లో మహిళల వన్డే ప్రపంచకప్ జరగనుండటం ఇది ఐదోసారి. చివరగా 2011లో మనదేశంలో ఈ టోర్నీ నిర్వహించారు. గత ఎడిషన్ మాదిరిగానే 8 జట్లు పాల్గొననున్న వన్డే వరల్డ్‌కప్‌లో 31 మ్యాచ్‌లు జరగనున్నాయి.

ప్రజాభిప్రాయాలకు అవకాశం

తప్పుడు వయో ధ్రువీకరణ కట్టడికి ముసాయిదా సిద్ధం

న్యూఢిల్లీ: క్రీడల్లో, పోటీల్లో తరచూ వివాదాస్పదమవుతున్న తప్పుడు వయో ధ్రువీకరణ అంశంపై నిర్దిష్టమైన పాలసీని రూపొందిస్తున్న కేంద్ర క్రీడా శాఖ ఇందులో సాధారణ ప్రజల్ని భాగం చేయాలని నిర్ణయించింది. క్రీడల్లో నకిలీ వయో ధ్రువీకరణ నిరోధక జాతీయ పాలసీ (ఎన్‌సీఏఏఎఫ్ఎస్) ముసాయిదా బిల్లును రూపొందించిన క్రీడా శాఖ తుది సవరణలు, అభ్యంతరాల స్వీకరణ కోసం ఈ నెలాఖరు (31) వరకు సాధారణ ప్రజానీకం అభిప్రాయాలు, ఫిర్యాదులను సేకరించనుంది. 'నూతన క్రీడల్లో వయో ధ్రువీకరణ పాలసీపై క్రీడలు-యువజన సర్వీసుల శాఖ తుది కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా సలహాలు సంప్రదింపులు జరుపుతుంది. ప్రజలు కూడా భాగం కావొచ్చు. ఆయా వయో విభాగాల క్రీడల్లో నిజమైన వయస్సు కలిగిన క్రీడాకారులకు నష్టం కలుగకుండా చూడటమే ఈ బిల్లు లక్ష్యం' అని ఆ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారత క్రీడల్లో మరింత జవాబుదారీతనం పెంచడం కోసం నిర్దిష్టమైన సవరణలతో 15 ఏళ్ల తర్వాత ఈ బిల్లును తీసుకొస్తున్నట్లు క్రీడాశాఖాధికారులు తెలిపారు. తప్పుడు, నకిలీ ధ్రువీకరణతో పోటీల్లో పాల్గొంటే తొలిసారి రెండేళ్ల నిషేధం విధిస్తారు. పతకాల్ని వెనక్కి తీసుకుంటారు. రెండోసారి పునరావృతం జీవితకాల నిషేధం విధించడంతో పాటు, చట్టాలకు లోబడి శిక్షలు తప్పవు. అయితే సస్పెన్షన్‌కు గురైన అథ్లెట్లు తమ తప్పుని అంగీకరించి, నిజమైన వయస్సును వెల్లడిస్తే క్షమాభిక్షకు అవకాశమిచ్చారు.

స్పెషలిస్ట్ బ్యాటర్‌గా మిచెల్ మార్ష్



ఐపీఎల్‌లో ఆడనున్న ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్

లక్నో: గాయం కారణంగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి దూరమైన ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మాత్రం బరిలోకి దిగనున్నాడు. శ్రీలంక పర్యటనకు ముందు వెన్నునొప్పితో ఆసీస్ జాతీయ జట్టుకు దూరమైన మార్ష్... ఐపీఎల్‌లో స్పెషలిస్ట్ బ్యాటర్‌గానే అందుబాటులో ఉండనున్నాడు. గాయం పూర్తిగా మానక పోవడంతో మార్ష్ బౌలింగ్ చేయబోవడం లేదు. పేలవ ఆటతీరుతో టీమిండియాతో 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ' ఆఖరి టెస్టుకు దూరమైన మార్ష్... చివరగా ఈ ఏడాది జనవరి 7న బిగ్ బాష్ లీగ్‌లో పెర్త్ స్కార్చర్స్ జట్టు తరఫున బరిలోకి దిగాడు. ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్‌లో 33 ఏళ్ల మార్ష్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. గత మూడు సీజన్‌లలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన మార్ష్‌ను గతేడాది వేలంలో లక్నో కొనుగోలు చేసుకుంది. ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు లాంగర్ లక్నో జట్టు కోచ్‌గా వ్యవహరిస్తుండగా... ఈ నెల 18 వరకు మార్ష్ జట్టుతో చేరనున్నాడు. టి20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన మార్ష్ గతంలో... సన్‌రైజర్స్ హైదరాబాద్, రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్, పుణే వారియర్స్, డెక్కన్ చార్జర్స్ జట్ల తరఫున ఐపీఎల్ ఆడాడు. మార్ష్‌తో పాటు వేర్వేరు కారణాలతో చాంపియన్స్ ట్రోఫీకి దూరమైన ఆసీస్ ఆటగాళ్లు కమిన్స్, స్టార్క్, హాజల్‌వుడ్ కూడా ఐపీఎల్ కోసం సిద్ధమవుతున్నారు.

సాక్షి ప్లస్
శనివారం। 15-3-2025

మన ఏడు రెస్టారెంట్లు ఆసియాలో బెస్ట్...

ఉత్తమ హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లను గుర్తించడంలో ప్రసిద్ధి చెందిన సంస్థ '50 బెస్ట్'ఆవిష్కరించిన ఆసియా ఉత్తమ రెస్టారెంట్ల విస్తృత జాబితాలో ఏడు భారతీయ రెస్టారెంట్లకు చోటు దక్కింది. 51 నుంచి 100వ ర్యాంకు ఫలితాలను శుక్రవారం సంస్థ వెల్లడించింది. ఇందులో ముంబై, ఢిల్లీ, కసోలి, బెంగళూరుకు చెందిన ఏడు ప్రసిద్ధ రెస్టారెంట్లు ఉన్నాయి. కసోలీలోని నార్ 66వ ర్యాంకు, బెంగళూరులోని ఫామ్‌లోర్ 68, ముంబైలోని అమెరికానో 71, న్యూఢిల్లీలోని ఇంజా 87, ముంబైలోని ద టేబుల్ 88, న్యూఢిల్లీలోని దమ్ పుఖ్త్ 89, ముంబైలోని ద బాంబే క్యాంటీన్ 91వ ర్యాంకులను దక్కించుకున్నాయి. కాగా, టాప్ 50 రెస్టారెంట్లను మార్చి 25న సియోల్‌లో జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో సంస్థ ప్రకటించనుంది.

నార్, ఫామ్‌లోర్, ఇంజా ఈ జాబితాలో చోటు దక్కించుకోవడం ఇదే తొలిసారి. కాగా, నార్ కొత్తగా ప్రారంభించిన రెస్టారెంట్ కావడం గమనార్హం. కసోలిలో చెఫ్ ప్రతీక్ సాధు నడుపుతున్న ఈ రెస్టారెంట్ హిమాలయాల దిగువన ఉంది. హిమాలయ ఆహార సంస్కృతికి అద్దంపడుతుంది. స్థానిక వంటకాలను ప్రోత్సహిస్తుంది. ఢిల్లీలోని ఇంజా రెస్టారెంట్ భారతీయ-జపనీస్ వంటకాలకు ప్రసిద్ధి. బెంగళూరులోని ఫామ్‌లోర్ వ్యవసాయ ఆధారిత వంటకాలకు ప్రసిద్ధి చెందింది. ఇది వ్యవసాయ క్షేత్రంలోనే నడిపిస్తుండటం గమనార్హం. బాంబే క్యాంటీన్, అమెరికానో, ది టేబుల్, దమ్ పుఖ్త్ గతంలోనూ ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ముంబైలోని కమలా మిల్స్‌లో ఉన్న బాంబే క్యాంటీన్ వైవిధ్యమైన భారతీయ వంటకాలకు ఆధునికతను జోడించి రుచి చూపిస్తుంది. అమెరికానో.. కాలానుగుణంగా వస్తున్న మార్పులను బట్టి సృజనాత్మక వంటకాలపై దృష్టి సారించే ఆధునిక యురోపియన్ బిస్ట్రో. ద టేబుల్ రెస్టారెంట్.. 'ఫామ్ టు టేబుల్'ఫిలాసఫీతో నడిచే భారతదేశపు మొట్టమొదటి రెస్టారెంట్. ఇక్కడ మెనూ శాన్‌ఫ్రాన్సిస్కో శైలిలో ఉంటుంది. ఈ రెస్టారెంట్ టాప్ వంటల్లో.. టాగ్లిరిని పాస్తా, గుమ్మడికాయ స్పాగెట్టి, ఆస్పరాగస్ రిసోటో ఉన్నాయి. ఢిల్లీలో సుప్రసిద్ధ రెస్టారెంట్ దమ్ పుఖ్త్‌లో సాంప్రదాయ భారతీయ వంటకాలైన బిర్యానీ, కబాబ్ వంటివి దొరుకుతాయి. –న్యూఢిల్లీ



రంగుల పండగ
హోలీ వేడుకలు శుక్రవారం దేశవ్యాప్తంగా కొనసాగాయి. చిన్నాపెద్దా బేధం లేకుండా అందరూ వేడుకల్లో పాల్గొని రంగుల్లో మునిగితేలారు.

గాజా నుంచి ఆఫ్రికాకు

పాలస్తీనియన్ల తరలింపునకు యత్నాలు

- అమెరికా, ఇజ్రాయెల్ రహస్య చర్చలు
- ప్రధానంగా మూడు దేశాలపై దృష్టి

జెరూసలేం: ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం ముగిశాక గాజాలోని పాలస్తీనియన్లందరినీ వేరే ప్రాంతాలకు తరలిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన కార్యరూపం దాల్చే దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ ప్రతిపాదనకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సైతం మద్దతు ప్రకటించారు. ఇందులో భాగంగా గాజా బాధ్యతలను అమెరికా ప్రభుత్వం తీసుకోనుందని ట్రంప్ చెప్పారు. అక్కడున్న సుమారు 20 లక్షల మందికి ఇతర ప్రాంతాల్లో పునరావాసం కల్పిస్తామన్నారు. గాజాను పూర్తిగా బాగు చేసి, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. పాలస్తీనా వాసులతోపాటు, చాలా దేశాలు ఈ ప్రతిపాదనను ఖండించాయి. చట్టపర, నైతిక పరమైన పలు సమస్యలు ఇందులో ఉన్నాయని పేర్కొన్నాయి. ట్రంప్ ప్రతిపాదనను ఇటీవల సమావేశమైన అరబ్ దేశాల నేతలు తీవ్రంగా ఖండించడం తెల్సిందే. అంతేకాదు, గాజా పునర్నిర్మాణానికి ముస్లిం దేశాలన్నీ మరో ప్రణాళికను సైతం తెరపైకి తెచ్చాయి.

పట్టువదలని అమెరికా, ఇజ్రాయెల్

అభ్యంతరాలెదురైనా అమెరికా, ఇజ్రాయెల్ తమ పథకాన్ని అమల్లో పెట్టే ప్రయత్నాల్లో సీరియస్‌గా ఉండటం గమనార్హం. ఈ మేరకు గాజా వాసులకు పునరావాసం కల్పించేందుకు అవకాశమున్న తూర్పు ఆఫ్రికాలోని మూడు దేశాలను అమెరికా, ఇజ్రాయెల్ అధికారులు గుర్తించారు. ఇందులో భాగంగా సూడాన్, సొమాలియా, సొమాలియా నుంచి విడిపోయిన సొమాలీ ల్యాండ్ పాలకులతో చర్చలు జరుపుతున్నారు. హింసాత్మక ఘటనలతో అతలాకుతలమవుతున్న అత్యంత పేద దేశాలివి. అంతేకాదు, పాలస్తీనియన్లకు అత్యంత సుందరమైన ప్రదేశంలో నివాసాలు ఏర్పాటు చేస్తామన్న ట్రంప్ హామీకి పూర్తి విరుద్ధంగా ఉండే ప్రాంతాలివి. అమెరికా అధికారులు చేసిన ప్రతిపాదనలను తిరస్కరించినట్లు సూడాన్ తెలపగా, తమ దేశాల్లో పాలస్తీనియన్లకు పునరావాసంపై ఎలాంటి సమాచారం లేదని సొమాలియా, సొమాలీల్యాండ్ అధికారులు తెలపడం గమనార్హం. అయితే, గత నెల నుంచి సొమాలీల్యాండ్, సొమాలియా, సూడాన్‌లతో దౌత్య మార్గాల్లో రహస్యంగా చర్చలు జరుగుతున్నాయని ఓ అధికారి వెల్లడించారు. ఈ విషయంలో చర్చలు ఎంత వరకు వచ్చాయి, ఏ మేరకు పురోగతి సాధించిందీ వెల్లడించలేదు. ఈ చర్చల్లో ఇజ్రాయెల్ ప్రభుత్వమే ముందు చొరవ తీసుకుందన్నారు. గాజా వాసుల పునరావాసానికి అంగీకరించే పక్షంలో దౌత్యపరమైన, భద్రతా పరమైన, ఆర్థిక పరమైన పలు వెసులుబాట్లు కల్పిస్తామని ఆయా దేశాలకు ఇజ్రాయెల్, అమెరికా ఆశ చూపుతున్నాయి. దీనిపై వైట్ హౌస్, ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం స్పందించడం లేదు. అయితే, స్వచ్ఛందంగా ముందుకు వచ్చే గాజా వాసులను తరలించే విషయంలో గుర్తించిన కొన్ని ఆఫ్రికా దేశాలతో ప్రభుత్వం చర్చలు జరుపుతున్నట్లు ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ చెప్పారు. రక్షణ శాఖ పరిధిలో పనిచేసేలా ప్రత్యేకంగా ఇమిగ్రేషన్ విభాగాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదన కూడా ఉందని వివరించారు.

ట్రంప్ మొదటి విడత పాలనా కాలంలోనే ఇజ్రాయెల్, నాలుగు అరబ్ దేశాలకు దౌత్యపరంగా లాభసాటిగా ఉండే పలు ఒప్పందాలను కుదిర్చేటప్పుడే గాజా వాసుల తరలింపు ప్రస్తావన కూడా వచ్చిందని చెబుతున్నారు. అయితే, పాలస్తీనియన్ల తరలింపు కోసం ఎంపిక చేసుకున్న ఆఫ్రికాలోని ఆయా దేశాల పరిస్థితేంటో చూద్దాం...

సోమాలీల్యాండ్

ఆఫ్రికాలోని 30 లక్షల జనాభా కలిగిన పేద దేశం సొమాలీల్యాండ్. 30 ఏళ్ల క్రితం సొమాలియా నుంచి విడిపోయింది. దీనికి స్వతంత్ర దేశంగా అంతర్జాతీయ సమాజం ఇప్పటికీ గుర్తించలేదు. దీనిని ఇప్పటికీ తమ దేశంలోని భాగంగానే సొమాలియా భావిస్తోంది. ఈ క్రమంలోనే సొమాలీల్యాండ్‌ను స్వతంత్ర దేశంగా గుర్తిస్తూ ప్రకటన చేయడంతోపాటు మరికొన్ని వెసులుబాట్లు కల్పించడం, బదులుగా గాజా వాసులకు ఇక్కడ పునరావాసం కల్పించడమనే కీలక అజెండాపై చర్చలు సాగుతున్నాయని అమెరికా అధికారి ఒకరు వివరించారు. పొరుగు దేశం సొమాలియాతో పోలిస్తే ఎంతో ప్రశాంత వాతావరణం ఇక్కడ కనిపిస్తుంది.

యూఏఈ

అబ్రహాం ఒప్పందంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కూడా భాగస్వామిగా ఉంది. ఇజ్రాయెల్‌తో బలమైన సంబంధాలు కలిగిన దేశం. సొమాలీల్యాండ్‌లో సైనిక స్థావరం, ఒక నౌకాశ్రయం యూఏఈకి ఉన్నాయి. యెమెన్‌కు సమీపంలోని గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతంలో యూఏఈ ఉంది. యెమెన్‌లో హౌతీ తిరుగుబాటుదారులను కట్టడి చేసేందుకు అమెరికాకు యూఏఈ అవసరం ఎంతో ఉంది.

సొమాలియా

సొమాలియాలో తరచూ జరిగే అల్ ఖైదా అనుబంధ అల్ షబాబ్ ఉగ్ర సంస్థ దాడులతో అస్థిర పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, పాలస్తీనియన్లకు బలమైన మద్దతుదారు. పాలస్తీనియన్లు అంగీకరించినా వారికి పునరావాసం కల్పించేందుకు ఈ దేశం సిద్ధంగా లేదు. ఇదే విషయాన్ని ఇటీవలి అరబ్ దేశాల భేటీలో స్పష్టం చేసింది. అయితే, గాజా వాసులను సొమాలియాకు తరలించాలన్న ప్రతిపాదన వెనుక బలమైన నిగూఢ కారణాలు ఉండి ఉండొచ్చని విశ్లేషకులు అంటున్నారు. అయితే, పాలస్తీనియన్లకు పునరావాసంపై తమ ప్రభుత్వంతో ఎటువంటి చర్చలు జరగలేదని సొమాలియా అధికారి ఒకరు తెలిపారు.

సూడాన్

అబ్రహాం ఒప్పందంలో భాగంగా 2020లో ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలను సాధారణ స్థాయికి తీసుకువచ్చేందుకు అంగీకరించిన దేశాల్లో సూడాన్ ఒకటి. ఈ మేరకు ఉగ్రవాదానికి ఆజ్యం పోస్తున్న దేశాల జాబితా నుంచి అమెరికా సూడాన్‌ను తొలగించింది. దీంతో, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సాయం పొందేందుకు, అంతర్జాతీయ చట్టబద్ధ గుర్తింపునకు సూడాన్ అవకాశమేర్పడింది. అయితే, సూడాన్‌లోని ప్రభుత్వ బలగాలు, పారా మిలటరీకి మధ్య అంతర్యుద్ధం తీవ్ర రూపం దాల్చడంతో ఇజ్రాయెల్‌తో సూడాన్ సంబంధాలు ఇప్పటికీ గాడిన పడలేదు. పారా మిలటరీ బలగాలు జనహననానికి పాల్పడుతున్నట్లు జనవరిలో బైడెన్ ప్రభుత్వం ఆరోపించింది. ఇటువంటి దేశానికి వెళ్లేలా పాలస్తీనియన్లను ఒప్పించడం కష్ట సాధ్యమైన విషయమే. అయితే, రుణ బకాయిల రద్దు, సాంకేతిక, దౌత్య సహకారం అందిస్తామంటూ ఆశచూపి సూడాన్ ప్రభుత్వాన్ని దారికి తెచ్చుకునే అవకాశముంది. అయితే, ఈ ప్రతిపాదనపై తమ ప్రభుత్వం విముఖంగా ఉందని సూడాన్ అధికారులు తెలిపారు. ఏదేమైనా పాలస్తీనియన్లను సొంత ప్రదేశం నుంచి బయటకు తరలించే ఎటువంటి ప్రయత్నాన్నైనా తాము వ్యతిరేకిస్తామని సూడాన్ మిలటరీ చీఫ్ బుర్హాన్ సైతం గత వారం అరబ్ దేశాల నేతల సమావేశంలో కుండబద్దలు కొటారు.

పాలస్తీనా అనుకూల విద్యార్థుల బహిష్కరణ

కొలంబియా వర్సిటీ నిర్ణయం

న్యూయార్క్: కొలంబియా వర్సిటీలో గతేడాది జరిగిన పాలస్తీనా అనుకూల ఆందోళన సమయంలో వర్సిటీ భవనాన్ని ఆక్రమించుకున్నారన్న ఆరోపణలను ఎదుర్కొంటున్న పలువురు విద్యార్థులు సస్పెన్షన్‌కు గురయ్యారు. కొందరి డిప్లొమాలు రద్దయ్యాయి. గాజాపై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ గతేడాది విద్యార్థులు వర్సిటీలోని హామిల్టన్ హాల్‌ను ఆక్రమించుకున్నారు. వర్సిటీ ప్రాంగణంలో టెంట్లు ఏర్పాటు చేసి, నిరసనలకు దిగారు. ఈ పరిణామం దేశవ్యాప్తంగా వర్సిటీల్లో యూదు వ్యతిరేక, పాలస్తీనా అనుకూల ప్రదర్శనలకు ఆజ్యం పోసింది. వర్సిటీలో పరిణామాలను 'విద్యార్థుల విపరీత ప్రవర్తన'గా భావిస్తూ జ్యుడీషియల్ బోర్డు తీసుకున్న క్రమశిక్షణ చర్యలను వర్సిటీ గురువారం మెయిల్ ద్వారా ప్రకటించింది. అయితే, ఎందరిపై ఏమేం చర్యలు తీసుకున్నదీ అందులో వివరించలేదు. కాగా, ప్రముఖ పాలస్తీనా ఉద్యమకారుడు మహ్మద్ ఖలీల్‌ను గత శనివారం ఇమిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. పాలస్తీనా అనుకూల, యూదు వ్యతిరేకులపై చేపట్టనున్న నిర్బంధ చర్యల్లో ఇది ప్రారంభమని అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల స్పష్టం చేశారు. అదేవిధంగా, యూదు వ్యతిరేక కార్యకలాపాలను ఉపేక్షించినందుకు గాను వర్సిటీకి అందించే ఫెడరల్ గ్రాంట్లలో 400 మిలియన్ డాలర్ల మేర కోత విధిస్తున్నట్లు ప్రకటించారు. వర్సిటీ పాలనా భవనాన్ని ఆక్రమించుకున్నట్లు ఆరోపణలున్న విద్యార్థులపై చర్యలు తీసుకోలేమని మన్‌హట్టన్ జిల్లా అటార్నీ కార్యాలయం ప్రకటించింది. అయినప్పటికీ, వర్సిటీ అధికారులు ఆరోపణలెదుర్కొంటున్న విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించారు. అయితే, హామిల్టన్ హాల్‌కు ఆక్రమించుకున్న వారిలో ఖలీల్ లేనప్పటికీ, ఇజ్రాయెల్‌ను తీవ్రంగా విమర్శించినట్లు అతడు ఆరోపణలను ఎదుర్కొంటున్నాడు.

మహ్మద్ ఖలీల్‌ను విడుదల చేయాలి: యూదుల డిమాండ్

కొలంబియా వర్సిటీలో పాలస్తీనా అనుకూల ఆందోళనలకు సారథ్యం వహించిన మహ్మద్ ఖలీల్‌ను ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించడాన్ని యూదులు కొందరు గురువారం అధ్యక్షుడికి చెందిన ట్రంప్ టవర్‌లోకి చొచ్చుకెళ్లారు. ఇజ్రాయెల్‌కు మరిన్ని ఆయుధాలు ఇవ్వడం మానేయాలని డిమాండ్ చేశారు. మహ్మద్ ఖలీల్‌ను దేశం నుంచి బహిష్కరించొద్దని నినాదాలు చేశారు. పోలీసుల హెచ్చరికలను వారు లక్ష్యపెట్టలేదు. దీంతో, 98 మంది ప్రదర్శన కారులను అరెస్ట్ చేశారు.

ఐఎస్ఐకి రహస్యాలు లీక్

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి అరెస్ట్

ఫిరోజాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ నుంచి పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ సమాచారం అందిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సైనిక రహస్య సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరవేశాడన్న ఆరోపణలతో ఉత్తరప్రదేశ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (యూపీ ఏటీఎస్) ఆగ్రాకు చెందిన రవీంద్ర కుమార్, అతని అనుచరుడిని అదుపులోకి తీసుకుంది. రవీంద్ర కుమార్ ఫిరోజాబాద్‌లోని హజ్రత్‌పూర్‌కు చెందిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. హనీట్రాప్‌లో ఇరుక్కుని ఫ్యాక్టరీలోని రోజువారీ ఉత్పత్తి నివేదికలు, స్క్రీనింగ్ కమిటీ నుంచి రహస్య లేఖలు, పెండింగ్ రిక్వెస్ట్ లిస్ట్, డ్రోన్లు, గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలతో సహా అత్యంత రహస్య సమాచారాన్ని ఐఎస్ఐతో సంబంధం ఉన్న మహిళతో పంచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ఫేస్‌బుక్‌లో నేహా శర్మ ప్రొఫైల్ ఉన్న మహిళతో గతేడాది రవీంద్రకు పరిచయం ఏర్పడింది. పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలో పనిచేస్తున్నానని వెల్లడించిన ఆమె, ట్రాప్‌లో పడేలా చేసింది.

పెళ్లి తర్వాత హద్దుల్లో ఉండాలి

- భార్య అసభ్యకర చాటింగ్‌లను ఏ భర్త కూడా సహించలేడు
- మానసికంగా వేధిస్తున్న భార్య నుంచి విడాకులు సబబే
- తేల్చిచెప్పిన మధ్యప్రదేశ్ హైకోర్టు

భోపాల్: పెళ్లి తర్వాత మహిళలు గానీ, పురుషులు గానీ హద్దుల్లో ఉంటేనే బాగుంటుందని మధ్యప్రదేశ్ హైకోర్టు సూచించింది. స్నేహితులతో అసభ్యకరంగా చాటింగ్‌లు చేస్తూ కాలం గడిపితే జీవిత భాగస్వామి భరించలేరని తేల్చిచెప్పింది. ఒకవేళ భార్య తన మగ స్నేహితులతో లేదా మాజీ ప్రియుడితో అలాంటి చాటింగ్‌లు చేస్తే ఏ భర్త కూడా సహించే పరిస్థితి ఉండదని పేర్కొంది. మధ్యప్రదేశ్‌లో దంపతుల మధ్య చాటింగ్ వ్యవహారం చిచ్చు పెట్టింది. ఈ కేసు తొలుత ఫ్యామిలీ కోర్టుకు, తర్వాత హైకోర్టుకు చేరింది. 2018తో దంపతుల వివాహం జరిగింది. తన భార్య ఆమె స్నేహితులతో ఫోన్లలో విచ్చలవిడిగా చాటింగ్‌లు చేస్తూ తనను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ భర్త ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు. తమ శృంగార జీవితం గురించి మగ స్నేహితులతో భార్య చాటింగ్ చేస్తోందని ఆరోపించాడు. తనను మానసికంగా హింసిస్తున్న భార్య నుంచి విడాకులు మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై ఫ్యామిలీ కోర్టు సానుకూలంగా స్పందించింది. విడాకులకు అంగీకారం తెలియజేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ సదరు భార్య మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించింది. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ వివేక్ రూసియా, జస్టిస్ గజేంద్ర సింగ్‌తో కూడిన హైకోర్టు ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. భర్తను నిర్లక్ష్యం చేస్తూ మగ స్నేహితులతో అసభ్యకర చాటింగ్‌ల్లో మునిగి తేలుతున్న భార్య నుంచి విడాకులు ఇవ్వడం సమంజసమేనని స్పష్టంచేసింది. ఈ కేసులో భార్య దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. పెళ్లి తర్వాత కూడా ఇతరులతో సంభాషించే స్వేచ్ఛ భార్యాభర్తలకు ఉన్నప్పటికీ ఆ సంభాషణ మర్యాదపూర్వకంగా, గౌరవప్రదంగా ఉండాలి తప్ప అసభ్యకరంగా ఉండొద్దని ధర్మాసనం అభిప్రాయపడింది. మగ స్నేహితులతో భార్య, ఆడ స్నేహితులతో భర్త చేసే ఫోన్ చాటింగ్‌లు, వాట్సాప్ మెసేజ్‌లు జీవిత భాగస్వామిని నొప్పించేలా ఉండొద్దని వెల్లడించింది.

జడ్జీలు రిటైరైనా, రాజీనామా చేసినా ప్రయోజనాలు సమానం

బాంబే హైకోర్టు కీలక తీర్పు

ముంబై: జడ్జీలు రిటైరైనా, స్వచ్ఛందంగా రాజీనామా చేసినా ప్రయోజనాల్లో ఎలాంటి మార్పూ ఉండదని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు జడ్జీల(వేతనాలు, సేవా నిబంధనల)చట్టం–1954 ఇదే విషయాన్ని చెబుతోందని పేర్కొంది. రిటైర్‌మెంట్ అంటే ఒక వ్యక్తి కెరీర్ ముగింపు, ఇందులో స్వచ్ఛంద రాజీనామా కూడా భాగమేనని స్పష్టం చేసింది. హైకోర్టు మాజీ జడ్జి పుష్పా గనెడివాలా వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ భారతి డాంగ్రేల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. హైకోర్టు జడ్జీలతో సమానంగా ఆమెకు పింఛను చెల్లించాల్సిందేనని రిజిస్ట్రార్‌కు ఆదేశాలిచ్చింది. పోక్సో కింద దాఖలైన పిటిషన్లపై వివాదాస్పద తీర్పులు వెలువరించిన హైకోర్టు అదనపు న్యాయమూర్తి జస్టిస్ పుష్ప పదవీ కాలం ముగియడంతో ఫిబ్రవరి 22న ఆమెను తిరిగి జిల్లా సెషన్స్ జడ్జిగా నియమించారు. దీంతో ఆమె ఉద్యోగానికి రాజీనామా చేశారు. అయితే, రిటైరైన అదనపు న్యాయమూర్తి స్థాయి పింఛను ఇచ్చేందుకు హైకోర్టు రిజిస్ట్రార్ తిరస్కరించారు. ఈ నిర్ణయాన్ని ఆమె బాంబే హైకోర్టులో సవాల్ చేశారు. విచారించిన ధర్మాసనం హైకోర్టు అదనపు జడ్జి హోదాతో 2022 ఫిబ్రవరి 22 నుంచి ఆమెకు పింఛనును 6 శాతం వడ్డీతో రెండు నెలల్లోగా అందజేయాలని ఆదేశించింది.

రన్యా రావుకు బెయిల్ నిరాకరించిన ప్రత్యేక కోర్టు

జ్యుడీషియల్ కస్టడీ కొనసాగించాలని ఆదేశాలు • సెషన్స్ కోర్టును ఆశ్రయించనున్న రన్యా

బెంగళూరు: గోల్డ్ స్మగ్లింగ్ కేసులో నటి రన్యారావు బెయిల్ పిటిషన్‌ను ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు మరోసారి తిరస్కరించింది. అభియోగాలు తీవ్రంగా ఉన్నందున బెయిల్ ఇవ్వలేమని కోర్టు తేల్చి చెప్పింది. జస్టిస్ విశ్వనాథ్ సి గౌడర్ నేతృత్వంలోని కోర్టు ఆమె జ్యుడీషియల్ కస్టడీలోనే ఉండాలన్న ప్రాసిక్యూషన్ వాదనతో ఏకీభవించింది. కస్టడీ కొనసాగించాలని ఆదేశాలు చేసింది. హైప్రొఫైల్ గోల్డ్ స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన రన్యా రావు బెయిల్ కోసం మొదట మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించారు. అక్కడ ఆమె అభ్యర్థన తిరస్కరణకు గురైంది. దీంతో ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. మరోసారి తిరస్కరణకు గురైంది. దీంతో ఉపశమనం కోసం సెషన్స్ కోర్టును ఆశ్రయించేందుకు రన్యా న్యాయబృందం సిద్ధమవుతోంది. అప్పటివరకు ఆమె జ్యుడీషియల్ కస్టడీలోనే ఉంటారు. ఈ కేసులో రెండో నిందితుడు తరుణ్ రాజుకు కోర్టు 15 రోజుల రిమాండ్ విధించింది. రన్యా రావుకు రాజు సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో రాజును డీఆర్ఐ బుధవారం అరెస్టు చేసింది. తదుపరి విచారణ కోసం ప్రత్యేక కోర్టు అతడిని మూడు రోజుల కస్టడీకి అప్పగించింది. ఆ తర్వాత కోర్టు 15 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

ఔరంగజేబ్ పాలన కంటే దారుణం: రౌత్

ముంబై: మహారాష్ట్రలో బీజేపీ పాలన మొఘల్ పాలకుడు ఔరంగజేబ్ పాలన కంటే దారుణంగా ఉందని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఆరోపించారు. కాషాయ పార్టీ విధానాల ఫలితంగా రైతులు, నిరుద్యోగులు, మహిళలు బలవన్మరణాలకు పాల్పుతున్నారని విమర్శించారు. ఛత్రపతి శంభాజీ నగర్ జిల్లాలో ఉన్న ఔరంగజేబ్ సమాధిని తొలగించాలంటూ బీజేపీ నేతలు చేస్తున్న డిమాండ్లను ప్రస్తావిస్తూ.. ఎప్పుడో 400 ఏళ్ల క్రితమే ఔరంగ్‌జేబ్ చనిపోయాడు. ఆయన అనేక దుష్కృత్యాలకు పాల్పడ్డాడు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం చేస్తున్నదేమిటి? ఔరంగ్‌జేబ్ విధానాల కారణంగా మహారాష్ట్రలో రైతుల బలవన్మరణాలు జరుగుతున్నాయా?'అని రౌత్ ప్రశ్నించారు. ఔరంగజేబ్ సమాధి ఉన్న ప్రాంతాన్ని భారత ప్రభుత్వం రక్షిత ప్రాంతంగా ప్రకటించింది, దానిని తొలగించాలంటే న్యాయపరంగానే ముందుకు వెళ్లాల్సి ఉంటుందని రౌత్ చెప్పారు.

హోలీ అంటే మైనారిటీలు భయపడేట్టు చేశారు

మెహబూబా ముఫ్తీ ఆవేదన

శ్రీనగర్: కొందరు మతోన్మాదులు హోలీ వేడుకలంటే మైనారిటీలు భయపడేట్టుగా మార్చారని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధినేత్రి మెహబూబా ముఫ్తీ ఆరోపించారు. హిందువులు, ముస్లింలను ఒకరికొకరిని వ్యతిరేకంగా నిలబెట్టడం దేశానికి ప్రమాదకరమని ఆమె వ్యాఖ్యానించారు. శుక్రవారం హోలీ వేడుకలు, రంజాన్ జుమ్మా నమాజ్‌కు సంబంధించిన వివాదాలపై మెహబూబా స్పందించారు. ''హోలీ మనదేశ గంగా–జమునా తెహజీబ్‌కు ప్రతీక. పండుగ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తుంటాను. నా హిందూ స్నేహితులతో కలిసి అపారమైన ఆనందంతో ఉత్సాహంగా పండుగ జరుపుకోవడం నాకు గుర్తుంది. అయితే కొందరు మతోన్మాదులు ఇప్పుడు అధికారంలో ఉన్నవారి అండతో ఈ వేడుకను మైనారిటీలకు భయం కలిగించే అంశంగా మార్చారు. భారతీను మేల్కొల్పాల్సిన సమయం ఆసన్నమైంది. అందరికీ హోలీ శుభాకాంక్షలు'' అని ముఫ్తీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఒక చక్రం లేకుండా ల్యాండైన పాక్ విమానం

లాహోర్: పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్(పీఐఏ) విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. గురువారం ఉదయం కరాచీ నుంచి లాహోర్‌కు టేకాఫ్ తీసుకున్న పీకే–306 విమానం వెనుక చక్రాల్లో ఒకటి ఎక్కడో ఊడిపోయింది. అయినప్పటికీ లాహోర్‌లో ఎటువంటి ప్రమాదానికి గురికాకుండా సురక్షితంగానే ల్యాండవడం గమనార్హం. టేకాఫ్ సమయంలోనే ఆ చక్రం వదులుగా ఉన్నట్లు గుర్తించారని, కరాచీ విమానాశ్రయంలో చక్రానికి సంబంధించిన శకలాలను గుర్తించామని అధికారులు అంటున్నారు. ప్రయాణికులంతా దిగాక, తనిఖీల్లో చక్రం ఒకటి లేని విషయం బయటపడింది. చక్రం టేకాఫ్ తీసుకునేటప్పుడే ఊడిందా, మార్గమధ్యంలోనే పడిపోయిందా తేల్చేందుకు అధికారులు దర్యాప్తు చేపట్టారు.

26న చైనాలో ఎస్‌సీవో రక్షణ మంత్రుల భేటీ

బీజింగ్: షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) రక్షణ మంత్రుల సమావేశం ఈ నెల 26, 27వ తేదీల్లో క్వింగ్‌డావోలో జరుగుతుందని చైనా రక్షణ శాఖ ప్రతినిధి ఝాంగ్ జియోహోగాంగ్ చెప్పారు. రెండు రోజుల సమావేశాల సందర్భంగా సభ్య దేశాలు రక్షణ, భద్రతా పరమైన అంశాల్లో సహకారం పెంచుకునే అవకాశాలపై చర్చలు జరుపుతామన్నారు. ఎస్‌సీవోలో చైనా, రష్యా, భారత్, ఇరాన్, కజఖ్‌స్తాన్, కిర్గిజ్‌స్తాన్, పాకిస్తాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, బెలారస్ సభ్య దేశాలుగా ఉన్నాయి.

మాజీ ఎమ్మెల్యేపై ఆగంతకుల కాల్పులు

బిలాస్‌పూర్: హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే బంబేర్ ఠాకూర్‌పై కాల్పులు జరిగాయి. శుక్రవారం బిలాస్‌పూర్‌లోని నివాసంలో హోలీ ఉత్సవాలు జరుపుకుంటున్న సమయంలో అక్కడికి వచ్చిన నలుగురు దుండగులు తుపాకీలతో కాల్పులు జరిపారు. ఘటనలో ఠాకూర్‌తోపాటు ఆయన అంగరక్షకుడు గాయపడ్డారు. సుమారు 12 రౌండ్ల వరకు కాల్పులు జరిపిన అనంతరం దుండగులు మార్కెట్ వైపు పరుగు తీశారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాలికి బుల్లెట్ గాయమైన ఠాకూర్‌ను సిమ్లాలోని ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి, అంగరక్షకుడిని బిలాస్‌పూర్ ఎయిమ్స్‌కు తరలించారు.

చీటింగ్ కేసులో ఎమ్మెల్యేకు ఏడాది జైలు సబబే

చెన్నై: చీటింగ్ కేసులో తమిళనాడులోని పాపనాశం ఎమ్మెల్యే ఎంహెచ్ జవహిరుల్లా, మరో నలుగురికి ఏడాది కఠిన జైలు శిక్ష విధిస్తూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును శుక్రవారం మద్రాస్ హైకోర్టు సమర్థించింది. ఇందుకు సంబంధించి, 2011లో ఎగ్మోర్‌లోని అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ జవహిరుల్లా, హైదర్ అలీ, జీఎం షేక్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ పి.వేల్‌మురుగన్ కొట్టివేశారు. అయితే, వీరు అప్పీల్ చేసుకునేందుకు వీలుగా తీర్పు అమలును ప్రస్తుతానికి నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మనితనేయ మక్కల్ కట్చి(ఎంఎంకే)నేతగా ఉన్న జవహిరుల్లా తదితరులు 1997–2000 సంవత్సరాల మధ్య కోయంబత్తూర్ ముస్లిం రిలీఫ్ ఫండ్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. భారత ప్రభుత్వ అనుమతులు లేకుండానే విదేశాల నుంచి రూ.1.54 కోట్ల మేర నిధులను స్వీకరించారు. దీనిపై సీబీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టింది.

మధ్యప్రదేశ్‌లో రూ.6.2 కోట్ల గంజాయి పట్టివేత

మొరెనా: మధ్యప్రదేశ్ పోలీసులు శుక్రవారం పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకున్నారు. పశువుల దాణా మాటున లారీలో తరలిస్తున్న రూ.6.2 కోట్ల ఖరీదు చేసే 30 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఈ లారీ ఒడిశా నుంచి ఢిల్లీ వైపు వెళుతోందని పోలీసులు తెలిపారు. సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సవితాపూర్ వద్ద గురువారం రాత్రి తనిఖీలు చేపట్టగా లారీలో గంజాయి బయటపడిందన్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, వివరాలు రాబడుతున్నామన్నారు.

పాక్ మసీదులో పేలుడు.. నలుగురికి గాయాలు

పెషావర్: పాకిస్తాన్‌లోని కల్లోలిత ఖైబర్ ప్రావిన్స్‌లోని మసీదులో శుక్రవారం బాంబు పేలిన ఘటనలో మత పెద్ద సహా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దక్షిణ వజీరిస్తాన్‌లోని మౌలానా అబ్దుల్ అజీజ్ మసీదులో శుక్రవారం పెద్ద సంఖ్యలో జనం ప్రార్థనల్లో పాల్గొన్న సమయంలో మసీదు వేదిక వద్ద అమర్చిన మందు పాతర పేలిందని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రులకు తరలించామన్నారు. గత నెలలో ఇదే ప్రావిన్స్‌లో దారుల్ ఉలూమ్ హక్కానియా మసీదు ప్రాంగణంలో చోటుచేసుకున్న పేలుడులో మత గురువు సహా ఆరుగురు చనిపోయారు.

సూట్‌కేసులో మహిళ తల

పాల్ఘర్: మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో దారుణం జరిగింది. సూట్‌కేసులో ఓ మహిళ తల లభ్యమైంది. విరార్ ప్రాంతంలోని పిర్కుంద దర్గా సమీపంలో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. కొంతమంది స్థానిక పిల్లలు ఆడుకుంటుండగా పాడుబడిన సూట్‌కేస్ దొరికింది. అందులో ఏముందోనని వారు కుతూహలంతో తెరవడంతో.. మహిళ తల కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బందీని, నాలుగు మృతదేహాలను అప్పగిస్తాం: హమాస్

జెరూసలేం: తమ వద్ద బందీలుగా ఉన్న అమెరికన్–ఇజ్రాయెలీతోపాటు నలుగురి మృతదేహాలను అప్పగించనున్నట్లు హమాస్ శుక్రవారం ప్రకటించింది. మధ్యవర్తుల సూచనల మేరకు ఈ మేరకు అంగీకరించినట్లు వెల్లడించింది. మృతులు నలుగురూ అమెరికా, ఇజ్రాయెల్ ద్వంద్వ పౌరసత్వం ఉన్న వారేనని తెలిపింది. ఇడాన్ అలెగ్జాండర్ అనే సైనికుడిని, నలుగురి మృతదేహాలను ఎప్పుడు అప్పగించేదీ స్పష్టం చేయలేదు. హమాస్ ప్రకటనపై మధ్యవర్తిత్వం వహిస్తున్న దేశాలు స్పందించాల్సి ఉంది. ఇజ్రాయెల్–హమాస్ మధ్య మొదటి విడత కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన రెండు వారాల అనంతరం మరో ఒప్పందం కుదుర్చుకునే దిశగా ఖతార్ రాజధాని దోహాలో చర్చలు జరుగుతున్న వేళ హమాస్ ఈ మేరకు ప్రకటన చేయడం గమనార్హం. 2023 అక్టోబర్ 7న అపహరించుకు వెళ్లిన వారిలో ఇంకా 24 మంది సజీవంగా, మరో 35 మృతదేహాలు హమాస్ వద్ద ఉన్నట్లు అంచనా.

అత్యవసర పరిస్థితుల్లో అనివార్యమైన అధికారాలు!

భారత రాజ్యాంగంలో మూడు రకాలైన అత్యవసర పరిస్థితులను పేర్కొన్నారు. అసాధారణ పరిస్థితుల్లో దేశ సార్వభౌమత్వం, సమగ్రత, ఐక్యత, రక్షణలను పరిరక్షించడానికి అత్యవసర అధికారాలను పొందుపర్చారు. జాతి ప్రయోజనాల దృష్ట్యా కేంద్రానికి ప్రత్యేక అధికారాలు అనివార్యమని, వీటిని జాగ్రత్తగా వినియోగించాల్సి ఉంటుందని రాజ్యాంగ నిర్మాతలు పేర్కొన్నారు. వీటిని ప్రయోగించే అవసరమే ఉండకపోవచ్చని భావించి 'మృత ప్రకరణలు (డెడ్ ఆర్టికల్స్)'గా పరిగణించవచ్చని వ్యాఖ్యానించారు.

అత్యవసర అధికారాలు

దేశంలో నెలకొన్న కొన్ని ప్రత్యేక పరిస్థితుల (బాహ్య లేక అంతర్గత) దృష్ట్యా దేశ ఐక్యత, సమగ్రతకు ప్రమాదం వాటిల్లుతుందని భావిస్తే.. అలాంటి స్థితిని 'అత్యవసర పరిస్థితి'గా పరిగణిస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ అధికారాలు సంక్రమిస్తాయి.

అత్యవసర పరిస్థితికి సంబంధించిన అధికారాలను రాజ్యాంగంలో పొందుపరచాలని రాజ్యాంగ పరిషత్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, టి.టి. క్రిష్ణమాచారి సమర్థించారు. అత్యవసర అధికారాలను వ్యతిరేకించిన వారిలో ముఖ్యులు హెచ్.వి. కామత్, ప్రొఫెసర్ కె.టి. షా., పి.డి. దేశ్‌ముఖ్.

అత్యవసర పరిస్థితులు - రకాలు

రాజ్యాంగంలోని 18వ భాగంలో ప్రకరణ 352 నుంచి 360 వరకు మూడు రకాలైన అత్యవసర పరిస్థితులకు సంబంధించిన అంశాలను పేర్కొన్నారు.

1. జాతీయ అత్యవసర పరిస్థితి (National Emergency) - ప్రకరణ 352
2. రాజ్యాంగపరమైన అత్యవసర పరిస్థితి లేదా రాష్ట్రపతి పాలన (Constitutional Emergency) - ప్రకరణ 356
3. ఆర్థిక అత్యవసర పరిస్థితి (Financial Emergency) - ప్రకరణ 360

జాతీయ అత్యవసర పరిస్థితి

జాతీయ అత్యవసర పరిస్థితిని రెండు కారణాల వల్ల విధించవచ్చు.

ఎ) **బాహ్య కారణాలు:** విదేశీ దాడులు, యుద్ధం మొదలైన కారణాల వల్ల దేశ సమగ్రతకు భంగం కలిగినా, కలుగుతుందని రాష్ట్రపతి భావించినప్పుడు జాతీయ అత్యవసర పరిస్థితిని విధించవచ్చు.

బి) **అంతర్గత కారణాలు:** దేశంలో అంతర్గత కల్లోలం ఏర్పడినప్పుడు తద్వారా దేశ ఐక్యత, సమగ్రతకు భంగం వాటిల్లుతుందని రాష్ట్రపతి భావించినప్పుడు అత్యవసర పరిస్థితి ప్రకటిస్తారు. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా 'అంతర్గత కల్లోలం (Internal Disturbances)' అనే పదాన్ని తొలగించి 'సాయుధ తిరుగుబాటు (Armed Rebellion)' అనే పదాన్ని చేర్చారు. కాబట్టి, ప్రస్తుతం అంతర్గత కారణాల వల్ల అత్యవసర పరిస్థితి విధించాలంటే సాయుధ తిరుగుబాటు అనే కారణాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటారు.

జాతీయ అత్యవసర పరిస్థితిని దేశవ్యాప్తంగా లేదా దేశంలోని కొన్ని ప్రాంతాల్లో లేదా ఒక రాష్ట్రంలోగానీ, రాష్ట్రంలోని కొంత భాగంలోగానీ విధించవచ్చు. ఈ ఏర్పాటును 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు. ప్రధాన మంత్రి అధ్యక్షతన ఉన్న కేబినెట్ స్థాయి మంత్రుల లిఖితపూర్వక సలహా మేరకు రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తారు. 'కేబినెట్', 'లిఖితపూర్వక' అనే పదాలను 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 352లో చేర్చారు. ఈ సవరణ చేయడానికి ముందు 'మంత్రి మండలి సాధారణ సలహా' మాత్రమే ఉండేది.

రాష్ట్రపతి జారీ చేసిన అత్యవసర పరిస్థితిని పార్లమెంట్ 30 రోజుల్లోపు (జారీచేసిన రోజు నుంచి) ప్రత్యేక మెజార్టీతో ఆమోదించాలి. మౌలిక రాజ్యాంగంలో పార్లమెంట్ రెండు నెలల్లోగా ఆమోదించాలని ఉండేది. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా దీన్ని ఒక నెలకు తగ్గించారు.

రాష్ట్రపతి అత్యవసర పరిస్థితిని ప్రకటించే సమయానికి లోక్ సభ రద్దై ఉన్నా లేదా విధించిన రోజు నుంచి 30 రోజుల్లోపు అత్యవసర పరిస్థితిని ఆమోదించకుండా రద్దయినా తిరిగి కొత్త లోక్ సభ ఏర్పడిన రోజు నుంచి 30 రోజుల్లోపు రాష్ట్రపతి ఆదేశాన్ని లోక్ సభ ఆమోదించాల్సి ఉంటుంది. ఈ మధ్య కాలంలో రాజ్యసభ ఆ తీర్మానాన్ని ఆమోదించాలి. లేకుంటే 30 రోజుల తర్వాత అత్యవసర పరిస్థితి దానంతట అదే రద్దవుతుంది.

ఒకసారి పార్లమెంట్ ఆమోదిస్తే, జాతీయ అత్యవసర పరిస్థితి ఆరు నెలల వరకు అమల్లో ఉంటుంది (ఆమోదించిన రోజు నుంచి). పార్లమెంట్ అనుమతితో జాతీయ అత్యవసర పరిస్థితిని ఎన్ని



పర్యాయాలైనా పొడగించవచ్చు. ప్రతి పొడగింపు ఆరు నెలలే ఉండాలి.

రెండు వేర్వేరు కారణాల వల్ల అత్యవసర పరిస్థితి విధించడం - ప్రకరణ 352(9): రెండు వేర్వేరు కారణాల వల్ల ఒకేసారి అత్యవసర పరిస్థితి విధించడానికి మౌలిక రాజ్యాంగంలో అవకాశం లేదు. అయితే 1975లో 38వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ విధమైన అవకాశం కల్పించారు.

ఉదా: 1971లో బాహ్య కారణాల వల్ల విధించిన అత్యవసర పరిస్థితి 1977 వరకు కొనసాగింది. ఈ పరిస్థితి అమల్లో ఉండగానే అంతర్గత కారణాల ప్రాతిపదికన అత్యవసర పరిస్థితిని 1975 జూన్ 26న విధించారు.

జాతీయ అత్యవసర పరిస్థితి రద్దు - ప్రకరణ 352(7, 8): రాష్ట్రపతి మరో ఆదేశం ద్వారా జాతీయ అత్యవసర పరిస్థితిని రద్దు చేయవచ్చు. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ప్రకారం, జాతీయ అత్యవసర పరిస్థితి రద్దుకు సంబంధించిన తీర్మానాన్ని లోక్ సభ ఆమోదించిన తర్వాత రాష్ట్రపతి రద్దు చేస్తారు.

లోక్ సభ ప్రత్యేక తీర్మానం: ఒకవేళ లోక్ సభ ఆ సమయానికి సమావేశంలో లేకపోతే, లోక్‌సభలోని మొత్తం సభ్యుల్లో 1/10వ వంతు సభ్యులు,

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

లోక్ సభ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయమని రాష్ట్రపతికి నోటీసు ఇస్తారు. నోటీసు ఇచ్చిన 14 రోజుల లోపల రాష్ట్రపతి లోక్ సభ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు.

జాతీయ అత్యవసర పరిస్థితి పర్యవసానాలు

జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటించినప్పుడు అది కింద పేర్కొన్న విధంగా దేశంలో వివిధ అంశాలపై ప్రభావం చూపుతుంది.

1. **కేంద్ర - రాష్ట్ర సంబంధాలపై ప్రభావం:** జాతీయ అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు కేంద్ర, రాష్ట్ర సంబంధాల మధ్య మౌలిక మార్పులు సంభవిస్తాయి. అవి:

- కేంద్ర కార్య నిర్వాహక వర్గం అధికారాలు విస్తృతమవుతాయి.
- కేంద్రం రాష్ట్రాలకు అన్ని అంశాలపై ఆదేశాలు జారీ చేస్తుంది.
- రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు కావుగానీ, వాటి అధికారాలన్నీ కేంద్రం నియంత్రణలోకి వస్తాయి.
- రాష్ట్ర జాబితాలోని అన్ని అంశాలపై, పార్లమెంట్ చట్టాలు చేయవచ్చు. కానీ రాష్ట్ర శాసన సభలు రద్దు కావు.
- పైన పేర్కొన్న విధంగా రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చేసిన చట్టాలు అత్యవసర పరిస్థితి రద్దు చేసిన తర్వాత ఆరు నెలల వరకు అమల్లో ఉంటాయి. ఆరు నెలల తర్వాత రద్దవుతాయి.
- కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలు కూడా ప్రభావితమవుతాయి. సాధారణ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్రాల మధ్య విభజితమయ్యే వనరులు రద్దు కావచ్చు లేదా వీటిని కేంద్రానికి బదలాయించవచ్చు.

2. **లోక్ సభ, రాష్ట్ర శాసనసభలపై ప్రభావం:** జాతీయ అత్యవసర పరిస్థితుల్లో లోక్ సభ సాధారణ పదవీకాలాన్ని ఏడాది వరకు పొడగించవచ్చు. ఇలా ఎన్ని పర్యాయాలైనా చేయవచ్చు. అయితే అత్యవసర పరిస్థితి రద్దయిన తర్వాత ఆరు నెలల కంటే ఎక్కువ పొడగించడానికి వీల్లేదు.

ఉదా: 1975లో 5వ లోక్ సభ పదవీ కాలాన్ని పొడగించారు. 5వ లోక్ సభ 1976 మార్చి 19కి ముగియాల్సి ఉంది. అయితే దీన్ని 1977 మార్చి 18 వరకు పొడగించారు. అదేవిధంగా మరోసారి 1978 మార్చి 18 వరకు పొడగించారు. కానీ ఇది మధ్యలోనే (1977 జనవరి 18న) రద్దయింది. ఈ విధంగా మొత్తానికి అయిదో లోక్ సభ 5 సంవత్సరాల 10 నెలల 6 రోజులు కొనసాగింది. ఇదే సుదీర్ఘ లోక్ సభ.

ఇదేవిధంగా రాష్ట్ర శాసనసభ పదవీ కాలాన్ని కూడా పార్లమెంట్ ఏడాది వరకు పొడగించవచ్చు. ఇలా ఎన్ని పర్యాయాలైన చేయవచ్చు.

ఉదా: అత్యవసర పరిస్థితి కారణంగా ఆంధ్రప్రదేశ్ అయిదో అసెంబ్లీని కూడా 1977 నుంచి 78 వరకు ఏడాది పాటు పొడగించారు. ఇదేవిధంగా కేరళ అసెంబ్లీ పదవీ కాలాన్ని కూడా రెండుసార్లు పొడగించారు.

3. **ప్రాథమిక హక్కులపై ప్రభావం:** జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటించినప్పుడు ప్రాథమిక హక్కులపై ప్రభావాన్ని ప్రకరణ 358, 359లో వివరించారు.

- ప్రకరణ 19లో పేర్కొన్న ప్రాథమిక హక్కులపై అత్యవసర పరిస్థితి ప్రభావాన్ని ప్రకరణ 358 తెలియజేస్తుంది. దీని ప్రకారం.. జాతీయ అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు ప్రకరణ 19లో పేర్కొన్న ఆరు వ్యక్తిగత స్వేచ్ఛలు వాటంతట అవే రద్దవుతాయి. ప్రభుత్వం ఈ స్వేచ్ఛలపై పూర్తిగా పరిమితులు విధించవచ్చు. ప్రాథమిక హక్కులకు భంగం కలిగిందని న్యాయస్థానాలను ఆశ్రయించడానికి వీల్లేదు.
- అత్యవసర పరిస్థితి ఎత్తేసిన తర్వాత ప్రకరణ 19లోని స్వేచ్ఛలు వాటంతట అవే పునరుద్ధరితమవుతాయి. అయితే రద్దయిన కాలంలో జరిగిన సంఘటనలు లేదా ఉల్లంఘనలను ప్రశ్నిస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి వీల్లేదు.
- 44వ రాజ్యాంగ సవరణ (1978) ద్వారా ఈ స్వేచ్ఛలపై కొన్ని పరిమితులు విధించారు. బాహ్య కారణాల వల్ల అత్యవసర పరిస్థితిని ప్రకటించినప్పుడు మాత్రమే ప్రకరణ 19లోని స్వేచ్ఛలు పరిమితమవుతాయి. సాయుధ తిరుగుబాటు కారణంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించినప్పుడు వీటిపై ప్రభావం ఉండదు. అత్యవసర పరిస్థితికి సంబంధించిన చట్టాలకు మాత్రమే పరిరక్షణ ఉంటుంది. ఇతర చట్టాల ద్వారా స్వేచ్ఛలపై పరిమితులు విధించడానికి వీల్లేదు.

ప్రకరణ 359 ఇతర ప్రాథమిక హక్కులపై ప్రభావాన్ని గురించి తెలియజేస్తుంది.

- ప్రకరణ 359 ప్రకారం, జాతీయ అత్యవసర పరిస్థితి విధించినప్పుడు ప్రాథమిక హక్కులు వాటంతట అవే రద్దు కావు. నిర్దేశిత కాలపరిమితికి ఒక నోటిఫికేషన్ ద్వారా వాటి అమలును రాష్ట్రపతి రద్దు చేస్తారు. ఈ సందర్భంలో ప్రాథమిక హక్కుల అమలు మాత్రమే రద్దవుతుంది.
- ప్రకరణ 359 ప్రకారం జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటిస్తే 20, 21 ప్రకరణలకు రద్దు నుంచి మినహాయింపు ఉంటుంది.
- 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 359 ప్రభావాన్ని కొంతవరకు పరిమితం చేశారు.
- ప్రకరణ 20, 21 అమలును రద్దు చేయడానికి రాష్ట్రపతికి అధికారం లేదు.
- ప్రకరణ 20, 21లో పేర్కొన్న హక్కులకు భంగం కలిగినప్పుడు పౌరులు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. అత్యవసర పరిస్థితికి సంబంధించిన చట్టాలను మాత్రమే న్యాయ సంరక్షణ నుంచి మినహాయించారు. ఇతర చట్టాల విషయంలో తమ హక్కులకు భంగం కలిగినప్పుడు పౌరులు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు.

ప్రకరణ 358, 359ల మధ్య వ్యత్యాసం

ప్రకరణ 358	ప్రకరణ 359
1. దీని ప్రభావం ప్రకరణ 19లో ప్రస్తావించిన వ్యక్తిగత స్వేచ్ఛలకు మాత్రమే పరిమితం.	1. దీని ప్రభావం ప్రాథమిక హక్కులన్నింటికీ వర్తిస్తుంది.
2. ఈ సందర్భంలో ప్రకరణ 19లో పేర్కొన్న వ్యక్తిగత స్వేచ్ఛలు అత్యవసర పరిస్థితి విధించిన వెంటనే వాటంతట అవే రద్దవుతాయి.	2. దీని ప్రకారం ప్రాథమిక హక్కులు అత్యవసర పరిస్థితిని ప్రకటించిన వెంటనే వాటంతట అవే రద్దు కావు. రాష్ట్రపతి వాటి అమలును రద్దు చేస్తూ ప్రత్యేక ఆదేశాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.
3. దీని ప్రభావం బాహ్య కారణాల వల్ల విధించిన అత్యవసర పరిస్థితికే పరిమిత మవుతుంది.	3. దీని ప్రభావం బాహ్య కారణాలు, అంతర్గత కారణాలతో విధింపునకు కూడా వర్తిస్తుంది.
4. దీని ప్రకారం అత్యవసర పరిస్థితి ఉన్నంతవరకూ ప్రాథమిక హక్కులపై ప్రభావం ఉంటుంది.	4. దీని ప్రభావం రాష్ట్రపతి నిర్ణయించిన సమయం వరకు మాత్రమే ఉంటుంది. అత్యవసర పరిస్థితి ఉన్నప్పటికీ ప్రాథమిక హక్కుల అమలు రద్దు చేయకపోవచ్చు.
5. దీని ప్రభావం దేశం మొత్తానికి వర్తిస్తుంది.	5. దీని ప్రభావాన్ని దేశం మొత్తానికిగానీ, కొన్ని ప్రాంతాలకుగానీ వర్తింపచేయవచ్చు.

జాతీయ అత్యవసర పరిస్థితి విధించిన సందర్భాలు

జాతీయ అత్యవసర పరిస్థితిని ఇంతవరకూ మూడు పర్యాయాలు విధించారు. రెండు పర్యాయాలు బాహ్య కారణాలు, ఒక పర్యాయం అంతర్గత కారణాల వల్ల విధించారు.

అత్యవసర పరిస్థితి కాలం	కారణం	నాటి రాష్ట్రపతి	నాటి ప్రధాని
1962 అక్టోబర్ 26 నుంచి 1968 జనవరి 10	చైనా దురాక్రమణ	సర్వేపల్లి రాధాకృష్ణన్	నెహ్రూ
1971 డిసెంబర్ 3 నుంచి 1977 మార్చి 21	పాకిస్థాన్ దాడి	వి.వి. గిరి	ఇందిరాగాంధీ
1975 జూన్ 25 నుంచి 1977 మార్చి 21	అంతర్గత కల్లోలం	ఫక్రుద్దీన్ అలీ అహ్మద్	ఇందిరాగాంధీ

- 1965లో పాకిస్థాన్‌తో యుద్ధం జరిగినప్పటికీ, ప్రత్యేకంగా అత్యవసర పరిస్థితిని విధించాల్సిన పరిస్థితి ఏర్పడలేదు. కారణం, 1962లో విధించిన అత్యవసర పరిస్థితి 1968 వరకు కొనసాగింది.
- మూడో పర్యాయం అంతర్గత కారణాల వల్ల జూన్ 25, 1975లో విధించారు. ఇది 1977 మార్చి వరకు కొనసాగింది. అయితే ఒక సమయంలో రెండు వేర్వేరు కారణాల వల్ల రెండు రకాలైన అత్యవసర పరిస్థితి విధించే సందర్భం మౌలిక రాజ్యాంగంలో లేదు. కానీ 1975లో 38వ రాజ్యాంగ సవరణ ద్వారా నిబంధన 352కు సవరణ చేసి ఒకే సమయంలో రెండు రకాలైన అత్యవసర పరిస్థితులను ప్రకటించే వీలును కల్పించారు.

మొట్టమొదటి భారతీయ అణు రియాక్టర్

భారతదేశం - శక్తి సంపద

శక్తి ఒక ముఖ్య వనరు మాత్రమే కాకుండా ఆధునిక కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే ప్రథమ కారకం. ఒక దేశం వ్యవసాయకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి శక్తి సంపద ఎంతో అవసరం. ప్రస్తుతం మానవ జీవితం శక్తి వనరులపై ఎంతో ఆధారపడింది. మానవ జీవితావసరానికి రూపొందించే ప్రతి వస్తు ఉత్పత్తి ఈ శక్తిపైనే ఆధారపడి ఉంటుంది. శక్తి వనరులను రెండు రకాలుగా విభజించొచ్చు. అవి

1. సంప్రదాయ శక్తి వనరులు/తరిగిపోయే శక్తి వనరులు
2. సంప్రదాయేతర/తరిగిపోని శక్తి వనరులు

1. **సంప్రదాయ/తరిగిపోయే శక్తి వనరులు:**

- బొగ్గు, చమురు, సహజవాయువు, అణుశక్తిని ఉత్పత్తి చేసే యురేనియం, థోరియం వంటి ఖనిజాలు మొదలైన వాటిని సంప్రదాయ శక్తి వనరులు అంటారు.
- వీటి నిల్వలు ప్రకృతిలో నిర్దిష్ట పరిమాణంలో మాత్రమే ఉన్నందున వాడుతూ ఉంటే క్రమేణా తరిగిపోతాయి.
- ఇవి తరిగిపోతే మానవుడు పునరుద్ధరించలేడు. కాబట్టి వచ్చే తరాలను దృష్టిలో పెట్టుకొని వీటిని క్రమబద్ధంగా వినియోగించుకోవాలి.

2. **సంప్రదాయేతర/తరిగిపోని శక్తి వనరులు:**

- నీరు, సౌరశక్తి, పవన శక్తి, వేలా తరంగాలు, భూతాప శక్తి మొదలైన వాటిని సంప్రదాయేతర శక్తి వనరులుగా పరిగణిస్తారు.
- ఇవి ప్రకృతిలో నిరంతరం లభ్యమవుతాయి. కాబట్టి తరిగిపోవడమనే సమస్యే లేదు.
- అయితే వీటిని శక్తి ఉత్పాదకతకు ఉపయోగించుకోవాలంటే సాంకేతికాభివృద్ధితో మాత్రమే సాధ్యపడుతుంది.
- మనదేశంలో నేలబొగ్గు, చమురు, కర్ర బొగ్గు, నీరు ప్రధాన శక్తి వనరులు. సూర్యరశ్మి, గాలి మొదలైన వనరుల వాడకం ఇప్పుడిప్పుడే అభివృద్ధి దశలో ఉంది. అలాగే అణుశక్తి కూడా మంచి అభివృద్ధి దశలో ఉందని చెప్పొచ్చు. వీటన్నింటిలోనూ బొగ్గు చాలా ముఖ్యమైన శక్తి ఉత్పాదక వనరు. ఆ తర్వాత స్థానం జలశక్తి ఆక్రమిస్తుంది.
- మనదేశంలో మొదటిసారి విద్యుచ్ఛక్తి తయారీ డార్జిలింగ్ (పశ్చిమ బంగా)లో 1897లో ప్రారంభమైంది. ఆ తర్వాత 1902లో కర్ణాటకలోని శివసముద్రం వద్ద జల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- స్వాతంత్ర్యానంతరం 'విద్యుచ్ఛక్తి చట్టం 1948'లో ప్రవేశపెట్టి విద్యుచ్ఛక్తిని ప్రభుత్వ రంగ



పరిధిలోకి తెచ్చారు.

- 1975లో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, 'నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్'ల ఏర్పాటుతో దేశంలో విద్యుచ్ఛక్తి రంగంలో గణనీయమైన అభివృద్ధి జరిగింది.
- మనదేశంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి 1947లో 1400 మెగావాట్లు ఉంటే, 2005-06 నాటికి 1,19,607 మె.వాట్లకు చేరింది.

థర్మల్ విద్యుత్

- బొగ్గు, నీటి ఆవిరి ఆధారంగా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను థర్మల్ విద్యుత్ అంటారు. దేశంలో సుమారు 73 శాతం ఉత్పత్తితో థర్మల్ విద్యుత్ మొదటి స్థానంలో ఉంది.
- థర్మల్ విద్యుత్‌ను ఎక్కువగా మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ఉత్పత్తి చేస్తున్నాయి.
- వేయి మెగావాట్ల కంటే ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన పవర్ స్టేషన్‌ను సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్టీపీఎస్) అంటారు. ఇవి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) ఆధ్వర్యంలో ఉంటాయి.
- 4000 మె.వాట్ల కంటే ఎక్కువ థర్మల్ విద్యుత్ సామర్థ్యం ఉంటే వాటిని 'అల్ట్రా మెగా పవర్ ప్లాంట్' (యూఎంపీపీ) అంటారు.

భారతదేశంలో సూపర్ థర్మల్ పవర్ స్టేషన్లు

ఎస్టీపీఎస్	రాష్ట్రం
1. సింగ్రౌలి	ఉత్తరప్రదేశ్
2. దాద్రి	ఉత్తరప్రదేశ్
3. రీహాండ్	ఉత్తరప్రదేశ్
4. వూంచహార్	ఉత్తరప్రదేశ్
5. సింహాద్రి	ఆంధ్రప్రదేశ్
6. రామగుండం	తెలంగాణ
7. వింద్యాచల్ -1	మధ్యప్రదేశ్
8. వింద్యాచల్-2	మధ్యప్రదేశ్
9. కోర్బా	ఛత్తీస్‌గఢ్
10. కహల్‌గావ్	బీహార్
11. తాల్చేర్	ఒడిశా
12. కాయంకుళం	కేరళ
13. ఫరక్కా	పశ్చిమ బంగా

భారతదేశంలో అల్ట్రా మెగా పవర్ ప్లాంట్స్

యూఎంపీపీ	రాష్ట్రం
1. ముంద్రా	గుజరాత్
2. తాద్రి	కర్ణాటక
3. గిర్యా	మహారాష్ట్ర
4. ససన్	మధ్యప్రదేశ్
5. ఇబ్ నదీ లోయ	ఒడిశా
6. కృష్ణపట్నం (నెల్లూరు)	ఆంధ్రప్రదేశ్

అణు విద్యుత్

అణు విద్యుదుత్పత్తికి అవసరమైన యురేనియం, థోరియం, ఇల్మనైట్, మోనజైట్ ఖనిజాలు భారతదేశంలో తగినంతగా లభిస్తున్నాయి.

- జార్ఖండ్‌లోని రాణి మేఖలలో, రాజస్థాన్‌లోని 'ఆరావళి' పర్వత ప్రాంతంలో యురేనియం లభిస్తోంది.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

- బీహార్‌లో గయ, రాజస్థాన్‌లో జైపూర్, ఉదయ్‌పూర్, ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు జిల్లాల్లో యురేనియం నిల్వలున్నాయి.
- జార్ఖండ్‌లోని 'జాదుగూడ'లో యురేనియాన్ని శుద్ధి చేసే ప్లాంట్ ఉంది.
- కేరళ తీరం వెంట ఉన్న మోనజైట్ ఇసుక ల్లో థోరియం నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి.
- ప్రపంచంలోని థోరియం నిక్షేపాల్లో 50 శాతంపైగా భారతదేశంలోనే ఉన్నాయి.
- ప్రస్తుతం భారతదేశ అణు విద్యుత్ సామర్థ్యం 4780 మె.వా. ఇది దేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తం ఉత్పత్తిలో సుమారు 3 శాతం.
- ప్రపంచంలో అణు విద్యుత్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశం ఫ్రాన్స్.

భారతదేశంలోని అణు విద్యుత్ కేంద్రాలు

1. **తారాపూర్ అణు విద్యుత్ కేంద్రం (టీఏపీఎస్) (మహారాష్ట్ర):**

- భారతదేశంలో ఏర్పాటు చేసిన మొదటి అణు విద్యుత్ కేంద్రం.
- 1969, అక్టోబర్ 28న దీన్ని స్థాపించారు.
- ఇక్కడ ఉన్న అణు రియాక్టర్ పేరు - అప్సర.
- ఈ కేంద్రం అణు విద్యుత్ సామర్థ్యం - 1400 మె.వాట్లు.

2. **రావత్ భటా అణు విద్యుత్ కేంద్రం (ఆర్ఏపీఎస్) (రాజస్థాన్):**

- ఈ కేంద్రాన్ని పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించారు.
- 1973, డిసెంబర్ 16న రాజస్థాన్‌లో నెలకొల్పారు.
- 'కోటా అణు విద్యుత్ కేంద్రం' అని కూడా అంటారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 1180 మె.వాట్లు.

3. **కల్పకం అణు విద్యుత్ కేంద్రం (ఎంఏపీఎస్) (తమిళనాడు):**

- 1984, జనవరి 24న తమిళనాడులోని కల్పకం వద్ద ఏర్పాటు చేశారు.
- మద్రాస్ అటామిక్ పవర్ స్టేషన్ (ఎంఏపీఎస్) అని, 'ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్' అని కూడా అంటారు.
- ఇక్కడ ఉన్న అణు రియాక్టర్ పేరు - కామిని, ఈ రియాక్టర్ ద్వారా ప్లూటోనియాన్ని ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.
- అణు విద్యుత్ సామర్థ్యం - 440 మె.వా.

4. **నరోరా అణు విద్యుత్ కేంద్రం (ఎన్ఏపీఎస్) (ఉత్తరప్రదేశ్):**

- ఉత్తరప్రదేశ్‌లోని నరోరా వద్ద 1991, జనవరి 1న దీన్ని ఏర్పాటు చేశారు.
- దీని ద్వారా ప్రధానంగా ఢిల్లీకి విద్యుత్‌ను అందిస్తున్నారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 440 మె.వా.

5. **కాక్రపార అణు విద్యుత్ కేంద్రం (కెఏపీపీ) (గుజరాత్):**

- గుజరాత్‌లోని కాక్రపార ప్రాంతంలో 1993, మే 6న నెలకొల్పారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 440 మె.వా.

6. **కైగా అణు విద్యుత్ కేంద్రం (కెజీపీ) (కర్ణాటక):**

- కర్ణాటక రాష్ట్రంలోని 'కైగా' ప్రాంతంలో 2000, నవంబర్ 16న స్థాపించారు.

భారతదేశంలో భారజల కేంద్రాలు

భారజల కేంద్రం	రాష్ట్రం
1. కోటా	రాజస్థాన్
2. తాల్చేర్	ఒడిశా
3. థాల్	మహారాష్ట్ర
4. బరోడా	గుజరాత్
5. ట్యుటికోరిన్	తమిళనాడు
6. హజీరా	మధ్యప్రదేశ్
7. మణుగూరు	తెలంగాణ

- అణు విద్యుత్ సామర్థ్యం 850 మె.వా.
- తమిళనాడులోని 'కూడంకుళం' వద్ద రష్యా సహాయంతో వేయి మెగావాట్లతో రెండు అణు రియాక్టర్లను నిర్మిస్తున్నారు.
- అణు విద్యుత్ కర్మాగారంలో మితకారిగా 'భారజలం'ను ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చు.
- భారతదేశంలో 1962లో మొట్టమొదటి 'భారజల కేంద్రాన్ని' 'నంగల్' (ఉత్తరప్రదేశ్)లో ఏర్పాటు చేశారు.

మాదిరి ప్రశ్నలు

1. మొట్టమొదటి భారతీయ అణు రియాక్టర్ పేరు?
   1) ఊర్వశి 2) కామిని
   3) రోహిణి 4) అప్సర
2. యురేనియం శుద్ధి ప్లాంట్‌ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) ట్రాంబే 2) తారాపూర్
   3) జాదుగూడ 4) కల్పకం
3. కామిని అణు రియాక్టర్ ఎక్కడ ఉంది?
   1) కల్పక్కం అణు విద్యుత్ కేంద్రం
   2) తారాపూర్ అణు విద్యుత్ కేంద్రం
   3) కైగా అణు విద్యుత్ కేంద్రం
   4) నరోరా అణు విద్యుత్ కేంద్రం
4. సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్టీపీఎస్) అంటే?
   1) 4000 మె.వా. కంటే ఎక్కువ గల ప్రాజెక్టు
   2) 1000 మె.వా. కంటే ఎక్కువ గల ప్రాజెక్టు
   3) 1000 మె.వా. కంటే తక్కువ గల ప్రాజెక్టు
   4) ఏదీకాదు
5. 'ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్' ఎక్కడ ఉంది?
   1) మహారాష్ట్ర 2) ఉత్తరప్రదేశ్
   3) తమిళనాడు 4) గుజరాత్
6. వీటిలో ఏది సంప్రదాయ వనరు కాదు?
   1) బొగ్గు 2) ముడిచమురు
   3) సౌర శక్తి 4) అణు శక్తి
7. మనదేశంలో మొట్టమొదటిసారిగా (1897) విద్యుచ్ఛక్తి ఏ ప్రాంతంలో ప్రారంభమైంది?
   1) శివ సముద్రం 2) డార్జిలింగ్
   3) తాల్చేర్ 4) నంగల్
8. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)ని ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 1948 2) 1962 3) 1980 4) 1975
9. 'రీహాండ్' సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ ఏ రాష్ట్రంలో ఉంది?
   1) ఉత్తరప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
   3) ఛత్తీస్‌గఢ్ 4) కేరళ
10. దేశంలో నాలుగో అణు విద్యుత్ కేంద్రం 'నరోరా' ఎక్కడ ఉంది?
    1) గుజరాత్ 2) రాజస్థాన్
    3) తమిళనాడు 4) ఉత్తరప్రదేశ్
11. వీటిలో ఏ శక్తి వనరు సంప్రదాయేతర శక్తి వనరు కాదు?
    1) సూర్యరశ్మి 2) అణుశక్తి
    3) పవన శక్తి 4) వేలా తరంగాలు
12. వీటిలో థర్మల్ పవర్ స్టేషన్‌ల్లో సరి కానిది?
    1) ఉత్తరప్రదేశ్ - దాద్రి
    2) పశ్చిమ బెంగాల్ - ఫరక్కా
    3) ఛత్తీస్‌గఢ్ - వూంచహార్
    4) కేరళ - కాయంకుళం
13. ససన్ థర్మల్ ప్రాజెక్టు ఏ రాష్ట్రంలో ఉంది?
    1) మహారాష్ట్ర 2) మధ్యప్రదేశ్
    3) కర్ణాటక 4) ఒడిశా
14. భారతదేశంలో మొట్టమొదటి భారజల కేంద్రాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1975 2) 1948 3) 1962 4) 1972
15. 'కోటా' భారజల కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) రాజస్థాన్ 2) ఒడిశా
    3) మహారాష్ట్ర 4) గుజరాత్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 1; 4) 2; 5) 3; 6) 3; 7) 2; 8) 4; 9) 1; 10) 4; 11) 2; 12) 4; 13) 2; 14) 3; 15) 1.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
శనివారం। 15-3-2025

ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనామిక్స్ అనే గ్రంథాన్ని రచించింది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఎకానమీ



అర్థశాస్త్రం - పరిధి

- అర్థశాస్త్రం అనే పదం గ్రీకు భాషలోని 'OIKOS', 'NEMEIN' అనే రెండు పదాల నుంచి ఆవిర్భవించింది. OIKOS అంటే ఇల్లు, NEMEIN' అంటే నిర్వహణ. గృహ, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణలో నైపుణ్యమని అర్థం. అర్థశాస్త్ర పితామహుడు 'ఆడమ్‌స్మిత్' అర్థశాస్త్రాన్ని సంపదకు సంబంధించిన శాస్త్రంగా నిర్వచించారు. ఆయనకు ముందు అర్థశాస్త్రాన్ని రాజనీతి ఆర్థిక వ్యవస్థగా పిలిచేవారు. ఆడమ్ స్మిత్ రచించిన 'దేశాల సంపద, స్వభావం, కారణాల పరిశోధన' 1776లో ప్రచురితమైన తర్వాత అర్థశాస్త్రం ప్రత్యేక శాస్త్రంగా రూపొందింది. 'సామాజిక శాస్త్రాల్లో అర్థశాస్త్రం రాణి వంటిది' అని పాల్ శామ్యూల్‌సన్ పేర్కొన్నారు.
- మానవుడు, అతని శ్రేయస్సును గురించి అధ్యయనం చేసే శాస్త్రం.. అర్థశాస్త్రమని ఆల్‌ఫ్రెడ్ మార్షల్ నిర్వచించారు. అమర్త్యసేన్ - సంక్షేమ ఆర్థిక శాస్త్రం గురించి వివరించారు. ఆడమ్ స్మిత్‌తో సహా సంప్రదాయ ఆర్థికవేత్తలందరూ అర్థశాస్త్రం సంపదకు సంబంధించిన శాస్త్రమని అభిప్రాయపడ్డారు. అర్థశాస్త్రానికి ఒక నిర్దిష్టమైన నిర్వచనాన్ని ఇచ్చిన మొదటి వ్యక్తి ఆడమ్‌స్మిత్. సంపద నిర్వచనాన్ని బలపర్చిన వారు జె.బి.సే, జె.ఎస్.మిల్, వాకర్ మొదలైన ఆర్థికవేత్తలు. ఆడమ్ స్మిత్ సంపదకు అధిక ప్రాముఖ్యతను ఇవ్వగా మార్షల్ శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యతను ఇచ్చారు. కార్లైల్, రస్కిల్‌లు సంపద నిర్వచనాన్ని విమర్శిస్తూ కేవలం సంపద అనే ఒకే విషయాన్ని గురించి చర్చించే శాస్త్రం శాస్త్రమే కాదని అది ఒక శూన్య శాస్త్రమని పేర్కొన్నారు. లయోనెల్ రాబిన్స్ 1932లో ప్రచురించిన ప్రఖ్యాత పుస్తకం 'యాన్ ఎస్సే ఆన్ ది నేచర్ అండ్ సిగ్నిఫికెన్స్ ఆఫ్ ఎకనామిక్ సైన్స్' లో వనరుల కొరతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు.
- **పరిధి:** అర్థశాస్త్రం ముఖ్యంగా సంపదకు సంబంధించిన శాస్త్రం. మానవుడు కోర్కెలను సంతృప్తి పర్చుకోవడానికి ధనాన్ని ఏ విధంగా ఉపయోగిస్తాడో తెలియచేస్తుంది. మానవుల కోర్కెలు తీర్చే వస్తు సేవల ఉత్పత్తి ఎలా జరుగుతుంది? తయారైన వస్తువులు మార్కెట్ల ద్వారా వ్యక్తులకు ఎలా చేరతాయి? వాటి ధరలను ఎలా నిర్ణయిస్తారు వంటి విషయాలను అర్థశాస్త్రం తెలుపుతోంది. ఉద్యోగిత, ఆదాయ పంపిణీ, ధరల పెరుగుదల, వస్తుమార్పిడి మొదలైన అంశాల్లో వ్యక్తులు, ప్రభుత్వ ప్రవర్తనను అర్థశాస్త్రం వివరిస్తుంది. ఆధునిక కాలంలో అర్థశాస్త్ర ప్రాముఖ్యత పరిధి పెరిగింది.

ప్రాముఖ్యత, ఆవశ్యకత

- అర్థశాస్త్రం ఒక సామాజిక, మానవీయ శాస్త్రం. ఇది శాస్త్రరూపం దాల్చి 200 ఏళ్లే అయినప్పటికీ దీన్ని 'సామాజిక శాస్త్రాల రాణి'గా పరిగణిస్తున్నారు. ఈ శాస్త్రంలో విశేషమైన ప్రతిభ కనబర్చిన వారికి 1969 నుంచి అత్యున్నత పురస్కారమైన నోబెల్ బహుమతి ఇస్తున్నారు. మనదేశానికి చెందిన భారతరత్న అవార్డ్ గ్రహీత అమర్త్యసేన్‌కు 1998లో నోబెల్ బహుమతి లభించింది. ప్రస్తుత ప్రణాళికా యుగంలో ఆర్థికాభివృద్ధికి ఈ శాస్త్ర అధ్యయనం ఎంతో ఉపయోగకరం. భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి, వనరుల సమతౌల్య వినియోగానికి అర్థశాస్త్రం ఉపయోగపడుతుంది. దేశ ఆర్థిక వనరులు పరిమితంగా ఉంటాయి. కాబట్టి ఆర్థిక వనరులను వినియోగ వస్తువుల తయారీకి ఎక్కువగా ఖర్చు చేస్తే ఆర్థికాభివృద్ధికి అవసరమైన వస్తువుల తయారీకి కావాల్సిన వనరుల కొరత ఏర్పడుతుంది. అందువల్ల వనరుల వాడకంలో సమతూకాన్ని పాటించాల్సి ఉంది.
- వస్తువుకు ఉండే కోరికలను తీర్చగలిగే శక్తిని ఉపయోగ విలువ అంటారు. ఉదాహరణకు గాలి, నీరు, ఆహారం, వస్త్రం, ఇల్లు, కారు వీటన్నింటికీ ఉపయోగ విలువ ఉంటుంది.
- ఒక వస్తువు కొనుగోలు శక్తిని వినిమయ విలువ అంటారు. ఇది ఆ వస్తువు మారక విలువకు సంబంధించింది. అర్థశాస్త్రంలో మారక విలువ ఉన్న వస్తువులను అధిక వస్తువులు అంటారు. ఉత్పత్తి అయిన వస్తు సేవలు వాటి ఉత్పత్తికి కారణమైన కారకాల మధ్య ఎలా సరఫరా అవుతాయో పంపిణీ తెలుపుతుంది. భూమికి, శ్రమకు, మూలధనాలకు చెల్లించే ప్రతిఫలాలు వరుసగా భాటకం, వేతనం, వడ్డీ. వ్యవస్థాపనకు చెల్లించే ప్రతిఫలం లాభాలు.
- వివిధ ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తులకు ఆదాయం వస్తుంది. ద్రవ్య రూపంలో వచ్చే ఆదాయాన్ని 'ద్రవ్య ఆదాయం' అంటారు. ద్రవ్య ఆదాయాన్ని అది కొనుగోలు చేయగల వస్తు సేవల రూపంలో చెప్పినట్లయితే దాన్ని 'నిజ ఆదాయం' అంటారు.
- ఆర్థిక వ్యవస్థలో అమలులో ఉన్న వేతనస్థాయి వద్ద పనిలో చేరడానికి ఇష్టపడిన వారందరికీ పని కలిగించగలిగే స్థితిని 'సంపూర్ణ ఉద్యోగిత' స్థితి అంటారు.
- నార్వేలోని ఓస్లో విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రాగ్నర్ ఫ్రిష్ 1933లో మొదటిసారిగా సూక్ష్మ, స్థూల అర్థశాస్త్రాలు అనే భావనలను అభివృద్ధి చేశారు. అర్థ శాస్త్రంలో నోబెల్ బహుమతిని 1969 నుంచి ఇస్తున్నారు. మొదటి విజేత రాగ్నర్ ఫ్రిష్.
- సూక్ష్మ అర్థశాస్త్రం అనేది 'మైక్రాస్' అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. మైక్రో అంటే చిన్న అని అర్థం. సూక్ష్మ అర్థశాస్త్రం వైయక్తిక ఆర్థిక యూనిట్లను అధ్యయనం చేస్తుంది. దీనికి ఎక్కువ ప్రాచుర్యం కల్పించిన వారు మార్షల్. ఆయన రచించిన గ్రంథం 'ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనామిక్స్'. సూక్ష్మ అర్థశాస్త్రాన్ని ధరల సిద్ధాంతం అని కూడా అంటారు.
- స్థూల అర్థశాస్త్రం మాక్రోస్ అనే గ్రీకు పదం నుంచి ఆవిర్భవించింది. మాక్రో అంటే పెద్ద అని అర్థం. స్థూల అర్థశాస్త్రం మొత్తం ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేస్తుంది. ఉదా: జాతీయాదాయం, మొత్తం వినియోగం, మొత్తం రాబడి, మొత్తం ఉద్యోగిత మొదలైన సమష్టి అంశాలను స్థూల అర్థశాస్త్రం వివరిస్తుంది. జె.ఎం. కీన్స్ స్థూల అర్థశాస్త్రానికి ఎక్కువ ప్రాధాన్యాన్ని కల్పించారు. సూక్ష్మ అర్థశాస్త్రాన్ని మార్షల్, స్థూల అర్థశాస్త్రాన్ని కీన్స్ వివరించారు. ధరల సిద్ధాంతాన్ని సూక్ష్మ అర్థశాస్త్రం అని, ఆదాయ ఉద్యోగిత సిద్ధాంతాన్ని స్థూల అర్థశాస్త్రం అని పిలుస్తారు.
- ప్రజల కోరికలను సంతృప్తి పర్చగలిగే దృశ్యరూప పదార్థాలన్నింటినీ వస్తువులుగా పరిగణించొచ్చు. ప్రకృతి పరంగా అందరికీ అందేవాటిని ఉచిత వస్తువులని అంటారు. వీటి విషయంలో డిమాండ్ కంటే సప్లయ్ ఎప్పుడూ ఎక్కువగా ఉంటుంది. వీటికి ఉపయోగితా విలువ ఉంటుంది. వినిమయ విలువ ఉండదు. **ఉదా:** సూర్యరశ్మి, నదిలో నీరు, గాలి. పెద్ద నగరాల్లో నీటిని ఉచిత వస్తువుగా చెప్పలేం.
- కొరతగా ఉన్న వస్తువులన్నీ ఆర్థిక వస్తువులే. డిమాండ్‌తో పోల్చి చూసినప్పుడు సప్లయ్ ఎప్పుడూ తక్కువగా ఉండి ధర చెల్లించాల్సిన వస్తువులను ఆర్థిక వస్తువులని అంటారు. పబ్లిక్, ప్రైవేట్ వస్తువులు అన్నీ ఆర్థిక వస్తువులే. ప్రజలు కోరే వస్తువులను ఉత్పత్తి చేసేందుకు వనరులను అత్యుత్తమ పద్ధతిలో వాడుకోవడాన్ని ఆర్థిక సామర్థ్యం అంటారు. ప్రస్తుతం ఉపయోగించుకోవడానికి ఉత్పత్తి చేసే వస్తువులను వినియోగ వస్తువులంటారు. ఇతర వస్తువుల ఉత్పత్తిలో ఉపయోగపడుతూ మానవుని కోర్కెలను పరోక్షంగా తీర్చగలిగే వస్తువులను ఉత్పాదక వస్తువులు లేదా మూలధన వస్తువులు అని అంటారు. **ఉదా:** యంత్రాలు, పరికరాలు. పూర్తిగా తయారు కాకుండా ఉత్పత్తి ప్రక్రియలో వివిధ దశల్లో ఉన్న వస్తువులను మాధ్యమిక వస్తువులు అంటారు.
- **ఉదా:** సిమెంట్, ఇటుకలు, ఉక్కు.
- అర్థశాస్త్రంలో ఆర్థిక వస్తువులన్నింటినీ సంపదగా పరిగణిస్తారు. ఒక వినియోగదారుడు లేదా సంస్థ కలిగి ఉన్న ఆదాయాన్ని ఆర్జించడానికి అవకాశం ఉన్న ఆస్తుల నిల్వ.. సంపద. ఆదాయానికి మూలం సంపద. సంపద ఒక విలువ. దీని ద్వారా ఆదాయం ప్రవాహం రూపంలో వస్తుంది. ప్రతి ఆర్థిక వ్యవస్థలో ఆదాయం కుటుంబాల నుంచి వ్యాపార సంస్థలకు, వ్యాపార సంస్థల నుంచి కుటుంబాలకు ప్రవహిస్తుంది. మానవుని కోరికలను సంతృప్తి పర్చగలిగే వస్తు, సేవల శక్తిని ప్రయోజనం అంటారు. ఒక వస్తువు ఆకారం, రంగు, పరిమాణం మొదలైనవి మార్చడం ద్వారా ఆ వస్తువుకు మానవుని కోరికను తీర్చగలిగే శక్తి పెరిగినట్లయితే దాన్ని రూప ప్రయోజనం అంటారు. **ఉదా:** చెక్కతో కుర్చీ లేదా టేబుల్ తయారు చేసినప్పుడు దాన్ని రూప ప్రయోజనం అంటారు. అదేవిధంగా స్థల, కాల, సేవల ప్రయోజనం కూడా ఉంటుంది.
- వ్యక్తులు తమ ప్రస్తుత కోరికలను తీర్చుకోవడానికి వస్తు సేవలను ఉపయోగించడాన్నే వినియోగం అంటారు. వస్తువులు ఉపయోగించే వ్యక్తిని వినియోగదారుడంటారు.
- అర్థశాస్త్రంలో ఉత్పత్తి అంటే ముడి పదార్థాలకు ప్రయోజనం చేకూర్చి అంతిమ వస్తువులుగా మార్చే ప్రక్రియ. వస్తువులను ఉత్పత్తి చేసేవారు ఉత్పత్తిదారులు.
- ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించే ప్రతి వ్యక్తి ఆర్థిక ప్రతినిధి. ఉత్పత్తి కార్యకలాపాల్లో పాల్గొనే వారందరూ ఉత్పత్తిదారులే. సేవలను ఉత్పత్తి చేసే వర్తకుడు కూడా ఉత్పత్తిదారుడే. ప్రత్యక్ష వినియోగానికి తోడ్పడే ఉత్పత్తులను అంతిమ ఉత్పత్తులు అంటారు. వస్తువు లేదా సేవలను ఉపయోగించుకొనే ప్రతి వ్యక్తి వినియోగదారుడే. వస్తు ఉత్పత్తికి ఉపయోగపడే వస్తువులను ఉత్పాదక వస్తువులు అంటారు. చిల్లర వర్తకులు విక్రయించే ధరను చిల్లర ధర అంటారు.
- వ్యాపారానికి కావాల్సిన పెట్టుబడిని వాటాలుగా (షేర్స్)గా విభజించి వాటిని ఎంపిక చేసిన కొంతమందికి, ప్రజలకు అమ్మి ఆ ధనంతో వ్యాపార వ్యవస్థను నిర్వహించడాన్ని 'జాయింట్ స్టాక్ కంపెనీ' అంటారు. ఈ కంపెనీలను 'లిమిటెడ్' అనడానికి కారణం వాటాదారు బాధ్యత పెట్టిన పెట్టుబడి మేరకే పరిమితంగా ఉంటుందని అర్థం.
- ప్రతి ధరకు, డిమాండ్‌కు సంబంధాన్ని డిమాండ్ ఫలం అంటారు. అంటే 'డిమాండ్ పరిమాణానికి ఆధారం ధర. కాబట్టి ధర తగ్గినప్పుడు డిమాండ్ పెరుగుతుంది. ధర పెరిగినప్పుడు డిమాండ్ తగ్గుతుంది. ధరకు డిమాండ్‌కు మధ్య విలోమ సంబంధం ఉంటుంది.

మాదిరి ప్రశ్నలు

1. ఏ నిర్వచనం వల్ల అర్థశాస్త్రానికి సార్వజనీనత లభిస్తుంది?
   1) కొరత 2) శ్రేయస్సు
   3) సంపద 4) అన్నీ
2. సూక్ష్మ అర్థశాస్త్రానికి మరొక పేరు?
   1) క్షీణోపాంత ప్రయోజన సూత్రం
   2) ఆదాయ ఉద్యోగితా సిద్ధాంతం
   3) ధరల సిద్ధాంతం 4) ఏదీకాదు
3. 'Wealth of Nations' గ్రంథాన్ని ఎవరు రాశారు?
   1) పిగూ 2) వాల్రస్
   3) మార్షల్ 4) ఆడం స్మిత్
4. 1970లో అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత?
   1) రాబిన్స్ 2) అమర్త్యసేన్
   3) మార్షల్ 4) పాల్ శామ్యూల్‌సన్
5. వనరుల కొరత వల్ల ఏర్పడే సమస్య?
   1) ఎంపిక 2) కొరత
   3) ఆర్థిక 4) శ్రేయస్సు
6. పూర్తిగా తయారుకాకుండా ఇంకా తయారీలో ఉన్న వస్తువులను ఏమంటారు?
   1) వినియోగ వస్తువులు
   2) మాధ్యమిక వస్తువులు
   3) ఆర్థిక వస్తువులు
   4) ఉచిత వస్తువులు
7. 'ఉద్యోగిత, వడ్డీ, ద్రవ్య సాధారణ సిద్ధాంతం' అనే పుస్తకాన్ని ఎవరు రాశారు?
   1) కె.ఇ. బోల్డింగ్ 2) రాగ్నర్ ఫ్రిష్
   3) జె.ఎం. కీన్స్ 4) స్టిగ్లర్
8. అర్థశాస్త్రంలో 'సూక్ష్మ అర్థశాస్త్రం', 'స్థూల అర్థశాస్త్రం' భావనలను 1933లో అభివృద్ధి చేసినవారు?
   1) కీన్స్ 2) ఆడమ్ స్మిత్
   3) రాగ్నర్ ఫ్రిష్ 4) రాబిన్స్
9. ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనామిక్స్ అనే గ్రంథాన్ని రచించింది?
   1) మార్షల్ 2) కీన్స్
   3) ఆడమ్ స్మిత్ 4) రాబిన్స్
10. చెక్కతో కుర్చీ తయారు చేసినప్పుడు దానికి ఏ ప్రయోజనం చేకూరుతుంది?
    1) రూప ప్రయోజనం
    2) స్థల ప్రయోజనం
    3) సేవల ప్రయోజనం
    4) కాల ప్రయోజనం
11. అర్థశాస్త్రాన్ని 'సామాజిక శాస్త్రాల్లో రాణి' వంటిదని చెప్పినవారు?
    1) జాకోబ్ వైనర్ 2) మార్షల్
    2) ఆడమ్ స్మిత్ 4) పాల్ శామ్యూల్ సన్
12. అర్థశాస్త్రానికి కొరత నిర్వచనాన్ని ఇచ్చిన ఆర్థికవేత్త?
    1) రాబిన్స్ 2) ఆడమ్ స్మిత్
    3) మార్షల్ 4) జాకోబ్ వైనర్

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 4;
5) 1; 6) 2; 7) 3; 8) 3;
9) 1; 10) 1; 11) 4; 12) 1;

Common nouns followed by 'of'..

BANK EXAMS

GENERAL ENGLISH

NOUNS

We use nouns to refer to animals, people, places and things.

Kinds and uses

- **Proper nouns:** The specific names by which we know an individual animal, a person, a place, such as an institution, a building or a town, or something such as a month, a day of the week, a season or a festival.

E.g. Smith; Delhi; India Gate; January; Sankranthi.. etc.

Note: that all proper nouns begin with a capital letter.

- **Common nouns:** words that name people, animals, places and things of the same kind Dog (as in my dog, Goldie), doctor (as in Satish, a doctor), library (as in central library), spoon(as in a plastic spoon)

Note: that all common nouns begin with a lower-case letter.

- **Common nouns are countable when:**
  - We use a / an in front of them.

  A bag, an orange, a shirt, an engineer
  - We can talk about many of them using their plural forms, with or without numbers in front of them.

    Ships, two books, seven women, many sheep, a few lemons.
  - We can use them in questions that begin with 'how many'.

    How many pens do you need? How many children are present today?
- **Common nouns are uncountable when:**
  - We do not use a/an in front of them.

  Not a slat, but salt; not an oil, but oil.
  - We do not use their plural forms, with or without numbers in front of them, to specify what quantity we are talking about.

    Not a sugar, two sugars, many milks, but a grain of/two spoons of/four bags of/ ten kilograms of / many packets of / a lot of sugar, a little milk.
- We do not use them in questions that begin with 'how many', but only in those that begin with 'how much'.

  Not How money do you owe him? not A How many plastic is manufactured in a day?, but How much money do you owe him? but How much plastic is manufactured in a day?
- **Note:** that some nouns can be used both as countables, when they refer to a thing, and as uncountables, when they refer to the substance or material it is made up of. There are three glasses on the tray. ('glasses', countable noun). The tray is made of glass. ('glass', uncountable noun). Some countable nouns are concrete and represent people, things or activities that can be seen, touched or heard, for example rose, table, basket. Other countable nouns are abstract and represent states, feelings or qualities, which can only be felt or imagined, for example hop, ambition, joy. Similarly, some uncountable nouns are concrete, for example cotton, clothing, bread, while others are abstract, for example peace, pain, anger.
- **Collective nouns:** common nouns followed by 'of' and referring to groups of people or things. A team of players, an army of soldiers, a bouquet of flowers.
- **Note:** that when using collective nouns, you will usually have to use the complete expression in order to make sense. For example, the collective noun 'bunch' by itself would not tell people what you are talking about because it could be used for grapes, roses or letters. Exceptions to this are, for example, 'an army', 'a bouquet' and 'a gang', which are usually used for soldiers, flowers and thieves respectively.

Plural forms of nouns

We use plural forms of nouns to talk about people, places and things that are more than one in number, for example 'two trolleys', 'a box of brushes', 'a few monkeys'.

Regular forms: You can follow the patterns below to form the plural forms of most nouns.



1. **Add-s in the case of most nouns:** mugs, pets, beds, cups, tubs, chiefs, cans, sums, teachers, dolls, months, smiles, tongues, days, windows.
2. **Add-es after nouns ending in:**
   -s: glasses, classes, passes, masses.
   -x: boxes, taxes, faxes.
   -ch: matches, clutches, stitches.
   -sh: wishes, bushes, dishes.
3. **Add-s after nouns ending in -ay, -ey,-oy, -uy:** rays, keys, toys, guys.
4. **In nouns ending in a consonant letter+-y, replace the final-y with 'ies':** countries, cities, ladies, babi es.
5. **In nouns ending in-fe, replace the letters with-ves:** knives, lives, wives.

Irregular forms: There are some nouns for which you cannot find the plural forms by following the patterns above. You will have to learn the plurals of these nouns through reading or by looking them up in a standard dictionary Look at some plurals that do not follow the usual pattern.

1. **Nouns ending in-f forms plurals:**
   - **With a final -f :** roof/ roofs, chief/ chiefs, proof/ proofs.
   - **With a final -ves in place of the -f :** calf/calves, loaf/loaves, leaf/ leaves.
   - **With either a final-s or a final -ves:** dwarf/ dwarfs or dwarves, hoof / hoofs or hooves, scarf/ scarfs or scarves.
2. **Nouns ending in -o form plurals:**
   - **Always with a final-oes:** potatoes, tomatoes, echoes.
   - **With either a final-oes or-os:** buffaloes/ buffalos.
   - **Always with a final-os:** kilos, radios, videos, photos.
3. **Nouns whose plural forms are formed by adding-en/-ren:** oxen, children
4. **Nouns whose plural forms are formed by changes in letters within the singular form:** foot/feet, mouse/mice, man/men.

Tips to remember

- The following words are countable and are normally used in singular form only. The indefinite article a/an should not be used with them.
- The words such as measles, mumps, ethics, maths, politics, phonetics, rickets, billiards and innings look like plural nouns but give singular meaning. So, they take singular form of verbs.
- Some nouns have the same form whether singular or plural.

  Sheep, deer, service, series, species, apparatus.
- The following nouns are always used in the plural form only.

  Cattle, scissors, spectacles, elec torate, binoculars, crackers, clergy. These are used with plural form of verbs.
- Add's' to the main word in compound noun to make it plural.

  Sister-in-law, sister's- in-law
- The possessive case of a compound noun is formed by adding's' to the last word.

  Father-in-law's property.
- After the phrases *one of, some of, each of, either of, neither of, any of, none of,* a plural form of a noun is used.
- Nouns indicating numerals should be used in singular form. A dozen eggs/ two dozen oranges.
- After collective noun either a singular or plural form of verb is used.
- An apostrophe and 's' is used with living beings only to show possession.
- When two nouns are connected by **'and'** and are closely related add an apostrophe and **s** to the last noun.
- Collective nouns, such as ***family, majority, audience,*** and ***committee*** are singular when they act in a collective fashion or represent one group. They are plural when the members of the collective body act as individuals. Collective nouns will usually be singular in Sentence Correction sentences.

A majority of the shareholders wants the merger.

This sentence is grammatically correct - but confusing. To determine whether a confusing noun requires a singular or plural verb, it might be helpful to visualize what's actually going on in the sentence. Is the sentence talking about something that acts as a *singular entity*? Or is it talking about the individual elements *within* that entity?

In the sentence here, there is no indication that the sentence is referring to the *individuals within* the majority. The "majority" acts as one - as a singular entity - and therefore requires a singular verb, "wants."

Again, the "flock of birds" is referred to as a singular group - we're not talking about *each bird's* direction of flight, but the direction of the flock as a whole - thus it requires the singular verb "is" not the plural verb "are".

*The team are always fighting amongst themselves.*This is an example of a collective noun that requires a ***plural*** verb. While 'team' is often used as a singular collective noun, in this case, the sentence describes the fighting that occurs *between the individual members of the team.* "Team" therefore refers to several *individual members*, and requires a plural verb, "are," as a result.

The key to these questions is simplicity: recognize the collective noun, visualize what's going on in the sentence, and proceed.

Directions (Q. 1-10): *Each question below has a blank, indicating that something has been omitted. Choose the word from the five options for the blank that best fits the meaning of the sentence as a whole.*

1. The work increases our ___ about how the body fights disease.
   1) knowledge 2) knowledges
   3) knowledgably 4) acknowledge
   5) knowledgeable
2. They are doing some fascinating__________ into the language of dolphins.
   1) Researches 2) researcher
   3) research 4) re searches
   5) re search
3. In our family, we share the ______ between us.
   1) Houseworks 2) housework
   3) houses works 4) house works
   5) house working
4. The first task is to clean up the _____ left behind by the factories.
   1) Pollutions 2) pollution
   3) polluting 4) pollute
   5) polite
5. They are suffering from _____ lack of medical supplies.
   1) a serious 2) serious
   3) seriously 4) seriousness
   5) series
6. He's starting to get a few grey _____ now.
   1) Hair 2) heirs 3) heir
   4) hairs 5) hairy
7. Would you like some more ___ on your plate?
   1) Cauliflower 2) cauliflowers
   3) the cauliflowers
   4) a cauliflowers
   5) an cauliflowers
8. The doctor said that she was making _____ and she would probably be out of hospital by next week.
   1) a good progress
   2) good progress
   3) good progresses
   4) better progress
   5) good progressing
9. The book has ______ at the end of every chapter.
   1) Exercises 2) exercise
   3) excess 4) exceed
   5) execute
10. Do you want any help in bringing your ______ from the van?
    1) stuffs 2) stuff 3) stuffing
    4) stuffy 5) stuffed

Key:

1) 1 2) 3 3) 2 4) 2
5) 1 6) 4 7) 1 8) 2
9) 1 10) 2